


ఈనాడు



విజయవాడ 25-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 135

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



పీపీపీపై రాజీలేదు

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే ఆర్థిక ఊతం

పేదలకు నాణ్యమైన వైద్యాన్ని తప్పక అందిస్తాం: ముఖ్యమంత్రి చంద్రబాబు

వైద్య కళాశాలల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం

ఈనాడు - అమరావతి

పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను అందించే విషయంలో రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానం అమల్లో ఉందని.. దీని విషయంలో వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు.. నిర్దేశించిన పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. దీనిపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. వైద్యారోగ్య శాఖపై సచివాలయంలో సీఎం బుధవారం సమీక్షించారు. పీపీపీ విధానంలో చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) సహా ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ విధానంలో ఆసుపత్రులు, వైద్య కళాశాలల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై కేంద్ర ప్రభుత్వ సూచనలు, మార్గదర్శకాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. సామాజిక- ఆరోగ్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ పీపీపీ ప్రాజెక్టులకు మద్దతివ్వాలన్న ఉద్దేశంతో వీజీఎఫ్ కింద అందించే 60 శాతం ఆర్థిక చేయూతను (మిగతా 2లో)



20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ప్రాధాన్యాంశం

పది సూత్రాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి 2లో

స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యసాధనపై సమీక్షలో సీఎం చంద్రబాబు

పెద్దకొడుకుగా అండగా ఉంటా



నాగేశ్వరమ్మతో ఆత్మీయంగా పవన్‌కల్యాణ్

ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి జన సేనాని

ఆప్యాయంగా పలకరించి... ఆర్థికసాయం అందించి..

ఇప్పటంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన

ఈనాడు, అమరావతి: 'అమ్మా, ఆరోగ్యం ఎలా ఉంది? బాగున్నావా.. నిన్ను చూడడానికి వచ్చా. కుటుంబంలో పెద్ద కొడుకుగా అన్నివిధాలా అండగా ఉంటా' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటం గ్రామంలో ఇండ్ల నాగేశ్వరమ్మను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఆప్యాయంగా పలకరించారు. బుధవారం మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఆ గ్రామంలోని నాగేశ్వరమ్మ ఇంటికెళ్లిన ఆయన.. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కుటుంబ పరిస్థితులు, జీవనాధారంపై ఆరాతీశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో జనసేన ఆవిర్భావ సభకు భూములిచ్చారన్న అక్కసుతో (మిగతా 2లో)

రీసర్వే సమస్యలపై.. సాకులు కుదరవిక

పరిష్కారంపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి

- పొలం కొలతల్లో తేడాలు చక్కదిద్దాల్సిందే
- సమస్యలు, పరిష్కారాలపై తాజాగా మార్గదర్శకాలు 5లో
- గ్రామ, మండల సర్వేయర్, తహసీల్దార్లకు శిక్షణ

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	135 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	235 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	162 కిలో	స్కిన్‌లెస్	267 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


అమరావతిలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ నేడు

- అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ 5లో
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి

రుషికొండ భవనాలు.. ఆతిథ్య రంగానికి!

తాజ్, లీలా ప్యాలెస్, అట్మాస్‌కోర్, ఫెమా సంస్థల ప్రతిపాదనలపై మంత్రుల కమిటీ చర్చ

- 26న మరోసారి పరిశీలనకు ఆదేశం
- వచ్చే క్యాబినెట్ భేటీకల్లా నివేదిక



ఈనాడు, అమరావతి: విశాఖలోని రుషికొండ భవనాలను ఆతిథ్య రంగానికి కేటాయించాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఈ నెల 28న మరోసారి చర్చించి భవనాల వినియోగంపై 29న మంత్రివర్గ సమావేశంలో నివేదించాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత భవనాల వినియోగంతోపాటు అదనపు భవనాల నిర్మాణం కోసం తీర ప్రాంత నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) నిబంధనలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో తుది పరిశీలన చేయించి నివేదిక ఇవ్వాలని పర్యాటక శాఖను ఆదేశించింది. రుషికొండ భవనాలపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సచివాలయంలో బుధవారం సమావేశమైంది. ఆర్థిక, పర్యాటక శాఖల మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ హాజరయ్యారు. మరో మంత్రి బాలవీరాంజనేయస్వామి వర్చువల్‌గా పాల్గొన్నారు. తాజ్, లీలా ప్యాలెస్, అట్మాస్ కోర్, (మిగతా 2లో)

ఆరావళిలో కొత్తగా మైనింగ్ లీజులు ఇవ్వొద్దు

- రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

దిల్లీ: ఆరావళి పర్వత శ్రేణుల్లో రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆ శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ బుధవారం ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఆరావళిలోని పలు ప్రాంతాల్లో మైనింగ్‌పై ఇప్పటికే నిషేధం అమల్లో ఉన్న సంగతిని (మిగతా 2లో)


నింగిలోకి 'బ్లూబర్డ్'



ఎల్‌వీఎం3-ఎం6 ప్రయోగం విజయవంతం

మొదటిసారిగా 6,100 కిలోల ఉపగ్రహం కక్ష్యలోకి

సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణం- న్యూస్‌టుడే: దేశ చరిత్రలో తొలిసారిగా 6,100 కిలోల బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ఇస్రో ప్రవేశపెట్టింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి బుధవారం ఉదయం 8.55 గంటలకు ఉపగ్రహాన్ని తీసుకుని అత్యంత శక్తిమంతమైన బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3-ఎం6 నింగిలోకి దూసుకెళ్లింది. 15.33 నిమిషాల తర్వాత రాకెట్ నుంచి (మిగతా 2లో)



ఛాంపియన్

హాకీ ఆటగాడు హార్దిక్‌కు ఖేల్‌రత్న

సిఫారసు చేసిన అవార్డుల కమిటీ

'అర్జున' జాబితాలో గాయత్రి, ధనుష్


హార్దిక్ సింగ్

దిల్లీ

భారత హాకీ ఆటగాడు హార్దిక్ సింగ్ పేరును క్రీడా అవార్డుల సెలక్షన్ కమిటీ.. మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు కోసం సిఫారసు చేసింది. ఈ ఏడాది భారత అత్యున్నత క్రీడా పురస్కారానికి కమిటీ అతడొక్కడి పేరునే ప్రతిపాదించింది. తెలుగు ఆర్చర్ జ్యోతిసురేఖకు మొండిచెయ్యి ఎదురైంది. అంతర్జాతీయ వేదికలపై ఏళ్లుగా గొప్పగా రాణిస్తున్నప్పటికీ మరోసారి ఆమెకు నిరాశ తప్పలేదు. మరోవైపు బాడ్మింటన్ ప్లేయర్ గాయత్రి గోపీచంద్, టీనేజ్ చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్, డెకాథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు అర్జున అవార్డు ఇవ్వాలని కమిటీ ప్రతిపాదించింది. బుధవారం జరిగిన సమావేశంలో మొత్తం 24 మందిని అర్జున కోసం ఎంపిక చేసింది. యోగాసన అథ్లెట్ ఆర్తి పాల్ కూడా ఈ జాబితాలో ఉంది. ఓ యోగాసన అథ్లెట్‌కు అర్జున దక్కనుండడం ఇదే తొలిసారి. ఐఓఏ ఉపాధ్యక్షుడు గగన్ నారంగ్, మాజీ బ్యాడ్మింటన్ ప్లేయర్ అపర్ణ పోపట్ వంటి వారు అవార్డుల కమిటీలో ఉన్నారు. కమిటీ సిఫారసులను క్రీడా మంత్రిత్వ శాఖ ధ్రువీకరించాల్సి వుంది. ఈ ధ్రువీకరణ దాదాపు లాంఛనమే. జాబితాలో మార్పులు చేర్పులు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది.


దివ్య

ఒలింపిక్స్ విజయంలో అతడు..

హాకీ స్టార్ హార్దిక్ సింగ్ భారత జట్టుకు వైస్ కెప్టెన్. మిడ్‌ఫీల్డ్‌లో కీలకమైన 27 ఏళ్ల హార్దిక్.. 2021 టోక్యో ఒలింపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన భారత జట్లలో సభ్యుడు. ఈ ఏడాది ఆసియాకప్‌లో స్వర్ణం గెలిచిన జట్టులోనూ అతడు ఉన్నాడు. మరోవైపు చెస్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్ ప్రపంచకప్ గెలిచిన తొలి భారత మహిళగా ఘనత సాధించింది. అర్జున అవార్డుల జాబితాలో ఈ ఏడాది ఒక్క క్రికెటర్ కూడా లేకపోవడం గమనార్హం. ఖేల్‌రత్న అవార్డు విజేతకు రూ.25 లక్షల నగదు బహుమతి లభిస్తుంది. అర్జున అవార్డు విజేతకు రూ.15 లక్షలు ఇస్తారు. నిరుడు నలుగురు అథ్లెట్లు.. ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేశ్, హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, షూటర్ మను బాకర్‌లకు ఖేల్‌రత్న పురస్కారం లభించింది.

కమిటీ సిఫారసులు

ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న: హార్దిక్ సింగ్ (హాకీ)

అర్జున అవార్డులు: తేజస్విన్ శంకర్ (అథ్లెటిక్స్), ప్రియాంక (అథ్లెటిక్స్), నరేందర్ (బాక్సింగ్), విదిత్ గుజరాతి (చెస్), దివ్య దేశ్‌ముఖ్ (చెస్), ధనుష్ శ్రీకాంత్ (డెఫ్ షూటింగ్), ప్రణతి నాయక్ (జిమ్నాస్టిక్స్), రాజ్‌కుమార్ పాల్ (హాకీ), సుజీత్ (కబడ్డీ), నిర్మల భాటి (ఖో ఖో), రుద్రాంశ్ (పారా షూటింగ్), ఏక్తా బ్యాన్ (పారా అథ్లెటిక్స్), పద్మనాభ్ సింగ్ (పోలో), అర్వింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెరాన్ (షూటింగ్), మెహులి ఘోష్ (షూటింగ్), సుతీర్థ ముఖర్జీ (టీటీ), సోనమ్ మలిక్ (రెజ్లింగ్), ఆర్తి (యోగా), ట్రీసా జాలీ (బ్యాడ్మింటన్), గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్), లాల్ రెమ్‌సియామి (హాకీ), మహ్మద్ అఫ్జల్ (అథ్లెటిక్స్), పూజ (కబడ్డీ).

నం.1 జోడీకి గుర్తింపు


గాయత్రి, ట్రీసా

పుల్లెల గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ భారత నంబర్‌వన్ మహిళల బ్యాడ్మింటన్ జోడీ. వారికి అర్జున లభించడం ఆశ్చర్యం కాదు. జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్ తనయగా ఆటలో అడుగుపెట్టినా.. తనదైన ప్రతిభతో అంతర్జాతీయ వేదికల్లో సత్తాచాటుతోంది గాయత్రి. ట్రీసా జాలీతో కలిసి కామన్వెల్త్ క్రీడల్లో రజతం, కాంస్య పతకాలు సాధించింది. ఆసియా మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గింది. నిరుడు ఆసియా టీమ్ ఛాపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలిచిన జట్టులో గాయత్రి సభ్యురాలు. 2024, 2025లలో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీల్లో గాయత్రి- ట్రీసా జంట టైటిళ్లు గెలుచుకుంది. మరికొన్ని అంతర్జాతీయ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది.

హైదరాబాద్ బుల్లెట్


శ్రీకాంత్

హైదరాబాద్‌కు చెందిన ధనుష్ శ్రీకాంత్ చిన్నప్పటి నుంచి మాట్లాడలేడు.. వినలేడు. ఈ వైకల్యం అతడిని ఒక ప్రపంచ స్థాయి షూటర్ కాకుండా ఆపలేకపోయింది. గగన్ నారంగ్ అకాడమీలో శిక్షణ పొందిన అతడు.. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో పట్టు సంపాదించాడు. 2021 టోక్యో డెఫ్లింపిక్స్‌లో పసిడి డబుల్‌తో అదరగొట్టాడు. 10 మీటర్ల వ్యక్తిగత విభాగంలో స్వర్ణం నెగ్గిన అతడు.. ప్రియేషా దేశ్‌ముఖ్ జతగా మిక్స్‌డ్ రైఫిల్ ఈవెంట్లోనూ పసిడి నెగ్గాడు. 2023 షూటింగ్ ప్రపంచకప్‌లో పసిడి నెగ్గిన ఈ షూటర్.. ఈ ఏడాది డెఫ్లింపిక్స్‌లో స్వర్ణాన్ని నిలబెట్టుకున్నాడు.

ఇంకేం సాధించాలి

ఖేల్‌రత్న ఎంపికలో జ్యోతి సురేఖకు మళ్లీ నిరాశే


జ్యోతి సురేఖ

ఈనాడు - హైదరాబాద్

'తెలుగు రాష్ట్రాల ఆణిముత్యం.. వెన్నం జ్యోతి సురేఖ' - బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్య ఇది. అతిశయోక్తి కాదు యావత్ భారత ఆర్చరీ కుటుంబానిది ఇదే మాట. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక పతకాలు.. ఆసియా క్రీడల్లో హ్యాట్రిక్ స్వర్ణాలు.. ప్రపంచకప్‌లో రికార్డు ప్రదర్శనలు.. అంతర్జాతీయ స్థాయిలో లెక్కలేనన్ని పతకాలు! ఇన్ని ఘనతలు అందుకున్న ఒకేఒక్క భారత ఆర్చర్ జ్యోతి సురేఖ. కానీ ఈ తెలుగు తేజానికి ఎప్పట్లాగే నిరాశ తప్పలేదు. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు ఎంపికలో మరోసారి వివక్షే ఎదురైంది. క్రీడా పురస్కారాల ఎంపిక కమిటీ వరుసగా మూడో ఏడాది సురేఖను విస్మరించింది.

ప్రపంచ రెండో ర్యాంకర్, ఆసియా నంబర్‌వన్ జ్యోతి సురేఖ గత కొన్నేళ్లుగా భారత ఆర్చరీకి ముఖ చిత్రంగా వెలుగొందుతోంది. పదిహేనేళ్ల కెరీర్‌లో పాల్గొన్న ప్రతి అంతర్జాతీయ టోర్నీలో పతకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తోంది. ఇప్పటి వరకు 77 అంతర్జాతీయ టోర్నీల్లో బరిలో దిగిన సురేఖ.. 90 పతకాలు కైవసం చేసుకుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీని చేర్చిన నేపథ్యంలో.. వచ్చే విశ్వ క్రీడల్లో భారత్‌కు సురేఖ పతకం అందించొచ్చన్న అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ దిశగా దూసుకెళ్తున్న 29 ఏళ్ల సురేఖను గుర్తించాల్సిన కేంద్ర ప్రభుత్వం.. ఆమె ప్రదర్శన పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుండటం క్రీడాభిమానులకు మింగుడుపడనిదే! ప్రదర్శన ప్రకారం వరుసగా మూడేళ్లుగా అత్యధిక పాయింట్లు సాధిస్తున్నా సురేఖకు మాత్రం న్యాయం జరగట్లేదు. 2023లో 148.25, 2024లో 132.12, 2025లో 148.37 పాయింట్లతో వరుసగా మూడు సార్లు సురేఖ ఖేల్‌రత్న రేసులో నిలిచింది. అర్హత విధానం.. అవార్డు మార్గదర్శకాల ప్రకారం మూడేళ్లుగా ఆమెనే టాపర్. అయితే ప్రదర్శన, పాయింట్ల ప్రకారం కాకుండా పేరున్న.. ఆదరణ కలిగిన క్రీడాకారులను ఖేల్‌రత్న పురస్కారాలు వరిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తుండటం ఆందోళన కలిగించేదే! వరుసగా రెండేళ్లు ఖేల్‌రత్నకు ఎంపిక చేయకపోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ హైకోర్టును కూడా సురేఖ ఆశ్రయించింది. 2023, 2024 ఖేల్‌రత్న పురస్కారానికి ఆమె పేరును పరిశీలించాలంటూ ఈ ఏడాది ఆరంభంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 2023, 2024 సంగతి అటుంచితే.. 2025లో కూడా సురేఖ పేరును పట్టించుకోలేదు.

గత కొన్నేళ్లుగా అవార్డుల ఎంపిక పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపిక కమిటీలో మాజీ క్రీడాకారులు, ఉన్నత స్థానాల్లోని వ్యక్తులు, అధికారులున్నా పారదర్శకత లోపిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన షూటర్ మను బాకర్‌కు ఇదే విషయంలో చేదు అనుభవం ఎదురైంది. 2024 ఖేల్‌రత్న కోసం మొదట ఎంపిక చేసిన జాబితాలో మను పేరు లేదు. మనుకు పురస్కారం ఎందుకివ్వరనే ఆందోళనల నేపథ్యంలో తర్వాత క్రీడల శాఖ ఆమె పేరును చేర్చింది. తాజాగా భారత హాకీ జట్టు వైస్ కెప్టెన్ హార్దిక్ సింగ్‌ను ఖేల్‌రత్న పురస్కారానికి బుధవారం ఎంపిక కమిటీ సిఫారసు చేసింది. మహిళల క్రికెట్లో ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పేర్లను పరిశీలించాలంటూ పెద్ద ఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయి. నేడో.. రేపో హర్మన్, స్మృతిలకు కేంద్ర ప్రభుత్వం ఖేల్‌రత్న పురస్కారాలు ప్రకటించినా ఆశ్చర్యపోనవసరం లేదు! వారిద్దరు క్రికెటర్లు కావడం.. ఎంతో పేరు ఉండటం.. పైపెచ్చు బీసీసీఐ వంటి అత్యంత సంపన్న బోర్డు అండదండలు ఉన్నాయి. కానీ పెద్దగా ప్రచార ఆర్భాటాలకు వెళ్లకుండా.. కేవలం ఆటపైనే ఎక్కువ దృష్టి సారించే సురేఖకు.. ఎన్ని ఘనతలు సాధించినా, ఎన్నేళ్లు ఎదురుచూసినా నిరాశ తప్పదేమో!

సురేఖ.. కీలక ఘనతలు

- ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో తొమ్మిది పతకాలు సాధించిన ఒకేఒక్క ఆర్చర్.
- ఆసియా క్రీడల్లో (2022 హాంగ్‌జౌ) హ్యాట్రిక్ స్వర్ణాలు నెగ్గిన ఏకైక భారత ఆర్చర్.
- మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ప్రపంచ రికార్డు గ్రహీత (1431/1440).
- 360/360 స్కోరు సాధించిన మొట్టమొదటి మహిళా కాంపౌండ్ ఆర్చర్.
- ప్రపంచకప్ (2024)లో హ్యాట్రిక్ స్వర్ణాలు గెలిచిన తొలి కాంపౌండ్ ఆర్చర్.

హంపి మళ్లీ గెలుస్తుందా?

నేటి నుంచే ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్


హంపి

దోహా: ఏడాది చివర్లో ఆసక్తికర చెస్ సమరానికి వేళైంది. ఫిడే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ గురువారం ఆరంభం కానుంది. రెండు సార్లు ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ కోనేరు హంపి ఈ టోర్నీ బరిలోకి దిగనుంది. ఆమె టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఉంది. హంపితో పాటు మహిళల విభాగంలో ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ కూడా పోటీలో ఉంది. ఇటీవల కాలంలో పెద్దగా రాణించలేకపోయిన ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు ఈ సీజన్‌ను ఘనంగా ముగించడానికి ఇదో చక్కని అవకాశం. ఓపెన్ విభాగంలో గుకేశ్‌తో పాటు అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), ఫాబియానో కరువానా (అమెరికా), వెస్లీ సో (రష్యా), నెపోమ్నియాషి (రష్యా) వంటి మేటి ఆటగాళ్లు పోటీలో ఉన్నారు. భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేశి, నిహాల్ సరీన్ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. భారత్ నుంచి రికార్డు స్థాయిలో 29 మంది ఓపెన్ విభాగంలో పోటీపడుతుండడం విశేషం. ఓపెన్ విభాగంలో ర్యాపిడ్‌లో 13 రౌండ్లు, బ్లిట్జ్‌లో 19 రౌండ్లు ఉంటాయి. మహిళలు ర్యాపిడ్ ఈవెంట్లో 11 రౌండ్లు, బ్లిట్జ్ ఈవెంట్లో 15 రౌండ్లు ఆడతారు.

కోచ్ ముందే చెప్పారు


షెఫాలి

విశాఖపట్నం: బ్యాటర్లందరూ అవసరమైతే బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉండాలని కోచ్ అమోల్ మజుందార్ ఎప్పుడూ చెప్పేవారని భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ షెఫాలి వర్మ తెలిపింది. "జట్టులో ప్రతి ఒక్కరూ బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉండాలని కోచ్ అమోల్ సార్ చెప్పేవాళ్లు. అందుకే నెట్స్‌లో బంతితోనూ కష్టపడే వాళ్లం. స్మృతి మంధాన, జెమీమా కూడా బౌలింగ్ చేసేవాళ్లు. క్రికెట్ చాలా భిన్నమైన ఆట. మన అవసరం ఎప్పుడు వస్తుందో తెలియదు. అందుకు సిద్ధంగా ఉండాలి. బౌలింగ్ చేయడానికి చాలా ఇష్టపడతాను" అని షెఫాలి చెప్పింది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ ఆరంభమయ్యేలోగా ఫీల్డింగ్‌లోనూ జట్టు మెరుగుపడుతుందని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపింది. దక్షిణాఫ్రికాతో వన్డే ప్రపంచకప్ ఫైనల్లో అనూహ్యంగా బంతి అందుకున్న షెఫాలి.. రెండు కీలక వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పింది.

యాషెస్‌కు ఆర్చర్ దూరం


ఆర్చర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో యాషెస్ సమరంలో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ కోల్పోయిన ఇంగ్లాండ్‌కు మరో ఎదురు దెబ్బ. ఆ జట్టు కీలక బౌలర్ జోఫ్రా ఆర్చర్ గాయంతో చివరి రెండు టెస్టులకు దూరమయ్యాడు. బుధవారం మెల్‌బోర్న్‌లో ఇంగ్లాండ్ జట్టుతో అతడు ఉన్నా.. సాధన చేయలేదు. తొలి రెండు టెస్టుల్లో ఆర్చర్ 80 ఓవర్లు బౌలింగ్ చేసి 9 వికెట్లు పడగొట్టాడు. అతడి స్థానంలో అట్కిన్సన్ ఆడనున్నాడు. శుక్రవారం మెల్‌బోర్న్‌లో నాలుగో టెస్టు మొదలు కానుంది. చివరిదైన అయిదో టెస్టు జనవరి 4న సిడ్నీలో ప్రారంభం అవుతుంది. రెండు, మూడో టెస్టుల మధ్య విరామంలో ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఓ బీచ్ రిసార్ట్‌లో గడిపిన సమయంలో ఓపెనర్ బెన్ డకెట్ అతిగా తాగినట్లు ఒక వీడియో ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై మరింత లోతుగా విచారణ జరుగుతోంది.

వాళ్లిద్దరూ మన్నించమన్నారు: బవుమా

జొహన్నెస్‌బర్గ్: తనపై అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు భారత స్టార్లు బుమ్రా, రిషబ్ పంత్ మన్నించమని కోరారని దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా చెప్పాడు. భారత పర్యటనలో కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టులో బవుమా ఎత్తును ఉద్దేశించి బుమ్రా, పంత్ 'మరగుజ్జు' అనే పదం వాడారు. దీనిపై బుమ్రా.. ఆట ముగిశాక బవుమాతో ఏదో మాట్లాడాడు. కానీ దక్షిణాఫ్రికా సారథి మాత్రం ఈ విషయంపై అప్పుడు ఏం స్పందించలేదు. ఈ పర్యటన ముగిసిన తర్వాత అతడు అప్పటి సంగతిని వెల్లడించాడు. "తొలి టెస్టులో తొలి రోజు ఆటలో బుమ్రా, పంత్ తమ భాషలో నా గురించి ఏదో అన్నారని అర్థమైంది. ఆ మాటల సారాంశం మాత్రం అర్థం కాలేదు. ఆ రోజు ఆట చివరికి బుమ్రా, పంత్ నా దగ్గరకు వచ్చి మన్నించమని అడిగారు. ఆ తర్వాత మా మీడియా మేనేజర్ ద్వారా వాళ్ల మాటలకు అర్థం తెలుసుకున్నా. మైదానంలో ఏం జరిగినా అది మైదానం వరకు మాత్రమే ఉంచాలి. అలా అని ఆ మాటలను మర్చిపోకుండా కసితో పోరాడాలి. ఎవరిపై కక్ష పెట్టుకోకూడదు" అని బవుమా పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ 0-2తో చేజార్చుకున్న సంగతి తెలిసిందే.


వైభవ్



సకిబుల్ గని

విజయ్ హజారే ట్రోఫీకి సంచలన ఆరంభం. స్టార్లు బరిలో దిగిన ఈ టోర్నీలో తొలి రోజే శతకాల మోత మోగింది. భీకర ఫామ్‌లో ఉన్న 14 ఏళ్ల సూర్యవంశీ మరోసారి భారీ సెంచరీతో మెరవగా.. అతడి సహచరుడు సకిబుల్ గని 32 బంతుల్లోనే సెంచరీ చేసి రికార్డు నెలకొల్పాడు. వీళ్లిద్దరూ ప్రాతినిధ్యం వహించిన బిహార్ 574 పరుగులతో ప్రపంచ రికార్డు సృష్టించింది. సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీలో ఆడుతున్న విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ మెరుపు సెంచరీలు బాదారు.

కుర్రాళ్ల తడాఖా

సీనియర్ల ధమాకా

- శతకబాదేసిన సూర్యవంశీ, గని
- 574 పరుగులతో బిహార్ ప్రపంచ రికార్డు
- సెంచరీలతో మెరిసిన కోహ్లి, రోహిత్
- విజయ్ హజారే ట్రోఫీ


రోహిత్


కోహ్లి

రాంచి

ఈ ఏడాది ఐపీఎల్ నుంచి అదిరే ఫామ్‌లో ఉన్న టీనేజర్ వైభవ్ సూర్యవంశీ (190; 84 బంతుల్లో 16×4, 15×6) మరోసారి దుమ్ము రేపాడు. విజయ్ హజారే ట్రోఫీలో బుధవారం అరుణాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో అతడు భారీ శతకాన్ని బాదేశాడు. ఎడాపెడా షాట్లతో చెలరేగిపోయిన సూర్యవంశీ.. 25 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. ఆ తర్వాత సెంచరీ మార్కు అందుకోవడానికి 11 బంతులే తీసుకున్నాడంటే అతడి విధ్వంసాన్ని ఊహించొచ్చు. లిస్ట్‌-ఎ క్రికెట్లో సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా అతడు ఘనత సాధించాడు. 59 బంతుల్లోనే అతడి 150 పరుగులు పూర్తయ్యాయి. లిస్ట్‌-ఎ క్రికెట్లో వేగంగా 150 పరుగులు చేసిన డివిలియర్స్ (64 బంతులు) రికార్డును బద్దలు కొట్టాడు. ద్విశతకం బాదేలా కనిపించిన సూర్యవంశీ.. కొద్దితేడాతో ఆ మైలురాయిని అందుకోలేకపోయాడు. అతడు ఔటైనా.. పరుగుల వరద ఆగలేదు. కెప్టెన్ సకిబుల్ గని (128 నాటౌట్; 40 బంతుల్లో 10×4, 12×6), ఆయుష్ (116; 56 బంతుల్లో 11×4, 8×6) విధ్వంసక సెంచరీలు బాదారు. ముఖ్యంగా గని 32 బంతుల్లోనే శతకాన్ని అందుకుని పురుషుల లిస్ట్‌-ఎ క్రికెట్లో వేగవంతమైన సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. ఇషాన్ కిషన్ (33 బంతులు) పేరిట ఉన్న రికార్డును అతడు అధిగమించాడు. సూర్యవంశీ, గని, ఆయుష్ శతకాలతో బిహార్ 6 వికెట్లకు 574 పరుగుల భారీ స్కోరు చేసింది. లిస్ట్‌-ఎ క్రికెట్లో ఒక జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే. తమిళనాడు (506/2; అరుణాచల్ ప్రదేశ్‌పై, 2022లో) పేరిట ఉన్న ప్రపంచ రికార్డు బద్దలైంది. భారీ ఛేదనలో అరుణాచల్ ప్రదేశ్ 42.1 ఓవర్లలో 177 పరుగులకే ఆలౌటైంది.

అటు విరాట్.. ఇటు రోహిత్: 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత విజయ్ హజారే టోర్నీ బరిలోకి దిగిన విరాట్ కోహ్లి (131; 101 బంతుల్లో 14×4, 3×6) సెంచరీతో అదరగొట్టాడు. చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఆంధ్రతో జరిగిన మ్యాచ్‌లో దిల్లీకి ఆడుతూ విరాట్ సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో మొదట ఆంధ్ర 8 వికెట్లకు 298 పరుగులు చేసింది. రికీ భుయ్ (122; 105 బంతుల్లో 11×4, 7×6) సెంచరీ చేశాడు. అనంతరం 299 పరుగుల ఛేదనలో కోహ్లి స్వేచ్ఛగా ఆడాడు. తన శైలిలో డ్రైవ్‌లు, కట్ షాట్లతో అలరించిన అతడు.. 83 బంతుల్లో సెంచరీ అందుకున్నాడు. అతడితో పాటు ప్రియాంశ్ ఆర్య (74) రాణించడంతో దిల్లీ 37.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సిక్కింతో గ్రూప్‌-సి మ్యాచ్‌లో ముంబయికి ఆడుతూ రోహిత్ శర్మ (155; 94 బంతుల్లో 18×4, 9×6) భారీ సెంచరీతో చెలరేగాడు. జైపుర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట సిక్కిం 7 వికెట్లకు 236 పరుగులు చేసింది. ఛేదనలో రోహిత్ మెరుపులతో ముంబయి 30.3 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. తన శైలిలో పుల్, కట్ షాట్లతో సిక్సులు బాదిన రోహిత్.. 62 బంతుల్లోనే మూడంకెల మార్కు అందుకున్నాడు. లిస్ట్‌-ఎ క్రికెట్లో అతడికిదే వేగవంతమైన శతకం. 2018 తర్వాత రోహిత్ ఈ టోర్నీలో ఆడాడు. అతడి ఆటను చూసేందుకు సవాయ్ మాన్‌సింగ్ స్టేడియానికి దాదాపు 20 వేల మంది అభిమానులు రావడం విశేషం.

మెరిసిన ఇషాన్, పడిక్కల్: భారత జట్టులోకి పునరాగమనం చేసిన ఇషాన్ కిషన్ (125; 39 బంతుల్లో 7×4, 14×6) విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. కర్ణాటకపై అతడు మెరుపు సెంచరీ (33 బంతుల్లో) చేయడంతో మొదట ఝార్ఖండ్ 412/9 స్కోరు చేసింది. కిషన్ శతకాన్ని వృథా చేస్తూ దేవ్‌దత్ పడిక్కల్ (147; 118 బంతుల్లో 10×4, 7×6) చెలరేగడంతో కర్ణాటక 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మయాంక్ అగర్వాల్ (54), అభినవ్ మనోహర్ (56 నాటౌట్) రాణించారు.

హైదరాబాద్ ఓటమితో..: విజయ్ హజారే ట్రోఫీని హైదరాబాద్ ఓటమితో మొదలుపెట్టింది. గ్రూప్‌-బి తొలి మ్యాచ్‌లో 84 పరుగుల తేడాతో ఉత్తర్‌ప్రదేశ్ చేతిలో ఓడింది. మొదట ఉత్తర్‌ప్రదేశ్ 5 వికెట్లకు 324 పరుగులు చేసింది. అభిషేక్ గోస్వామి (81), ఆర్యన్ జుయల్ (80), ధ్రువ్ జురెల్ (80), రింకు సింగ్ (67) రాణించారు. ఛేదనలో యూపీ బౌలర్ల ధాటికి హైదరాబాద్ 43 ఓవర్లలో 240కే ఆలౌటైంది. తన్మయ్ అగర్వాల్ (53), రాహుల్ బుద్ధి (47), వరుణ్ గౌడ్ (45), రాహుల్ సింగ్ (32) మాత్రమే పోరాడారు. జీషన్ అన్సారి (4/31), ప్రశాంత్ వీర్ (3/47) హైదరాబాద్‌ను కట్టడి చేశారు.

9 — 150 అంతకంటే ఎక్కువ పరుగులు చేయడం లిస్ట్‌-ఎ క్రికెట్లో రోహిత్‌కు ఇది తొమ్మిదోసారి. లిస్ట్‌-ఎలో అత్యధికంగా 150 ప్లస్ స్కోర్లు చేసిన డేవిడ్ వార్నర్ (9)ను సమం చేశాడు.

58 — కోహ్లి లిస్ట్‌-ఎ శతకాలు. అత్యధిక లిస్ట్‌-ఎ సెంచరీలు చేసిన సచిన్ తెందుల్కర్ (60)ను చేరువయ్యాడు. చివరిగా ఈ టోర్నీలో 2009లో రైల్వేస్‌పై విరాట్ శతకం సాధించాడు.

16000 — లిస్ట్‌-ఎ క్రికెట్లో వేగంగా 16 వేల పరుగుల మైలురాయి అందుకున్న భారత బ్యాటర్ కోహ్లి (330 ఇన్నింగ్స్‌నే. అతడు సచిన్ (391 ఇన్నింగ్స్)ను అధిగమించాడు.

(c) eenadu

ఆత్మీయ బంధాలకు
ఆకట్టుకునే చిట్కాలు...
www.vasundhara.net

ఈనాడు

తాజా బిజినెస్ వార్తలు,
ఆర్థిక సందేహాల నివృత్తికై
సిరి
చూడండి
www.eenadusiri.net

విజయవాడ 25-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 135
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఓఆర్‌ఆర్ భూసేకరణకు 4 జిల్లాల్లో గెజిట్

ఏలూరు, పల్నాడు జిల్లాల్లో అభ్యంతరాల స్వీకరణ

- వచ్చేవారం నుంచి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ అభ్యంతరాల స్వీకరణ మొదలు
- తర్వాత పెగ్ మార్కింగ్
- ఎన్టీఆర్ జిల్లాలో భూముల వివరాలు కేంద్రానికి పంపనున్న అధికారులు

ఈనాడు, అమరావతి: అమరావతి ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్‌ఆర్) ప్రాజెక్టు కోసం భూసేకరణకు రంగం సిద్ధమైంది. కేంద్రం ఇప్పటివరకు నాలుగు జిల్లాలకు (గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఏలూరు) గెజిట్ ప్రచురించింది. ఎన్టీఆర్ జిల్లా వివరాలను ఇక్కడి అధికారులు వచ్చే వారం కేంద్రానికి పంపిన తర్వాత దానికీ గెజిట్ నోటిఫికేషన్ ఇస్తుంది. ఇప్పటికే గెజిట్ ప్రచురణ జరిగిన జిల్లాల్లోని సంయుక్త కలెక్టర్లు.. రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ చేపట్టారు. ఓఆర్ఆర్ ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర మంత్రివర్గం ఆమోదించేలోపు భూసేకరణను కొలిక్కి తెచ్చేలా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఓఆర్‌ఆర్, రెండు లింక్ రోడ్లకు కలిపి..

- ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా 189.90 కి.మీ. మేర ఓఆర్ఆర్ నిర్మించనున్నారు.
- దీనితోపాటు ఓఆర్‌ఆర్‌లో తెనాలి సమీపంలోని నందివెలుగు నుంచి చెన్నై-కోల్‌కతా హైవేలో కాజ వరకు 17.5 కి.మీ. మేర ఆరు వరుసలతో లింక్ (స్పర్) రోడ్ నిర్మిస్తారు. ఓఆర్‌ఆర్‌లో నారాకోడూరు నుంచి గుంటూరు శివారులోని బుడంపాడు వరకు 5.5 కి.మీ. మేర నాలుగు వరుసలతో మరో లింక్‌రోడ్ నిర్మిస్తారు.
- వీటితో కలిపి మొత్తం 212.60 కి.మీ. ప్రాజెక్టు అవుతోంది.
- ఓఆర్‌ఆర్ కోసం 140 మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేస్తున్నారు. ఇందులో ఆరు వరుసల ఓఆర్‌ఆర్, ఇరువైపులా చెరో రెండు వరుసలతో సర్వీస్ రోడ్లు నిర్మిస్తున్నారు.
- మొత్తంగా ఈ ప్రాజెక్టు కోసం ఐదు జిల్లాల్లోని 23 మండలాల పరిధిలో 97 గ్రామాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది.

పల్నాడు, ఏలూరు జిల్లాల్లో అభ్యంతరాల స్వీకరణ

- ఇప్పటివరకు కేంద్రం పల్నాడు, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భూసేకరణకు గెజిట్ నోటిఫికేషన్ ప్రచురించింది.
- ఎన్టీఆర్ జిల్లాల భూముల వివరాలను ఇక్కడి రెవెన్యూ అధికారులు రెండు రోజుల క్రితం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కి అందజేశారు. వాళ్లు వచ్చే వారం ఆ వివరాలను ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులకు పంపాక.. ఎన్టీఆర్ జిల్లా భూసేకరణ గెజిట్ నోటిఫికేషన్‌నూ కేంద్రం ప్రచురించనుంది.
- ఇప్పటికే కేంద్రం గెజిట్ ప్రచురించిన జిల్లాల్లోని.. పల్నాడు జిల్లా సంయుక్త కలెక్టర్ పత్రికా ప్రకటన జారీచేసి, ఆయా సర్వే నంబర్లలో భూ యజమానుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు.
- ఏలూరు జిల్లాలో అభ్యంతరాల స్వీకరణ జరుగుతోంది.
- కృష్ణా, గుంటూరు జిల్లాల సంయుక్త కలెక్టర్లు వచ్చే వారం పత్రికా ప్రకటన జారీచేసి.. తర్వాత 21 రోజులపాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- కొన్నిచోట్ల 140 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుతో గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు.
- ఎలైన్‌మెంట్ ప్రకారం కొన్ని సర్వే నంబర్లలో పూర్తి భూమి, మరికొన్నింట్లో కొంత భూమినే సేకరించాలి. అయినా ఆ సర్వే నంబర్లన్నింటినీ గెజిట్‌లో పేర్కొంటున్నారు.

ఓఆర్‌ఆర్ ఏ జిల్లాలో ఎన్ని కి.మీ.

జిల్లా	కి.మీ.
ఎన్టీఆర్	51.12
ఏలూరు	18.76
కృష్ణా	35.14
గుంటూరు	67.65
పల్నాడు	17.23
మొత్తం	189.90



క్షేత్రస్థాయి సర్వే తర్వాత అసలైన విస్తీర్ణం

- సంయుక్త కలెక్టర్లు.. రైతులు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు పరిశీలించి, వారికి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చాక.. క్షేత్రస్థాయిలో పెగ్ మార్కింగ్‌కు ఆదేశిస్తారు.
- ఇందులోభాగంగా కొలతలు వేసి, సర్వే చేస్తారు. కేంద్రం ఆమోదించిన ఎలైన్‌మెంట్ ప్రకారం.. జీపీఎస్ కోఆర్డినేట్స్ ద్వారా.. 140 మీటర్ల వెడల్పులోని సరిగ్గా మధ్య పాయింట్ నుంచి ఇరువైపులా 70 మీటర్లతో పెగ్ మార్కింగ్ వేసుకుంటూ వెళ్తారు.
- అప్పుడు ఏ సర్వే నంబరులో ఎంత భూమి సేకరించాలి? అది మెట్టా? మాగాణా? అందులో చెట్లు, భవన నిర్మాణాల లాంటివి ఏమైనా ఉన్నాయా? వంటివన్నీ తెలుస్తాయి.
- ఆ వివరాలు, సర్వే నంబర్లతో సహా రెవెన్యూ, సర్వే అధికారులు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్ రూపొందించి, సంయుక్త కలెక్టర్‌కు అందజేస్తారు.
- ఆ తర్వాత జేసీలు భూమిరాశి పోర్టల్‌లో వాటిని అప్‌లోడ్ చేస్తారు.
- వీటిని పరిశీలించి.. ఖరారు చేస్తూ కేంద్రం 3డి నోటిఫికేషన్ జారీచేస్తుంది.
- కేంద్ర మంత్రివర్గం.. ఓఆర్‌ఆర్ ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ, అధికారిక ఉత్తర్వు జారీచేసిన తర్వాత 3డి నోటిఫికేషన్ జారీ అవుతుంది.
- అనంతరం ఆయా భూములకు డాక్యుమెంట్లు, ఆధారాలను చూపించి, యజమానులు, రైతులు నిరూపించుకోవాలి.
- తర్వాత సర్వే నంబర్లు, వాటిలో భూవిస్తీర్ణం ఆధారంగా ఎంత చెల్లిస్తారనేది పేర్కొంటూ అవార్డు పాస్ చేస్తారు.

గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో మండలాలు, గ్రామాలు, సర్వే నంబర్లు, విస్తీర్ణం వారీగా గెజిట్ నోటిఫికేషన్లు.. https://eenadu.net లో

సెకి.. లేఖల ఆంతర్యమేంటి?

- నెట్‌వర్క్ సిద్ధం చేస్తామని ఏడాదైనా.. అతీగతీ లేదు
- ఐఎస్‌టీఎస్‌పై ఇంకా తేల్చలేదు
- అయినా.. విద్యుత్ ఇస్తామంటూ తాజాగా ఒత్తిడి

ఈనాడు, అమరావతి: ఒప్పందం ప్రకారం విద్యుత్ తీసుకోవాలంటూ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) ఇంధనశాఖకు పదే పదే లేఖలు పంపుతోంది. మార్చి నుంచి 500 మెగావాట్ల విద్యుత్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తాజా లేఖలో పేర్కొంది. రెండోవిడత మరో 500 మెగావాట్ల విద్యుత్ అందిస్తామంటోంది. ఒప్పందం ప్రకారం దశలవారీగా 7వేల మెగావాట్ల విద్యుత్ ఇస్తామని సెకి తెలిపింది. ఆ విద్యుత్‌కు అంతర్రాష్ట్ర సరఫరా ఛార్జీల (ఐఎస్‌టీఎస్) మినహాయింపుపై స్పష్టత ఇస్తేనే ఒప్పందంపై ముందుకెళ్తామని ఇంధనశాఖ చెబుతున్నా.. హామీ ఇవ్వలేదు.

అదానీ లేఖలపై ఏం చేద్దాం?

డిస్కంలతో కుదుర్చుకున్న విద్యుత్ విక్రయ ఒప్పందం (పీఎస్‌ఏ) ప్రకారం మొదటి దశలో 3వేల మెగావాట్లను 2024 సెప్టెంబరు నుంచి సెకి సరఫరా చేయాలి. 'ఇప్పటివరకు విద్యుత్ ఇవ్వలేకపోయాం. ఇప్పుడు అదానీ ప్లాంట్లు ఉత్పత్తిలోకి వచ్చాయి. విద్యుత్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం' అని సెకి తన లేఖలో పేర్కొంది. అదానీ సంస్థతో సెకి 7వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. ఆ విద్యుత్ తీసుకోవాలని అదానీ సంస్థ లేఖలు రాస్తోందంటూ.. సెకి వాటిని ఇంధనశాఖకు పంపింది. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఛార్జీల మినహాయింపుపై స్పష్టత ఇవ్వండి

సెకి లేఖలపై ఇంధనశాఖ ఆచితూచి వ్యవహరిస్తోంది. ఐఎస్‌టీఎస్ ఛార్జీల మినహాయింపు ఉంటుందని కేంద్రం నుంచి హామీ ఇవ్వాలని కోరుతూ ఇంధనశాఖ సమాధానం రాసినట్లు తెలిసింది. దీనికి సెకి స్పందన చూసి.. ముందుకెళ్లాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

వైకాపా హయాంలో ఒప్పందం

వైకాపా ప్రభుత్వం సెకితో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం యూనిట్‌కు రూ.2.49 చొప్పున డిస్కంలు చెల్లించాలి. 2024 సెప్టెంబరులో మొదటివిడత 3వేల మెగావాట్లు, 2025 సెప్టెంబరులో రెండోవిడత 3వేల మెగావాట్లు, 2026 సెప్టెంబరులో మిగిలిన వెయ్యి మెగావాట్లు తీసుకునేలా జగన్ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. కానీ, సౌరప్లాంట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఒప్పందం అమలుకాలేదు. సెకితో కుదుర్చుకున్న పీపీఏ 25 ఏళ్ల పాటు అమలులో ఉంటుంది. ఐఎస్‌టీఎస్ మినహాయింపుపై స్పష్టత లేకుండా ఒప్పందంపై ముందుకెళ్తే.. పీపీఏ వ్యవధిలో ప్రజలపై రూ.1.10 లక్షల కోట్ల అదనపు భారం పడుతుందని ఇంధనశాఖ అంచనా.

నెట్‌వర్క్ సిద్ధం కాకున్నా.. మళ్లీ లేఖలు

ఈ ఏడాది జనవరిలో సెకి నుంచి 10 లేఖలు ఇంధనశాఖకు అందాయి. విద్యుత్‌గ్రిడ్‌కు కనెక్ట్ చేసేందుకు నెట్‌వర్క్ 2025 మార్చి నాటికి సిద్ధమవుతుందని, ఏప్రిల్ నుంచి విద్యుత్ సరఫరాకు సిద్ధమన్నది వాటి సారాంశం. కానీ, ఇప్పటివరకు నెట్‌వర్క్ సిద్ధం కాలేదు.

- అదానీ సంస్థతో సెకి విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదుర్చుకుంది. ఆ సంస్థ గుజరాత్, రాజస్థాన్‌లలో ఏర్పాటుచేసే ప్లాంట్ల నుంచి వచ్చే విద్యుత్‌ను గ్రిడ్‌కు కనెక్ట్ చేసేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రెండు రాష్ట్రాల్లోనూ నెట్‌వర్క్ అభివృద్ధి చేయాలి. ఆ విద్యుత్‌ను అనంతపురం జిల్లాలోని గుత్తి దగ్గర ట్రాన్స్‌కో 400 కెవి సబ్‌స్టేషన్‌కు అనుసంధానించాలి.
- ఆ సంస్థ ఎంత విద్యుత్ ఇస్తోందనే లెక్కలు తేల్చేందుకు మీటర్లు, విద్యుత్ తీసుకునేందుకు ట్రాన్స్‌కో నెట్‌వర్క్ సిద్ధం చేయాలి. కానీ, ఇప్పటివరకు ట్రాన్స్‌కో ఎలాంటి పనులు నిర్వహించలేదు.



(c) eenadu



ప్రయోగం అనంతరం ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ నమూనాతో ఇస్రో ఛైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తల విజయోత్సాహం

నింగిలోకి 'బ్లూబర్డ్'

(మొదటి పేజీ తరువాయి)

విడిపోయిన బ్లూబర్డ్.. నిర్దేశిత కక్ష్యలోకి చేరింది. దేశ తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్‌'లో ఎల్‌వీఎం3 రాకెట్‌నే ఉపయోగించనున్నందున.. ఈ విజయం ఇస్రో నమ్మకాన్ని ద్విగుణీకృతం చేసింది.

మార్చిలోపు మరో ఆరు

షార్ నుంచి మార్చిలోపు మరో ఆరు ప్రయోగాలు చేపడతామని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ వెల్లడించారు. ప్రయోగం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎల్‌వీఎం-3ఎం6 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడానికి శాస్త్రవేత్తలు అంకితభావంతో పని చేశారని కొనియాడారు. అమెరికాలోని టెక్సస్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ రూపొందించిన అత్యంత బరువైన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని 518.5 కి.మీ. ఎత్తులో కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు ఆయన వెల్లడించారు. 520 కి.మీ. ఎత్తులో ప్రవేశపెట్టాలనేది ప్రణాళిక కాగా.. దానికి 1.5 కి.మీ. దిగువన ఉపగ్రహాన్ని చేర్చామన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన లాంచ్ అని నారాయణన్ చెప్పారు. చంద్రయాన్-4, 5 ప్రయోగాలకు అన్నీ సిద్ధం చేశామని, ఏడాదిలో వాటి పనులు మొదలవుతాయని ఆయన వెల్లడించారు. షార్ డైరెక్టర్ పద్మకుమార్, వీఎస్ఎస్‌సీ సంచాలకులు రాజరాజన్, ఎల్‌పీఎస్‌సీ డైరెక్టర్ మోహన్, మిషన్ డైరెక్టర్ విక్టర్ జోసఫ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రధాని అభినందనలు

అత్యంత బరువైన ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. గగన్‌యాన్, ఇతర భవిష్యత్ ప్రయోగాలకు ఈ మిషన్ పునాదిలా మారుతుందని అన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు చెప్పిన వారిలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉన్నారు.

అంతరిక్షంలో అద్భుత విజయం: సీఎం చంద్రబాబు

బాహుబలి రాకెట్ 'ఎల్‌వీఎం3-ఎం6' ప్రయోగంతో అంతరిక్ష రంగంలో భారత్ మరో అద్భుత విజయం సాధించిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. అమెరికాకు చెందిన 'బ్లూ బర్డ్ బ్లాక్-2' ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారని ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు గవర్నర్ అభినందన

ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్‌ను బుధవారం విజయవంతంగా ప్రయోగించి, బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టినందుకు ఇస్రో శాస్త్రవేత్తలను గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించారు.

- ఎల్‌వీఎం3 మిషన్ విజయవంతం చేసిన ఇస్రో బృందానికి మాజీ సీఎం జగన్ బుధవారం 'ఎక్స్‌'లో అభినందనలు తెలిపారు. ఇది దేశ శాస్త్రీయ నైపుణ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు.

ఆరావళిలో కొత్తగా మైనింగ్ లీజులు ఇవ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)



అందులో గుర్తుచేసింది. వాటికి అదనంగా ఆ శ్రేణుల్లో ఇంకా ఏయే ప్రాంతాలు, జోన్లలో తవ్వకాలను నిషేధించడం అవసరమో గుర్తించాలని భారత అటవీ పరిశోధన, విద్యా మండలి (ఐసీఎఫ్ఆర్ఈ)ని ఆదేశించింది. అదే సమయంలో ప్రకృతిపై ప్రతికూల ప్రభావం పడకుండా ఆరావళిలో తవ్వకాలు జరిపేందుకు సమగ్ర, సశాస్త్రీయ నిర్వహణ ప్రణాళికను రూపొందించాలని సూచించింది. దాన్ని ప్రజా బాహుళ్యంలో ఉంచి అభిప్రాయాలు సేకరిస్తామని పేర్కొంది.

కాపాడట్లేదు.. అమ్మేస్తున్నారు: కాంగ్రెస్

ఆరావళిలో కొత్త లీజులను నిషేధిస్తూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై కాంగ్రెస్ పెదవి విరిచింది. నష్ట నివారణకు ప్రభుత్వం బోగస్ ప్రయత్నాలు చేస్తోందని విమర్శించింది. ఇలాంటి ప్రయత్నాలతో ఎవరినీ మోసపుచ్చలేరని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. ఈ పర్వత శ్రేణులను ప్రభుత్వం కాపాడటం లేదని, అమ్మేస్తోందని ఆరోపించారు. ఆరావళి కొండల విషయంలో ఇటీవల ఇచ్చిన పునర్నిర్వచనాలు ప్రమాదకరమైనవని పేర్కొన్నారు.

రామ్‌కో సిమెంట్స్ లీజులో తవ్వకాలకు అనుమతి

ఈనాడు, అమరావతి: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వటల, కోటపాడు గ్రామాల పరిధిలో రామ్‌కో సిమెంట్స్‌కు ఉన్న 663.46 హెక్టార్ల సున్నపురాయి లీజు ప్రాంతంలో లభించే క్వార్ట్జైట్‌ను కూడా ఆ సంస్థ తవ్వుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీ చేసింది. లీజు ప్రాంతంలో 373.52 హెక్టార్లలో సున్నపురాయి నిల్వలు ఉన్నాయని, మిగిలిన 289.94 హెక్టార్లలో క్వార్ట్జైట్ నిల్వలు ఉన్నట్లు గుర్తించామని, వాటిని తవ్వుకునేందుకు అనుమతివ్వాలని రామ్‌కో విజ్ఞప్తి చేసింది. దీంతో టన్నుకు రూ.160 చెల్లించి, క్వార్ట్జైట్‌ను పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

DSC-SGT, SA, TGT (Maths, Bio-Sci. Phy.Sci)
FREE DEMO & NEW BATCH : 26-12-2025@9AM
SA, TGT బ్యాచ్‌లకు మల్కిడా సార్వంకాని ఫ్యాకల్టీ కాంబినేషన్‌తో
మ్యాథ్స్: తండ శ్రీనివాస్, వెంకట్ గౌడ్ (DL), తిరుమల్‌రెడ్డి మెథడ్: జితేందర్ రెడ్డి, ఫిజికల్ సైన్స్: రాము, గోపి, కెమిస్ట్రీ: అయ్యప్ప లింగస్వామి, శ్రీనివాస్ (డైరెక్టర్), మెథడ్ : డా॥ వేణుగోపాల్ రెడ్డి బయాలజీ: ఆంజనేయులు, ప్రజాపతి, సైదులు, మెథడ్ : విక్రమ్
బాసర ఇన్‌స్టిట్యూట్ Pranavam Plaza, 4/9 Brodipet GUNTUR 8885020155

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
నెం.18/2025-26, నిట్ నెం.115 నుండి 119, ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన తేదీ: 22.12.2025
సూపరింటెండింగ్ ఇంజనీర్, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు పరిధిలోని వివిధ నియోజకవర్గంలోని 5 పనులకు అంచనా విలువ: రూ.531.00 లక్షలతో వివిధ నిధులతో మంజూరైన పనులకు టెండర్లు తేది.31.12.2025 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నవి.
సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు
DIPR No. 18522/CL/ADVT/1/1/2021-22

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం
వేలముల శాఖ
ఇ-వేలం ప్రకటన
అన్ని వెరైటీల మానవ వెంట్రుకలను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 'కొనుగోలు' పోర్టల్ ద్వారా వేలం ఐడి.నెం: 25403 క్రింద తొలగించేందుకు గాను తిరిగి వారు తేది: 08-01-2026 నాడు ఈ-వేలం నిర్వహించనున్నారు. తదుపరి వివరాల కొరకు సంప్రదించవలసిన వెబ్‌సైట్ http://konugolu.ap.gov.in లేదా O/o ది జనరల్ మేనేజర్ (వేలములు) టిటిడి, తిరుపతి వారికి ఫోన్ నెం: 0877-2264429 / ఈ-మెయిల్ gmauctionsttd@gmail.com పై సంప్రదించండి.
కార్యనిర్వహణాధికారి
TTD-40021/10/2025-PRO SEC(Adv No:334), Dt: 24-12-2025

నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, హైదరాబాద్
(రాష్ట్ర చట్టం క్రింద స్థాపించబడిన విశ్వవిద్యాలయం)
పంజగుట్ట, హైదరాబాద్ - 500082, తెలంగాణ.
ఫోన్: 040-23489000/9244, 040-23396552, ఫ్యాక్స్: 040-23310076, వెబ్‌సైట్: www.nims.edu.in
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Rc.No.Plng II/20/2024/TCU/News papers తేది: 24-12-2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ swww.eprocurement.telangana.gov.in ద్వారా నిమ్స్‌లోని ప్లానింగ్ సెక్షన్ నుండి దిగువ తెలిపిన టెండరు నోటిఫికేషన్ల కొరకు బిడ్స్ కోరబడుచున్నవి. క్ర.సం.- వివరం: 2. నిమ్స్ గ్రంథాలయానికి పుస్తకాల సేకరణ, 3. మెడికల్ జెనెటిక్స్ శాఖకు ZBSA ప్రాజెక్ట్ క్రింద ఎక్విప్‌మెంట్ సేకరణ. బిడ్డర్లు పూర్తి టెండరు స్పెసిఫికేషన్లు, అనుబంధాలు, సవరణ, ప్రీ-క్వాలిఫికేషన్ ప్రమాణాలు, గడువు తేదీలు, రెగ్యులర్ అప్‌డేట్స్ మరియు పాల్గొనడం కొరకు పై వెబ్‌సైట్‌లను చూడవల్సిందిగా విజ్ఞప్తి.
సం/- ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్
DIPR R.O.No. 12633-PP/CL/ADVT/1/2025-26. తేది: 24-12-2025

చిరుధాన్యాలు.. ఘనమైన ఆవిష్కరణలు!

- సరికొత్త ఉత్పత్తులు తయారు చేస్తున్న సీఓఈఎం
- ఔత్సాహికులకు సాంకేతికత అందిస్తున్న సంస్థ



సీఎఫ్‌టీఆర్ఐలో ఏర్పాటైన చిరుధాన్యాల కేంద్రం

చిరు ధాన్యాలు.. ఆరోగ్యానికి వరం అని అందరికీ తెలుసు. కానీ, చాలా మంది వాటిని సేకరించడం, వండటం ఓ పెద్ద పనిగా భావిస్తారు. ఇలాంటి వారికోసమే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ మిల్లెట్స్ అండ్ ఇంక్యుబేషన్ కేంద్రం(సీఓఈఎం) మిల్లెట్స్ ముద్దను నేరుగా నోటికందించేందుకు యత్నిస్తోంది. చిరుధాన్యాలను 'రెడీ టూ ఈట్'లా సిద్ధం చేస్తోంది. ఆ దిశగా ఇప్పటికే ఎన్నో ప్రయోగాలు చేసిన ఈ సంస్థ.. ఔత్సాహికులకు ఆయా సాంకేతికతలను అందిస్తోంది. మైసూరులోని సీఎస్ఐఆర్- సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ)లో గతేడాది డిసెంబరులో సీఓఈఎం ఏర్పాటైంది. ఏడాది పూర్తి చేసుకోబోతున్న ఈ కేంద్రం.. చిరుధాన్యాలతో సాధించిన ఘన ఆవిష్కరణలను పరిశీలిద్దాం.

రైతుల నుంచే షురూ..

చిరుధాన్యాల ఉత్పత్తిలో కర్ణాటక నాలుగో స్థానంలో ఉంది. రైతులు మాత్రం అవగాహన లేక నష్టపోతున్నారు. సీఓఈఎం ముందుగా రైతు నుంచి కార్యాచరణ మొదలుపెట్టింది. రూ.20 కోట్లతో 3 రకాల ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ధాన్యాన్ని నేరుగా ఈ కేంద్రాలకు తరలించేలా అవగాహన కల్పించింది. ధాన్యం నాణ్యత, శుద్ధి, అనుబంధ ఉత్పత్తుల తయారీ రైతుల కళ్లముందే చేపడుతోంది. ప్రత్యేక ప్రాసెసింగ్ యంత్రాలతో గంటకు 500 కిలోల ధాన్యం శుద్ధి చేసి, ఉత్పత్తులనూ తయారు చేయడంతో రైతులకు కేంద్రంపై గురి కుదిరింది.




నిల్వకు పెద్దపీట..

- చిరు ధాన్యాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం ఉన్నా.. వాటి పిండి, రవ్వ ఇతర ఉత్పత్తుల నిల్వ కాలం తక్కువ.
- సీఓఈఎం ప్రత్యేక పద్ధతుల్లో 4-5 నెలలపాటు నిల్వ చేసుకునేలా చేసింది.
- ఇందుకు తొలుత వైబ్రో క్లీనర్ల ద్వారా ధాన్యం శుభ్రం చేసి, స్టీమింగ్ ట్యాంకర్లు, డ్రైయర్ బెడ్ల ద్వారా ఆరబెట్టి ఎప్పుడంటే అప్పుడు వాడుకునేలా పాలిష్ చేస్తోంది.
- ఆ తర్వాత వినియోగదారుడికి అవసరమైన ఉత్పత్తులుగా మార్చుతోంది.
- ధాన్యం నిల్వకూ ఈ కేంద్రంలోనే గోదాములు ఏర్పాటు చేసింది.



రాగి, మామిడితో తయారైన ఉగ్గు



ఎలక్ట్రానిక్ నోస్: ఆహార పదార్థాల తయారీకి అవసరమైన పరిమాణాలు, రుచిని చెప్పేస్తుంది



మెక్‌డొనాల్డ్ మెచ్చింది

సీఓఈఎంలో జొన్న, రాగి, సజ్జ తదితర ధాన్యాలతో చేసిన బన్.. మెక్‌డొనాల్డ్ సంస్థకు ఎంతో నచ్చింది. దాన్ని 'మిల్లెట్ బన్ బర్గర్'గా మార్చి ప్రపంచ విపణికి పరిచయం చేసింది.

వృథా లేదిక్కడ

చిరుధాన్యాలు శుద్ధి చేసేటప్పుడు వచ్చే వ్యర్థాలనూ ఈ ఇంక్యుబేషన్ కేంద్రంలో వృథాగా పోనివ్వడం లేదు. రాగి పొట్టు నుంచి ఆయిల్, విరిగిన రాగులతో పేలాలు, పగుళ్లిచ్చిన గింజలతో 'రాగి రైస్', నూకతో రవ్వ, మురుకులు ఇలా.. ఒక్క రాగులతోనే 45 రకాల ఉత్పత్తులు చేస్తోంది. వాటికి అదనపు పోషకాలూ జోడిస్తోంది.

- ప్రస్తుతం కేంద్రంలో 9 రకాల ధాన్యాలను 130 రకాల ఉత్పత్తులుగా మలిచే వ్యవస్థలున్నాయి.
- బయో డిగ్రేడబుల్, తినదగిన ప్లేట్లు, స్పూన్లు, గిన్నెలు తయారు చేస్తోంది.
- వినియోగదారుడు కోరుకున్న రంగులు, రుచులను చేర్చేందుకు ఎలక్ట్రానిక్స్ నోస్, మౌత్ అప్లికేషన్లు, ప్యాకేజింగ్ వ్యవస్థలూ తీసుకొచ్చింది.



ఈ ప్యాకెట్‌తో క్షణాల్లో రాగి కేసరిబాత్ తయార్

వ్యాపారవేత్తలుగా మారుస్తున్నాం

– డాక్టర్ గిరిధర్ పర్వతం, డైరెక్టర్, సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరు



సీఓఈఎంలో ఏర్పాటైన వ్యవస్థలు ఇప్పుడిప్పుడే వినియోగంలోకి వస్తున్నాయి. చిరుధాన్యాన్ని 'రెడీ టు కమర్షియలైజేషన్'గా మార్చే సాంకేతికత సీఓఈఎంలో ఉంది. రైతులు, మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. సాంకేతికతలను వినియోగించుకొని రైతులు, సంఘాలు వ్యాపారవేత్తలుగా రాణించొచ్చు. ఇప్పటికే 40కి పైగా మహిళా స్వయం సహాయ సంఘాలు వ్యాపార కేంద్రాలుగా మారాయి.

- ఈనాడు, బెంగళూరు

20 లక్షల ఉద్యోగాల కల్పనే మా ప్రాధాన్యాంశం

- 30 లక్షల పేద కుటుంబాలకు కలిగిన ప్రయోజనాల్ని అంచనా వేయాలి
- సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాల్ని పది మిషన్లుగా నిర్దేశించుకుని అన్ని శాఖలూ పని చేయాలని, వాటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించారు. పేదరికం లేని సమాజం అనే మిషన్‌లో భాగంగా ప్రతి కుటుంబానికి సాధికారత, వ్యక్తులకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం ఆయన సచివాలయంలో స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై అధికారులతో సమీక్షించారు. 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో భాగంగా పౌరులకు వేగంగా, మెరుగైన సేవలు అందించాలి. ప్రతి ప్రభుత్వ శాఖ సూచికలు సిద్ధం చేసుకుని పనిచేయాలి. వాటి అమలును విజన్ యూనిట్ల ద్వారా పర్యవేక్షించాలి. జనాభా నిర్వహణకు విధానం రూపొందించాలి. సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో 30 లక్షల పేద (బీపీఎల్) కుటుంబాలకు ఎంత ప్రయోజనం కలిగిందో అంచనా వేయాలి. నైపుణ్యాలు, ఉద్యోగ కల్పనను అత్యంత ప్రాధాన్యాంశంగా తీసుకోవాలి. 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలి' అని చంద్రబాబు ఆదేశించారు. 'పౌర సేవలు సులభంగా అందేలా ప్రభుత్వ శాఖలన్నీ సాంకేతికత అందిపుచ్చుకోవాలి. ఆర్టీజీఎస్ ద్వారా సమాచారాన్ని సమన్వయం చేసుకోవాలి. విద్యాశాఖ వినియోగంలోకి తెచ్చిన క్లికర్ యాప్ తరహా వినూత్న ఆవిష్కరణలు అమలు చేయాలి' అని సూచించారు.



స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై సచివాలయంలో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నీటి వినియోగంలో వివాదాలకు తావుండకూడదు

'నీటి భద్రత అంశంపై ప్రధాన దృష్టి పెట్టాలి. నీటి వనరుల సమర్థ వినియోగంతోపాటు నీటి ఆడిట్ నిర్వహించాలి. వినియోగంలో ఎక్కడా వివాదాలు లేకుండా చూడాలి. రెండు తెలుగు రాష్ట్రాలూ సస్యశ్యామలంగా ఉండాలనేదే నా ఆకాంక్ష. రాష్ట్రంలో రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించేలా లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలి. రోడ్డు, రైలు, అంతర్గత జలరవాణా, సీకార్గో, ఎయిర్ కార్గో తదితర అంశాలతోపాటు కోల్డ్‌చైన్‌లోనూ మౌలిక సౌకర్యాలు కల్పించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి' అని పేర్కొన్నారు.

రెసిడెన్షియల్ హస్టళ్లలో ఆర్గానిక్ కూరగాయల సాగు: రాష్ట్రంలోని అన్ని రెసిడెన్షియల్ వసతిగృహాల్లో ఆర్గానిక్ కూరగాయల సాగుకు ఆలోచన చేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. 'సాంకేతికత ఉపయోగించి, సాగు వ్యయం తగ్గేలా చూడాలి. డిమాండ్ ఆధారిత పంటల ఉత్పత్తి, కోల్డ్ చైన్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టి రైతులకు ప్రయోజనం కలిగించాలి. రైతు ఆత్మహత్యల నివారణకు కార్యాచరణ చేపట్టాలి. స్వచ్ఛాంధ్రలో భాగంగా సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడంతోపాటు గాలి, నీటి నాణ్యతల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి. స్వచ్ఛాంధ్రలో కేంద్ర నిధుల్ని సమర్థంగా వినియోగించుకోవాలి' అని నిర్దేశించారు. సమీక్షలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీపీపీపై రాజీలేదు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 30% చొప్పున భరించాలని కేంద్రం సూచించిందని చెప్పారు. వీజీఎఫ్ ద్వారా అరుణాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఆసుపత్రులు, వైద్య కళాశాలలు నిర్మించేందుకు ఆర్థిక వ్యవహారాల విభాగం ఇప్పటికే అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం పీపీపీ విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు.

టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలి: ప్రభుత్వం తొలి విడతగా ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల వైద్య కళాశాలలకు ఆహ్వానించిన టెండర్ల తాజా పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 'నాలుగు వైద్యకళాశాలల నిర్మాణానికి సెప్టెంబర్ 18న టెండర్లు పిలిస్తే రెండు ప్రీబిడ్ సమావేశాల్లో ఆరు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయి. కొందరు బిడ్డర్లు ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించి, పరిస్థితులు అంచనా వేసేందుకు కొంత సమయం కావాలని కోరారు. నాలుగు సంస్థలు మరింత సమాచారం అడిగాయి. ప్రతి ప్రాజెక్టుకు గరిష్ఠంగా 50 ఎకరాల కేటాయింపు, ఆకృతుల వివరాలు తదితర అంశాలపై చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఎన్ఎంసీ నిబంధనల మేరకు భూమిని సమర్థంగా వినియోగించుకునేలా డిజైన్లు రూపొందించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, కన్సార్షియం సభ్యుల సంఖ్యను రెండు నుంచి మూడుకు పెంచాలని బిడ్డర్లు కోరితే అంగీకరించాం. ఆదోని వైద్యకళాశాల నిర్మాణానికి ఓ సంస్థ ముందుకొచ్చింది' అని వివరించారు. ఆ సంస్థతో ఒప్పందం చేసుకుని వైద్య కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మిగిలిన వైద్య కళాశాలల టెండర్ల ప్రక్రియ వేగవంతం చేసేలా బిడ్డర్లతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు.

సంజీవని ప్రాజెక్టుపై ఆరా: ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ కార్డులు ఇచ్చేలా రూపొందించిన సంజీవని ప్రాజెక్టును ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ సమర్థంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. కుప్పంలో పైలట్‌గా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు అమలుపై ఆరా తీశారు. అక్కడ ఎదురైన అడ్డంకులు అధిగమిస్తూ చిత్తూరు జిల్లావ్యాప్తంగా ప్రాజెక్టు అమలు చేయాలని ఆదేశించారు.

పెద్దకొడుకుగా అండగా ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు కూల్చేశారు. అప్పటి పాలకుల దాష్టీకాలకు ఎదురు నిలిచి, బెదిరింపులకు భయపడబోమని.. పవన్‌కల్యాణ్ వస్తారని గ్రామస్థులు రోడ్డెక్కారు. అప్పట్లో ఇప్పటం గ్రామానికి వెళ్లిన పవన్‌కల్యాణ్ బాధితులకు అండగా నిలిచారు. నాగేశ్వరమ్మకు ఆర్థిక సహాయం అందించి పెద్దకొడుకుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఇప్పటం రావాలని ఆమె కోరారు. ఆమెకిచ్చిన మాట నిలబెట్టుకుంటూ బుధవారం అక్కడకు వెళ్లారు.



నాగేశ్వరమ్మకు పాదాభివందనం చేస్తున్న పవన్‌కల్యాణ్



ఇప్పటంలో గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటూ...

వేతనం నుంచి ప్రతినెలా రూ.5 వేల సాయం

నాగేశ్వరమ్మ కుటుంబసభ్యులతో మాట్లాడిన పవన్‌కల్యాణ్.. సంక్రాంతి పండుగ కానుకగా వారికి నూతన వస్త్రాలు, ఖర్చుల నిమిత్తం రూ.50వేలు అందించారు. ఆమె మనవడు, దివ్యాంగుడైన మనోజ్‌సాయి చదువు కోసం రూ.లక్ష సాయం చేశారు. ఆమె కుమారుడు కొండయ్య క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.3 లక్షలు ఇచ్చారు. వృద్ధాప్యం వల్ల పొలం పనులకు వెళ్లలేకపోతున్నానని నాగేశ్వరమ్మ చెప్పగా.. ప్రతినెలా తన వేతనం నుంచి రూ.5వేలు ఇచ్చే ఏర్పాటుచేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న దివ్యాంగుడైన మనోజ్‌సాయికి ప్రభుత్వోద్యోగం ఇప్పించాలని, కుమారుడు కొండయ్యకు ఉచితంగా వైద్యం చేయించాలని ఆమె కోరగా... వాటిని పరిష్కరించాలని అక్కడే ఉన్న సబ్‌కలెక్టర్ సంజనా సింహకు ఉపముఖ్యమంత్రి సూచించారు. ఆరోగ్యం జాగ్రత్త అని నాగేశ్వరమ్మకు చెప్పిన ఆయన.. ఆమెకు పాదాభివందనం చేసి తిరుగు పయనమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమను సొంత కుటుంబసభ్యుల్లా చూసుకోవడం పట్ల నాగేశ్వరమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటం పర్యటనలో ఆయనకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడిన గ్రామస్థులను పలకరించేందుకు పవన్ రావడం ఎంతో ఆనందంగా ఉందని జనసేన నాయకులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణం శివశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తిరిగి వెళ్లే దారిలో రోడ్డుపక్కన పూలతోటల్లో పని చేస్తున్న కూలీలను చూసి కారు దిగి వారిని పలకరించారు.

అనంతరం ఇప్పటంలో శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటం గ్రామస్థులు జనసేన ఆవిర్భావ సభకు భూములిస్తే వైకాపా ప్రభుత్వం కక్షగట్టి 53 ఇళ్లు కూల్చేసిందన్నారు. అప్పట్లోనే నాగేశ్వరమ్మతోపాటు మరికొందరు బాధితులను పరామర్శించిన పవన్‌కల్యాణ్.. మరోసారి ఆమె ఇంటికి వస్తానని మాట ఇచ్చారని గుర్తుచేశారు. వృద్ధురాలి ఇంటికి వచ్చి సాయం అందించి మాట నిలబెట్టుకుని మానవత్వం చాటుకున్నారన్నారు.

రుషికొండ భవనాలు.. ఆతిథ్య రంగానికి!

(మొదటి పేజీ తరువాయి)

ఫెమా వంటి సంస్థల ప్రతిపాదనలపై మంత్రులు చర్చించారు. రుషికొండపై భవనాలు హోటళ్లకు పూర్తి అనుకూలంగా లేవని, అదనపు భవనాలు నిర్మిస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు. అప్పుడే ఆతిథ్య రంగానికి అనుకూలమని అన్నారు. మంత్రుల కమిటీ ఆదేశాలతో సీఆర్‌జడ్ అథారిటీ, పర్యాటక, రెవెన్యూ శాఖలు, మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ), విశాఖ మెట్రో రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) అధికారులు ఈ నెల 26న రుషికొండ భవనాలు, కొండ కింద ఖాళీ భూములను పరిశీలించనున్నారు. ఆ వివరాలపై మంత్రుల కమిటీ 28 వర్చువల్‌గా సమావేశమై చర్చించి, నివేదిక రూపొందిస్తుంది. దాన్ని 29న జరిగే మంత్రిమండలి సమావేశం దృష్టికి తీసుకెళ్లనుంది.

ఆ ఏడెకరాల అభివృద్ధికి నిబంధనల అడ్డంకి: మంత్రి కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్. చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్

'రుషికొండ కింద ఉన్న 9 ఎకరాల భూముల్లో 7 ఎకరాల్లో సీఆర్‌జడ్ నిబంధనల ప్రకారం ఎలాంటి నిర్మాణాలూ చేపట్టకూడదని, ప్రత్యామ్నాయంగా స్థలం కేటాయించాలని భవనాల అభివృద్ధికి ముందుకొచ్చిన పలు సంస్థలు కోరాయి. వాస్తవ పరిస్థితులపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. రుషికొండ భవనాల్లో చివరి రెండు బ్లాకులు ప్రజలకు ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఉంచుతాం. మిగిలినవే ప్రైవేట్ సంస్థలకు ఇస్తాం' అని మంత్రుల కమిటీ సమావేశం అనంతరం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ విలేకర్లతో చెప్పారు. రుషికొండ భవనాల వినియోగంపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మరో మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

పరిశీలన వీటిపైనే..

- రుషికొండపై ప్రస్తుత భవనాలను వాణిజ్య అవసరాలకు ఎంత వరకు వినియోగించుకోవచ్చు?
- కొత్తగా అదనపు భవనాలు నిర్మించేందుకు సీఆర్‌జడ్ నిబంధనల ప్రకారం అవకాశం ఉందా?
- కొండ కింద 9 ఎకరాల్లో వ్యాపార నిర్వహణకు ఎంత వరకు వీలుంది?
- సమీపంలో ప్రభుత్వ భూముల లభ్యత ఉందా?

గ్రహం అనుగ్రహం

25-12-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత ఋతువు, పుష్య మాసం, శుక్లపక్షం
పంచమి: ఉ. 10-42 తదుపరి షష్ఠి
శతభిష: తె. 6-18 తదుపరి పూర్వాభాద్ర
వర్జ్యం: మ. 1-27 నుంచి 3-03 వరకు
అమృత ఘడియలు: రా. 11-05 నుంచి 12-41 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-10 నుంచి 10-53 వరకు తిరిగి మ. 2-32 నుంచి 3-16 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.31; సూర్యాస్తమయం: సా.5.28

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	12.9	28.1
విజయనగరం	15.0	27.0
అనంతపురం	15.0	30.5
కర్నూలు	16.3	30.4
కడప	17.0	28.0
శ్రీకాకుళం	17.0	28.0
విశాఖపట్నం	17.0	29.0
విజయవాడ	17.0	29.0
రాజమహేంద్రవరం	17.0	33.0
గుంటూరు	19.0	29.0
నరసాపురం	19.0	30.7
తిరుపతి	19.2	29.5
ఒంగోలు	20.6	30.1
సూర్యాపేట	21.0	30.0
నెల్లూరు	21.3	30.0
తాడేపల్లిగూడెం	24.0	30.0

(c) eenadu

అటల్ స్మృతి న్యాస్ సొసైటీ అధ్యక్షుడిగా వెంకయ్యనాయుడు



వాజ్‌పేయీ జయంతి సందర్భంగా భాజపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన దీపోత్సవ్ కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, జేపీ నడ్డా


ఈనాడు, దిల్లీ: దిల్లీలోని రాజ్‌ఘాట్ సమీపంలో ఉన్న మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ స్మృతి స్థలం 'సదైవ్ అటల్' నిర్వహణకు ఏర్పాటైన అటల్ స్మృతి న్యాస్ సొసైటీ అధ్యక్షుడిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న విజయ్‌కుమార్ మల్హోత్ర ఇటీవల కన్నుమూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం జరిగింది. బుధవారం దిల్లీలోని వెంకయ్యనాయుడి నివాసంలో సొసైటీ సభ్యులందరూ సమావేశమై ఆయనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాని మోదీతో పాటు, ఇతర సభ్యులను సంప్రదించి సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు రామ్‌బహదూర్‌రాయ్ వెంకయ్యనాయుడి పేరును ప్రతిపాదించగా, సమావేశంలో పాల్గొన్న భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, భాజపా కేంద్ర కార్యాలయ కార్యదర్శి మహేంద్రపాండేలు బలపరిచారు. త్వరలోనే అధ్యక్ష హోదాలో వెంకయ్యనాయుడు ఇతర సభ్యులను సంప్రదించి న్యాస్ కార్యకలాపాల నిర్వహణకు పాలక మండలి, కార్యనిర్వాహక కమిటీని నియమించనున్నారు.

వాజ్‌పేయీ ఆశీస్సులుగా భావిస్తున్నా: అటల్ స్మృతి న్యాస్ సొసైటీ బాధ్యతలు చేపట్టడాన్ని వాజ్‌పేయీ ఆశీస్సులుగా భావిస్తున్నట్లు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తిమంతమైన జీవితాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు కృషి చేస్తానన్నారు. వాజ్‌పేయీ పాటించిన విలువలను ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

విశాఖలో అమెజాన్ రెట్టింపు పెట్టుబడులు

- మూడేళ్లలో 833 మందికి ఉపాధి కల్పన
- రీ-రిజిస్టర్ చేసుకున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఎస్‌టీపీఐ

ఈనాడు, విశాఖపట్నం: విశాఖలో గత రెండున్నరేళ్లుగా అమెజాన్ తన కార్యకలాపాలు సాగిస్తుండగా, మరింత విస్తరించేందుకు అడుగులు వేస్తోంది. సిరిపురం వద్ద ఓ తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసి, వర్క్ ఫ్రం హోమ్ పద్ధతిలో ఇప్పటికే 300 మంది ఉద్యోగులతో అమెజాన్ పని చేస్తోంది. పెట్టుబడిని రెట్టింపు చేసి మరో మూడేళ్లలో 833 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. రూ.100 కోట్ల మేర ఈ-కామర్స్ ఎగుమతులు పెంచేలా లక్ష్యం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఇటీవల సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)లో అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ రీ రిజిస్టర్ చేసుకుంది. లైసెన్స్‌ను అమెజాన్ రెన్యువల్ చేసుకున్న విషయాన్ని ఎస్‌టీపీఐ ఎక్స్‌లో పోస్టు చేసింది.



బీసీ, ఎస్సీలకు 57 శాతం పార్టీ పదవులు

- తెదేపా లోక్‌సభ నియోజకవర్గ కమిటీల ప్రకటన
- మహిళలకు 28 శాతం పోస్టులు

ఈనాడు, అమరావతి: లోక్‌సభ నియోజకవర్గ కమిటీలను తెలుగుదేశం పార్టీ బుధవారం ప్రకటించింది. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గానికి 42 మందితో కమిటీలను ఆ పార్టీ నియమించింది. వెనుకబడిన వర్గాలు, ఎస్సీలకు అగ్ర ప్రాధాన్యమిచ్చింది. మొత్తం పదవుల్లో బీసీలకు 37 శాతం, ఎస్సీలకు 20 శాతం కేటాయించింది. ఆ రెండు వర్గాలకూ కలిపి మొత్తం 57 శాతం పదవులిచ్చింది. కార్యవర్గాల్లో మహిళలకు 28 శాతం పదవులు కేటాయించింది. లోక్‌సభ నియోజకవర్గాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పేర్లు ఇటీవలే ప్రకటించిన పార్టీ... ఇప్పుడు మిగతా కార్యవర్గాల జాబితాలను విడుదల చేసింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకుండా, ఇది వరకు కమిటీల్లో 32 మంది సభ్యులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్యను 40కి పెంచింది. ప్రతి లోక్‌సభ నియోజకవర్గ కమిటీలోనూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, కార్యదర్శులను.. తొమ్మిది మంది చొప్పున నియమించింది. వీరితోపాటు ఒక కోశాధికారి, ఒక పార్టీ కార్యాలయ కార్యదర్శి ఒక మీడియా సమన్వయకర్త, సోషల్ మీడియా సమన్వయకర్త ఉంటారు.

బీసీలకు 389 పదవులు

లోక్‌సభ నియోజకవర్గ కమిటీల నియామకంలో సామాజిక సమతూకం పాటించింది. మొదటి నుంచి పార్టీకి అండదండగా ఉన్న బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చింది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాలకుగాను వేసిన పార్టీ కమిటీల్లో మొత్తం 1,050 పదవులు ఉండగా వాటిలో అత్యధికంగా 389 పదవులు వారికి కేటాయించింది. ఓసీలకు 335, ఎస్సీలకు 207, ఎస్టీలకు 41, మైనారిటీలకు 78 పదవులను కేటాయించింది. ఈ కమిటీల కూర్పుపై పార్టీ అధినేత చంద్రబాబు విస్తృత కసరత్తు చేశారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గానికి ఒక మంత్రి, మరో ఇద్దరు సీనియర్ నాయకులతో త్రిసభ్య కమిటీలను నియమించారు. ఆ కమిటీలు ఆయా లోక్‌సభ స్థానాల పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరించాయి. ఇతర మార్గాల్లో, ఐవీఆర్‌ఎస్ సర్వే ద్వారా తెప్పించుకున్న సమాచారాన్ని కూడా బేరీజు వేసుకుని పార్టీ కమిటీలను నియమించారు. ప్రాథమికంగా రూపొందించిన జాబితాల్లో మహిళల సంఖ్య తక్కువగా ఉండటంతో, వారి సంఖ్య పెంచాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ మేరకు జాబితాల్లో మార్పులు చేయించారు. పార్టీలో యువత, మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆయన అభిమతానికి అనుగుణంగా కమిటీల కూర్పు జరిగింది. పార్టీకి దీర్ఘకాలంగా విధేయులుగా ఉంటూ, అంకితభావంతో పనిచేస్తున్నవారికి ప్రాధాన్యమిచ్చారు.

తెదేపా లోక్‌సభ నియోజకవర్గ కమిటీల కూర్పు ఇలా

సామాజిక వర్గం	మొత్తం	శాతం	పురుషుల శాతం	మహిళల శాతం
ఓసీ	335	32	77	23
బీసీ	389	37	75	25
ఎస్సీ	207	20	60	40
ఎస్టీ	41	4	63	37
మైనారిటీ	78	7	73	27
మొత్తం	1,050	100	72	28

జనవరి నుంచి జిల్లా కేంద్రాల్లోని రేషన్ దుకాణాల్లో గోధుమపిండి

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది జనవరి నుంచి జిల్లా ముఖ్య కేంద్రాల్లోని రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై గోధుమపిండి పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్డుకు ఒక కిలో చొప్పున రూ.20కు అందిస్తామని తెలిపారు. బహిరంగ మార్కెట్ ధరతో పోలిస్తే తక్కువకే అందజేస్తున్నామని వెల్లడించారు.

రాష్ట్రంలో జగన్‌ది ప్రతినాయకుడి పాత్ర

- మంత్రి నారా లోకేశ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ ప్రజాపక్షం వహించకుండా అభివృద్ధిని అడ్డుకుంటూ రాష్ట్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణంతో పేదలకు మేలు జరుగుతుందని, వారికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, వైద్య విద్య సీట్లు లభిస్తాయని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు.



కానీ.. పీపీపీ విధానంపై జగన్ ఉద్దేశపూర్వకంగా విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. పీపీపీ విధానాన్ని జగన్, వైకాపా నేతలు అడ్డుకుంటున్న తీరు.. రౌడీలు, అరాచకవాదులకు వారు కొమ్ము కాస్తూ, అభివృద్ధిని అడ్డుకుంటున్న విధానంపై రూపొందించిన వీడియోను పోస్టుకు జత చేశారు.

2023-26 కాలానికి ఇంజినీరింగ్ ఫీజులను సవరించిన ప్రభుత్వం

ఏడు కళాశాలలకు పెరిగిన రుసుములు

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాలతో 2023-26 మూడేళ్ల కాలపరిమితికి ఈ మార్పు చేసింది. దీని ప్రకారం.. కనీస ఫీజు రూ.40 వేలు కాగా.. గరిష్ఠంగా రూ.1.05 లక్షలు. ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ 2023లో కళాశాలలకు మూడేళ్ల కాలానికి ఫీజులను నిర్ణయించింది. దీనిపై కొన్ని యాజమాన్యాలు అప్పట్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల మేరకు అప్పట్లో కమిషన్ ఫీజులను 10% పెంచింది. తరువాత కమిషన్.. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు 31 కళాశాలలు తమ ఆదాయ, వ్యయాల నివేదికలను కమిషన్‌కు సమర్పించగా.. వాటిని ఆడిట్ చేసి, ఫీజులను నిర్ణయించింది. వీటిలో ఏడు కళాశాలల ఫీజులు పెరిగాయి. 192 కళాశాలలు కమిషన్‌కు నివేదికలు సమర్పించలేదు. దీంతో ఏడు మినహా మిగతా అన్నింటికీ 2023లో నిర్ణయించిన ఫీజులనే వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి గడువు ఈ ఏడాదితో పూర్తవుతుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త ఫీజులు అమల్లోకి వస్తాయి.

టెట్ గణితం, సైన్సు పరీక్షల ప్రాథమిక కీ విడుదల

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పేపర్-2ఏ గణితం, సైన్సు పరీక్షల ప్రాథమిక 'కీ' విడుదల చేసినట్లు టెట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలను ఈ నెల 29 వరకు స్వీకరించనున్నారు. వెబ్‌సైట్‌లోనే అభ్యంతరాలు సమర్పించాల్సి ఉంటుంది.

బాలల కళ్లలో ఆనందం కోసం..



నూతన సంవత్సరం సమీపిస్తున్న వేళ పేద కుటుంబాలకు చెందిన బాలల మోముల్లో వెలుగులు నింపాలనుకున్నారు.. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని వన్ ఇండియా షాపింగ్ మాల్ అధినేత మారుతి. ఆ ఆలోచనను కొందరు స్వచ్ఛంద కార్యకర్తలతో కలిసి ఆచరణలో పెట్టారు. పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఉండే పేదలు వారి పిల్లలతో సహా బుధవారం సాయంత్రం తన మాల్‌కు షాపింగ్‌కు వచ్చేలా ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది చిన్నారులను వారికి నచ్చిన జతను తీసుకోనిచ్చారు. ఇలా మొత్తం రూ.2 లక్షల విలువైన దుస్తులను ఉచితంగా ఇచ్చారు.

– న్యూస్‌టుడే, తణుకు





(c) eenadu

ఈనాడు

ఇస్రో విజయ పరంపర


భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. మొదటిసారి అతి భారీ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టి ఇస్రో నిన్న తన సత్తా చాటుకుంది. ఎల్‌వీఎం-3 ఎం-6 రాకెట్ సాయంతో అమెరికాకు చెందిన 6,100 కిలోల బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి దిగ్విజయంగా నింగిలోకి పంపింది. ఎల్‌వీఎం-3కి ఇది వరసగా తొమ్మిదో విజయం. పైగా, 52 రోజుల వ్యవధిలోనే రెండు ప్రయోగాలను అనుకున్నట్లుగా పూర్తిచేయడం ఇస్రో సమర్థతకు తార్కాణం. ఇదే ఉత్సాహంతో వచ్చే మార్చి నాటికి మరిన్ని ప్రయోగాలకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సిద్ధమవుతోంది. 'గగన్‌యాన్'లో భాగంగా ఒక రోబోను ఆకాశంలోకి తీసుకెళ్లనుంది. ప్రైవేటు రాకెట్‌నూ ప్రయోగించనుంది. అతిపెద్ద శాటిలైట్లను రోదసిలోకి తరలించాలంటే స్పేస్‌ఎక్స్, ఐరోపా స్పేస్ ఏజెన్సీ లాంటివే గుర్తొచ్చే పరిస్థితుల్లో ఇస్రో సాధించిన తాజా ఘనత అంతరిక్ష విపణిలో ఇండియా స్థానాన్ని పటిష్ఠపరుస్తుంది. ఇస్రోపై ప్రపంచదేశాల్లో నమ్మకాన్ని ఇనుమడింపజేసి రాబోయే రోజుల్లో వాణిజ్య ప్రయోగాలకు మరింత ఊతమిస్తుంది. తద్వారా దేశీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ మరిన్ని కొత్త పుంతలు తొక్కే వీలుంది.

అయిదు దశాబ్దాల కిందట సొంత శాటిలైట్ సాంకేతికత లేని ఇండియా- దార్శనిక శాస్త్రవేత్తల కృషితో అంతరిక్ష రంగంలో వడివడిగా అడుగులు వేసింది. అనతికాలంలోనే 104 ప్రయోగాలు చేపట్టింది. వచ్చే పదిహేనేళ్లలో వాటి సంఖ్యను అంతకు రెట్టింపు స్థాయికి చేర్చాలని నిశ్చయించింది. మంగళయాన్, చంద్రయాన్-3 వంటి వాటి ద్వారా తన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి వెల్లడించిన ఇస్రో- 2040 కల్లా చంద్రుడిపై భారత వ్యోమగామి పాదంమోపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంతకు అయిదేళ్ల ముందే సొంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ఇండియా స్వప్నాన్ని సాకారం చేసేందుకు శ్రమిస్తోంది. రెండేళ్లలో మానవసహిత అంతరిక్ష యాత్రను చేపట్టేందుకు ఉద్యుక్తమవుతోంది. ఇస్రో విజయ పరంపరను గమనిస్తున్న చాలా దేశాలు వాటి ఉపగ్రహ ప్రయోగాలకు ఇండియానే ఆశ్రయిస్తున్నాయి. ఈ క్రమంలో ఇంతవరకు 34 దేశాలకు చెందిన 434 ఉపగ్రహాలను ఇస్రో అంతరిక్షానికి చేర్చింది. తద్వారా దేశానికి నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా ఆర్జించి పెట్టింది. ఇస్రో వెచ్చిస్తున్న ప్రతి రూపాయికి రెండున్నర రెట్ల ప్రతిఫలం వస్తుండటం ఆ సంస్థ అద్భుత పనితీరుకు నిదర్శనం!

ఇతర దేశాలతో పోలిస్తే చాలా చౌకగా నాణ్యమైన సేవలు అందిస్తున్నా- ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష విపణిలో ఇండియా వాటా రెండు శాతమే. రాబోయే పదేళ్లలో దాన్ని 10శాతానికి పెంచాలని కేంద్రం సంకల్పించింది. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో మన రోదసి కార్యకలాపాల్లో పురోగతి వేగవంతమైంది. నేడు ఇండియా అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ 840 కోట్ల డాలర్లు. వచ్చే దశాబ్ద కాలంలో అది అంతకు అయిదున్నర రెట్లకు పెరిగే అవకాశముంది. అందులో అధిక వాటా దేశీయ స్టార్టప్‌ల నుంచే ఉంటుందన్నది నిపుణుల అంచనా. ఉపగ్రహాల తయారీ, లాంచింగ్ సేవలు, అంతరిక్ష ఆధారిత సమాచార విశ్లేషణ తదితరాల్లో ఇండియాలో ఇప్పుడు నాలుగు వందల దాకా స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. వ్యవసాయం నుంచి జాతీయ భద్రత వరకు, సమాచార ప్రసారాలు మొదలు విపత్తు నిర్వహణ దాకా ఉపగ్రహాలు కీలక సేవలందిస్తున్నాయి. సంబంధిత ప్రయోగాలు ఇకపై ఇంకా జోరందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అంతరిక్ష కార్యక్రమ అవసరాలకు తగినంత నిపుణ మానవ వనరులను భారత్ తయారు చేసుకోవాలి. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో వైజ్ఞానిక స్పృహ పెంచాలి. ఆర్‌అండ్‌డీకి ఇతోధికంగా నిధులు కేటాయిస్తూ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా సంస్కృతిని పెంపొందించాలి.

రాష్ట్రాల తోడ్పాటుతో విజ్ఞాన భారతం!

ఆధునిక భారతదేశం విజ్ఞానపరంగా మరింత శక్తిమంతం కావాలంటే, రాష్ట్రాలు సైతం అందుకు కలిసి రావాలి. ఇందుకు సంబంధించి నీతి ఆయోగ్ మొన్న జులైలో విడుదలచేసిన నివేదిక రాష్ట్రాల శాస్త్ర సాంకేతిక మండళ్లకు స్పష్టమైన మార్గదర్శనం చేసింది. ఆ మేరకు అవి ముందుకు సాగితే భారతదేశ శాస్త్రీయ పునరుజ్జీవనం సుసాధ్యమవుతుంది. ఈ విషయంలో తెలుగు రాష్ట్రాలూ చురుగ్గా ముందడుగేయాలి.



దేశీయంగా జరుగుతున్న పరిశోధన-అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వమే అధికంగా నిధులు సమకూరుస్తోంది. మొత్తం ఆర్‌అండ్‌డీ వ్యయంలో కేంద్రం వాటా 43.7శాతమైతే, రాష్ట్రాల వాటా కేవలం 6.7శాతమే. పరిశోధన, నవ్యావిష్కరణలకు రాష్ట్రాలు మరిన్ని నిధులు ప్రత్యేకించాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు చాటిచెబుతున్నాయి. రాష్ట్రాల్లోని శాస్త్ర సాంకేతిక మండళ్లకు పూర్తిస్థాయిలో ఆర్థిక వనరులు సమకూరిస్తేనే- విస్తృతస్థాయిలో ప్రణాళికల రూపకల్పన, అమలు దిశగా అడుగులు పడతాయి. ఇందుకోసమని నీతి ఆయోగ్ రాష్ట్రాల జీఎస్‌డీపీలో కనీసం 0.5శాతాన్ని శాస్త్రీయ కార్యక్రమాలకు వెచ్చించడం వంటి అనేక సూచనలు చేసింది.

ఎన్నో అవకాశాలు...

తెలుగు రాష్ట్రాలు ఆర్థికంగా పురోగమిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) వృద్ధిరేటు 12.5శాతంగా ఉంటుందని ప్రభుత్వం నిరుడు పేర్కొంది. ఏపీ దేశీయ ఉత్పాదకత రూ.16.41 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. గతేడాది దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా నిలిచిన తెలంగాణ జీఎస్‌డీపీ రూ.16.5లక్షల కోట్లుగా ఉండవచ్చని అంచనా. మొత్తంగా సుమారు రూ.33లక్షల కోట్ల ఆర్థికశక్తితో తెలుగు రాష్ట్రాలు దేశంలోనే ముందువరసలో ఉన్నాయి. కానీ, వైజ్ఞానిక పరిశోధనలపై వెచ్చించే విషయంలో మాత్రం ఉభయ రాష్ట్రాలు చేయాల్సింది చాలానే ఉంది. ఏపీ పరిశోధన-అభివృద్ధి వ్యయం 2020-21లో రూ.502 కోట్లు. ఇది జీఎస్‌డీపీలో 0.031శాతం. తెలంగాణ ఖర్చేమో రూ.385 కోట్లు (జీఎస్‌డీపీలో 0.026శాతం). నీతిఆయోగ్ సిఫారసు మేరకు ఏపీ ఏటా రూ.8,205 కోట్లు, తెలంగాణ రూ.8,250 కోట్లు చొప్పున ఆర్‌అండ్‌డీకి కేటాయించాల్సి ఉంది. ఈ లక్ష్యాన్ని దశలవారీగా సాధించడానికి తెలుగు రాష్ట్రాలకు ఆర్థిక నిబద్ధత, సమర్థ ప్రణాళికలు అవసరం.

కేరళ సర్కారు నీతి ఆయోగ్ సూచించిన 0.5శాతం కన్నా తక్కువగా రూ.173.34 కోట్ల నిధులను రాష్ట్ర శాస్త్రసాంకేతిక మండలికి కేటాయించింది. అయితే, వాటిని అత్యంత సమర్థంగా వినియోగించడంతో మంచి ఫలితాలను సాధించింది. ఆ రాష్ట్రం 'బ్యాక్ టు ల్యాబ్' ఫెలోషిప్ కార్యక్రమం ద్వారా విరామం తీసుకున్న మహిళా సాంకేతిక పరిశోధకులకు మళ్లీ అవకాశం కల్పించింది. దాంతో వారు దాదాపు అయిదు వందల పరిశోధనా పత్రాలను సమర్పించారు. అయిదు ఆవిష్కరణలకు పేటెంట్లు కూడా సాధించారు. తమిళనాడు ఏమో పేటెంట్ల దాఖలులో జాతీయ స్థాయిలోనే మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ఆదర్శ పాఠశాలల నుంచి వందల మంది విద్యార్థులను ఐఐటీలకు పంపి ఔరా అనిపిస్తోంది. వాటి మాదిరిగా మరింత ముందుకు వెళ్లేందుకు తెలుగు రాష్ట్రాలకు అనేక అనుకూలతలూ అవకాశాలూ ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘమైన తీరప్రాంతం ఉంది. అక్కడ సముద్ర, జీవసాంకేతికతల అభివృద్ధికి అపారంగా అవకాశాలున్నాయి. ఆక్వాకల్చర్, బయోటెక్నాలజీలపై ఆంధ్రా యూనివర్సిటీ చేపట్టిన పరిశోధనలు, కృత్రిమ రీఫ్ ప్రాజెక్టులు, మెరైన్ సైన్స్ అభివృద్ధి వంటివి ఈ దిశగా వేసిన ముందడుగులే. అమరావతి నగరాభివృద్ధి, విశ్వవిద్యాలయాల విస్తరణ, డ్రోన్ సాంకేతికత, క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ దృష్టి కోణాన్ని దేశం ముందు ఆవిష్కరిస్తున్నాయి. విశాఖపట్నంలోని మెరైన్ సాంకేతిక స్టార్టప్‌లు, ఫిషరీస్ ఆర్‌అండ్‌డీ ల్యాబులు సముద్ర వనరుల శాస్త్రీయ వినియోగానికి తోడ్పడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో జరుగుతున్న ఇలాంటి ప్రయత్నాలను సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిళ్లు పర్యవేక్షించడమే కాకుండా, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఆర్‌అండ్‌డీ ప్రణాళికలను రూపొందించాలి. తద్వారా ఆవిష్కరణలు జోరందుకుంటాయి. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని టి-హబ్ చుట్టూ ఆవిష్కరణలకు అనువైన 'ఇన్నొవేషన్ ఎకో సిస్టం' తీసుకొచ్చింది. మరోవైపు, వెంచర్ క్యాపిటల్ కోసం రూ.2,000 కోట్లతో మాస్టర్ ఫండ్‌ను ఏర్పాటుచేసి సాంకేతిక ఆధారిత అభివృద్ధికి మద్దతిస్తోంది. హైదరాబాద్ బయోటెక్ పార్క్, జీనోమ్ వ్యాలీ వంటివి జీవసాంకేతికతల రంగంలో దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆవిష్కరణల రంగాన్ని పరిశ్రమలతో అనుసంధానించడానికి ఉభయ రాష్ట్రాలూ మరింతగా కృషి చేయాల్సి ఉంది.

దిశానిర్దేశక ప్రణాళికలు అవసరం

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, రాష్ట్రాల్లో శాస్త్రీయ పురోగతికి మూడు కీలక చర్యలు అవసరం. మొదటిది- రాష్ట్ర ప్రభుత్వాలు 2030 నాటికి జీఎస్‌డీపీలో కనీసం 0.5శాతం నిధులను ఆర్‌అండ్‌డీకి వెచ్చించాలి. సైంటిఫిక్ కౌన్సిళ్లను పునర్నిర్మించి, పూర్తికాల వైజ్ఞానిక డైరెక్టర్లను నియమించడం; పరిశ్రమలతో భాగస్వామ్యానికి ప్రత్యేక సెల్‌లను ఏర్పాటు చేయడం; పేటెంట్-టెక్ ట్రాన్స్‌ఫర్ మెకానిజం కలిగిన వేదికలను నెలకొల్పడం రెండోది. రాష్ట్రాలు తమ ప్రాధాన్య రంగాలనూ, అవి పాటించాల్సిన ప్రమాణాలనూ స్పష్టంగా నిర్ధారించుకుని... పనితీరు పర్యవేక్షణ-మదింపు విధానాలను రూపొందించుకోవడం, ఫలితాల ఆధారంగా నిధులను కేటాయించడం మూడోది. అయితే, వీటన్నింటినీ సమన్వయం చేసేందుకు దిశానిర్దేశక ప్రణాళిక అవసరం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సెంటర్ల తోడ్పాటుతో శాస్త్ర పరిజ్ఞానాన్ని సమాజానికి చేరువ చేయాలి. ఇటువంటి చర్యల ద్వారా- హైదరాబాద్, అమరావతి, విశాఖపట్నం మధ్య ప్రాంతాన్ని 'ఇన్నొవేషన్ మెట్రో ట్రయాంగిల్'గా అభివృద్ధి చేయవచ్చు. ఇది దేశార్థిక, శాస్త్రీయ భవిష్యత్తును మలుపుతిప్పడంలో కీలకంగా మారగలదు. ప్రస్తుతం ఇండియాలో ఆర్‌అండ్‌డీకి జీడీపీలో 0.64శాతాన్నే ఖర్చు చేస్తున్నారు. ఈ విషయంలో చైనా(2.4శాతం), జర్మనీ(3.1), దక్షిణ కొరియా(4.8 శాతం)లు మనకంటే ముందున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రైవేటు రంగం ఆర్‌అండ్‌డీకి 70శాతానికి మించి ఖర్చుపెడుతుంటే, మన దగ్గర అది 36.4శాతం దగ్గరే తచ్చాడుతోంది. ఈ అంతరాన్ని భర్తీ చేయడంలో తెలుగు రాష్ట్రాలు కీలక పాత్ర పోషించగలవు. నీతి ఆయోగ్ సూచనలను పాటించడం ద్వారా ఏపీ, తెలంగాణలు శాస్త్రీయపరంగా ఆత్మనిర్భరత సాధించిన రాష్ట్రాలుగా అవతరించగలవు!



డాక్టర్ మంగళంపల్లి కిరణ్
అసోసియేట్ ప్రొఫెసర్, నానో శాస్త్ర పరిశోధకులు
ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, అమరావతి


వినడానికి రెండు చెవులున్నా మాట్లాడ్డానికి ఒకటే నోరు మనకి. అంటే తక్కువ మాట్లాడి ఎక్కువ వినమని అర్థం. మాట్లాడటమైనా వినడమైనా గొప్ప కళలే కాదు, ఎంతో ప్రభావవంతమైన కమ్యూనికేషన్ సాధనాలు కూడా. వాటిని సాధన చేయాలి. కానీ చాలామంది వాటికి ఆ విలువ ఇవ్వరు. పూర్తిగా వినకుండా సమాధానం ఇవ్వడం; అసందర్భంగా, అనవసరంగా మాట్లాడటం... చేస్తుంటారు. కానీ మాటలు చాలా శక్తిమంతమైనవి. మంచి మాటలతో ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చు, నీరసించే మాటలు చెప్పి ఆత్మవిశ్వాసాన్ని తుంచనూ వచ్చు. ఎవరైనా మీ ముందు అసందర్భ ప్రసంగం చేస్తున్నట్లయితే మీరేం చేస్తారు?

కాస్త వినండి బాస్!



గుజరాత్‌లో అనిల్ షా అని ఒక ఐఏఎస్ అధికారి ఉండేవారు. ఇలా అసందర్భ ప్రసంగాలు చేసేవారిని ఆపడానికి ఆయన ఒక కొత్త టెక్నిక్ కనిపెట్టారు. అందరి ముందూ వాళ్లను ఆపమనో, అలా మాట్లాడటం తప్పు అనో చెప్పలేం. సైగలు చేయలేం. అటువంటప్పుడు ఆయనేం చేసేవారంటే మెల్లగా ఆ వ్యక్తి పక్కకి వెళ్లి భుజం మీద వేళ్లతో తట్టేవారు. ఇక ఆపమన్న సూచన అది. ఎవరూ గమనించకుండా, మాట్లాడుతున్న వ్యక్తి చిన్నబుచ్చుకోకుండా... జరగాల్సిన పని జరిగిపోయేది. ఈ విధానం ఎందుకు ప్రాధాన్యం సంతరించుకుందంటే- ప్రశంసనీయమైన పనులు చేసిన సంస్థలను, ప్రాజెక్టులను... ఇతర విభాగాల అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, శిక్షణలో ఉన్న అధికారులు... ఇలా రకరకాల వ్యక్తులు సందర్శిస్తూ ఉంటారు. ఈ ఫీల్డ్ విజిట్స్‌లో ఆయా అంశాలపై ప్రశ్నలు అడిగి తమ సందేహాలను తీర్చుకుంటూ ఉంటారు. ఆ ప్రాజెక్టు ఉద్దేశం ఏంటి? ఆలోచన ఎవరిది? ఎలా చేశారు? ఖర్చెంతయింది? ప్రయోజనాలెన్ని? ఎదుర్కొన్న సాధకబాధకాలేంటి? వాటిని ఎలా అధిగమించారు?... ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉంటాయి. తెలుసుకోవాలనే కుతూహలంతో వేసే ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి అవతలివారికి కూడా ఆసక్తిగానే ఉంటుంది. ఉత్సాహంగా చెబుతారు. ఏదైనా ఒక కొత్త విషయం తెలుసుకోవడానికి వెళ్లినప్పుడు వాళ్ల అనుభవంతో చెబుతున్నది పూర్తిగా వినాలి. అర్థం కాని విషయాలు అడగాలి కానీ విమర్శనాత్మకంగా చూడటం సరికాదు. కానీ కొందరు ఆ పనే చేస్తారు. అలా చేయకుండా ఇలా ఎందుకు చేశారంటూ నిలదీస్తారు. లోటుపాట్లను ఎంచుతారు. దాని గురించి తమకీ తెలుసని చెప్పుకోవడానికి, తమ హోదాను చాటుకోవడానికి అతి తెలివిని ప్రదర్శిస్తారు. మనం తెలుసుకోవడానికి వెళ్లాం, వాళ్లకి నేర్పడానికి కాదన్న సంగతి గుర్తుంచుకోరు. ఇలాంటి వారి నోరు మూయించడానికి అనిల్ షా వాడిన టెక్నిక్ బాగా పనిచేసేది. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి రంగాల్లో, పార్టిసిపేటరీ రూరల్ అప్రైసల్ లేదా పార్టిసిపేటరీ లెర్నింగ్ మెథడ్స్ అభ్యాసాల్లో ఇది చాలా అవసరం. కొద్దిరోజులకే ఆయన వాడే ఈ టెక్నిక్ అందరికీ తెలిసిపోయింది. ఈ పద్ధతిని ఎవరైనా కార్యాలయాల్లో, మిత్రుల సమూహాల్లో, కుటుంబాల్లో కూడా ఉపయోగించవచ్చు. అసందర్భ ప్రసంగాలు చేసేవారిని నొప్పించకుండా ఆపడానికి అదొక మార్గమన్నమాట.

– మధుర



వ్యక్తి సాధికారతకు ప్రాధాన్యమిస్తే అది దేశాన్ని శక్తిమంతం చేస్తుంది. ఆర్థికవృద్ధికి సామాజిక మార్పు తోడైనప్పుడే సాధికారత వేగవంతమవుతుంది. అవినీతి విషయంలో మాత్రం రాజీ ప్రసక్తే రాకూడదు.

– అటల్ బిహారీ వాజ్‌పేయీ

ప్రేమ సందేశం!

మనుషులు వస్తారు, వెళ్తారు. అయితే, వేలాది ఏళ్లుగా నక్షత్రంలా నిలిచి ఉండేది సత్యమే! నేనే మార్గం, సత్యం, జీవం అంటూ తన పేరుతోనే ఒక శకానికి నాంది పలికారు. ఆయన పుట్టినప్పుడు ఆకాశంలో ఒక తార మెరిసింది. అది నేటికీ సత్యంగా నిలిచింది. సత్యాన్ని అనుసరించండి.. ఆ సత్యమే మిమ్మల్ని సర్వస్వతంత్రులను చేస్తుంది అని బలంగా చెప్పిన ఆయనే ఏసు క్రీస్తు.

క్రీస్తు చూపిన సత్యమార్గం పేరే ప్రేమ. అలా విశ్వమంతటికీ ప్రేమను పంచి తన జీవితాన్నే సందేశంగా ఇచ్చిన ఆయన పుట్టింది పశువులశాలలో. పడుకోబెట్టింది పశువుల తొట్టెలో. ఆయన పుట్టిన ఆ ప్రదేశం ఆవాసయోగ్యం కాదు. మలినమైన మనసులు ఉన్న మనుషులకు అది సంకేతం. ఆ మనుషులను మహోన్నత మనస్కులుగా మార్చడానికి తన పుట్టుకతోనే ఒక సందేశం అందించారు.



అంతర్యామి

క్రీస్తు పుట్టిన విషయం ముందుగా తెలిసింది అమాయకులైన గొర్రెల కాపరులకు. ఆయన తన శిష్యులకు తప్పిపోయిన గొర్రెపిల్ల కథ చెప్పేవారు. ఆ కథలో కాపరి తన గొర్రెలకోసం ప్రాణం పెడతాడు. మందలోని ఒక గొర్రె తప్పిపోయినప్పుడు మిగతా గొర్రెలన్నిటినీ వదిలి దానికోసం కొండలు, గుట్టలు, వాగులు వెతుకుతాడు. దొరకగానే దాన్ని భుజంమీద ఎక్కించుకుని ఆనందపడతాడు. అలా తప్పిపోయిన గొర్రెలవంటి మనుషుల్ని వెతికి రక్షించడానికే క్రీస్తు ఈ లోకంలోకి వచ్చారు. సమాజం వెలివేసిన కుష్టురోగుల్ని తాకి మానవత్వపు స్పర్శ గురించి లోకానికి చాటిచెప్పారు. పాపం చేస్తే రాళ్లతో కొట్టి చంపే ఆనాటి మత పెద్దల అమానుష చర్యను ఖండించారు. పాపం చేయనివారే మొదటిరాయి విసరాలంటూ తీర్పు చెప్పారు. మంచివారిని, చెడ్డవారిని, పతితులను, పవిత్రులను సమదృష్టితో చూడమనే తన సత్యమార్గాన్ని ప్రబోధించారు.

ఏసు జన్మస్థలం బెత్లహేమును దర్శించడానికి ఇద్దరు మిత్రులు బయల్దేరారు. దారిలో వారికి గాయాలపాలైన ఒక వ్యక్తి ఎదురుపడ్డాడు. ఆ ఇద్దరిలో మొదటి మిత్రుడు, గాయపడిన ఆ బాటసారికి చికిత్స చేస్తూ ఉండిపోయాడు. రెండో మిత్రుడు అతణ్ని వదిలి బెత్లహేమువైపు సాగిపోయాడు. బెత్లహేములో అతడికి క్రీస్తు, తను వదిలి వెళ్లిన మిత్రుణ్ని హత్తుకుంటున్న దృశ్యం కనిపించింది. ఆ మిత్రుడు బెత్లహేము సందర్శన పూర్తిచేసుకుని, తిరిగి వచ్చేసరికి తన మిత్రుడు ఆ క్షతగాత్రుడికి సేవ చేస్తుండటం చూసి ఆశ్చర్యపోయాడు. అప్పుడతడికి 'దయగల హృదయమే దేవుడి మందిరం' అనే సత్యం బోధపడింది. 'నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించు' అని క్రీస్తు బోధించిన విశ్వప్రేమలోని అంతరార్థం అదే.

ప్రేమ సహిస్తుంది, దయ చూపిస్తుంది. అంతేకానీ అమర్యాదగా నడచుకోదు, స్వప్రయోజనం చూడదు, అపకారాన్ని తలపెట్టదు. దుర్నీతికి సంతోషపడదు. ప్రేమకు నిరీక్షించే శక్తి ఉంటుంది. అదొక్కటే నిత్య సత్యం. అదే క్రిస్మస్ పర్వదినం రోజున క్రీస్తు ప్రభువు అందించే ప్రేమ సందేశం.

– డాక్టర్ ఎమ్.సుగుణరావు

ఆరోగ్య భాగ్యం కోసం

ఇండియాలో వైద్య సేవలను మెరుగుపరచాలన్నా, తక్కువ ధరలో వైద్య విద్యను అందుబాటులోకి తేవాలన్నా కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు తప్పనిసరి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 44 కొత్త మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. వాటిలో ఏపీ, తెలంగాణల నుంచి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. అలాగే అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో 11,732, పీజీలో 3,393 సీట్లు నూతనంగా పుట్టుకొచ్చాయి. ఆయా రాష్ట్రాల్లో అవి ఎన్నంటే...

రాష్ట్రం	యూజీ సీట్లు	పీజీ సీట్లు
ఆంధ్రప్రదేశ్	430	119
బిహార్	550	47
గుజరాత్	375	285
కర్ణాటక	1550	599
కేరళ	700	97
మహారాష్ట్ర	980	418
రాజస్థాన్	825	112
తమిళనాడు	1050	375
తెలంగాణ	475	118
ఉత్తర్ ప్రదేశ్	950	290
పశ్చిమ్ బెంగాల్	800	36

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

అన్నదాతల ఆరోగ్యానికి పెనుముప్పు

హరిత విప్లవం తరవాత సాగులో పురుగు మందుల వాడకం పెరుగుతూ వచ్చింది. దానివల్ల అంతకు ముందు కంటే దిగుబడులు అధికమయ్యాయి. కానీ ఇది నాణేనికి ఒకవైపు అయితే, మరోవైపు అత్యంత విషపూరితమైన ఈ రసాయనాలు రైతుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. మన దేశంలో పంజాబ్, హరియాణా, మహారాష్ట్ర తరవాత తెలంగాణ, ఏపీల్లోనే పురుగు మందుల వినియోగం ఎక్కువగా ఉంది.

పంటలను చీడపీడలు ఆశించకుండా చూడటానికి, అధిక దిగుబడిని సాధించడానికి ఉపయోగించే పురుగు మందులు నేడు ఎంతోమంది రైతులను దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడేస్తున్నాయి. మరికొంతమంది ప్రాణాలూ తీస్తున్నాయి. ఇటీవల ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు యువ రైతులు అలాగే ప్రాణాలు కోల్పోయారు. ఏ రక్షణ లేకుండా పురుగు మందు పిచికారీ చేయడమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో విష రసాయనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.

నిర్లక్ష్యమే కారణం...

పంటకు మందు పిచికారీ చేసేటప్పుడు రైతులు కచ్చితంగా పీపీఈ కిట్ ధరించాలి. తుంపర్లు పీల్చకుండా మాస్కులు, కళ్లకు జోళ్లు, చేతులకు గ్లౌజులు వేసుకోవాలి. కానీ అవేమీ పట్టించుకోకపోగా చాలా మంది డబ్బాల మూతలను పళ్లతో తీస్తున్నారు. కవర్లు ధరించకుండా రసాయన మిశ్రమాలను కలుపుతున్నారు. మధ్యలో అదే చేతులతో మంచినీళ్లు తాగడం సాధారణం అయిపోయింది. పిచికారీ చేసిన తరవాత కూడా చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోకుండా ముక్కు, కళ్లు ఇతర శరీర భాగాలను తాకుతున్నారు. పిచికారీ చేసేటప్పుడు గాలి వాటానికి ఎదురెళ్లడం వల్ల ఆ మందుతో శరీరమంతా తడిసిపోతోంది. దాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇక ఖాళీ పురుగు మందు డబ్బాలు కాలువల్లో, పొలం గట్టు పక్కన ఎక్కడపడితే అక్కడ పడేయడంతో జలవనరులు, గాలి కలుషితం అవుతున్నాయి. ఇలా చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే దేశంలో ఏటా 11వేల మంది రైతులు, కూలీలు పురుగు మందులకు బలైపోతున్నారని అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కీటకనాశనులను పిచికారీ చేసేవారు దీర్ఘకాలంలో గుండె, శ్వాస, నాడీ సంబంధ, చర్మ క్యాన్సర్ వంటి వ్యాధుల బారినపడుతున్నారు. ఈ పనుల్లో భాగస్వాములయ్యే మహిళలను సంతాన లేమి, గర్భవిచ్ఛిత్తి వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. మరోవైపు ఈ హానికరమైన పురుగు మందులు సులభంగా దొరకడం వల్లే.. గ్రామీణ ప్రాంతాల్లో వాటిని తాగి బలవన్మరణాలకు పాల్పడే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఓ అంచనా ప్రకారం పురుగు మందులు తాగి దేశంలో ఏటా 70 వేల మంది చనిపోతున్నారు. ఆ మృతుల్లో ఎక్కువగా 25-40 ఏళ్లలోపు వారు ఉండటంతో వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.




అయిదేళ్ల క్రితమే 27 రకాల పురుగు మందులను పూర్తిగా తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. కానీ అందులో కేవలం మూడింటినే నిషేధించారు. కొన్ని సంస్థల ఆర్థిక ప్రయోజనాల కోసం రైతుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం సమంజసం కాదని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రాణాంతకమైన పెస్టిసైడ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తాత్కాలికంగా నిషేధించే అవకాశం ఉంది. ఇప్పటికే కేరళ, తమిళనాడు, ఒడిశా వంటి రాష్ట్రాలు అత్యంత హానికరమైన మందులను తొలగించాయి. కేరళ ప్రభుత్వం పదేళ్ల క్రితమే ఈ దిశగా ముందడుగు వేసింది. 14 రకాల ఉత్పత్తులను నిషేధించింది. శ్రీలంక, బంగ్లాదేశ్, దక్షిణ కొరియాలు సైతం ఇదే బాటలో సాగుతున్నాయి. కానీ ఇలాంటి నిర్ణయాలు దిగుబడులను దెబ్బతీస్తాయని, రైతులే నష్టపోతారనే వాదనను పలు సందర్భాల్లో కంపెనీలు తెరపైకి తెచ్చాయి.

కలిసిన చర్యలే పరిష్కారం...

పురుగు మందుల విష ప్రభావం నుంచి బయటపడాలంటే రెండు మార్గాలున్నాయి. పరీక్షల ఆధారంగా అత్యంత ప్రమాదకరమైనవి ఏవో గుర్తించి వాటిని పూర్తిగా నిషేధించాలి. తక్కువ గాఢత ఉన్న వాటిని పిచికారీ చేసేటప్పుడు కూడా తీసుకోవాల్సిన జాగ్రత్తల మీద రైతులకు అవగాహన కల్పించాలి. పీపీఈ కిట్లు, గ్లౌజులు, మాస్కులు వంటివి రైతులకు చౌకగా అందుబాటులో ఉంచాలి. డ్రోన్లతో పిచికారీ వైపు రైతులను మళ్లించాలి. రెండోది సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగించేలా రైతులను ప్రోత్సహించాలి. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్' మరింత మెరుగ్గా పనిచేయాలి. ఏపీలోని 'ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్' లాంటి పాలసీని అన్ని రాష్ట్రాలు అవలంబించాలి. అప్పుడే విషపూరిత పురుగుమందుల కారణంగా చోటు చేసుకునే మరణాలు తగ్గుముఖం పడతాయి.

– మాడుగుల గోపయ్య



(c) eenadu

రీసర్వే సమస్యలపై.. సాకులు కుదరవిక

- పరిష్కారంపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి
- పొలం కొలతల్లో తేడాలు చక్కదిద్దాల్సిందే
- జాయింట్ ఎల్‌పీఎం సమస్యలూ పరిష్కరించాలి
- చిన్న మార్పు చేయాలన్నా.. నోటీసు తప్పనిసరి
- సమస్యలు, పరిష్కారాలపై తాజాగా మార్గదర్శకాలు
- గ్రామ, మండల సర్వేయర్, తహసీల్దార్లకు శిక్షణ

ఈనాడు, అమరావతి: రీసర్వేలో మీ భూమి కొలత తగ్గిందా, జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సమస్య ఉందా? తహసీల్దారు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు చక్కదిద్దలేదా? అయితే వెళ్లి అధికారుల్ని అడగండి.. మూడు, నాలుగేళ్లుగా వెంటాడుతున్న సమస్యల్ని పరిష్కరించుకోండి. దీనికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేసింది. వాటి పరిష్కారంలో మండల, గ్రామ స్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉద్దేశపూర్వక జాప్యం చేసినా, కావాలని అర్జీలు తిరస్కరించినా తీవ్రంగా పరిగణిస్తామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఆదేశాలిచ్చారు. సంబంధిత అధికారుల వివరణ కోరడంతోపాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా పరిగణించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. రెవెన్యూలో అన్ని దస్త్రాలూ తప్పనిసరిగా ఈ-ఆఫీస్ ద్వారానే ప్రాసెస్ చేయాలని పేర్కొన్నారు. వైకాపా హయాంలో రీసర్వే సందర్భంగా తలెత్తిన సమస్యలు ఇప్పటికీ లక్షల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తే భూమి కొలతల్లో తేడాలకు సంబంధించినవే లక్షకుపైగా అర్జీలు వచ్చాయి. అందులో 85% పరిష్కరించామని అధికారులు చెబుతున్నా అధిక శాతం సమస్యలు అలాగే కొనసాగుతున్నాయి. అర్జీల్ని కిందిస్థాయి అధికారులకు పంపి పరిష్కరించామని ముగించేస్తున్నారు. ఇప్పుడు వీటి పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ప్రధాన సమస్యలు, పరిష్కారాలు

సమస్య 1: భూమి కొలత తగ్గినప్పుడు సరిచేసేందుకు పట్టాదారు, సరిహద్దు భూయజమానులకు ఎలాంటి అభ్యంతరం లేని కేసుల్లో

పరిష్కారం: రీసర్వేలో వచ్చిన విస్తీర్ణాన్ని వెబ్‌ల్యాండ్ 2.0లో నమోదు చేయాలి.

సమస్య 2ఎ: పట్టాదారు భూమి విస్తీర్ణం తగ్గడం, అది 5% కంటే ఎక్కువ ఉండటం.. దాన్ని పక్క భూమి యజమాని తనకున్న హక్కుపత్రాల్లోని విస్తీర్ణం కంటే ఎక్కువగా ఆక్రమించడం

పరిష్కారం: పక్క భూమి యజమాని అధీనంలోని అధిక విస్తీర్ణాన్ని పట్టాదారుకు చేర్చాలి. అదే విస్తీర్ణాన్ని పక్క భూమి యజమాని నుంచి తొలగించాలి.

సమస్య 2బి: తేడా విస్తీర్ణం 5% కంటే తక్కువ ఉంటే

పరిష్కారం: వాస్తవంగా వినియోగంలో ఉన్న భూమినే నమోదు చేయాలి.

సమస్య 3: ఆర్ఎస్ఆర్/వెబ్‌ల్యాండ్ 1.0 కంటే వాస్తవ భూమి విస్తీర్ణం ఎక్కువ ఉంటే..

పరిష్కారం: ఆ అధిక విస్తీర్ణం ప్రభుత్వానికి కాకుండా.. ప్రస్తుతం ఆక్రమణలో ఉన్నవారికే చెందుతుంది. ఇప్పటికే ప్రత్యేక ఎల్‌పీఎం సృష్టించి ఉంటే తహసీల్దార్ ఆర్ఓఆర్ విచారణ చేసి, ఆ భూమిని అనుభవదారుకు అప్పగించాలి.

సమస్య 4: ఆర్ఎస్ఆర్/వెబ్‌ల్యాండ్ 1.0 లేదా రిజిస్ట్రేషన్ పత్రాల్లో నమోదైన దాని కంటే వాస్తవ భూమి విస్తీర్ణం తక్కువగా ఉంటే..

పరిష్కారం: వాస్తవంగా ఉన్న భూమి విస్తీర్ణాన్నే నమోదు చేయాలి. పొరుగువారు ఆక్రమించి ఉంటే దాన్ని తిరిగి పట్టాదారుకు (సమస్య 2ఎలో చెప్పిన విధంగా) అప్పగించాలి.

సమస్య 5: పాత సర్వే రికార్డుల్లో తప్పులు ఉంటే (ఎఫ్ఎంబీ- ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్, సబ్ డివిజన్లతో పోలిస్తే.. ఆర్ఎస్ఆర్- రీసర్వే రిజిస్టర్, ఎస్ఎఫ్ఏ-సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలు సరిపోలకపోతే)

పరిష్కారం: రీసర్వేలో నమోదైన వాస్తవ విస్తీర్ణాన్నే నమోదు చేయాలి.

సమస్య 6: వెబ్‌ల్యాండ్ 1.0తో పోలిస్తే ఆర్ఎస్ఆర్, ఎస్ఎఫ్ఏ విస్తీర్ణంలో తేడా ఉంటే..

పరిష్కారం: లోటు భర్తీ సాధ్యం కాదు. అనుభవంలో ఉన్న వాస్తవ విస్తీర్ణాన్నే నమోదు చేయాలి.

విస్తీర్ణం కంటే సరిహద్దులకే ప్రాధాన్యం

దశాబ్దాల కిందట చైన్, మాన్యువల్ విధానంలో కొలతలు నిర్వహించారు. ఆధునిక డిజిటల్ సర్వేలతో పోలిస్తే వాటి కచ్చితత్వం తక్కువే. అందువల్ల పాత కొలతల పరిమితుల్లో విస్తీర్ణంలో 5% తేడా అనుమతించారు. రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా ఆర్ఓఆర్ (1బి)లో పేర్కొన్న విస్తీర్ణంతో పోలిస్తే.. వాస్తవ విస్తీర్ణం సరిపోలడం లేదు. ఆర్ఓఆర్‌లో నమోదైన విస్తీర్ణం కొత్తగా చేపట్టే కొలతలకు సంబంధించిన సవరణకు లోబడి ఉంటుందని ఆర్ఓఆర్ చట్టం చెబుతోంది. విస్తీర్ణం కంటే సరిహద్దులకే ప్రాధాన్యమని సుప్రీంకోర్టు గతంలో తీర్పిచ్చింది. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ.. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట ఆదేశాలిచ్చింది.

విస్తీర్ణ వ్యత్యాసంపై గత ఆదేశాల రద్దు

◆ రీసర్వే ధ్రువీకరణ, క్షేత్రస్థాయి వాస్తవికత, అప్పీల్ దశల్లో ఈ సూచనలన్నీ కచ్చితంగా పాటించాలి.

◆ అవసరమైన చోట తహసీల్దార్లు ఆర్ఓఆర్ చట్టం కింద అన్ని సంయుక్త ల్యాండ్ పార్సిల్స్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ కేసుల్ని పరిష్కరించాలి.

◆ విస్తీర్ణాలకు సంబంధించిన వ్యత్యాసంపై గతంలో ఇచ్చిన ఆదేశాలన్నీ రద్దయ్యాయి.

◆ ఎల్‌పీఎం ఏరియా కరెక్షన్ అనే ప్రత్యేక పౌరసేవ పరిచయం చేస్తున్నాం.

నోటీసులు తప్పనిసరి.. పక్కింటి వారి సంతకం తీసుకోవాలి

◆ ప్రభావితులందరికీ నోటీసు ఇవ్వకుండా రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేయకూడదు. అది ఎంత చిన్నదైనా నోటీసు తప్పనిసరి. సంబంధిత పత్రాల్ని ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

◆ గ్రామ సర్వేయర్ ద్వారా జరిగే మార్పులకు నోటీసులు ఇవ్వకుండా చేస్తే ఆయనే బాధ్యుడవుతారు.

◆ గ్రామ సచివాలయంలో నోటీసు పెడితే సరిపోదు. ఇంటి వద్ద అతికిస్తే సాక్ష్యంగా పక్కింటి వారితో సంతకం తీసుకోవాలి.

◆ సంబంధిత అధికారి ఆర్డర్ కాపీల్ని అర్జీదారుకు అందించి, అందులోని అంశాల్ని వారికి వివరించాలి.

శిక్షణ ఇవ్వాలి.. ప్రతి పేరా చదువుతూ సంతకం చేయాలి

◆ పై ఆదేశాలకు సంబంధించి ప్రతి మండలంలో గ్రామ, మండల సర్వేయర్లకు శిక్షణ నిర్వహించాలి. ట్రైనర్లకు శిక్షణను కలెక్టర్ స్వయంగా నిర్వహించాలి.

◆ ప్రతి పేరా వారికి వివరించి.. గ్రామ, మండల సర్వేయర్లు, తహసీల్దార్ల నుంచి సంతకాలు తీసుకోవాలి. కలెక్టర్లు వాటన్నింటినీ పీడీఎఫ్‌గా చేసి ఈ-ఆఫీస్‌లో అప్‌లోడ్ చేయాలి.

సంయుక్త ఎల్‌పీఎంల విషయంలో తీసుకోవాల్సిన చర్యలివే

సమస్య 1: వెబ్‌ల్యాండ్ 2.0లోని సంయుక్త ఎల్‌పీఎం నంబర్ల సవరణలు

పరిష్కారం: ఎ. భూమి పట్టాదారు అనుభవంలో లేకుంటే సంబంధిత పట్టాదారుల పేర్లు తొలగించాలి.

బి. వారసత్వ కేసుల్లో.. చనిపోయిన పట్టాదారు, ఆయన చట్టబద్ధ వారసుణ్ని పట్టాదారులుగా చూపిస్తున్నారు. చనిపోయిన పట్టాదారు పేరు తొలగించాలి.

సి. అమ్మకం/ బహుమతి తదితర లావాదేవీల్లో విక్రేత, కొనుగోలుదారు పేర్లు ఉంటున్నాయి. విక్రేత పేరు తొలగించాలి.

సమస్య 2: వెబ్‌ల్యాండ్ 2.0లో సంయుక్త ఎల్‌పీఎంలు సబ్‌డివిజన్ చేయడం

పరిష్కారం: సంయుక్త ఎల్‌పీఎంల సబ్‌డివిజన్‌కు పట్టాదారులు అంగీకరించకపోతే.. అక్కడి తహసీల్దారు తనంతట తానుగా డబ్ల్యు.ఆర్.టి. వెబ్‌ల్యాండ్ 1.0 ప్రకారం అనుభవ విస్తీర్ణం విభాగంలో నమోదు చేయాలి.

సమస్య 3: బావులు, కాలిబాటలు, రహదారులు తదితర ఉమ్మడి ఆస్తులు, ఉమ్మడి అనుభవంలో ఉన్న వాటి విషయంలో..

పరిష్కారం: ఎలాంటి పరిష్కారం అవసరం లేదు.

సమస్య 4: విస్తృత గ్రామ కంఠాలు, అనుమతి కలిగిన/ లేని లేఔట్లు, కోర్టు ఆదేశాలకు సంబంధించిన కేసులు, సంబంధిత వ్యక్తులు/సంస్థల ఆమోదంతో ఏర్పడిన జాయింట్ ఎల్‌పీఎంలు

పరిష్కారం: గ్రామకంఠాలు, అనుమతి కలిగిన, అనుమతి లేని లేఔట్లను స్వామిత్వ/నక్షపై తుది నిర్ణయం వచ్చే వరకు వ్యవసాయేతర విభాగంలో కొనసాగించాలి.

సమస్య 5: భూమిపై అడ్డంకులు ఏమీ లేని సందర్భంలో భూయజమానులు వ్యక్తిగత ఎల్‌పీఎం కోరుతుంటే..

పరిష్కారం: సంబంధిత సర్వేయర్ పక్క భూమి యజమానుల అంగీకారంతో వేర్వేరు ఎల్‌పీఎంలు తయారు చేయాలి. వారి అంగీకారం లేకపోతే తహసీల్దారు తనంతట తానుగా వెబ్‌ల్యాండ్ 1.0 దామాషా ప్రకారం అనుభవ విభాగంలో నమోదు చేయాలి.

సంతకాలుంటేనే అర్జీ తీసుకుంటామంటే కుదరదు

రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇవ్వాలంటే సంబంధిత దరఖాస్తులపై వీఆర్వో, గ్రామ సర్వేయర్లతో సంతకాలు చేయించుకుని తీసుకురావాలని గ్రామ/వార్డు సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు చెబుతున్నారు. దీన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. అలా చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఉత్తర్వులు జారీ చేసింది.

శ్రీవారి దర్శనానికి పెరిగిన భక్తుల రద్దీ



తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ వద్ద సర్వదర్శన టోకెన్ల కోసం రోడ్లపై భక్తుల నిరీక్షణ

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తుతున్నారు. విద్యాసంస్థలకు సెలవులు కావడంతో భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాహనాలు బారులుతీరి కనిపించాయి. భక్తుల లగేజీ తనిఖీ కేంద్రాల నుంచి అలిపిరి లింకు బస్టాండు వరకు వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. సర్వదర్శన టోకెన్ల పంపిణీ కేంద్రాలైన శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులు ఉదయం నుంచే టోకెన్ల కోసం నిరీక్షించారు. కేవలం 8 వేల టోకెన్లు మాత్రమే విడుదల చేయడంతో నిరాశ వ్యక్తం చేశారు. 30 వేల మందికి పైగా భక్తులు సర్వదర్శనం కోసం తరలిరావడంతో టోకెన్లు పొందినవారు, లేనివారు వసతి పొందడం గగనంగా మారింది.

అరుదైన కేసులో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు



తల్లి చేత కేకు కోయిస్తున్న వైద్యులు

నెల్లూరు (నవాబుపేట), న్యూస్‌టుడే: అరుదైన కేసులో తల్లీబిడ్డలకు నెల్లూరు కిమ్స్ (బొల్లినేని) ఆసుపత్రి వైద్యులు సత్వర చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ దుర్గ, నియోనాటాలజిస్ట్ డాక్టర్ బార్గవ్ కేసు వివరాలు వెల్లడించారు. 'నెల్లూరు రూరల్‌కు చెందిన 9 నెలల గర్భిణి అంకమ్మ ఈ నెల 15న పొరపాటున పురుగుల మందు తాగారు. ఆమెను కుటుంబ సభ్యులు కిమ్స్ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు వెంటనే అల్ట్రాసౌండ్ స్కాన్ చేశారు. పురుగు మందు ప్రభావం గర్భనాళం ద్వారా బిడ్డకు చేరినట్లు అందులో బయటపడింది. శిశువుకు ప్రాణాపాయం పొంచి ఉండటంతో శస్త్రచికిత్స ద్వారా బిడ్డను బయటకు తీశారు. అప్పటికే కనుపాపలు చిన్నగా మారటం, నోటిలో స్రావాలు కనిపించడాన్ని గుర్తించారు. వెంటనే ఎన్ఐసీయూ వార్డుకు మార్చి చికిత్స అందించగా శిశువు కోలుకుంది. తల్లికి కూడా ప్రాణాపాయం తప్పడంతో వైద్యులు ఆమెతో కేకు కోయించారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి ప్రియ లక్ష్మి, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ మురారి, డాక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లి సోదరులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: వైకాపా నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి జనవరి 7 వరకు రిమాండ్ పొడిగిస్తూ మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ బుధవారం ఆదేశాలిచ్చారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నాయకులు జవ్విశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసులో పిన్నెల్లి సోదరులు ఏ6, ఏ7 నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీరిద్దరూ ఈ నెల 11న మాచర్ల కోర్టులో లొంగిపోవడంతో తొలుత 24వ తేదీ వరకు రిమాండ్ విధించారు. వీరు నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉండగా, ఆన్‌లైన్ ద్వారా విచారించారు.

క్రైస్తవ భవన్ నిర్మాణాన్ని అడ్డుకున్న జగన్

ఎమ్మెల్యే రామాంజనేయులు

ఈనాడు, అమరావతి: క్రైస్తవ భవన్ నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వంలో జగన్ అడ్డుకున్నారని తెదేపా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మండిపడ్డారు. క్రైస్తవులకు సంబంధించిన అనేక పథకాల్ని రద్దు చేశారని దుయ్యబట్టారు. క్రైస్తవ భవన్ నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. మంగళగిరిలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 8,427 మంది పాస్టర్లకు ప్రభుత్వం రూ.51 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కుమారుడి లాకర్ నుంచి రూ.5 లక్షలు స్వాధీనం

ఈనాడు, అమరావతి: శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ మీనుల ప్రసాద్‌బాబు కుమారుడు హెచ్.రామ్‌తేజ్ పేరిట ఉన్న బ్యాంకు లాకర్ నుంచి రూ.ఐదు లక్షల నగదును ఏసీబీ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం రామ్‌నగర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లోని లాకర్ నుంచి ఈ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఉద్యోగులు, వారి తరఫున లంచాలు వసూలు చేసే ప్రైవేటు వ్యక్తులకు చెందిన నివాసాల్లో మంగళవారం ప్రారంభమైన ఏసీబీ సోదాలు.. వరుసగా రెండో రోజూ కొనసాగాయి. విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, అనంతపురం సహా పలు ప్రాంతాల్లో దాడులు చేసి, నిందితులకు సంబంధించిన కీలక ఆస్తి పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భోగాపురం, విశాఖ జగదాంబ సెంటర్, ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్‌లు, ఆయా కార్యాలయాల సిబ్బందికి వాస్తవ ఆదాయమెంత.. వారికి భారీ మొత్తంలో ఆస్తులు ఎలా సమకూరాయి.. లెక్కల్లో చూపని నగదు ఎక్కడి నుంచి వచ్చింది.. తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

20కి చేరిన స్క్రబ్‌టైఫస్ మరణాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్క్రబ్‌టైఫస్ మరణాలు 20కి చేరాయి. మృతుల్లో స్క్రబ్‌టైఫస్ లక్షణాలతో పాటు ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నట్లు వైద్యులు తేల్చారు. తాజాగా ఈ నెల 23న బాపట్ల జిల్లాలో యు.నాగబాబు (21), కాకినాడ జిల్లాలో ఎం.చిన్నారి (25) స్క్రబ్‌టైఫస్ అనుమానిత లక్షణాలతో మృతిచెందారు.

అమరావతిలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ నేడు

- అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి



విలేకర్లతో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. చిత్రంలో లక్ష్మీప్రసన్న, జయప్రకాశ్, రమేష్‌నాయుడు, షేక్ బాజీ



★ సభాప్రాంగణం వద్ద మాధవ్, పల్లా శ్రీనివాసరావు, సత్యకుమార్ యాదవ్ తదితరులు

ఈనాడు, అమరావతి: సుపరిపాలన దివస్ సందర్భంగా 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర' ముగింపు కార్యక్రమాన్ని రాజధాని అమరావతిలోని వెంకటాయపాలెంలో గురువారం నిర్వహిస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. రాజధానిలో మూడెకరాల్లో నిర్మిస్తున్న అటల్ స్మృతివనంలో మాజీప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ 13 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. విగ్రహావిష్కరణ, చిత్ర ప్రదర్శన, బహిరంగ సభ కార్యక్రమాలకు అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయ- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరవుతారని తెలిపారు. అమరావతి రాజధానిలో ఏర్పాటవుతున్న తొలి విగ్రహం వాజ్‌పేయీదేనని వెల్లడించారు. నేటి, భవిష్యత్తు తరం వాజ్‌పేయీ విలువలు, గొప్పతనం తెలుసుకోవాలన్నారు. వాజ్‌పేయీ ఆశయాలకు అనుగుణంగా మోదీ అద్భుతమైన పాలన సాగిస్తున్నారని కొనియాడారు. డిసెంబరు 11న ప్రారంభించిన 'అటల్- మోదీ సుపరిపాలన యాత్ర' రెండు దశల్లో విజయవంతంగా సాగిందన్నారు. యాత్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ పూర్తి సహకారం అందించారని చెప్పారు. యాత్రలో కేంద్ర మంత్రులు, భాజపా పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు, తెదేపా, జనసేన, భాజపా నాయకులతో పాటు అక్కడక్కడ వైకాపా నాయకులూ పాల్గొన్నారని తెలిపారు. కాగా.. విగ్రహావిష్కరణ, బహిరంగ సభ ప్రాంగణాన్ని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కూటమి నాయకులు బుధవారం సాయంత్రం సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించారు.

పచ్చగా ఉంటే జగన్ చూడలేరు

కోటి సంతకాలు సహా అనేక విషయాల్లో ప్రజలను జగన్ పక్కదారి పట్టిస్తున్నారని మాధవ్ విమర్శించారు. పచ్చగా ఉంటే కొందరు చూడలేరని ఎద్దేవా చేశారు. సమావేశంలో భాజపా ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్‌నాయుడు, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, అధికార ప్రతినిధి షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏ రాయి అడ్డొచ్చిందో.. పాదంలా మారింది!



అచ్చం మనిషి పాదంలాగే ఉంది కదూ..! కానీ, ఇది అరుదైన దుంప. గిరిజనులు మటెం దుంపగా పేర్కొనే దీన్ని.. ఎక్కువగా ఆహారం కోసం వినియోగిస్తుంటారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం సాడేకు గ్రామంలో సీదరి మల్లన్న భూమిలో ఇది లభ్యమైంది. ఇటీవలి కాలంలో పండిస్తున్నా.. ఇవి చాలా వరకు అడవుల్లో సహజంగా దొరుకుతాయని, ఎన్నో పోషకాలు ఉంటాయని గిరిజనులు చెబుతున్నారు. దుంపలు భూమిలో పెరిగే క్రమంలో రాళ్లు, గట్టి మట్టి అడ్డు వచ్చినప్పుడు ఇలా వివిధ ఆకారాలు వస్తాయని వ్యవసాయ నిపుణులు పేర్కొన్నారు.

- జి.మాడుగుల, న్యూస్‌టుడే


తుంగభద్రకు కొత్త గేట్ల అమరిక పనులు ప్రారంభం





క్రస్ట్‌గేటు విడిభాగాన్ని అమర్చే ముందు ప్రత్యేక పూజలు చేసిన డ్యాం కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఎస్ఈ నారాయణ్‌నాయక్, ఇంజినీర్లు ★ క్రస్ట్‌గేటు విడిభాగాన్ని క్రేన్ ద్వారా ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త క్రస్ట్‌గేటు బిగింపు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత 18వ గేటును అమర్చేందుకు ఇంజినీర్లు ముందుగానే అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. దీనికోసం 2 భారీ క్రేన్లను తెప్పించారు. ఓ క్రస్ట్‌గేటు 20 అడుగుల ఎత్తు, 60 అడుగుల వెడల్పు, 40 టన్నుల బరువు ఉండటంతో 12 విడిభాగాలుగా చేసి, ఒకదానిపై ఒకటి అమర్చుతున్నామని డ్యాం ఇంజినీరు కిరణ్‌కుమార్ తెలిపారు. గేటు ఏర్పాటుకు ముందు తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి, పర్యవేక్షక ఇంజినీరు నారాయణ్ నాయక్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ క్రేన్ల ద్వారా అమర్చే పనులు మొదలుపెట్టారు. మొదటి రోజు 18వ గేటు ఏర్పాటు పనులు పూర్తి చేస్తామని ఇంజినీర్లు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం గేట్లకు దిగువకు చేరుకుంది. అందువల్ల పనులు వేగంగా చేసేందుకు వీలవుతుందని ఇంజినీర్లు తెలిపారు.



(c) eenadu

విద్యుత్ టవర్లనూ వదలని మట్టి మాఫియా

- చాలాచోట్ల ప్రమాద స్థితిలో టవర్లు
- గ్రిడ్‌కు ప్రమాదమని హెచ్చరిస్తున్న నిపుణులు
- తనిఖీ బృందాలు ఉన్నా.. ఉపయోగమేంటి?



ఎన్టీఆర్ జిల్లా కవులూరులో టవర్‌కు ఇరువైపులా చెరువులు తవ్వడంతో నీటి మధ్యనే ప్రమాదకర స్థితిలో టవర్



రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరపడంతో ఏర్పడిన భారీ లోయలు

ఈనాడు, అమరావతి: విద్యుత్తు సరఫరా నెట్‌వర్క్‌లో కీలక టవర్లకు భద్రత కరవైంది. మట్టి మాఫియా టవర్లను ఆనుకుని ఉన్న మట్టినీ కూడా తవ్వేస్తోంది. టవర్ కారిడార్‌కు ఇరువైపులా ఎలాంటి నిర్మాణాలు, తవ్వకాలు జరుపకూడదన్న నిబంధనలను మాఫియాలు పట్టించుకోవడం లేదు. మారుమూల ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతోంది. దీనివల్ల లోతైన గుంతలు ఏర్పడి.. వర్షాలకు నీరు నిలిచిపోతోంది. అప్పుడు నేల దెబ్బతిని.. బలమైన గాలులు వీస్తే టవర్లు కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇలా జరిగితే గ్రిడ్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి.. దక్షిణాది గ్రిడ్ ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టవర్లే.. నెట్‌వర్క్‌కు ఆధారం: రాష్ట్రంలో వివిధ సంస్థలు ఉత్పత్తి చేసిన విద్యుత్తు జాతీయ గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ట్రాన్స్‌కో, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐఎల్) 765 కె.వి., 400 కె.వి., 220 కె.వి. నెట్‌వర్క్ వినియోగించుకుంటాయి. విద్యుత్తు సంస్థలతో పాటు కొన్ని ప్రైవేటు సంస్థలు సైతం సరఫరా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశాయి. ఈ లైన్లు మొత్తం జాతీయ గ్రిడ్‌కు అనుసంధానం అవుతాయి.

◆ 400/220/132 కె.వి. లైన్ల కోసం 40 నుంచి 50 మీటర్ల ఎత్తు టవర్లను విద్యుత్ సంస్థలు ఏర్పాటు చేస్తాయి. ఒక్కొక్క టవర్ సుమారు 100 టన్నుల బరువు ఉంటుంది. ఆ టవర్లు దెబ్బతినకుండా.. గాలులకు పడిపోకుండా భూమి లోపల సుమారు 3.5 మీటర్ల ఫౌండేషన్ ఏర్పాటు చేస్తారు.

◆ ట్రాన్స్‌కో పరిధిలో సుమారు 31,000 సర్క్యూట్ కి.మీ. లైన్లు ఉన్నాయి. వీటి కోసం 12 రకాల భద్రతాంశాలను ప్రత్యేక బృందం పరిశీలిస్తుంది.

◆ రైల్వే లైన్లు, హైవే క్రాసింగ్, నదుల పైభాగం నుంచి వెళ్లే లైన్లను అత్యంత సెన్సిటివ్‌గా గుర్తించి.. ప్రతినెలా తనిఖీలు నిర్వహించాలి. ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లైన్లను మూడు, ఆరు నెలలకోసారి పెట్రోలింగ్ నిర్వహిస్తారు.

రైట్ ఆఫ్ వే కింద వదలాల్సిన విస్తీర్ణం

వోల్టేజ్ (కె.వి.)	ఆర్‌ఓడబ్ల్యూ వెడల్పు (మీటర్లలో)
400	52
220	35
132	27

తవ్వకాలు జరపకూడదు

విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసిన ప్రాంతానికి ఇరువైపులా రైట్ ఆఫ్ వే (ఆర్‌ఓడబ్ల్యూ) కారిడార్‌గా విద్యుత్ సంస్థలు గుర్తిస్తాయి. టవర్ నుంచి గరిష్ఠంగా 52 మీటర్లు, కనిష్ఠంగా 27 మీటర్ల పరిధిని ఆర్‌ఓడబ్ల్యూ ప్రాంతంగా నిర్ణయిస్తాయి. లైన్ల ఏర్పాటు కోసం భూసేకరణ జరిగే సమయంలోనే ఆ ప్రాంతానికి పరిహారాన్ని చెల్లిస్తాయి. ఆ పరిధిలో ఎలాంటి తవ్వకాలు, నిర్మాణాలు జరుపకూడదని విద్యుత్తు చట్టం స్పష్టంగా పేర్కొంది.

◆ దెబ్బతిన్న టవర్లను పునరుద్ధరించాలంటే.. కనీసం నెల రోజులు పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

◆ రాష్ట్రవ్యాప్తంగా టవర్ల తనిఖీలకు ప్రత్యేక అధికారుల బృందాలు ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కోకు చెందిన ఒక అధికారి తెలిపారు. 'టవర్ల వెంట ఎలాంటి తవ్వకాలు జరగకుండా బృందాలు పర్యవేక్షిస్తాయి. అయినా, చాలాచోట్ల మాకు తెలియకుండా తవ్వేస్తున్నారు' అని పేర్కొన్నారు.

వైభవంగా పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిష్ఠాపన



గద్దెపై గోవిందరాజును పునఃప్రతిష్ఠాపన చేసిన పూజారులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో రాతిగద్దెపై పగిడిద్దరాజు, గోవిందరాజుల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం పూజారులు ఈ క్రతువు చేపట్టారు. నూతన గద్దెలపై ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన దేవుళ్లను పసుపు, కుంకుమలతో పూజారులు అలంకరించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో పూజారులు మాత్రమే పాల్గొన్నారు. ఇతరులెవర్నీ అనుమతించలేదు. ఉదయం 6.30 గంటలకు గోవిందరాజును, 9.45 గంటలకు పగిడిద్దరాజును గద్దెలపై ప్రతిష్ఠించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించి... శాంతి పూజలు చేశారు. ఉత్సవాలకు మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు హాజరయ్యారు. దేవుళ్ల ప్రతిష్ఠాపన సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలిరాగా.. కార్యక్రమం పూర్తయ్యేవరకు పోలీసులు నియంత్రించారు.

కృష్ణా బేసిన్‌లో 951 టీఎంసీలు ఇవ్వండి

బ్రిజేష్ ట్రైబ్యునల్‌ను కోరిన తెలంగాణ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో 951 టీఎంసీలు తమకు కేటాయించాలని తెలంగాణ.. బ్రిజేష్ ట్రైబ్యునల్‌ను కోరింది. 75 శాతం నీటి లభ్యత కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 811 టీఎంసీలలో 555, పోలవరం ద్వారా కృష్ణా బేసిన్‌కు మళ్లించే గోదావరి నీటిలో 45, బ్రిజేష్ ట్రైబ్యునల్ 2013లో మూడు రాష్ట్రాల మధ్య నీటిని పంపిణీ చేస్తూ 65 శాతం నీటి లభ్యత కింద కేటాయింపులో 43, సరాసరి నీటి లభ్యత కింద ఉమ్మడి ఏపీకి కేటాయించిన 145 టీఎంసీలలో 120 ఇవ్వాలని కోరింది. వీటితోపాటు మిగిలిన నీటిలో 188 టీఎంసీలు కలిపి మొత్తం 951 టీఎంసీల డిమాండ్‌ను కృష్ణా ట్రైబ్యునల్-2 ముందు పెట్టింది.

వైకాపా పాలనలో తిరుమలలో మహాపాపాలు

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానంలో అనేక అక్రమాలు, మహా పాపాలు చోటుచేసుకున్నాయని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని, భక్తుల సౌకర్యాల్లో నిర్లక్ష్యం చేయడంతో దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. అన్నప్రసాదాలు, కాటేజీలు, ఇతర సేవల్లో జరిగిన అక్రమాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలికి తీస్తున్నామని తెలిపారు. అప్పటి తితిదే ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పాత్ర కూడా వెలుగులోకి వస్తోందన్నారు. వైకాపా నేతలు తిరుమల గురించి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

పెట్టుబడిదారులను భయపెట్టలేరు..

పెట్టుబడిదారులను భయపెట్టేలా వైకాపా నేతలు మాట్లాడడం దురదృష్టకరమని.. ఇలాంటి బెదిరింపులకు పెట్టుబడిదారులు భయపడరని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో దౌర్జన్య రాజకీయాలకు చోటు లేదన్నారు. రాష్ట్రంలో కొత్త పోర్టులు, షిప్ బిల్డింగ్ యార్డులు, ఐదు కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. నెల్లూరు ప్రాంతంలో త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులుగా చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని, అన్ని పెండింగు రహదారుల పనులూ పూర్తిచేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖను నిర్వీర్యం చేస్తే..కూటమి ప్రభుత్వ పాలనలో ఒక్క ఏడాదిలోనే రూ.3 వేల కోట్ల విలువైన రహదారి పనులకు అనుమతులు తెచ్చామని వివరించారు.



విద్యుత్తు వెలుగుల్లో ఒంగోలులోని జేఎంబీ చర్చి

శిలువలా కొలువై.. ప్రార్థనకు నెలవై!



శిలువ ఆకారంలో.. (డ్రోన్ చిత్రం)

క్రిస్మస్ వేడుకల కోసం రాష్ట్రంలో చర్చిలు ముస్తాబయ్యాయి. క్రీస్తు జననం థీమ్‌తో చేసిన అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. 1866లో నిర్మించిన ప్రకాశం జిల్లా ఒంగోలులోని జేఎంబీ చర్చి రంగుల విద్యుత్తు దీపాలతో మెరిసిపోతోంది. అప్పట్లోనే ఈ చర్చిని శిలువ ఆకారంలో నిర్మించారు. విహంగ వీక్షణంలో శిలువలా కనిపిస్తుంది. 159 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ప్రార్థనా మందిరాన్ని జాన్ ఈ క్లౌగ్ నిర్మించారు. ఒంగోలు నగరంలో ఈ చర్చి సెంటరే ప్రముఖమైన కూడలిగా ఉంది. జేఎంబీ చర్చి ఆధ్వర్యంలో జిల్లాలో పేదల కోసం వివిధ సేవా కార్యక్రమాలతోపాటు, విద్యాలయాలు నిర్వహిస్తున్నారు. – ఈనాడు, ఒంగోలు

సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఆరంభం

28 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 550 మంది రాక



పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి అనిత



బ్యాడ్మింటన్ పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత, చిత్రంలో రవినాయుడు, భరణి, ద్వారకానాథ్, అంకమ్మచౌదరి, రఘురాజు తదితరులు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే–విజయవాడ క్రీడలు: '87వ నేషనల్ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025' పోటీలు విజయవాడలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే అంతర్రాష్ట్ర టీం ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. 28 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాలు... రైల్వేస్, ఆర్బీఐ, కాగ్, ఎల్‌ఐసీ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి సుమారు 550 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో మహిళలు, సాయిసందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో పురుషులకు పోటీలు నిర్వహించారు. పోటీలు ఆదివారం వరకూ జరగనున్నాయి.

ఏపీ సురక్షితం అందుకే: మంత్రి అనిత

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సురక్షితంగా మారడంతోనే సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉందని, వారు ధైర్యంగా ఇక్కడికి వచ్చారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. బ్యాడ్మింటన్ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ భరణితో కలిసి కొంతసేపు బ్యాడ్మింటన్ ఆడారు. పదేళ్ల తర్వాత జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు రాష్ట్రంలో జరగడం గర్వకారణమని రవినాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారకానాథ్, కార్యదర్శి అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడూ సినిమాకు వచ్చేలా టికెట్ ధర

- పరిశ్రమకు నష్టం కలగకుండానూ నిర్ణయం
- సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- ఇండస్ట్రీ ప్రతినిధులతో భేటీ



సినిమా టికెట్ ధరల హేతుబద్ధీకరణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఈనాడు, అమరావతి: సామాన్యుడూ థియేటర్‌కు వచ్చేలా.. అదే సమయంలో సినిమాకూ నష్టం కలగకుండా సమతుల్యత పాటిస్తూ టికెట్ ధరలపై నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రతి సినిమాకు బడ్జెట్‌ను బట్టి విడివిడిగా జీవోలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఒకే విధానంలో టికెట్ ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సినీ పరిశ్రమల ప్రతినిధులు దర్శకుడు జాస్తి ధర్మతేజ, నిర్మాత కూచిభట్ల వివేక్, డిస్ట్రిబ్యూటర్ నక్కలపూడి సాయిబాబు, ఎగ్జిబిటర్లు సోంపల్లి శివప్రసాద్, అలంకార్ ప్రసాద్ తదితరులతో భేటీ అయ్యారు. టికెట్ల రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన కమిటీ అంతకు ముందు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ వద్ద సమావేశమైంది. తర్వాత మంత్రి దుర్గేష్, సినీపరిశ్రమ ప్రతినిధులు విలేకర్లతో మాట్లాడారు.

చిత్ర నిర్మాణ గమ్యస్థానంగా ఏపీ

రాష్ట్రంలో సినిమా టికెట్ ధరలపై నెలకొన్న గందరగోళానికి తెరదించుతామని మంత్రి దుర్గేష్ తెలిపారు. తెలుగు సినిమా పాన్ ఇండియా దాటి పాన్ వరల్డ్ అవుతుండడంతో నిర్మాతలకు బడ్జెట్ పెరుగుతోందని వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పెద్ద బడ్జెట్ సినిమా, ఆర్టిస్టుల రెమ్యూనరేషన్‌పై చర్చించి, అన్నింటికీ విభాగాలవారీగా సమానంగా టికెట్ల ధరలు పెంచే విధానాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. సినిమా నష్టపోరాదు, అదే సమయంలో సామాన్య ప్రేక్షకుడిపై టికెట్ ధరల భారం పడకూడదనేదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. త్వరలోనే సినీ నిర్మాతలు, పంపిణీదారులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సినిమా చిత్రీకరణలో ఎంత శాతం ఏపీలో చేయాలనేదానిపైనా నిబంధనలు నిర్ణయిస్తామన్నారు. దేశంలోనే చిత్ర నిర్మాణానికి ఏపీని ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

పైరసీతో తెలుగు ఇండస్ట్రీకి గతేడాది రూ.3వేల కోట్ల నష్టం

బాహుబలి లాంటి సినిమాతో తెలుగు సినిమాకు అంతర్జాతీయ మార్కెట్ వచ్చింది. అలా రావాలంటే ఆ స్థాయిలో బడ్జెట్ పెట్టాలి. అలాంటి సినిమాను కాపాడుకోవాలంటే ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చేలా చేయాలి. సినిమాకు కలెక్షన్లు రావాలి, అదే సమయంలో బీదవాడూ సినిమా చూడాలి. ఆ దిశగా టికెట్ ధరలపై ప్రభుత్వం మంచి నిర్ణయమే తీసుకుంటుందని ఆశిస్తున్నాం. ఐ బొమ్మ నిర్వాహకుణ్ని పట్టుకున్నారు. కానీ, అలాంటివారికి సినిమా ఎక్కడ నుంచి లీకవుతుందనేదీ తేల్చాలి. పైరసీ వల్ల గతేడాది తెలుగు సినీ పరిశ్రమ రూ.3 వేల కోట్లు నష్టపోయింది. థియేటర్లలో టికెట్ ధర కంటే పాప్‌కార్న్ ధరలు ఎక్కువ ఉంటున్నాయి. సినిమాకు వెళ్లినపుడు ఆ ధరలకు నేనే అదిరిపోతున్నా. దీనిపై రెండేళ్ల నుంచి నేను పోరాడుతున్నా. పాన్ ఇండియా సినిమాల వల్ల చిన్న సినిమాలకు ఇబ్బందే. అవి పాన్ ఇండియా అయితే, చిన్న సినిమాలు పెయిన్ ఇండియాలా మారుతున్నాయి.

– తేజ, దర్శకుడు

కొన్ని సలహాలు చెప్పాం

మాకున్న సమస్యలు చెప్పాం. టికెట్లను ఒకే విధానంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పేదలకు కూడా సినిమాను దగ్గర చేయాలని కృషి చేస్తోంది. అదే సమయంలో సినీ పరిశ్రమ స్టేక్‌హోల్డర్లకు నష్టం కలగకుండా ఏం చేయవచ్చనేదానిపై కొన్ని సలహాలు చెప్పాం.

– కూచిభట్ల వివేక్, నిర్మాత

తెలుగు, సంస్కృత తాళపత్ర గ్రంథాల డిజిటలైజేషన్ ప్రాజెక్టు మంజూరు

ఈనాడు, అమరావతి: తెలుగు, సంస్కృత తాళపత్ర, కాగితపు మనుస్క్రిప్టుల డిజిటలైజేషన్, పరిరక్షణ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఏపీ ఓరియంటల్ మనుస్క్రిప్ట్స్ లైబ్రరీ విభాగం డైరెక్టర్ వి.రంగరాజ్ తెలిపారు. జ్ఞానభారతం కింద ఈ ప్రాజెక్టును మంజూరు చేసిందని వెల్లడించారు. మన వద్ద భద్రపరిచిన తాళపత్ర, కాగితపు మనుస్క్రిప్టుల సమగ్ర కేటలాగ్‌ను సిద్ధం చేయాలని గతంలో కేంద్రం సూచించిందని, ఇటీవల ఈ నివేదికను సమర్పించామని తెలిపారు. జ్ఞానభారతం, నేషనల్ మిషన్ ఫర్ మనుస్క్రిప్ట్స్ డైరెక్టర్ అనిర్బన్ దాస్‌కు ప్రతిపాదనలు సమర్పించగా.. ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కింద అమూల్యమైన లిఖిత ప్రతులను డిజిటలైజేషన్ చేసి, పరిరక్షిస్తారు. దీంతో రాష్ట్రానికి చెందిన సాంస్కృతిక వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించే అవకాశం ఏర్పడుతుంది. ఈ ప్రాజెక్టుకయ్యే వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది.

'క్యాట్'లో 12 మందికి 100 పర్సంటైల్ స్కోర్

- ఈసారి టాపర్లలో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కరూ లేరు
- 99.99 పర్సంటైల్‌లో ఏపీ నుంచి ఒక్కరే..

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ఐఐఎంలు, ఇతర మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లో ఎంబీఏ, తత్సమాన కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్టు (క్యాట్)-2025లో దేశవ్యాప్తంగా 12 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించారు. అందులో ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కరూ లేకపోవడం గమనార్హం. 100 పర్సంటైల్ సాధించిన వారిలో ఇద్దరు అమ్మాయిలున్నారు. గత ఏడాది మొత్తం 14 మంది 100 పర్సంటైల్ సాధించిన అభ్యర్థుల్లో ఒక్కరే అమ్మాయి నిలిచారు. టాపర్లలో ఈసారి ముగ్గురు ఇంజినీరింగ్, 9 మంది నాన్ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉన్నారు. గతానికి భిన్నంగా ఈసారి నాన్ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఎక్కువ మంది టాపర్లుగా నిలవడం విశేషం. ఇక 99.99 పర్సంటైల్ సాధించిన 26 మందిలో కూడా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్కరు ఉన్నారు. గత ఏడాది 100 పర్సంటైల్ స్కోర్ పొందిన 14 మందిలో ఇద్దరు తెలంగాణ, ఒకరు ఏపీ అభ్యర్థులు చోటు దక్కించుకున్నారు. ఈసారి నవంబరు 30వ తేదీన పరీక్ష నిర్వహించిన ఐఐఎం కోజికోడ్ బుధవారం సాయంత్రం ఫలితాలను విడుదల చేసింది.

పదేళ్ల బాలికపై అత్యాచారం, హత్య

చాంద్‌బలిలో తీవ్ర నిరసనలు



చాంద్‌బలి ఠాణా వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశాలోని భద్రక్ జిల్లా చాంద్‌బలిలో అమానుష ఘటన చోటుచేసుకుంది. పదేళ్ల బాలికపై అత్యాచారం చేసి హతమార్చారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం రాస్తారోకో చేశారు. ఈ ఘటనపై మండిపడిన విపక్షాలు గురువారం (25న) చాంద్‌బలి బంద్‌కు పిలుపునిచ్చాయి. చాంద్‌బలికి చెందిన బాలిక మంగళవారం పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు అన్నిచోట్లా వెతికారు. పాప కనిపించకపోవడంతో రాత్రి చాంద్‌బలి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం గ్రామానికి దూరంగా ఉన్న తోటలో బాలిక మృతదేహాన్ని చూసిన ప్రజలు పోలీసులకు తెలిపారు. భద్రక్ ఎస్పీ మనోజ్ కుమార్ రౌత్, ఏఎస్పీ అరూప్ అభిషేక్ బెహరాలు ప్రాథమిక దర్యాప్తు చేశారు. ఎస్పీ ఏర్పాటు చేసిన మరో టీం జగత్సింగ్‌పూర్‌లో ప్రధాన నిందితుణ్ని అరెస్టు చేసింది. ఈ ఘటనలో ఒకరి కంటే ఎక్కువ మంది ప్రమేయం ఉందా? ఇంకెవరున్నారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు విలేకర్లకు ఎస్పీ చెప్పారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు చాంద్‌బలి వాసి కాగా, అతని ఇంటిని ప్రజలు ధ్వంసం చేశారు. పోలీసుస్టేషన్‌ను ముట్టడించి రాస్తారోకో చేశారు.

గతేడాది టెండర్‌పై ఇప్పుడు పిల్ వేస్తారా?

- అభ్యంతరం ఉంటే అప్పుడే ఎందుకు సవాల్ చేయలేదు
- పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించిన హైకోర్టు
- ఎల్1గా నిలిచిన బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాకు టెండర్ కేటాయిస్తే తప్పేముందని వ్యాఖ్య
- రాజధానిలో భూగర్భ విద్యుత్ కేబుల్ టెండర్‌పై దాఖలైన పిల్‌పై విచారణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి పరిధిలో భూగర్భ విద్యుత్ కేబుల్ లైన్ వేసే టెండర్ ప్రకటన గతేడాది నవంబర్‌లో జారీచేస్తే దానిని సవాల్ చేస్తూ ప్రస్తుతం పిల్ దాఖలు చేయడం ఏంటని పిటిషనర్‌ను హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. అభ్యంతరం ఉంటే అప్పుడే ఎందుకు సవాల్ చేయలేదని నిలదీసింది. బిడ్డింగ్ ప్రక్రియలో ఎల్1గా నిలిచిన బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ ఇండియా లిమిటెడ్‌కు టెండర్ కేటాయిస్తే తప్పేముందని వ్యాఖ్యానించింది. ఎల్1గా ఎంపికైన బీఎస్ఆర్‌తో పాటు మొత్తం మూడు సంస్థలు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొన్నాయని గుర్తుచేసింది. బుధవారం జరిగిన విచారణలో వాదనలు ముగియడంతో పిల్‌పై తగిన ఉత్తర్వులు జారీచేస్తామని పేర్కొంటూ తీర్పును రిజర్వు చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. రాజధానిలో భూగర్భ విద్యుత్ కేబుల్ లైన్ ఏర్పాటు నిమిత్తం 2024 నవంబర్‌లో జారీచేసిన టెండర్ ప్రకటన, అందులోని నిబంధనలు, తదనంతరం జారీచేసిన కొనుగోలు ఆర్డర్లను సవాల్ చేస్తూ న్యాయవాది కె.దీపక్ హైకోర్టులో పిల్ వేశారు.

అనుభవం లేని సంస్థకు టెండర్లు కట్టబెట్టారు: పిటిషనర్

బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది మెట్టా చంద్రశేఖర్ వాదనలు వినిపిస్తూ.. "భూగర్భ విద్యుత్ లైన్ వేసే విషయంలో అనుభవం లేని బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు అనుకూలంగా టెండర్ నిబంధనలను రూపొందించారు. నచ్చిన వారిని ఎంపిక చేసుకునేందుకు అనుగుణంగా నిబంధనలు పెట్టారు. భూగర్భ విద్యుత్ లైన్ వేసే అనుభవం దేశవ్యాప్తంగా ఆరు సంస్థలకు మాత్రమే ఉంది. ఎలాంటి అనుభవం లేని బీఎస్ఆర్‌కు నాలుగు టెండర్లు కట్టబెట్టారు. బీఎస్ఆర్ ఓ నిర్మాణ సంస్థ. విద్యుత్ కేబుల్ వేసే బాధ్యతను ఆ సంస్థ.. యూనివర్సల్ కేబుల్ లిమిటెడ్‌కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చింది. ఇది చట్టవిరుద్ధం. అంతిమంగా ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రభుత్వ ఖజానాపై రూ.400-500 కోట్ల భారం పడుతుంది. ప్రతివాదులకు నోటీసులు జారీచేసి వివరణ కోరండి" అని పేర్కొన్నారు.

ఆ వెసులుబాటు నిబంధనల్లో ఉంది: ఏజీ

రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ ట్రాన్స్‌కో తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. "భూగర్భ విద్యుత్ కేబుల్స్ వేయడంలో సాంకేతిక అనుభవం ఉన్న సంస్థను సబ్ కాంట్రాక్టర్‌గా నియమించుకునే వెసులుబాటు టెండర్ నిబంధనల్లోనే ఉంది. పిటిషనర్ కోర్టును తప్పుదోవపట్టిస్తున్నారు. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయకుండా పిల్ దాఖలు చేశారు. బీఎస్ఆర్‌తో పాటు మొత్తం మూడు సంస్థలు బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొన్నాయి. బీఎస్ఆర్ సంస్థ ఎల్1గా నిలిచింది. భూగర్భ విద్యుత్ కేబుల్ వేయడంలో అనుభవం ఉన్న ఆరు సంస్థలలో యూనివర్సల్ కేబుల్ సంస్థ కూడా ఉంది. గతేడాది నవంబర్‌లో జారీచేసిన టెండర్ విషయంలో ప్రస్తుతం పిల్ దాఖలు చేయడం సరికాదు. టెండర్ నిబంధనలపై అభ్యంతరం ఉంటే బిడ్డింగ్‌లో పాల్గొన్న సంస్థలు కోర్టును ఆశ్రయించాలి. పిల్ ముసుగులో పిటిషనర్ టెండర్ నిబంధనలను సవాల్ చేయడానికి వీల్లేదు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకుని పిల్‌ను కొట్టేయండి" అని కోరారు.

మాజీ సీఎం జగన్‌కు అస్వస్థత

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల వచ్చిన వైకాపా అధినేత వైఎస్ జగన్ అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి ప్రజాదర్బార్ ముగించుకుని నివాసానికి చేరుకున్న ఆయన తీవ్ర జ్వరం బారిన పడ్డారని పార్టీ శ్రేణులు తెలిపాయి. బుధవారం ఉదయం ఇడుపులపాయలో జరిగే క్రిస్మస్ ముందస్తు వేడుకలకు ఆయన హాజరు కావాల్సి ఉండగా కార్యక్రమం రద్దు చేసుకుని పూర్తిగా విశ్రాంతి తీసుకున్నారు. తల్లి వైఎస్ విజయమ్మ, ఆయన సతీమణి వైఎస్ భారతి, కుటుంబ సభ్యులు ఇడుపులపాయ వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.



నిజమైన శాంటాక్లాజ్ తండ్రే


ప్రతి ఒక్కరి జీవితాల్లో అసలైన శాంటాక్లాజ్ వారి తండ్రే. ఎందుకంటే తన చిన్నారుల కోసం నాన్న నిస్వార్థంగా వ్యవహరిస్తాడు. పిల్లల కోరికలు తీర్చేందుకు తపన పడతాడు. చిన్నారులు ఆడుకునే తొలి ఆటబొమ్మలు నాన్న కొన్నవే అయి ఉంటాయి. అటుపై వారి అవసరాలు తీర్చేది ఆయనే. మీరు పెద్దైనా మీ తండ్రి రక్షణలో ఉంటే మీరు అత్యంత అదృష్టవంతులు.

– గుర్మీత్ చద్దా, వ్యాపారవేత్త

ఆ చల్లని సముద్రగర్భం.. అరుదైన జీవులెన్నో..!



థ్రెషర్ షార్క్ చేప



శిలువ పీత

కడలి అలల కింద కనువిందు చేసే జీవులెన్నో..! చూసే మనసు ఉండాలేగానీ ప్రతి జీవి వైవిధ్యమే. అలాంటివే ఈ థ్రెషర్ షార్క్ చేప, శిలువ పీత. కాకినాడ సముద్ర తీరంలో బుధవారం మత్స్యకారుల వలలకు థ్రెషర్ షార్క్ చేపలు చిక్కాయి. 'ఇవి సముద్ర జలాల్లో లోతైన ప్రాంతాల్లో ఉంటాయి. అందుకే అరుదుగా దొరుకుతాయి. పొడవైన తోక వీటి ప్రత్యేకత. వీటి లివర్ నుంచి ఆయిల్ తీస్తారు. చర్మం, రెక్కలను సూప్‌ల తయారీకి వాడుతారు' అని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. వీటిని ఎక్కువగా కోల్‌కతాకు ఎగుమతి చేస్తామని వ్యాపారులు తెలిపారు.

◆ శిలువ పీత.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిపల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు దొరికింది. ఇవి ఎంత అరుదైనవి అంటే.. సాధారణ పీతలు వేల సంఖ్యలో దొరికితే.. ఇవి ఒకటో రెండో లభిస్తాయని మత్స్యకారులు తెలిపారు. వీటిని గంగపుత్రులు దైవంగా భావిస్తారు. అందుకే మళ్లీ సముద్రంలోనే వదిలేస్తుంటారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ), సఖినేటిపల్లి

(c) eenadu

ఈనాడు అమరావతి
ఎన్టీఆర్
గురువారం డిసెంబరు 25, 2025




క్రీస్తు జనించెను.. జనులు కీర్తించెను

శాంతి, కరుణ, ప్రేమను పంచేందుకు.. క్రీస్తు లోకానికి వచ్చారని బిషప్‌లు పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా చర్చిలు విద్యుత్తు కాంతులతో వెలుగులీనాయి. విశ్వాసులు కీర్తనలు పాడుతూ, కొవ్వొత్తులు వెలిగించారు. పటమట సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువ జాము వరకు క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. - పటమట, న్యూస్‌టుడే


పటమట సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో బాల ఏసు చెంత ధూపం వేస్తున్న బిషప్ టి.జె. రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు

సైకిల్‌పై సవారీ.. రికార్డులపై స్వారీ

దశాబ్దంగా బొగ్గవరపు శ్రీనివాసకిరణ్ సైక్లింగ్‌తో అద్భుతాలు చేస్తున్నారు. వ్యాయామం కోసం సైక్లింగ్‌ను ఆరంభించి.. ఇప్పటి వరకు ఏడుసార్లు సూపర్ రాండోనియర్ రికార్డులు సాధించారు. గుంటూరుకు చెందిన ఆయన విజయవాడలో స్థిరపడ్డారు.
★ ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచేందుకు.. విజయవాడ, గుంటూరు కేంద్రంగా.. సైకిల్ రైడ్లు నిర్వహిస్తుంటారు.



ఆడాక్స్ ఇండియా రాండోరియన్ క్లబ్‌కు.. అనుబంధంగా 2018లో అమరావతి రాండోనియర్ క్లబ్ ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు.

గుర్తింపు ఇలా..

సుదూర ప్రాంతాలకు.. నిర్ణీత సమయంలోగా సైకిల్‌పై చేరుకునే వాళ్లను రాండోనియర్‌గా గుర్తిస్తారు. 200 కి.మీ. 13.30 గంటల్లో, 300 కి.మీ. 20 గంటల్లో, 400 కి.మీ. 27 గంటల్లో, 600 కి.మీ. 40 గంటల్లో సైకిల్ రైడ్‌లను ఆయన అందరికంటే ముందు అనేకసార్లు పూర్తి చేశారు. 4 విభాగాలను ఒకే ఏడాదిలో.. పూర్తి చేస్తే సూపర్ రాండోనియర్‌గా గుర్తిస్తారు. ఇప్పటివరకు శ్రీనివాసకిరణ్ ఏడు సార్లు సూపర్ రాండోనియర్‌గా నిలిచి రికార్డు నెలకొల్పారు.

వివిధ విభాగాల్లో సత్తా..

★ 2025 నవంబరు 6న గుంటూరు నుంచి ఏలూరు వరకు 200 కి.మీ.(రానుపోను) దూరాన్ని 13.30 గంటల్లో వెళ్లాల్సి ఉండగా 12 గంటల్లోనే పూర్తి చేశారు. ★ నవంబరు 22న గుంటూరు నుంచి తెలంగాణలోని మునగాల వరకు 300 కి.మీ. 20గంటల్లో చేరాల్సి ఉండగా 19.10 గంటల్లోనే వెళ్లారు. ★ డిసెంబరు 6న గుంటూరు నుంచి నకిరేకల్ 400 కి.మీ. దూరాన్ని 27 గంటల్లో వెళ్లాల్సి ఉండగా.. 25.45 గంటల్లోనే చేరుకున్నారు. ★ డిసెంబరు 20న గుంటూరు నుంచి పాయకరావుపేట 600 కి.మీ. దూరాన్ని 40 గంటల్లో పూర్తి చేయాలి కానీ 38.52 గంటల్లో వెళ్లారు. ★ 2027 ఆగస్టులో పారిస్‌లో నిర్వహించే 1200 కి.మీ. ఎల్‌ఆర్‌ఎంలో పాల్గొనేందుకు ప్రీ ఫైనల్ పూర్తి చేశాను. సైక్లింగ్ చేసే వాళ్లకు ఎల్‌ఆర్‌ఎంలో పాల్గొనాలనేది ఓ కల. దానిని నేను 2027లో సాధించబోతున్నానని శ్రీనివాస కిరణ్ చెబుతున్నారు. – విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

అభివృద్ధి చేస్తే.. ఆదాయమెంత?

✪ దిల్లీ నిపుణుల బృందం ఆధ్వర్యంలో అధ్యయనం
✪ విజయవాడలో ఆరు స్థలాలపై నివేదికల తయారీ

ఈనాడు, అమరావతి

నగరంలో గాంధీనగర్‌లోని రాజగోపాలాచారి మార్కెట్ 80 సెంట్లలో ఉంది. నగరపాలిక.. మార్కెట్‌లోని దుకాణ సముదాయాలు శిథిలావస్థకు చేరాయి. అత్యంత ఖరీదైన ఈ స్థలాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై నిపుణుల బృందం అధ్యయనం చేస్తోంది. దిల్లీ నుంచి వచ్చిన నిపుణులు.. పాలికకు ఆర్థికంగా, లాభదాయకంగా ఉండేలా ఏం చేయాలో నివేదిక రూపొందించారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయుఐఏఎంఎల్) కూడా నగరంలో స్థలాలపై అధ్యయనం చేసి మరో నివేదిక రూపొందించారు.

ఆరు ప్రాంతాలు...

విజయవాడలో రూ.వందల కోట్ల విలువైన పాలిక స్థలాలను.. ఆధునిక పంథాలో తీర్చిదిద్దనున్నారు. తొలిగా.. రాజగోపాలాచారి మార్కెట్, వస్త్రలత కాంప్లెక్స్, అన్సారీ పార్కింగ్, మహంతీ మార్కెట్, గోవిందరాజుల మార్కెట్, విద్యాధరపురంలో సితార గ్రౌండ్స్‌లను అభివృద్ధి చేయనున్నారు. ఇవన్నీ అత్యంత రద్దీ ప్రాంతాల్లోనే కావడంతో వాణిజ్య సముదాయాలకు గిరాకీ ఉంటుంది.


రాజగోపాలాచారి మున్సిపల్ మార్కెట్

ఏ నమూనాతో ముందుకెళ్తే..

ఏ రెవెన్యూ నమూనాలో స్థలాలు అభివృద్ధి చేయాలనే నిర్ణయాధికారం.. నగరపాలక అధికారులదే. వీటి అభివృద్ధికి నిపుణుల బృందం అధ్యయనం, నమూనాలపై.. తాజాగా అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్లాన్ ఏ, ప్లాన్ బీ

దిల్లీ నిపుణుల బృందం ఈ ప్రదేశాలను పరిశీలించింది. చుట్టుపక్కల ఏమున్నాయి? అభివృద్ధి చేస్తే ఏ అవకాశాలు ఉంటాయని అధ్యయనం చేసి.. ప్లాన్ ఏ, ప్లాన్ బీ.. నివేదికలు కమిషనర్‌కు అందజేశారు.

వస్త్రలత ఏడంతస్తుల్లో...

నగరంలో వస్త్రలత కాంప్లెక్స్‌ను ఏడంతస్తులు నిర్మించి.. జి+2 వరకు పార్కింగ్‌గా మార్చాలని బృందం పేర్కొంది. ప్రస్తుత వాణిజ్య సముదాయాలపై ఎంత ఆదాయం వస్తోంది? అభివృద్ధి చేస్తే ఎంత పెరుగుతుంది? నిర్మాణ వ్యయం ఎంత? నగరపాలిక భరించగలదా? లేదా మరేవిధానంలో అభివృద్ధి చేయాలనే అంశాలతో.. ప్లాన్ ఏ, బీ నివేదికలను బృందం తయారు చేసిచ్చింది.

ఆభరణాల కళ.. బందరువాసి భళా!

దోకిపర్రు వేంకటేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి, భద్రాచలం శ్రీరామచంద్రమూర్తి ఇలా.. తెలుగు రాష్ట్రాలే కాదు దేశంలోని అనేక ఆలయాల్లో దేవతామూర్తులకు అలంకరించే ఆభరణాల గురించి ఆరాతీస్తే.. మచిలీపట్నంకు చెందిన కళాకారుడు దేవరం శివరామకృష్ణ నైపుణ్యం తెలుస్తుంది. నగరంలో జ్యుయలరీ పార్కుతో పాటు చిలకలపూడి తదితర ప్రాంతాల్లో వందలాది పరిశ్రమలు ఉన్నాయి. అయితే దేవతామూర్తుల ఆభరణాలు కావాలంటే అందరూ చెప్పేది శివరామకృష్ణ పేరే.. తన తండ్రి వెంకటేశ్వరరావు స్ఫూర్తితో 17వ ఏటే కళను అందిపుచ్చుకుని.. అనతికాలంలో మంచి నైపుణ్యం సాధించారు.




శివలింగం తొడుగు తీర్చిదిద్దుతున్న శివరామకృష్ణ

25 ఏళ్లుగా..

గత 25 ఏళ్లుగా ఆభరణాలు తయారు చేస్తూ దేశ నలుమూలల్లో ఉన్న ఆలయాలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్లు రావడంతో పరిశ్రమను విస్తరించి.. పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రసిద్ధ దోకిపర్రు వేంకటేశ్వర స్వామికి అలంకరించే ఆభరణాలతో పాటు ముఖ ద్వారానికి కవచాలు కూడా ఈయనే తయారు చేశారు.

మంగళగిరి పానకాల స్వామి, మైసూరులో ప్రసిద్ధ మద్దూరు నరసింహస్వామి, మళ్లవల్లి నరసింహస్వామి ఇలా శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రం కొల్లూరు బాలాజీ క్షేత్రం ఇలా.. అనేక ఆలయాలకు అలంకరణ వస్తువులు పంపారు. కిరీటాలు, ముక్కు పుడకలు, వడ్డాణాలు, హారాలు, శంఖు చక్రాలు, త్రిశూలాలు, పిల్లనగ్రోవి ఇలా.. ఆయా దేవతామూర్తులకు అలంకరించే వస్తువులను అందంగా తీర్చిదిద్దగల నైపుణ్యం ఆయన సొంతం. కొంచెం కష్టంగా ఉన్నా కళను భవిష్యత్తు తరాలకు అందించాలన్న లక్ష్యంతో శ్రమిస్తూ.. బందరు కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. – మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వీర విధేయులకే.. అందలం!

★ తెదేపా పార్లమెంటరీ పార్టీ కమిటీ కూర్పు ఇలా...
★ మొత్తం 42 మందిలో 15 మంది మహిళలు..

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, పటమట

'తెదేపాకు వీర విధేయులుగా ఉన్న నాయకులకే పార్లమెంటరీ పార్టీ నూతన కమిటీలో అవకాశం దక్కింది. ఎన్టీఆర్ జిల్లాలో ప్రతి నియోజకవర్గం నుంచి ఆరుగురికి చోటు కల్పించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కలిపి మొత్తం 42 మందికి అవకాశమిచ్చారు. జిల్లాలో పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, గత వైకాపా హయాంలో ఇబ్బంది పడిన వారు, సామాజిక సమీకరణాలతో పాటు 35 శాతం మహిళలకు కేటాయించారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనూరాధతో కలిపి 15 మంది మహిళలకు అవకాశం దక్కింది.' ఎన్టీఆర్ జిల్లాలో స్థానిక ఎమ్మెల్యేలకే పూర్తిగా ఎంపిక బాధ్యతను అప్పగించారు. ప్రతి నియోజకవర్గం నుంచి బీసీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీ వర్గాలు, మహిళలు, యువత.. అందరూ ఉండేలా పేర్లు ఉండాలని.. ముందే తెదేపా అధిష్ఠానం సూచించింది. దీనికి తగ్గట్టుగానే అన్ని సమీకరణాలనూ పరిగణనలోకి తీసుకుని.. ఎమ్మెల్యేలు పేర్లను సూచించారు. వాటిలో 90 శాతం ఖరారయ్యాయి. కొన్నిచోట్ల సామాజికవర్గ, మహిళా సమీకరణాలు కుదరకపోవడం, అభ్యంతరాలు రావడంతో.. కొన్ని పేర్లను అధిష్ఠానం మార్పించింది.

పశ్చిమలో ఎంపీ సూచన: తెదేపా ఎమ్మెల్యే లేని విజయవాడ పశ్చిమలో.. ఆరుగురి పేర్ల ఎంపిక బాధ్యతను ఎంపీ కేశినేని శివనాథ్‌కు అప్పగించారు. ఆయన సూచించిన వారికే కమిటీలో చోటు కల్పించారు.

మైలవరంలో ఒక ఖాళీ: ఐదుగురి పేర్లే ఖరారయ్యాయి. మిగతా ఒక్కటి మైలవరం కోటాలో.. కార్యనిర్వాహక కార్యదర్శుల కమిటీలో ఖాళీ ఉంచేశారు. ఇక్కడ ఎమ్మెల్యే సూచించిన ఒకరికి అవకాశం కల్పిస్తారు.

అధినేత కోసం నిలబడిన వాళ్లకు

అధినేత చంద్రబాబును గత వైకాపా ప్రభుత్వం అరెస్టు చేసిన సమయంలో.. జిల్లా, నియోజకవర్గాల వారీగా నిరసన శిబిరాల్లో 50 రోజులకు పైగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొని అరెస్టయిన నేతలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. నూతన అధ్యక్షురాలు గద్దె అనూరాధ కూడా విజయవాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో 52రోజులు నిరసన చేపట్టడంతో అరెస్టు చేసి కేసులు పెట్టారు.

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లాలో ఎరువులకు కొరత లేదు. సరిపడా యూరియా నిల్వలూ ఉన్నాయి. దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్. విజయకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజులకు 1,521 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, ఈ క్రమంలో 4,963 మెట్రిక్ టన్నులను సొసైటీలు, ఆర్.ఎస్.కె.లు, మార్క్‌ఫెడ్ గోదాములు, రిటైల్/హోల్‌సేల్, కంపెనీ గోదాముల్లో అందుబాటులో ఉంచినట్లు ఆమె వివరించారు.

వ్యాపార ప్రకటన.. నమ్మితే ఇరుకున

సామాజిక మాధ్యమాల్లో వ్యాపారులకు టోకరా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే



సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్‌లను సైబర్ నేరగాళ్లు తమ ఆయుధంగా మార్చుకుంటున్నారు. అమాయకులను వల వేసి.. మభ్యపెట్టి రూ.లక్షలు గుంజేస్తున్నారు. ఎవరూ ఊహించని రీతిలో రోజుకో రకంగా టోకరా వేస్తున్నారు. తాజాగా ఇద్దరు వ్యాపారుల నుంచి రూ.35లక్షలు కొట్టేశారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టుబడులు, వ్యాపార పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొందరు ఆశతో మోసపోతున్నారు.


సెకండ్ హ్యాండ్ యంత్రాలు అమ్ముతామంటూ...

రామవరప్పాడులో ఓ వ్యాపారి రసాయనాల విక్రయం చేస్తున్నారు. అక్టోబరు 17న ఫేస్‌బుక్‌లో సెకండ్ హ్యాండ్ యంత్ర సామగ్రి అమ్ముతామంటూ ఉన్న ప్రకటన చూశారు. దానిలో ఉన్న నంబరును సంప్రదించారు. రూ.12లక్షల విలువైన యంత్ర సామగ్రి కొనేందుకు ఆసక్తి చూపారు. సంప్రదింపులు తర్వాత అక్టోబరు 23న.. అవతలి వ్యక్తులు చెప్పిన బ్యాంకు ఖాతాకు మొత్తం డబ్బులు పంపారు. తర్వాత మోసపోయినట్లు గుర్తించి విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఈ నెల 21న ఫిర్యాదు చేశారు. వ్యాపారి పంపిన డబ్బులు నవీ ముంబయి జుహూ నగర్ ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఖాతాకు వెళ్లినట్లుగా గుర్తించారు.

షేర్స్.. స్టాక్స్‌లో పెట్టుబడులంటూ..

విద్యాధరపురానికి చెందిన ఓ ఫర్నిచర్ వ్యాపారి సెప్టెంబరు 19న ఫేస్‌బుక్‌లో.. షేర్ మార్కెట్‌పై వచ్చిన ప్రకటన చూశారు. ఆసక్తితో క్లిక్ చేయగానే 'ఆనంద్‌రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్ లిమిటెడ్' అనే వాట్సప్ గ్రూప్‌కు అనుసంధానమయ్యారు. గుర్తు తెలియని వ్యక్తి లైనులోకి వచ్చారు. తక్కువ పెట్టుబడులకు ఎక్కువ లాభాలంటూ ఆశ చూపించారు. ఫోన్లో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. అతని మాటలు నమ్మి ఆ వ్యాపారి.. ఆ బ్యాంకు ఖాతాలకు రూ.23లక్షలు పంపించారు. తర్వాత నుంచి స్పందన లేకపోవడం, లాభాలను తీసుకునేందుకు ప్రయత్నించినా వీలు కాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. దీనిపై ఈ నెల 19న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ డబ్బులు బ్యాంకు ఆఫ్ బరోడా ఝార్ఖండ్, అసోం, తెలంగాణ, విశాఖపట్నం, ఒడిశా శాఖలకు, మహారాష్ట్రలోని యాక్సిస్ బ్యాంకు శాఖకు వెళ్లినట్లు గుర్తించారు.

5 సెంట్లు.. 20 రకాల కూరగాయలు

కూరగాయల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో ఆ రైతు కలత చెందారు. వీటిని ఆహారంగా తీసుకుంటున్న వారు అనారోగ్యాల బారిన పడుతున్నట్లు గుర్తించారు. ఈ పరిస్థితిలో మార్పు తేవడానికి తన వంతు ప్రయత్నంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. అలా తనకున్న ఐదు సెంట్ల స్థలంలోనే 20 రకాల కూరగాయలు పండిస్తూ గ్రామస్థులకు ఉచితంగా అందజేస్తున్నారు పెదపులిపాకకు చెందిన రైతు **ముసునూరి శ్రీనివాసరావు.** ఏడు నెలల క్రితం ఆయన ఈ విధానాన్ని ఎంచుకున్నారు. వీటి సాగుకు గోమూత్రం, ఆవు పేడతో ఘనజీవామృతం, బ్రహ్మాస్త్రం ఎరువులను తానే తయారు చేసుకుంటూ వాడుతున్నారు. ఐదు సెంట్లలో పాదు, తీగజాతి కూరగాయలతో పాటు పూల మొక్కలకు చోటు కల్పించారు. టమాట, వంగ, సొర, బీన్స్, బీర, నేతిబీర, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, మిర్చి, తోటకూర, పాలకూర, చుక్కకూర, పుదీనా, చిక్కుడు, దోస, బెండ, దొండ, కరివేపాకు, నిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, బంతి, మందార పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ తరహా సాగును మరింత విస్తీర్ణంలో చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, పెనమలూరు

నెలకోసారి మత్తు పార్టీలు

★ బెజవాడలో ధర ఎక్కువని.. ★ బెంగళూరు నుంచి కొనుగోళ్లు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట: స్నేహితులతో నెలకోసారి జరిగే మత్తు పార్టీల్లో వినియోగించే ఎండీఎంఏను సింథటిక్ జగదీష్ కుమార్, అభిలేష్‌లు స్థానికంగా కొనేవారు. ధర ఎక్కువగా ఉండడంతో అంత చెల్లించలేక బెంగళూరు బాట పట్టేవారు. అక్కడ కొన్న సరకును బెజవాడకు తెచ్చి పార్టీల్లో తీసుకునేవారు. కొందరు స్నేహితుల ద్వారా అలవాటు చేసుకున్నారు. ఇటీవల నగరంలో దొరికిన ఎండీఎంఏ కేసు దర్యాప్తులో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నగరంలోని వీర నవీన్, నానాజీ, తదితరులతో కలిసి రహస్యంగా ఎండీఎంఏ తీసుకునేవారు. మరోవైపు.. పరారీలో ఉన్న రాజేష్ ఆచూకీ ఇంకా దొరకలేదు. అతని కోసం వివిధ ప్రాంతాల్లో బృందాలు గాలిస్తున్నాయి. [illegible] శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలోనూ నిఘా పెట్టారు. తల్లిదండ్రులకు రాజేష్ పెంపుడు కుమారుడు.

23 ఏళ్లకే డ్రగ్స్‌కు బానిసైన తేజ

విజయవాడకు చెందిన తేజ.. హైదరాబాద్‌లో మల్టీమీడియా, బీకాం చదివాడు. ఆ సమయంలోనే 23 ఏళ్లకే స్నేహితుల ద్వారా గంజాయి, డ్రగ్స్‌కు బానిసయ్యాడు. చదువు పూర్తయ్యాక విజయవాడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనేవాడు. ✪ 2018లో ఫ్రెండ్స్‌తో కలిసి విశాఖలో ఎండీఎంఏ తీసుకుంటుండగా అరిలోవ పోలీసులు అరెస్టు చేశారు. 30 రోజులు జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. ✪ 2022లో హైదరాబాద్‌లో రాజేష్ పరిచయమయ్యాడు. తర్వాత బెంగళూరుకు వెళ్లేవారు. [illegible] ✪ సరఫరాదారుల నుంచి [illegible] ✪ 19న డ్రగ్స్ కోసం బెంగళూరు వెళ్లిన జగదీష్ కుమార్, అభిలేష్‌లు [illegible] రాజేష్‌ను అందజేయమని తేజ ఇచ్చాడు. జగదీష్ కుమార్‌కు రూ.20 వేలు ఫోన్ పే చేశాడు. [illegible]

ఇక్కడ పార్కింగ్ చేస్తే కోర్టుకే..!



రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ముందు పరిసరాల్లో పలువురు వాహనాలను పార్కింగ్ చేసి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన రైల్వే పోలీసులు బుధవారం వాహనాలకు తాళాలు వేసి, కోర్టుకెళ్లి ఫైన్ కట్టి తీసుకోవాలని సూచించారు. - ఈనాడు, అమరావతి

జగనన్న కాలనీల్లో.. అక్రమాల కహానీలు

ఈనాడు - అమరావతి

జగనన్న కాలనీల్లో మెరక పనుల నుంచి ఇళ్ల నిర్మాణం వరకు.. ఇంకుడు గుంతల నుంచి చేతి పంపుల వరకు.. అడుగడుగునా అక్రమాలు రాజ్యమేలాయి. అధికారులు, గుత్తేదారులు, నాయకులు అనే తేడా లేకుండా ఎవరికి వారు అందిన కాడికి దోచుకున్నారు. ఆ అక్రమాలకు మూల్యం చెల్లించే సమయం వచ్చింది. వరుస పెట్టి అక్రమాలపై విచారణలు.. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు కూటమి సర్కారు ముందుకెళ్తోంది. జగనన్న కాలనీల్లో తాగునీటి సరఫరాలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణ లున్న 14 మంది అధికారులపై విచారణ చేపట్టేందుకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారులు వీరే

బోర్లు, మోటార్లు, విద్యుత్తు సర్వీసులు, పైపు లైన్ల ఏర్పాటులో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై అప్పటి అధికారులపై విచారణ చేయనున్నారు.
✪ కానూరు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పోరంకి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, పెనమలూరు పీఆర్ ఏఈ నాంచారయ్య, విజయవాడ డివిజన్‌లో ఏఈ ఉమా, జూనియర్ అసిస్టెంట్ కేవీఎన్ కుమార్, ఈఈ రామలింగ ప్రసాద్, మైలవరం డివిజన్ ఏఈలు కృష్ణకిశోర్, నాగేశ్వరరావు, ఉంగుటూరు ఏఈలు సుధాకర్, సుజాత, గన్నవరం, విజయవాడ ఈఈలు రాఘవేంద్ర, ప్రసాద్, విజయవాడ సర్కిల్‌లో ఈఈ సాయినాథ్, మైలవరం సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ భాస్కరరెడ్డి ఉన్నారు.

రహదారులకు మంచి రోజులు

ఉమ్మడి జిల్లాకు రూ.12.28 కోట్లు మంజూరు

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో పూర్తిగా దెబ్బతిన్న దారులను కూటమి సర్కారు దశల వారీగా బాగు చేస్తోంది. ఇప్పటికే గ్రామీణ రహదారులకు భారీగా నిధులు విడుదల చేసిన నేపథ్యంలో తాజాగా ఉమ్మడి జిల్లాలో పూర్తి అధ్వానంగా తయారైన 9 రహదారుల పునరుద్ధరణకు రూ.12.28 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 52.27 కిమీ మేర రహదారుల్లో అభివృద్ధి పనులు చేస్తారు. గుంతలు పూడ్చడం, పూర్తిగా ధ్వంసమైన చోట బాగుజేయనున్నారు. విజయవాడ డివిజన్‌లో ప్రధాన రహదారులు ఏళ్లుగా సరిగాలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అత్యధికంగా నందిగామ-పొక్కునూరు రహదారి 12.730 కిమీ మేర విస్తరిస్తున్నారు. ఇందుకు రూ.2.5 కోట్లు కేటాయించారు.

ఎక్కడ నుంచి ఎక్కడికి	బాగుచేసే పరిధి (కి.మీ)	అంచనా రూ.కోట్లు
నందిగామ–పొక్కునూరు	12.730	2.5
విజయవాడ–విస్సన్నపేట	4.2	2
ఎన్‌హెచ్–9– మక్కపేట	2	1
విజయవాడ– నూజివీడు	6	2
చెవిటికల్లు–వత్సవాయి	8.7	0.5
నూజివీడు–మైలవరం	2.14	2
తిరువూరు–రాజవరం	5	0.60
విస్సన్నపేట–వెలగలపల్లి	3.1	0.15
గుడివాడ–కొత్తపాలెం	8.4	1.53

ఎన్నెన్నో వర్ణాలు.. తెచ్చాయి అవార్డులు!




కృష్ణా జిల్లా మొవ్వలో బందలపాటి శివరాణి, సాయిప్రసాద్ దంపతులు పూలమొక్కలు పెంచుతూ వారి ఇంటి ఆవరణను పూదోటలా మార్చారు. ఇంటి బయట, ఆవరణలో, డాబాపైన.. ఎటుచూసినా.. రంగురంగుల పూలమొక్కలు కనువిందు చేస్తాయి. బంతి, ఎడారి గులాబి, చామంతులు, మందారాలు.. శివుడికి ఇష్టమైన ఐదు రేకుల పువ్వులు, బ్రహ్మకమలం ఇలా ఆ ఇల్లంతా నందనవనంలా ఉంటుంది. వీటితోపాటు మిద్దె పంటలు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా స్థాయిలో ఈ వృద్ధ దంపతులు గత రెండేళ్లుగా పచ్చదనం, మిద్దెపంటలు వంటి విభాగాల్లో పలు అవార్డులు అందుకున్నారు. – న్యూస్‌టుడే, మొవ్వ(కూచిపూడి)

రెండో రోజూ అనిశా సోదాలు

భవానీపురం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ షేక్ మహమూద్‌కు చెందిన భవానీపురంలోని నివాసంలో అనిశా అధికారులు రెండో రోజైన బుధవారం సోదాలు చేశారు. నివాసంలో స్వాధీనం చేసుకున్న కొన్ని కీలకపత్రాలు, ఆస్తి పత్రాలను విశ్లేషిస్తున్నారు. మహమూద్‌కు చెందిన బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. ఉదయం నివాసానికి వచ్చిన అనిశా అధికారులు తనిఖీలు చేపట్టారు.

పల్లె ప్రగతికి.. కొత్త రూపు!

✷ నూతన పంచాయతీల ఏర్పాటుకు అడుగు
✷ జిల్లా అధికారులకు చేరిన దరఖాస్తులు...

ఈనాడు, అమరావతి

"పల్లె ప్రగతికి కొత్త రూపు ఇచ్చే ప్రక్రియకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. కొత్తగా పంచాయతీలను కోరుతూ దరఖాస్తులు ఇప్పటికే జిల్లా అధికారులకు చేరాయి. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. వీటి ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగనుంది. ఇది పూర్తయితే నూతన పంచాయతీలకు నిధులు వచ్చి ప్రగతి పథంలోకి అడుగు పెడతాయి."

★ ఉమ్మడి జిల్లాలో కొత్తగా 12 పంచాయతీల ఏర్పాటు కోరుతూ దరఖాస్తులు వచ్చాయి. ★ ఎన్టీఆర్ జిల్లాలో... తిరువూరు-వావిరాల, విస్సన్నపేట-వేమిరెడ్డిపల్లి, పొట్రేల, తెల్లదేవరపల్లి, ఏ.కొండూరు-కంభంపాడు, జగ్గయ్యపేట- అనుమంచపల్లి, బూదవాడ, బండిపాలెం, జయంతిపురం, రెడ్డిగూడెం-రంగాపురం పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేయాలని వినతులు వచ్చాయి. ★ కృష్ణా జిల్లాలో... బాపులపాడు-రంగన్నగూడెం, నందివాడ-ఇలపర్రు పంచాయతీలను విడగొట్టాలని కోరారు. గుడ్లవల్లేరు-నాగవరంలో కొంత వేమవరం.. మరికొంత ముక్కొల్లు పంచాయతీలో ఉంటుంది. మొత్తం కలిపి ముక్కొల్లులో కలపాలని దరఖాస్తు వచ్చింది. ★ మోపిదేవి మండలం కే. కొత్తపాలెం పంచాయతీలో ఉత్తరపాలేన్ని చల్లపల్లి మండలం నడకుదురులో కలపాలనీ, పెదకళ్లేపల్లి పంచాయతీలోని చిర్రపాలేన్ని వెంకటాపురంలో కలపాలని దరఖాస్తు వచ్చింది.

పంచాయతీలు ఇలా..		
జిల్లా	ఉన్నవి	కొత్తగా
ఎన్టీఆర్	286	10
కృష్ణా	497	02


అభివృద్ధి పథంలోకి...

✪ కొత్త పంచాయతీ ఏర్పాటుకు 3,000 మంది జనాభా ఉండాలి. పంచాయతీ కేంద్రానికి 3 కి.మీ. దూరం ఉండాలి. ఇవేవీ లేకున్నా ప్రత్యేక పరిస్థితులు ఉంటే ప్రభుత్వం విచక్షణాధికారంతో ఏర్పాటు చేసే వీలుంది. ✪ ప్రస్తుతం దరఖాస్తులు ఇచ్చిన పంచాయతీల్లో పరిస్థితులు గమనిస్తే 1, 2 పంచాయతీలకు మాత్రమే 3,000 మంది జనాభా, 3 కిమీ దూరం అర్హత ఉంది. మిగిలినవన్నీ పంచాయతీ కేంద్రానికి, అభివృద్ధికి దూరం అవుతున్నామనే అంశం పైనే వచ్చాయి. ✪ కొన్నిగ్రామాల్లో దారులు, తాగునీరు, వీధిదీపాలు వంటివి అరకొరగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైతే.. ప్రత్యేక నిధులొచ్చి ప్రగతికి వీలుంటుంది.

★ 'నిబంధనలు..స్థానిక పరిస్థితులకు పరిగణనలోకి తీసుకుని వేగంగా ప్రక్రియ పూర్తి చేస్తామని' కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ తెలిపారు.

(c) eenadu

తడబడిన బ్యాటర్లు.. నిప్పులు చెరిగిన బౌలర్లు



KAMINENI HOSPITALS VIJAYAWADA

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025లో భాగంగా బుధవారం జరిగిన సీనియర్స్ విభాగం మ్యాచ్‌ల్లో నలంద డిగ్రీ కళాశాల, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్లు ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి.


నలంద డిగ్రీ కళాశాల క్రీడాకారుల విజయానందం

నలంద జట్టు జయకేతనం

మొదటి మ్యాచ్‌లో నలంద డిగ్రీ కళాశాల జట్టు 19 పరుగుల ఆధిక్యంతో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన ఉషారామ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు నిర్ణీత పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. ఎస్.కార్తీక్ 22 బంతుల్లో 35, టీహెచ్‌కే వర్మ 16 పరుగులతో రాణించారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఉషారామ జట్టు నిర్ణీత పది ఓవర్లలో 66 పరుగులు మాత్రమే చేసింది. కె.లీల 18, కె.వినోద్ 10 పరుగులు చేయగా.. ప్రత్యర్థి బౌలర్లు ఎ.వాసు, ఎం.కుమారస్వామి, డి.అఖిల్, టీహెచ్‌కే వర్మ రెండేసి వికెట్లు తీశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎస్.కార్తీక్ ఎంపికయ్యాడు.

గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలదే గెలుపు


విజేతగా నిలిచిన గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల జట్టు

రెండో మ్యాచ్‌లో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల జట్టు 12 పరుగుల తేడాతో ఆంధ్రా లయోలా కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన లయోలా జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన గుడ్లవల్లేరు కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 58 పరుగులకు ఆలౌటైంది. ఎం.నవీన్ 17 బంతుల్లో 19 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు జి.మోహన్ 11 పరుగులు ఇచ్చి మూడు, కె.హరి ప్రసాద్ ఆరు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశారు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా లయోలా కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 46 పరుగులే చేసింది. ఐ.బాలు 14 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్లు కె.సురేంద్ర ఆరు పరుగులు ఇచ్చి మూడు, టి.పవన్ ఏడు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు కూల్చారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కె.సురేంద్ర ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే


ఎస్.కార్తీక్ | కె.సురేంద్ర | విశాల్

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Digital Partner: ETV BHARAT, ఈనాడు.నెట్ | FM Partner: ఈ FM Mee FM | TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Organised by ఈనాడు

పీబీ సిద్ధార్థ... విజయబావుటా


గెలుపొందిన ఆనందంలో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు

మూడో మ్యాచ్‌లో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా వర్సిటీ జట్టు నిర్ణీత పది ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. ఎ.వంశీ 13 బంతుల్లో 25, డి.గణేష్ 15 బంతుల్లో 15 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ తేజ ఏడు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన పీబీ సిద్ధార్థ జట్టు 5.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 67 పరుగులతో విజయకేతనం ఎగురవేసింది. విశాల్ 18 బంతుల్లో మూడు సిక్సర్లతో 32 పరుగులు సాధించి క్రీజ్‌లో నిలవగా.. ఎం.హర్ష 17 పరుగులు జోడించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా విశాల్ ఎంపికయ్యాడు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

మొదటి మ్యాచ్	రెండో మ్యాచ్	మూడో మ్యాచ్
పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల X గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల	ఎంఆర్ఆర్ కళాశాల X ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల	ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల X కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల జట్టు

తెదేపా పార్లమెంటరీ పార్టీ నూతన కమిటీ ఇదే...

ఈనాడు, అమరావతి, పటమట, న్యూస్‌టుడే: ప్రధాన కార్యదర్శిగా చెన్నుబోయిన చిట్టిబాబు, కోశాధికారిగా నాదెళ్ల నాగమణి (తిరువూరు), కార్యాలయ కార్యదర్శిగా తనారి గాయత్రి (నందిగామ), మీడియా కోఆర్డినేటర్‌గా కలపర్తి రామకృష్ణ ప్రసాద్ (విజయవాడ సెంట్రల్), సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సీహెచ్.కృష్ణారావు (నందిగామ) నియమితులయ్యారు.

తొమ్మిది మంది ఉపాధ్యక్షులు..: నూకల సత్యనారాయణ (జగ్గయ్యపేట), వేమ వెంకటేశ్వరరావు (నందిగామ), ధరణికోట విజయలక్ష్మి (మైలవరం), తాళ్లూరి రామారావు (తిరువూరు), చలసాని రమణారావు (విజయవాడ ఈస్ట్), కొట్టేటి హనుమంతరావు (విజయవాడ వెస్ట్), తామ్మా విజయ లక్ష్మి (విజయవాడ సెంట్రల్), బొల్లెపోగు కల్యాణి (తిరువూరు), నారల సుగుణ (నందిగామ).

కార్యనిర్వాహక కార్యదర్శులు..: దర్శి విజయ నరసింహారావు (జగ్గయ్యపేట).. వెల్పుల బిక్షాలు (నందిగామ).. జమీల్ అమ్మీద్దీన్ మహ్మద్ (మైలవరం).. ఆకుల రాధాకృష్ణ (తిరువూరు).. దొమ కొండ రవి (విజయవాడ ఈస్ట్).. పేరబత్తుల వెంకటేశ్వరరావు (విజయవాడ వెస్ట్).. పలగాని భాగ్యలక్ష్మి (విజయవాడ సెంట్రల్).. షేక్ హసీనా (విజయవాడ వెస్ట్).

అధికార ప్రతినిధులు..: నంబూరు వెంకట శివరామ్ ప్రసాద్ (జగ్గయ్యపేట), గూడూరు శ్రీనివాస్ (నందిగామ), కాయముంటి దుర్గారావు (మైలవరం), అలవల రమేష్‌రెడ్డి (తిరువూరు), పఠాన్ హయత్ ఖాన్ (విజయవాడ ఈస్ట్), రెగ్గ లక్ష్మణరావు (విజయవాడ వెస్ట్), వంజమూరి సతీష్ బాబు (విజయవాడ సెంట్రల్), అమిరేని కరుణకుమారి (విజయవాడ ఈస్ట్), జె.ఆనందరావు(జగ్గయ్యపేట).

కార్యదర్శులు: వై.నాగమణి (జగ్గయ్యపేట), షేక్ గౌసియా (విజయవాడ సెంట్రల్), పజ్జూరు రవికుమార్ (మైలవరం), బొడ్డుకుళ్ల ప్రేమరాజు (తిరువూరు), అప్పన్న రమణయ్య (జగ్గయ్యపేట), ఎం.భవాని (విజయవాడ వెస్ట్), గరిమెళ్ల రాధిక (విజయవాడ సెంట్రల్), పగడాల రమాదేవి (విజయవాడ వెస్ట్), పెనుగొండ శ్రీనివాస్ (విజయవాడ ఈస్ట్)

రాజకీయాల్లో అజాత శత్రువు వాజ్‌పేయీ

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ


మాట్లాడుతున్న భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్, పక్కన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భవానీపురం, న్యూస్‌టుడే: రాజకీయాల్లో అజాత శత్రువు అటల్ బిహారీ వాజ్‌పేయీ నిలుస్తారని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. వాజ్‌పేయీ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ భవానీపురంలోని వాజ్‌పేయీ ఉద్యానంలో దీపారాధన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ.. దేశంలో సంస్కరణలకు ఆద్యుడు వాజ్‌పేయీ అని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేల ఆధునికీకరణతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో ప్రధాని మోదీ నడుస్తున్నారని వెల్లడించారు. భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ వాజ్‌పేయీ జీవితం స్ఫూర్తిదాయకమని, నేటి యువతకు మార్గదర్శకుడిగా నిలుస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉద్యానంలోని వాజ్‌పేయీ విగ్రహం వద్ద దీపారాధన చేసి నివాళులు అర్పించారు. మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

హోటల్‌పై గవర్నర్‌పేట పోలీసుల దాడులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: ఉత్తరాది రాష్ట్రాల నుంచి యువతులను తెప్పించి వారితో వ్యభిచారం చేయిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు గవర్నర్‌పేట పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. రాము అనే వ్యక్తి యువతులను తెప్పించినట్లు గవర్నర్‌పేట సీఐ నాగమురళికి సమాచారం రావడంతో ఆయన తన సిబ్బందితో ప్రకాశం రోడ్డులోని ఒక హోటల్‌పై మెరుపు దాడులు చేశారు. 209, 210 గదుల్లో ఉన్న ఇద్దరు యువతులను రక్షించారు. నాగాపూర్, దక్షిణ ఢిల్లీ నుంచి ఈ యువతులను మాయమాటలు చెప్పి తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల రాకను గమనించి రాము అక్కడ నుంచి తప్పించుకుని పారిపోగా యువతులను కాపాడి సంరక్షణ గృహానికి తరలించారు.

27న కేఎల్‌యూ స్నాతకోత్సవం

5 వేల మందికి డిగ్రీలు ప్రదానం


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న జి.పార్థసారధివర్మ చిత్రంలో కె.ఎస్.జగన్నాథరావు, కె.సుబ్బారావు, కె.రామకృష్ణ, కిషోర్‌బాబు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 27న వడ్డేశ్వరంలోని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి జి.పార్థసారధివర్మ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం గవర్నర్‌పేటలోని కేఎల్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 5వేల మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తామని తెలిపారు. ఇందులో 184 మంది పీహెచ్‌డీ, 700 మంది పీజీ, 4,500 మంది అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నారన్నారు. గత విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరిచిన 44 మంది విద్యార్థులకు బంగారు, 40 మందికి రజత పతకాలను అందిస్తామని పేర్కొన్నారు. స్నాతకోత్సవానికి నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కె. సింగ్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని, ముంబయి టాటా మెమోరియల్ సెంటర్ పీడియాట్రిక్ హెమటో అంకాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద్ బనవల్లి గౌరవ అతిథిగా వస్తున్నారని వివరించారు. కార్యక్రమ సంధానకర్త, వర్సిటీ రిజిస్ట్రార్ కె.సుబ్బారావు మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులకు ఇప్పటికే సమాచారం అందించామన్నారు. 27న ఉదయం 9గంటల కల్లా యూనివర్సిటీ వేదిక వద్దకు చేరుకోవాలని కోరారు. కె.సుబ్రహ్మణ్యం, కె.రామకృష్ణ కన్వీనర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో యూనివర్సిటీ ప్రొ వైస్‌ఛాన్సలర్ కె.ఎస్.జగన్నాథరావు, డీన్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

జిల్లా ఏడీసీపీ-1గా మురళీకృష్ణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ శాంతిభద్రతల ఏడీసీపీ-1గా ఎన్.బి.ఎం. మురళీకృష్ణను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలనాపరమైన మార్పుల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా పరిపాలనా విభాగం అదనపు ఎస్పీగా పనిచేస్తున్న మురళీకృష్ణను ఎన్టీఆర్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

చంద్రబాబు ఆలోచనకు ప్రతిరూపమే నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణ తీసుకున్న మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె, ఉమా, మాజీ ఎమ్మెల్సీ వెంకన్న

పటమట, న్యూస్‌టుడే: మహిళల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ తన సొంత నిధులతో హైదరాబాద్ ఎన్ఐఆర్‌డీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించడం గొప్ప విషయమని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే సీఎం చంద్రబాబు ఆలోచనలకు ప్రతిరూపమే నైపుణ్యాభివృద్ధి శిక్షణ అని పేర్కొన్నారు. కేశినేని ఫౌండేషన్, ఎన్వు ఇండియా, ఎన్ఐఆర్‌డీ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా మెప్మా, ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఎన్టీఆర్ భవన్‌లో చెదలు-బొద్దింకలు-దోమల నివారణ చర్యలపై ఇచ్చిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీ శివనాథ్‌తో పాటు, ఎమ్మెల్యేలు గద్దె, ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, దూదేకుల కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. శివనాథ్ మాట్లాడుతూ.. మెప్మా, డ్వాక్రా మహిళలకు ఆర్థిక సహకారం లభిస్తుందని, అయితే స్వయం ఉపాధి రంగంలో ఏ వ్యాపారం చేయాలి.. ఎక్కడ శిక్షణ తీసుకోవాలనే విషయాలపై అవగాహన లేదన్నారు. అందుకే నైపుణ్యాభివృద్ధి శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. డిసెంబర్‌లోనే 400 మందికి శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసేందుకు కూడా సహకారం అందిస్తామన్నారు. ప్రతి నెల 250 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. జోనల్ ఆఫీస్ : డి నెం.29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) క్రింద 30 రోజుల తర్వాత అమ్మకం గురించి సమాచారమిస్తూ ఋణగ్రహీతకు ఉద్దేశిత అమ్మకం ప్రకటన.

1) శ్రీ రాజ్యలక్ష్మి రోడ్ క్యారియర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు పూసల పుల్లారావు, హిందూ, వయస్సు 48 సంవత్సరాలు, డి నెం.7-339/A, తొర్రగుంటపాలెం, జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా-521175.
2) పూసల పుల్లారావు, తండ్రి : జగన్ మోహన్ రావు, హిందూ, వయస్సు 48 సంవత్సరాలు, డి నెం. 7-339/A, తొర్రగుంటపాలెం, జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా-521175.
3) పూసల సీతారావమ్మ, భర్త : పుల్లారావు, హిందూ, వయస్సు 48 సంవత్సరాలు, డి నెం. 7-339/A, తొర్రగుంటపాలెం, జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా-521175.
4) గొల్ల రామ కృష్ణ, తండ్రి : అనంతయ్య, హిందూ, వయస్సు 43 సంవత్సరాలు, డి.నెం.7-173, తొర్రగుంటపాలెం, జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా-521175.

అయ్యా/అమ్మా,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్‌కి రావాల్సిన బకాయి మొత్తం రాబట్టుకొనుటకు ఋణగ్రహీత పూసల సీతారావమ్మ గారికి చెందిన ఆస్తుల అమ్మకం గురించి ఉద్దేశిత అమ్మకం ప్రకటన.

Ref: ఋణ అగ్రిమెంట్ నెం. JAGPTTF2203240005

మేము శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" NCLT చెన్నై యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు తర్వాత 30-11-2022 తేదీనాటి పేరు మార్పునుసరించి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ యొక్క రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ ద్వారా ధృవీకరించబడిన ఇన్‌కార్పోరేషన్ సర్టిఫికేట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడినది. రిజిస్టర్డ్ ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మరియు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ కార్యాలయం, డి నెం. 29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002 మరియు బ్రాంచ్ ఆఫీస్ : జగ్గయ్యపేట (ఇక పై కంపెనీ/ఋణదాతగా పిలువబడుతుంది).

ఇందులో తెలిపిన సమయంలోగా తదుపరి వడ్డీ, ఖర్చులతో పాటు తేది.05-12-2023 నాటికి రూ.28,96,341/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల తొంభై ఆరు వేల మూడు వందల నలభై ఒక్క రూపాయలు మాత్రమే) వర్తించు వడ్డీ/వ్యయాలు కలిపి మొత్తం చెల్లించమని మిమ్ములను కోరుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ - శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ 05-12-2023 తేది గల డిమాండ్ నోటీసును జారీచేయడమైనది. తెలిపిన సమయంలోగా సదరు నోటీసును పాటించడంలో మీరు విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద హామీ గల స్థిరాస్తులను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి తేది 03-04-2024 న లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు మరియు సదరు ఆస్తులను మా కార్యనిర్వాహకుల సహాయంతో తేది 19-12-2025 న భౌతికంగా కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎందుకంటే ఆ భూమి ఖాళీ భూమి.

హామీగల ఆస్తిని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కి ఉన్న బకాయిలను చెల్లించుటలో మీరు విఫలమైనందున విడిగా ఇ-వేలం అమ్మకం ప్రకటన ద్వారా ఈ నోటీసు స్వీకరణ తేది/ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 30 రోజుల తర్వాత బహిరంగ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ తెలిపిన ఆస్తిని విక్రయించుట అనివార్యమైనది. ఆస్తి రిజర్వు ధరతో పాటు ఇ-వేలం తేది మరియు సమయం మరియు నిర్వహించబడనున్న ఇ-వేలం సర్వీసు ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

అందువలన అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీ లోగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భరించిన తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కి ఉన్న బకాయి మొత్తాన్ని మీరు చెల్లించినచో, చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద నిర్దేశించిన విధంగా ఆస్తి అమ్మకానికి తదుపరి చర్య చేపట్టబడదు మరియు మీ ఆస్తిని మీరు విడిపించుకొనవచ్చును.

పూసల సీతారావమ్మ గారికి చెందిన షెడ్యూలు ఆస్థి వివరములు

కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట సబ్ జిల్లా, జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట మున్సిపల్ పరిధి, జగ్గయ్యపేట టౌన్, ఆర్ ఎస్ నెం.369 నందు విస్తీర్ణం ఎకరా 10.81 సెంట్లు మరియు సబ్-డివిజన్ ప్రకారం ఆర్ ఎస్ నెం.369/2 నందు విస్తీర్ణం ఎకరా 5.82 సెంట్లులోని ఎకరా 0.06 సెంట్లు 480 చ॥లింకులు లేదా 314 చ॥గ॥లులోని ఖాళీ ఇంటి స్థలం (డోర్ నెం.6-1128 దగ్గర). హద్దులు: తూర్పు: పల్లింపాటి రాజా మోహన రావు ఇతరులు యొక్క స్థలం - 61 లింకులు, దక్షిణం: నోముల పుండరీకాక్షుడు ఇతరులు యొక్క స్థలం - 104 లింకులు, పడమర: 30 అ॥ల వెడల్పు రోడ్డు - 59 లింకులు, ఉత్తరం: చీడె నాగలక్ష్మి గారి స్థలం - 112 లింకులు.

పైన చెప్పబడిన విస్తీర్ణం ఎ. 0.06 సెంట్లు 480 చ॥లింకులు లేదా 314 చ॥గ॥లులోని ఖాళీ ఇంటి స్థలం మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ జగ్గయ్యపేట, డాక్యుమెంట్ నెం.5401/2017 కు సంబంధించినది)

తేది : 24.12.2025
ప్రదేశం : విజయవాడ


సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పర్యాటకంలో వినూత్న నమూనాలకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్: పర్యాటకంలో వినూత్న నమూనాలను ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సీఎం చంద్రబాబు పిలుపునిచ్చిన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అనుగుణంగా పర్యాటకరంగ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక కౌన్సిల్ (డీటీసీ) సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్, హోమ్‌స్టేలు, పర్యాటక ఈవెంట్లు, ట్యాక్సీ యాప్ తదితరాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు తీసుకున్న నిర్ణయాలను సత్వరం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. పెట్టుబడిదారులకు పూర్తి స్థాయి సహకారాలను అందజేస్తాం. పర్యాటకరంగ సుస్థిర అభివృద్ధికి, స్థానిక ప్రజలకు ప్రత్యక్షంగా ఆర్థిక ఫలాలను అందించడంలో హోమ్ స్టేలు కీలకపాత్ర పోషిస్తాయి. వీటిపై ఔత్సాహికులకు అవగాహన కల్పించి, నమోదు చేసుకునేలా చూడాలి. కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి. హౌస్‌బోట్, హెలీ టూరిజం తదితరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. డిమాండ్ దృష్ట్యా వీలైనన్ని ఎక్కువ హౌస్ బోట్‌లను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలి. నగరంలో జనవరి 8 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సినిమా, సంస్కృతి, సాహిత్యాల 'ఆవకాయ్ అమరావతోత్సవాన్ని' విజయవంతం చేసేందుకు టూరిజం శాఖ అధికారులు సమష్టిగా కృషి చేయా'లన్నారు. పర్యాటకశాఖ ఆర్డీ వై.వి.ప్రసన్న లక్ష్మి, జిల్లా పర్యాటక అధికారిణి ఎ.శిల్ప, ఏపీటీడీసీ ఈఈ ఎం.శ్రీనివాసరావు, బీఐటీసీ ఈడీ జి.ఉమామహేశ్వరరావు, కాకాని తరుణ్ (అమరావతి బోటింగ్ క్లబ్) తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం


ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావుకు ప్రశంసాపత్రం ఇస్తున్న సీపీ రాజశేఖరబాబు, చిత్రంలో ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఎం.డి.ఫారూక్.. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి గుంటూరు జిల్లా తాడేపల్లికి వచ్చి నూడుల్స్ బండి పెట్టుకుని జీవిస్తున్నారు. 2024 జూన్ 9న విజయవాడలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆయన భార్య మృతి చెందింది. నెల్లూరుకు వెళ్లిపోయిన ఆయనతో మాట్లాడి సంబంధిత పత్రాలు పంపి జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ నుంచి రూ.2లక్షలు వచ్చేలా చేశారు. సాధారణంగా రోడ్డు ప్రమాద కేసుల్లో వాహనాన్ని గుర్తించకపోతే పరిహారం రాదు. కానీ సుప్రీంకోర్టు ఈ కేసుల్లో వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చొరవ తీసుకున్నారు. ఎన్టీఆర్ కమిషనరేట్‌లో జరిగిన 238 కేసుల్లో 247 మంది బాధితులకు రూ.2కోట్ల పరిహారం ఇప్పించారు. మృతి చెందిన 51 మందికి ఒక్కొక్కరికి రూ.2లక్షలు చొప్పున, గాయపడ్డ 196 మందికి ఒక్కొక్కరికీ రూ.50వేలు చొప్పున ఈ ఏడాది పరిహారం ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యభూమిక పోషించిన ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం, ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావు, హెడ్ కానిస్టేబుల్ ఎన్.వి.శ్రీనివాసరావు, పీసీ వి.లీలసాయి కిరణ్‌లను సీపీ అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU eClassifieds

INDUSTRY

MACHINERY FOR SALE

ఖమ్మంలో మంచి రన్నింగ్‌లో ఉన్న UPVC విండోస్ & డోర్స్ కంపెనీ అమ్మకం/లీజుకు ఇవ్వబడును. సెల్: 94401 08943.

విత్తనశుద్ధి యంత్రాలు మరియు జనపనార సంచులు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి సంప్ర॥. ✆ 72880 65253.

REAL ESTATE

FLAT FOR SALE

3BHK Flat for Sale RR Gardens High school Road Patamata Genuine Buyers only. Contact: 7675855717

FOR SALE
Sale of 3 BHK, Sri Vaibhav Villa, R.S.No. 334/2A, Gunadala (Behind Ayush Hospital) Vijayawada, NTR District, Andhra Pradesh, having Built up area of 1610 sft (Plinth Area of 1360 sq.feet sq ft, Common Area of 250 Sft) configuring with UDS of 54.40 Sq.yds in land and 150 sft of car parking on 30.12.2025, For further details call Mr. Ramesh Kumar on 8886112124, Mr. G.K.Raghu Ram (Mobile No. +91 9899276269)

అశోక్‌నగర్ టైం హాస్పిటల్ ఎదురుగా బందరురోడ్‌కి అతి సమీపమున నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. ✆ 93939 59907.

2B/R ఫ్లాట్స్ అమ్మకం. గన్నవరం సెయింట్ జాన్స్ స్కూలు దగ్గర మరియు మొఘల్‌రాజపురంలో కారు పార్కింగ్ వసతితో అమ్మకం. ✆ 93980 22862

KANURU

కానూరు బల్లెంవారి వీధిలో Occupancyకి సిద్ధముగా 1700 S.ft న్యూ 3 BHK లగ్జరీ ఫ్లాట్స్ E/W కభోర్డ్స్ 100% లోన్‌తో ✆ 76719 22845.

LAND FOR SALE

450 ఎకరాల్లో మెగా అవకాడో ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు 6 లక్షలకే 5 సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. 91335 74455

గుడివాడ, పెదపారుపూడి మండలం, గురివిందగుంట- దోసపాడు మధ్య, మహేశ్వరపురంలో 2ఎకరాల పొలం అమ్మకంనకు కలదు. @ 65 లక్షలు. ✆ 81434 53250.

PLOT FOR SALE

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 91336 33855.

కుంచనపల్లి 40ft రోడ్‌ఫేసింగ్ హైవేకి 1.5 Kmదూరంలో 26 సెంట్లస్థలం & గుంటూరు IRRకు 1 Kmదూరంలో 40ft రోడ్‌ఫేసింగ్ 500 చ॥గ॥ స్థలం అమ్మకం. 99081 88946

NUNNA ROAD

అమరావతి-కాజా-నున్న-గ్రేటర్ విజయవాడలో (Nr. ORR దగ్గరలో) CRDA అప్రూవ్ గల 150 గజాల పైనా గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు అమ్మకము. Ph:95028 22335

LEASE/ SALE

నున్న దోబీఖానా రోడ్‌లో 80HP ఇండస్ట్రియల్ కరెంట్‌తో 628 చ॥గ॥లలో GF & FF, RCC,2వ ఫ్లోర్ క్వార్టర్స్‌గల బిల్డింగ్ లీజు/అమ్మకము. ✆ 98482 34444

TO LET

COMMERCIAL

పటమట బందరురోడ్డుకి 4వ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ నందు ఈస్ట్ రోడ్డు ఫేసింగ్‌తో 250 S.Ft గల షాపు ఆఫీసు / షాపుకు అద్దెకు. ✆ 83328 18745.

JOBS

WANTED male admin Incharges qualification any Degree, Age limit: 25 to 45 years (must be married) Salary upto: 20,000/- working location: Master minds college. Vijayawada. Contact:96761 96218.

Wanted lady helper, Age 18 to 32, qualification: 10 th, place: Ayyappa nagar vijayawada (prefer Ayyappa nagar local person) Contact: 83090 07906

ప్రముఖ కంపెనీకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టార్గెట్ లేదు, కనీస జీతం 10K+ ఇన్సెంటివ్‌లు మరియు ప్రయాణ భత్యాలు. ✆ 91770 56787.

గన్నవరం కార్యాలయంలో పనిచేయుటకు అనుభవం కలిగి ఉన్న అకౌంటెంట్ కావలెను, ట్యాలీ & GST ఫైలింగ్‌లో పని అనుభవం ఉండాలి. ✆ 94401 75207.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్. A:25-30Y, S:18-25k, Q:డిగ్రీ, టేడీటెలికాలర్ కావలెను. 99495 58181/ 81215 58181

లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. విజయవాడ 1టౌన్ వస్త్రలత క్లాత్ షాపులో పనిచేయుటకు, బిల్లింగ్ చేయుటకు అకౌంట్స్ తెలిసిన విజయవాడ లోకల్ వారు మాత్రమే సంప్రదించండి ✆ 92464 74109.

మహిళా అభ్యర్థిని (హెల్పర్) 10th P/F ఏలూరురోడ్డు, సీతారాంపురం ప్లేవుడ్ & డోర్స్ షాపులో పనిచేయుటకు కావలెను. 12,000/-, 9.30 to7.30 ✆. 92472 88381

DRIVERS

కె ఎల్ డీమ్డ్ యూనివర్సిటీ నందు పనిచేయుటకు అనుభవం కల్గిన కారు డ్రైవర్లు కావలెను. ఆసక్తి గల వారు 27.12.2025, 10.00 గం.లకు ఇంటర్వ్యూకి హాజరు కాగలరు. డోర్ నెం. 29-36-38, మ్యూజియం రోడ్, విజయవాడ. ఫోన్: 0866-3500143

ACCOUNTING

గొల్లపూడి కమర్షియల్ కాంప్లెక్స్ హోల్‌సేల్ డ్రైఫ్రూట్స్ స్టోర్స్‌లో Tally నాలెడ్జి అనుభవం గల అకౌంటెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం.VJA, 1 టౌన్ వారికి ప్రాధాన్యత. ✆ 90524 87777

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

పార్లమెంట్ కార్యదర్శిగా పజ్జూరు రవికుమార్



జి.కొండూరు, న్యూస్‌టుడే : విజయవాడ పార్లమెంట్ కార్యదర్శిగా మైలవరం నియోజకవర్గం నుంచి జి.కొండూరుకు చెందిన పజ్జూరు రవికుమార్‌ను నియమించినట్లు తెదేపా రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో జి.కొండూరు మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రవికుమార్ సేవలను పార్టీ గుర్తించి పార్లమెంట్ కార్యదర్శి పదవి ఇవ్వడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభ చూపి.. బహుమతి పట్టి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రం విస్సన్నపేట శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ఎన్.హేమంత్ (8వ తరగతి), స్వరూప్ (6వ తరగతి), జె.దినేష్ (7వ తరగతి) ప్రతిభ చూపి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపల్ పవన్ కుమార్, డీన్ టి.మల్లికార్జునరావు విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌ఛార్జి ఎ.చిన్న పుల్లారావు, ఉపాధ్యాయులు జి.విజయ్ బాబు, ఎ.సంజీవరావు పాల్గొన్నారు.



విజేతలతో శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ పవన్‌కుమార్, డీన్ మల్లికార్జునరావు

పోటీ పడాలి.. బహుమతులు సాధించాలి

మైలవరం, న్యూస్‌టుడే : తోటి విద్యార్థులతో పోటీ పడి, ప్రతిభ చాటి బహుమతులు సాధించాలని మండలంలోని చిలుకూరివారి గూడెం (పుల్లూరు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని అన్నే కుసుమ కుమారి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జి అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థినులు ముద్దంగుల హర్షిత, ఉల్లిబోయిన తేజశ్విని, బండారు సాహిత్య వరుసగా, మొదటి మూడు స్థానాలు సాధించారు. వారికి ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎస్.అరుణ, బి.ఉషారాణి, బి.తిరుపతమ్మ బహుమతులు అందజేసి, అభినందించారు.



విజేతలతో ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయినులు

రీసర్వేకు రైతులు సహకరించాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జనవరి 2 నుంచి రెడ్డిగూడెం, మద్దులపర్వ, కూనపరాజుపర్వ గ్రామాల్లో చేపట్టే రీసర్వేకు రైతులు సహకరించాలని తిరువూరు ఆర్డీవో కె.మాధురి పేర్కొన్నారు. గురువారం రీసర్వేపై రెడ్డిగూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రీసర్వే సిబ్బంది సర్వే చేసే సమయంలో రైతులు తమ భూములు వివరాలు చూపించి సహకరించాలని కోరారు. తహసీల్దార్ జె.సుశీలాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి, తహసీల్దార్ సుశీలాదేవి

నా మొక్క.. నాదే బాధ్యత

★ పాఠశాలలో విద్యార్థుల స్ఫూర్తి ★ పర్యావరణ పరిరక్షణకు కృషి


ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

'పాఠశాలలో మొక్క నాటి దత్తత తీసుకో, పుట్టిన రోజు నాడు మొక్కనాటి సంరక్షించు, అమ్మ పేరున మొక్క నాటు' ఇలాంటి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను కాచవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆచరిస్తూ.. మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తూ గ్రీన్ పాస్‌పోర్టు సాధిస్తున్నారు. మొక్కల పెంపకం, పచ్చదనం తదితర అంశాలపై ప్రభుత్వంతో పాటు ఉపాధ్యాయుల బోధనలతో స్ఫూర్తి పొందిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో వివిధ సందర్భాల్లో మొక్కలు నాటి సంరక్షణకు శ్రీకారం చుట్టారు. పాఠశాల మొక్కల సంరక్షణ కమిటీతో కలిసి ప్రతిరోజు వారు నాటిన మొక్కలకు నీళ్లు పెట్టి ఎదుగుదలకు కృషి చేస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణం

పాఠశాల ప్రధానోపాధ్యాయిని భవానీ, ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు పర్యావరణం, మొక్కల పెంపకంపై ఆసక్తి పెంపొందించి.. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరికి గ్రీన్ పాస్‌పోర్టు అందిస్తున్నట్లు తెలిపారు. అందులో విద్యార్థి పేరు, ఫొటో, మొక్క నాటిన తేదీ, మొక్క వివరాలు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐదో తరగతి చదువుతున్న **అంకశాల ప్రజ్ఞశ్రీ** రెండో తరగతిలో ఉండగా తన పుట్టిన రోజు సందర్భంగా సపోటా మొక్క నాటింది. ఐదేళ్లలో అది చెట్టుగా ఎదిగి వందల సంఖ్యలో ఫలాలు ఇచ్చింది. తన శ్రమకు ఫలితం దక్కిందన్న సంతోషంతో మిత్రుల సాయంతో చిన్నారి పండ్లు కోసి అందరికీ పంచింది.



మూడో తరగతి చదువుతున్న **మొగులూరి అమూల్య** తల్లి పేరుతో ఒకటో తరగతిలో నాటిన జామ మొక్క కాపుదశకు వచ్చింది. ఎపుడు కాయలు కాస్తాయా.... వాటిని మిత్రులకు అందజేయాలన్న సంకల్పంతో ప్రతి రోజు దాని సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.



మూడో తరగతికి వచ్చిన **సయ్యద్ ఖాజా** రెండో తరగతిలో నాటిన గులాబీ, తదితర పూల మొక్కలకు పూసిన పూలను దండగా చేసి పాఠశాలలో నిర్వహించే దేశ నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో వారి చిత్రపటాలకు వేస్తూ ఆనందపడుతున్నాడు. వీరి బాటలో మరి కొందరు విద్యార్థులు కూడా మొక్కలు నాటి.. పరిరక్షణలో భాగస్వాములయ్యారు.



కార్మికులకు సర్పంచి చేయూత

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలుగా జీతాలందలేదు. సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి సొంత డబ్బులు రూ.2 లక్షలు వేతనాలకు అడ్వాన్స్‌గా చెల్లించి కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఈ సందర్భంగా ఆమెకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

31 నుంచి విశాఖలో సీఐటీయూ మహాసభలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు కోరారు. గంపలగూడెం, తోటమూలలో బుధవారం కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై మహాసభల గోడపత్రికలను వారు ఆవిష్కరించారు. మండల నాయకులు పాల్గొన్నారు.

నిమ్రాలో రక్తదాన శిబిరం

ఇబ్రహీంపట్నం గ్రామీణం : జూపూడి నిమ్రా కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ అక్బర్‌ఖాన్ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. విజయవాడ బందరు రోడ్డు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

తక్షణ సాయం, ప్రాథమిక చికిత్సతో ప్రాణాలు పదిలం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : వరదల సమయంలో తక్షణ సాయం, ప్రాథమిక చికిత్స చేస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీటీసింగ్ పేర్కొన్నారు. వరదలు, విపత్కర పరిస్థితుల్లో ప్రమాదాలను ఎదుర్కొనే అంశాలతో కూడిన మాక్‌డ్రిల్‌ను ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఇబ్రహీంపట్నం ఫెర్రీ కృష్ణానదిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నది నీటిలో తేలియాడుతున్న వ్యక్తిని రక్షించడం, ఒడ్డుకు తెచ్చి ప్రాథమిక చికిత్స ఎలా చేయాలో వివరించారు. నీటిలో మునిగి బయటకు తీసుకువచ్చిన వ్యక్తికి మెడ వద్ద ఉన్న పల్స్‌ను పరిశీలించి సీపీఆర్ చేయాలని చూపించారు. అలాగే నది నీటిలో 40 అడుగుల లోతు వరకు వెళ్లి అక్కడ ఉన్న వారిని రక్షించి ఎలా తీసుకురావచ్చో చూపించారు. కార్యక్రమాన్ని సీఐ చంద్రశేఖర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం పర్యవేక్షించారు. కార్యక్రమంలో కొండపల్లి పురపాలక ఛైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్లు, పీహెచ్‌సీ వైద్య అధికారులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో ప్రాథమిక చికిత్స అందిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీటీసింగ్

బోరు ఏర్పాటు

పెనుగంచిప్రోలు, : స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొత్త బోరు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో బోరు లేక నీటి కోసం పోలీసులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎస్సై అర్జున్ ప్రత్యేక చొరవ తీసుకుని పక్కనే ఉన్న పాత పోలీస్‌స్టేషన్ స్థలంలో బోరు వేయించారు.

రెవెన్యూ వ్యవస్థలను తారుమారు చేసిన వైకాపా ప్రభుత్వం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలను తారుమారు చేసిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పార్టీ నాయకులను కలిసేందుకు, పార్టీ పలు కార్యక్రమాల విశ్లేషణకు మంత్రి బుధవారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలకు ఎన్నికల హామీల్లో ఇచ్చిన సూపర్- 6 హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. గత వైకాపా ప్రభుత్వంలో ఇసుక, మద్యం, రేషన్ బియ్యం పేరుతో ఏ విధంగా దోపిడీ చేశారో ప్రతి ఒక్కరూ చూశారని తెలిపారు. జోగి రమేష్ లిక్కర్ స్కామ్ చేశారని తెలిపారు. అనంతపురంలో జగన్ జన్మదిన వేడుకల్లో వైకాపా నాయకులు గొర్రెలని కాలితో తన్నారని, సత్యసాయి జిల్లాలో మూగజీవాలను నరికి జగన్ చిత్రపటాలకు రక్తంతో అభిషేకం చేయడం ఆ పార్టీ నేతల వైఖరికి నిదర్శనమన్నారు. 2029 ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ దాటనివ్వరు రప్పా రప్పా తలకాయలు నరుకుతాం అనడం ఏంటని, ఇది ఈ రాష్ట్రం కోసం కొట్లాడే ఇవేనా అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, దోపిడీలు, దాడులు, దౌర్జన్యాలు, కూల్చివేతలు తప్ప ఇంకేం జరగలేదన్నారు. ప్రభుత్వం మంచి ఆలోచనతో వైద్య కళాశాలలు రాష్ట్రానికి అందించాలని కృషి చేస్తుంటే.. గత ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా మభ్య పెట్టిందని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

భక్తిశ్రద్ధలతో వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో బుధవారం గోదా రంగనాయకస్వామి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు, భక్తులు ఉదయాన్నే ఆలయాల్లో గోదాదేవి తిరుప్పావై పాశురాలు ఆలపించారు. మహిళలు ఆలయాలను అలంకరించి దర్శించుకున్నారు.



గంపలగూడెంలో ధనుర్మాస పూజలో భక్తులు

తెదేపా అధికార ప్రతినిధిగా నలమోలు



వెంకటశివరామ్

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : తెదేపా విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా (స్పోక్స్ పర్సన్)గా నలమోలు వెంకటశివరామ్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ఆయన గత సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు క్రిస్మస్ శుభాకాంక్షలు
సుధీర్ టింబర్ డిపో
98489 10892
VAMSI'S ROYAL CITY
OPEN PLOTS, DUPLEX VILLAS
N.N.V.S. N.M.V.
NH 65
98486 62222
94401 58793

సందడిగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ఇబ్రహీంపట్నం : చిన్నారులతో కలిసి కేకు కోస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తదితరులు



గొల్లపూడి నారాయణ పాఠశాలలో విద్యార్థుల వేషధారణలు

కొండపల్లి, మైలవరం, గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, గొల్లపూడి, విస్సన్నపేట, న్యూస్‌టుడే : జిల్లాలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలు, వివిధ పాఠశాలల్లో కేకులు కోశారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.



మైలవరం లీలావతి పాఠశాలలో వివిధ వేషధారణల్లో చిన్నారులు



విస్సన్నపేట : వేడుకలో ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఎంపీపీ మల్లయ్య, పాదర్ కిరణ్ తదితరులు

ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు పటిష్ఠ భద్రత కల్పిస్తున్నట్లుగా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక అందిస్తామని తెలిపారు. కేంద్రం వద్ద సీసీ కెమెరాల పనితీరును, మంటలను ఆర్పే పరికరాలను పరిశీలించారు. గోదాము వద్ద విధులు నిర్వహించే పోలీసులు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ పార్టీల నాయకులు రామయ్య, ఆంజనేయరెడ్డి, కృష్ణారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.



గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

క్రిస్మస్ శుభాకాంక్షలు
BALAJI HOSPITALS & DIABETES CENTRE
బాలాజీ హాస్పిటల్స్ & డయాబెటిస్ సెంటర్
స్వాతి థియేటర్ రోడ్డు, భవానీపురం, విజయవాడ-12
ఫెర్రీ రోడ్డు, ఇబ్రహీంపట్నం, ఎన్టీఆర్ జిల్లా.
Dr. RLV PHANI KUMAR MBBS, MD (INT MED), DIP DIAB CONSULTANT PHYSICIAN AND DIABETOLOGIST
Dr. D. ANUSHA MBBS, MD (INT MED), DIP DIAB CONSULTANT PHYSICIAN AND DIABETOLOGIST
DIABETIC FOOT SURGERY & PODIATRY CARE.
VACUUM THERAPY (NPWT) FOR FAST, SAFE WOUND HEALING.
COMPLETE HEALTH CHECK UPS & AFFORDABLE PACKAGES.
మా హాస్పిటల్ నందు 24 గంటలు లభించు సేవలు
షుగర్ వ్యాధి సంపూర్ణ నిర్ధారణ & చికిత్సలు • బి.పి.
ఊపిరితిత్తుల సమస్యలు
థైరాయిడ్ • అన్ని విషప్రయోగాలు
మల్టీ సిస్టమ్ డిజార్డర్స్
అన్ని మెడికల్ కేసులు
అన్ని ప్రముఖ కంపెనీల ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సదుపాయం కలదు.
50 BEDDED HOSPITAL
91540 64744, 91540 64745
www.sreebalajihospitals.com
Location Scan Gmaps QR
Scan QR code for following us on facebook

శ్మశానవాటికలో పిచ్చి చెట్ల తొలగింపు

మైలవరం : వీరభద్ర సంఘీయుల స్థానిక శ్మశానవాటిలో పిచ్చి చెట్ల తొలగింపు పనులను బుధవారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనల మేరకు తెలుగు యువత నాయకుడు లంకా లితీష్ ఆధ్వర్యంలో చేపట్టారు. దీర్ఘకాలంగా ఉన్న ఇబ్బందులు తొలగడంపై వర్గీయులు కృతజ్ఞతలు తెలిపారు.

ముస్తాబైన క్రైస్తవాలయాలు

తిరువూరు : తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని క్రైస్తవాలయాలు క్రిస్మస్ పర్వదిన వేడుకలకు ముస్తాబయ్యాయి. చర్చిలను విద్యుత్తు దీపాలతో వర్ణ శోభితంగా అలంకరించారు. నక్షత్రాలను వేలాడదీశారు. పశువుల కొట్టాలు, దేవదూతలు, గొర్రెల కాపర్లతో క్రీస్తు జన్మ వృత్తాంతం తెలిపే అలంకారాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భవానీపురం, న్యూస్‌టుడే: గొల్లపూడిలో మస్తాన్, సమీరా దంపతులు నివాసం ఉంటున్నారు. సమీరా గొల్లపూడి టైలరింగ్ నిర్వహిస్తున్నారు. ఈనెల 23వ తేదీ రాత్రి దుకాణం వద్ద నుంచి ఇంటికి వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో ఆమె గాయపడ్డారు. ఆటో డ్రైవర్ సుభానీ మద్యం తాగి ఆటో నడుపుతూ ఢీ కొట్టినట్లు సమీరా భర్త మస్తాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ప్రాజెక్టు ఎంపిక

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : కానూరు మురళీ రిసార్ట్స్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మైలవరం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి కె.పిచ్చేశ్వరరావు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ఇస్లావత్ రుక్మిణి, బత్తుల విజయదుర్గ.. గ్రీన్ ఎనర్జీలో భాగంగా పునరుత్పాదక శక్తిని పెంపొందించడానికి ఇంధన సామర్థ్యాన్ని విస్తరించి భారతదేశాన్ని సౌర, పవన విద్యుత్తు రంగంలో ప్రపంచ స్థాయిలో ఒకటిగా నిలిచేందుకు ప్రాజెక్టు రూపొందించారని పేర్కొన్నారు. వారికి ఎస్సీఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారని తెలిపారు.

తనిఖీల్లో 65 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మైలవరం,: మండలంలోని పుల్లూరు పంచాయతీ పరిధిలో బుధవారం తెల్లవారుజాము నుంచి సీఐ దాడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పోలీసులు సోదాలు నిర్వహించారు. రికార్డులు సరిగా లేని 65 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి ధ్రువపత్రాలను చూపితే అప్పగిస్తామని, లేకుంటే సీజ్ చేయనున్నట్లు ఎస్సై కె.సుధాకర్ పేర్కొన్నారు. వాటిని ట్రాక్టర్లు, ఆటోల్లో మైలవరం స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో జి.కొండూరు, రెడ్డిగూడెం ఎస్సైలు సతీష్‌కుమార్, శ్రీను, పీఎస్సైలు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక గీతాంజలి పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి గిరిధర్‌ను అల్లరి చేస్తున్నాడని తరగతి గదిలో ఉపాధ్యాయుడు కొట్టినట్లు గురువారం ఎంఈవో పి.రమేష్ బాబుకు విద్యార్థి తండ్రి టమటం కొండలరావు ఫిర్యాదు చేశాడు. ఎంఈవో పాఠశాల యాజమాన్యాన్ని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం జరిగిందని, బుధవారం విద్యార్థి తల్లి భాగ్యలక్ష్మి వచ్చి అడగ్గా ఉపాధ్యాయుడు క్షమాపణ చెప్పారని, ఇకపై ఇలాంటివి జరగకుండా చూస్తామని వారు చెప్పారు. ఉపాధ్యాయుడు అల్లరి చేస్తున్నాడనే కారణంగా చేతితో కొట్టిన మాట వాస్తవమేనని యాజమాన్యం చెప్పినట్లు ఎంఈవో విలేకర్లకు తెలిపారు. బాలుడి వీపుపై, చేతిపై వాతలు పడగా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

కోడూరు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : డిజిటల్ అరెస్టులు లేవని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ గ్రామీణ డీసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని కోడూరులో బుధవారం వాహన ప్రమాదాల నియంత్రణ, సైబర్ మోసాలపై ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని, మద్యం తాగి వాహనం నడపవద్దని సూచించారు. యువత నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి బారినపడి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు. జూదాలు, కోడి పందేలు, క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మైలవరం ఏసీపీ ప్రసాదరావు, తిరువూరు సీఐ గిరిబాబు, ఎ.కొండూరు ఎస్సై గంధం మహా లక్ష్మణుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మీనారాయణ, వేదికపై పోలీస్ అధికారులు

వైకుంఠధామంలో మార్చురీ గది ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక హిందూ శ్మశానవాటిక వైకుంఠధామంలో కొత్తగా ఏర్పాటు చేసిన మృతదేహాలను భద్రపరిచే గదిని బుధవారం ప్రముఖ వైద్యులు కె.కృష్ణారెడ్డి, ఎన్.పూర్ణచంద్రరావు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఎం.ఉపేంద్ర ప్రారంభించారు. లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు గాంధీ, ముత్యప్రసాద్, నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, చలవాది మధుసూదనరావు, నాగభూషణం, కొప్పు సత్యం, బయన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మార్చురీ గదిని ప్రారంభిస్తున్న వైద్యులు తదితరులు

జాతీయ నాయకుల పటాల వితరణ

దుందిరాలపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని దుందిరాలపాడు ప్రాథమిక పాఠశాల (హెచ్‌డబ్ల్యూ)కు తెదేపా నాయకుడు కల్యాణం కృష్ణయ్య కంచాలు, గ్లాసులు, జాతీయ నాయకుల చిత్రపటాలు బుధవారం వితరణగా అందించారు. ఎస్‌ఎంసీ అధ్యక్షుడు ఎం.నరసింహారావు, ఎంఈవో పి.నరసింహారావు, హెచ్ఎం సీహెచ్ శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఇటీవల కుంటముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎం- 3.0 పాల్గొన్న తెదేపా మండల కార్యదర్శి లంకా నాగేశ్వరరావు పాఠశాలకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం ఆయన జన్మదిన సందర్భంగా రూ.16 వేలు సమకూర్చి మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూల్ మీరా షరీఫ్‌కు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు సుఖవాసి శ్రీహరి, తెదేపా మండల మాజీ కార్యదర్శి లంకా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విస్సన్నపేట : మండలంలోని ములగలపాటి వారి గూడెం దళితవాడ చర్చికి రూ.30 వేల విలువైన మైక్‌సెట్‌ను తెదేపా నియోజకవర్గ యువనేత, ఎన్నారై వల్లభనేని గిరిబాబు బుధవారం బహూకరించారు.

సాగు వివరాలు నమోదు చేయించుకోవాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని ఏవో డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం కుదప, రుద్రవరం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగుకు సమయం దాటిపోయిందని.. సాగు చేయవద్దని సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కంభంపాడు బ్రాంచి-18981
ఈ వేలం అమ్మకం ప్రకటన
[illegible]
www.unionbankofindia.co.in
https://baanknet.com
తేదీ: 20.12.2025
ప్రదేశం: కంభంపాడు
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



Baroda BNP PARIBAS MUTUAL FUND

బరోడా బీఎన్‌పీ పరిబాస్ మ్యూచువల్ ఫండ్ యొక్క పెట్టుబడిదారుల అవగాహన మరియు విద్యా కార్యక్రమం.

వన్ టైమ్ నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రక్రియ గురించి వివరాల కోసం, డాక్యుమెంటేషన్/విధానాలతో సహా, చిరునామా మార్పులు, బ్యాంక్ ఆదేశాలు, సెబీ పోర్టల్ లో ఫిర్యాదులు దాఖలు చేయడం, మొదలైనవి., దయచేసి https://www.barodabnpparibasmf.in/investor-centre/information-on-kyc ని సందర్శించండి. దయచేసి "మధ్యవర్తులు/మార్కెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్స్" కింద సెబీ వెబ్సైట్ (www.sebi.gov.in) లో ధృవీకరించగల రిజిస్టర్డ్ మ్యూచువల్ ఫండ్లతో మాత్రమే వ్యవహరించండి. పన్ను చిక్కుల యొక్క వ్యక్తిగత స్వభావం కారణంగా, ఈ పెట్టుబడులు పెట్టడానికి ముందు పెట్టుబడిదారులు తమ పన్ను సలహాదారులను సంప్రదించాలని అభ్యర్థిస్తున్నారు. బరోడా బీఎన్‌పీ పరిబాస్ మ్యూచువల్ ఫండ్కు సంబంధించిన అన్ని ఫిర్యాదులను service@barodabnpparibasmf.in కు పంపవచ్చు మరియు/లేదా www.scores.gov.in (సెబీ స్కోర్స్ పోర్టల్) ను సందర్శించవచ్చు. ఇన్వెస్టర్లు ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఓడీఆర్) పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదులను దాఖలు చేయవచ్చు. https://smartodr.in/login.

మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు మార్కెట్ ప్రమాదాలకు లోబడి ఉంటాయి, పథకానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్ లను జాగ్రత్తగా చదవండి.

ఈనాడు బిజినెస్

రష్యా చమురు కొనుగోలు ఆంక్షల నుంచి రిలయన్స్‌కు ఒక నెల మినహాయింపు!

రష్యా చమురు ఉత్పత్తి సంస్థ రాస్‌నెఫ్ట్ నుంచి, ముడిచమురు దిగుమతి చేసుకోవడాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనసాగించనుంది. రష్యా సంస్థల నుంచి చమురు కొనుగోలు చేసేవారిపై విధించిన ఆంక్షల నుంచి ఒక నెల పాటు రిలయన్స్‌కు అమెరికా మినహాయింపు ఇవ్వడం ఇందుకు నేపథ్యం. రాస్‌నెఫ్ట్‌పై అమెరికా ఆంక్షలు విధించిన నేపథ్యంలో, రిలయన్స్ మాత్రం ప్రత్యేక అనుమతులు పొందినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. రాస్‌నెఫ్ట్, ల్యూకాయిల్‌పై అక్టోబరులో అమెరికా ఆంక్షలు విధించింది. నవంబరు 21లోగా ఈ రెండు సంస్థలతో లావాదేవీలను నిలిపివేయాలని ప్రపంచ దేశాలను అమెరికా కోరింది. రోజుకు 5 లక్షల బారెళ్ల ముడిచమురును రాస్‌నెఫ్ట్ నుంచి కొనుగోలు చేయడానికి రిలయన్స్ గతంలోనే దీర్ఘకాల ఒప్పందం చేసుకుంది. దీనికి అనుగుణంగా, నవంబరు 22 తర్వాత కూడా రిలయన్స్ 15 కార్గోల రాస్‌నెఫ్ట్ చమురును పొందినట్లు కెప్లర్ గణాంకాలు చెబుతున్నాయి. ముందే జరిగిన ఒప్పందాల వల్ల ఈ సరఫరా జరిగినట్లు రిలయన్స్ స్పష్టం చేయగా, ఈ మినహాయింపుపై వ్యాఖ్యానించడానికి అమెరికా ఆర్థిక శాఖ నిరాకరించింది.


కొత్త తరం సెల్టోస్ కారును చూపుతున్న కియా ప్రతినిధులు

కొత్త తరం కియా సెల్టోస్ తయారీ ప్రారంభం

జనవరి 2న ధరల వెల్లడి

పెనుకొండ, న్యూస్‌టుడే: మధ్యశ్రేణి ఎస్‌యూవీ (స్పోర్ట్స్ వినియోగ వాహన) విభాగంలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేలా, కొత్త తరం సెల్టోస్ కారు వాణిజ్య తయారీని కియా ఇండియా ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ (శ్రీసత్యసాయి జిల్లా)లోని పరిశ్రమలో సరికొత్త కియా సెల్టోస్ కార్ల తయారీని ప్రారంభించినట్లు సంస్థ బుధవారం వెల్లడించింది. 4460 మి.మీ. పొడవు, 1830 మి.మీ.వెడల్పుతో, 2690 మి.మీ. పొడవైన వీల్‌బేస్‌తో, డిజిటల్ టైగర్‌ఫేస్, ఆటోమేటిక్ స్ట్రీమ్‌లైన్ డోర్ హ్యాండిల్స్, ఐస్‌క్యూబ్ ఎల్ఈడీ ప్రొజెక్షన్ లైట్లు, 75.18 సెం.మీ. ట్రినిటీ పనోరమిక్ డిస్‌ప్లే, ప్రీమియం బోస్ 8 స్పీకర్ ఆడియో సదుపాయాలతో రహదారి భద్రత - డ్రైవింగ్ నాణ్యతను మెరుగుపరిచేలా ఇండియా ఫస్ట్ గ్లోబల్ కే3ప్లాట్‌ఫాంపై ఈ కారును తయారు చేస్తున్నట్లు కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగు లీ వివరించారు. జనవరి 2న కారు ధరలు వెల్లడిస్తామని చెప్పారు.

ఎలక్ట్రానిక్స్ వ్యాపారంలోకి సునీల్ మిత్తల్

హైయర్ ఇండియాలో భారతీ ఎంటర్‌ప్రైజెస్, వార్‌బర్గ్ పింకస్‌కు 49% వాటా



WARBURG PINCUS bharti

భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్, వినియోగదారు ఎలక్ట్రానిక్స్ వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నారు. చైనా ఎలక్ట్రానిక్స్ సంస్థ హైయర్ గ్రూపు అనుబంధ కంపెనీ హైయర్ అప్లయన్సెస్ ఇండియాలో 49% వాటాను మిత్తల్ నేతృత్వంలోని భారతీ ఎంటర్‌ప్రైజెస్, అమెరికా ప్రైవేటు ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ సంయుక్తంగా కొనుగోలు చేయనున్నాయి. ఈ లావాదేవీ విలువ ఎంత అనేది వెల్లడించలేదు. అయితే పరిశ్రమ వర్గాల కథనం ప్రకారం ఈ లావాదేవీ విలువ 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.18,000 కోట్లు) ఉండొచ్చు. ఈ లావాదేవీ అనంతరమూ హైయర్ ఇండియాలో 49% వాటా, యాజమాన్య నియంత్రణ హైయర్ గ్రూపు చేతిలోనే ఉంటుంది. 49% వాటా కోసం తాము వ్యూహాత్మక పెట్టుబడులు మాత్రమే పెడుతున్నట్లు భారతీ ఎంటర్‌ప్రైజెస్, వార్‌బర్గ్ పింకస్ తెలిపాయి. మిగిలిన 2% వాటాను హైయర్ ఇండియా యాజమాన్య బృందం కలిగి ఉంటుంది. హైయర్ ఇండియా బోర్డులో కొత్త పెట్టుబడిదార్లకు స్థానం లభిస్తున్నా, ప్రస్తుత యాజమాన్య బృందమే సంస్థను నిర్వహించనుంది.

- హైయర్ ఇండియాలో వాటా కొనుగోలుకు సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ గ్రూపు, ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ప్రయత్నించినా, వీలు కాలేదు.

దక్షిణాదిలో కొత్త ప్లాంటు

2004 నుంచి మనదేశంలో హైయర్ ఇండియా కార్యకలాపాలు సాగిస్తోంది. 6,500కు పైగా విక్రయశాలల్లో ఈ సంస్థ ఉత్పత్తులు లభిస్తున్నాయి. హైయర్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల్లోనే కొత్త తయారీ ప్లాంటు పెట్టే యత్నాల్లో ఉంది. ఇక్కడ తయారు చేసే ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను దేశీయంగా విక్రయించడంతో పాటు, ఎగుమతి చేయాలనీ భావిస్తోంది. 2030 నాటికి దశలవారీగా ఈ ప్లాంటుపై రూ.3,500 కోట్లు పెట్టుబడి పెట్టే యోచనలోనూ హైయర్ ఉంది.

ఎలక్ట్రానిక్స్ విపణిలో పోటీ తీవ్రతరం

మనదేశంలో ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, ఎల్ఈడీలు, వాషింగ్ మెషీన్లు, కిచెన్ అప్లయెన్సెస్ విభాగాల్లో వివిధ ఉత్పత్తులను హైయర్ ఇండియా విక్రయిస్తోంది. తాజాగా వచ్చే పెట్టుబడులతో, ఎలక్ట్రానిక్స్ విపణిలో హైయర్ ఇండియా తయారీ, పోటీ సామర్థ్యం పెరగనున్నాయి. మనదేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మన్నికైన వినియోగ వస్తువుల రంగంలో, తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు హైయర్ ఇండియాకు ఈ పరిణామం ఉపయోగపడనుంది. స్థానిక అవసరాలకు అనుగుణమైన పరికరాలను దేశీయంగా తయారు చేసేందుకు, ఈ లావాదేవీ ఉపయోగపడుతుందని భారతీ ఎంటర్‌ప్రైజెస్, వార్‌బర్గ్ పింకస్ తెలిపాయి. పరికరాల ఆవిష్కరణ, తయారీ పరంగా అంతర్జాతీయంగా హైయర్‌కు ఉన్న అనుభవం, మనదేశంలో భారతీ ఎంటర్‌ప్రైజెస్‌కున్న బలమైన నెట్‌వర్క్, బ్రాండ్లను వినియోగదార్లకు చేరువ చేయడంలో వార్‌బర్గ్ పింకస్‌కు ఉన్న నైపుణ్యం తోడవుతాయని పేర్కొన్నాయి.

దేశీయ ఎలక్ట్రానిక్స్, అప్లయన్సెస్ విపణి 2030కి ప్రస్తుతం కంటే రెట్టింపు స్థాయి అయిన రూ.2 లక్షల కోట్లకు చేరుతుందనే అంచనాల నేపథ్యంలో, హైయర్ ఈ నిర్ణయం తీసుకుంది.

- గత ఏడేళ్లలో సగటున 25% వార్షిక వృద్ధిని హైయర్ ఇండియా సాధిస్తోంది.
- దేశీయంగా సైడ్‌బైసైడ్ డోర్ రిఫ్రిజిరేటర్ల విపణిలో తమ వాటా 21 శాతమని హైయర్ తెలిపింది.

పౌరవిమాన సేవల్లోకి మరో 4 సంస్థలు

- 2026 ప్రథమార్ధం నుంచి సర్వీసులు ప్రారంభించే అవకాశం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



ఈనాడు, దిల్లీ: దేశీయ విమాన ప్రయాణికుల విపణిలో అత్యధిక మార్కెట్‌వాటా ఉన్న ఇండిగో సేవల్లో ఇటీవల తలెత్తిన సమస్యల కారణంగా, లక్షలమంది ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడిన నేపథ్యంలో.. మరిన్ని విమానయాన సంస్థలను రంగంలోకి దింపడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శంఖ్ ఎయిర్, తెలుగు రాష్ట్రాలకు చెందిన ట్రూజెట్ సంస్థలకు షెడ్యూల్డ్ విమానాలు నడపడానికి ఎన్‌ఓసీ (నిరభ్యంతర పత్రం) జారీచేసిన కేంద్ర పౌరవిమానయానశాఖ, తాజాగా కేరళకు చెందిన అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ సంస్థలకూ నిరభ్యంతరపత్రం జారీచేసింది. ఈ విషయాన్ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. 'భారతీయ విమానయాన రంగం ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న మార్కెట్లలో ఒకటి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ప్రభుత్వం మరిన్ని విమానయాన సంస్థలను ప్రోత్సహించడానికి కృషిచేస్తోంది. ఉడాన్ పథకం ద్వారా స్టార్ ఎయిర్, ఇండియా వన్ ఎయిర్, ఫ్లై91 వంటి చిన్నవిమానయాన సంస్థలు దేశంలో ప్రాంతీయ అనుసంధానతను బలపర్చడంలో కీలకభూమిక పోషిస్తున్నాయి. ఈ రంగంలో ఇంకా విస్తృత అభివృద్ధికి అవకాశాలున్నాయి' అని పేర్కొన్నారు.

భోగాపురం కేంద్రంగా ట్రూజెట్ పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం (భోగాపురం)లో కొత్త విమానాశ్రయం ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో.. అక్కడి నుంచి పని చేయాలని ట్రూజెట్‌కు సూచించినట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గతంలో హైదరాబాద్ కేంద్రంగా ఈ సంస్థ కార్యకలాపాలు సాగించినా, తదుపరి సర్వీసులు నిలిచిపోయాయి. మళ్లీ విశాఖ కేంద్రంగా ప్రారంభం కానుంది. శంఖ్ ఎయిర్ ఉత్తర భారతదేశం కేంద్రంగా, అల్‌హింద్, ఫ్లైఎక్స్‌ప్రెస్‌లు దక్షిణాది కేంద్రంగా విమానాలు నడిపే అవకాశం ఉన్నట్లు చెప్పారు. 2026 తొలి ఆరునెలల్లో ఈ 4 సంస్థలు తమ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.

రోమ్‌కు ఎయిరిండియా విమానం: ఐరోపా దేశాలకు విమాన అనుసంధానాన్ని పెంచేందుకు రోమ్ (ఇటలీ)కు విమాన సర్వీసులను పునరుద్ధరిస్తున్నట్లు ఎయిరిండియా తెలిపింది. మార్చి 25 నుంచి వారానికి 4 విమాన సర్వీసులను నడపనుంది.

లండన్‌కు దిల్లీ నుంచి విమానం: **ఇండిగో** ముంబయి-లండన్ మధ్య రోజువారీ విమాన సర్వీసులు నిర్వహిస్తున్న ఇండిగో, 2026 ఫిబ్రవరి 2 నుంచి దిల్లీ-లండన్ (హీత్రూ)కు నేరుగా విమానాలు నిర్వహించనుంది. వారంలో 5 సర్వీసులు ఉంటాయి.

టెల్ అవీవ్ నుంచి దిల్లీ, ముంబయికి విమానాలు: ఇజ్‌రైర్

టెల్ అవీవ్ నుంచి దిల్లీ, ముంబయికి నేరుగా విమాన సర్వీసులు నిర్వహించేందుకు ఇజ్రాయెల్ విమానయాన సంస్థ ఇజ్‌రైర్ ముందుకొచ్చింది. అన్ని అనుమతులు కనుక లభిస్తే, 2026 ఏప్రిల్ నుంచే తాము సర్వీసులు ప్రారంభిస్తామని బుధవారం వెల్లడించింది.

జోస్ అలుక్కాస్ ప్రచారకర్త దుల్కర్ సల్మాన్



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్‌ను తమ ప్రచారకర్తగా నియమించుకున్నట్లు ఆభరణాల సంస్థ జోస్ అలుక్కాస్ వెల్లడించింది. ఆరు దశాబ్దాలుగా విశ్వసనీయ బ్రాండుగా నిలిచిన తమ సంస్థను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, వివిధ భాషా చిత్రాల్లో ప్రాచుర్యం ఉన్న దుల్కర్ భాగస్వామ్యం ఉపయోగ పడుతుందని జోస్ అలుక్కాస్ ఎండీ వర్గీస్ అలుక్కాస్ పేర్కొన్నారు. విస్తరణ పథంలో ఉన్న తమ బ్రాండుకు దుల్కర్ తోడయ్యారని ఎండీలు పాల్ అలుక్కాస్, జాన్ అలుక్కాస్ తెలిపారు.

కోడి గుడ్లు

25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	675	తూ/ప గోదావరి	695
వరంగల్	677	విశాఖపట్నం	702
విజయవాడ	720	చిత్తూరు	703

అపోలో హాస్పిటల్స్ వాటాదార్లకు అపోలో హెల్త్‌టెక్ షేర్లు

ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికకు స్టాక్ ఎక్స్ఛేంజీలు అనుమతి ఇచ్చాయి. ఫార్మసీ వ్యాపారాన్ని, డిజిటల్ హెల్త్‌కేర్ వ్యాపారాన్ని విడదీయాలని; అనుబంధ కంపెనీలైన అపోలో హెల్త్‌కో, కీమెడ్ లను అపోలో హెల్త్‌టెక్‌లో కలపాలని సంస్థ ప్రతిపాదించింది. దీనిపై బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి నిరభ్యంతర పత్రం జారీ అయినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఈ విలీనం తర్వాత అపోలో హెల్త్‌టెక్ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేస్తారు. దీనివల్ల అపోలో హాస్పిటల్స్ వాటాదార్లకు ప్రతి 100 షేర్లకు, 195.2 అపోలో హెల్త్‌టెక్ షేర్లు లభిస్తాయి. అపోలో హాస్పిటల్స్‌కు అపోలో హెల్త్‌టెక్‌లో 15% వాటా ఉంటుంది. అపోలో హెల్త్‌కో ఫార్మా ఉత్పత్తుల టోకు వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. దీనికింద అపోలో 24/7 డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఉంది. కీమెడ్ హోల్‌సేల్ ఫార్మా, హెల్త్‌కేర్, వెల్‌నెస్ ఉత్పత్తులను పంపిణీ చేస్తోంది. విలీనం తర్వాత అపోలో హెల్త్‌టెక్ కింద ఫార్మసీ పంపిణీ వ్యాపారం, డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ వ్యాపారాలుంటాయి.

త్వరిత చెక్ క్లియరెన్స్ వ్యవస్థ రెండో దశ అమలు వాయిదా

ముంబయి: వేగవంతంగా చెక్కులను క్లియర్ చేసే వ్యవస్థ రెండో దశ అమలును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వాయిదా వేసింది. బ్యాంకులు తమ కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకోవడానికి మరింత సమయం ఇచ్చింది. 'కంటిన్యువస్ క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ ఆన్ రియలైజేషన్ ఇన్ చెక్ ట్రంకేషన్ సిస్టమ్' రెండో దశ 2026 జనవరి 3 నుంచి అమలు కావాల్సి ఉంది. అక్టోబరు 4న ప్రారంభమైన తొలి దశ అమలులోనే సమస్యలు వచ్చిన సంగతి తెలిసిందే. అంతక్రితం రెండు పనిదినాల్లో జరుగుతూ వచ్చిన చెక్కు క్లియరెన్సులను, నూతన వ్యవస్థ తొలి దశలో కొద్ది గంటలకు తగ్గించారు. రెండో దశ కింద, చెక్కులను మూడు గంటల్లోగానే బ్యాంకులు క్లియర్ చేయాల్సి ఉంటుంది.

భారీ ఉపగ్రహ ప్రయోగంలో అనంత్ టెక్నాలజీస్ పరికరాలు

హైదరాబాద్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, బుధవారం చేపట్టిన భారీ ఉపగ్రహ ప్రయోగంలో, తాము కూడా భాగస్వామ్యం వహించినట్లు అనంత్ టెక్నాలజీస్ తెలిపింది. 6,100 కిలోల అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని, ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ ద్వారా విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ద్వారా, ఈ రంగంలో ఇస్రో విశ్వసనీయత మరోసారి రుజువైందని అనంత టెక్నాలజీస్ ఛైర్మన్ సుబ్బారావు పావులూరి పేర్కొన్నారు. ఈ ప్రయోగం కోసం కీలకమైన ఫ్లైట్ హార్డ్‌వేర్, ఏవియానిక్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్, ప్రెసిషన్ సబ్ సిస్టమ్స్‌ను తాము సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఇందులో పవర్ మాడ్యూళ్లు, కమాండ్ మాడ్యూళ్లు, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, సెన్సర్ ఇంటర్‌ఫేస్ యూనిట్లు ఉన్నాయని వివరించారు.

క్యాస్ట్రోల్‌లో 65% వాటా విక్రయం

విలువ రూ.54,000 కోట్లు ● బీపీ అంగీకారం



ముంబయి: లూబ్రికెంట్లు తయారు చేసే క్యాస్ట్రోల్ ఇండియా మాతృసంస్థ, బ్రిటన్‌కు చెందిన క్యాస్ట్రోల్‌లో 65% వాటా విక్రయించడానికి బ్రిటన్ ఇంధన సంస్థ బీపీ అంగీకరించింది. అంతర్జాతీయ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ స్టోన్‌పీక్‌కు ఈ వాటా విక్రయిస్తామని తెలిపింది. క్యాస్ట్రోల్ కంపెనీ విలువను 10.10 బిలియన్ డాలర్లు (సుమారు రూ.90,900 కోట్లు)గా పరిగణించి ఈ లావాదేవీ నిర్వహించనున్నారు. ఈ విక్రయంతో బీపీకి 6 బి. డాలర్ల (రూ.54,000 కోట్ల) వరకు వస్తాయి. 2026 చివరికల్లా ఒప్పందం పూర్తవుతుందని బీపీ భావిస్తోంది. క్యాస్ట్రోల్‌కు చెందిన మైనారిటీ వాటాలు (1.8 బి. డాలర్లు) కూడా ఈ లావాదేవీలో భాగమే. ఇందులో ఎక్కువ భాగం క్యాస్ట్రోల్ ఇండియా నుంచి వస్తుండడం గమనార్హం. సెప్టెంబరు త్రైమాసికం చివరకు క్యాస్ట్రోల్‌కు క్యాస్ట్రోల్ ఇండియాలో 51% వాటా ఉంది. ఈ లావాదేవీ తర్వాత స్టోన్‌పీక్‌కు 65%, బీపీకి 35% వాటాలతో కొత్త సంయుక్త సంస్థ ఏర్పాటు కానుంది. రెండేళ్ల లాక్ ఇన్ గడువు ముగిశాక, క్యాస్ట్రోల్‌లో తనకున్న 35% వాటాను బీపీ విక్రయించేందుకు వీలుంది.

బొగ్గు గనుల బిడ్లలో యాక్సిస్ ఎనర్జీ, రిలయన్స్‌కు అగ్రస్థానం

దిల్లీ: వేలానికి ఉంచిన బొగ్గు గనుల కోసం దాఖలు చేసిన బిడ్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న యాక్సిస్ ఎనర్జీ అగ్రస్థానంలో నిలిచాయి. ఈ రెండు సంస్థలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 17 బ్లాకుల కోసం సంయుక్తంగా బిడ్ చేశాయి. పెన్నా ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ ఒడిశాలోని ఒక బ్లాక్ కోసం బిడ్ దాఖలు చేసింది. ఎన్ఆర్ఎస్‌కే మైన్స్ అండ్ మినరల్స్, క్యాలిబర్ మైనింగ్ అండ్ లాజిస్టిక్స్, సాయి సూర్య ప్రొఫెషనల్ సర్వీసెస్, సింగరేణి కాలరీస్ కంపెనీ- తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్, ఎంఎంపీఎల్ కమర్షియల్ మైన్స్- మెహిత్ మినరల్స్ కూడా బిడ్లు వేశాయి. కేంద్ర ప్రభుత్వం మొత్తం 41 బొగ్గు గనుల వేలం కోసం ప్రకటన జారీ చేసింది. ఇందులో 21 గనులు భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్‌కు అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారించారు.

ఇండిగో టికెట్ల రద్దుపై కేంద్రానికి 100 ఫిర్యాదులు



దిల్లీ: ఇండిగో విమాన టికెట్ల రద్దుపై 100 వరకు ఫిర్యాదులను తమ శాఖ అందుకున్నట్లు, వాటిని విమాన నియంత్రణాధికార సంస్థకు పంపినట్లు వినియోగదారు వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే పేర్కొన్నారు. టికెట్ల రద్దు, రిఫండ్, పరిహార క్లెయిములకు సంబంధించి నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్)కు ఇవి రాగా, ప్రభుత్వ విమాన ప్రయాణ ఫిర్యాదుల ప్లాట్‌ఫాం అయిన 'ఎయిర్‌సేవ'కు బదిలీ చేసినట్లు ఖరే తెలిపారు. పౌర విమానయాన రంగాన్ని పర్యవేక్షిస్తున్న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, పౌర విమానయాన శాఖలు ఈ ఫిర్యాదులను పరిష్కరిస్తాయని ఆమె స్పష్టం చేశారు. న్యాయ వివాదాలకు తావుండే కేసులను ఇజాగృతి (ప్రభుత్వ వినియోగదారు ఫిర్యాదుల పోర్టల్)కు పంపినట్లు వివరించారు.

నెమ్మదించిన స్థిరాస్తి లావాదేవీలు

- కార్యాలయ లీజు కూడా
- ప్రాప్ ఈక్విటీ

దిల్లీ: ఈ ఏడాది అక్టోబరు- డిసెంబరులో హైదరాబాద్‌లో ఇళ్ల/ఫ్లాట్ల విక్రయాలు 11,323లకు పరిమితమవుతున్నాయని స్థిరాస్తి విశ్లేషణా సంస్థ ప్రాప్ ఈక్విటీ తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసిక అమ్మకాలు 13,902తో పోలిస్తే ఈసారి 19% తగ్గాయంది. హైదరాబాద్ సహా దేశంలోని 9 నగరాల్లో ఇళ్ల విక్రయాలు నాలుగో త్రైమాసికంలో 98,019గా నమోదు కావచ్చని సంస్థ తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో అమ్ముడైన 1,16,137 ఇళ్లతో పోలిస్తే, ఇవి 16% తక్కువ. 2021 జులై-సెప్టెంబరు త్రైమాసికం నుంచి అతి తక్కువ విక్రయాలు నమోదైన త్రైమాసికం ఇదేనని పేర్కొంది. గిరాకీ క్షీణించడంతో పాటు సంస్థలు కొత్త నిర్మాణాలను తగ్గించడమూ దీనికి కారణమని వివరించింది.



కార్యాలయ లీజు (లక్షల చదరపు అడుగుల్లో)

నగరం	2025	2024	వృద్ధి/ క్షీణత(%)
హైదరాబాద్	101	125	- 19
ముంబయి	9.5	10	-5
బెంగళూరు	22.1	21.7	2
చెన్నై	9.6	6.8	41
దిల్లీ-ఎన్‌సీఆర్	11.3	9.7	16
కోల్‌కతా	1.1	0.8	38
పుణె	7.8	5.7	37

- కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్లు కూడా 98,664 నుంచి 10% తగ్గి 88,427గా నిలవవచ్చని అంచనా వేసింది.
- హైదరాబాద్‌లో కార్యాలయాల లీజు గత ఏడాది 125 లక్షల చదరపు అడుగుల మేర ఉండగా, ఈ ఏడాది 19% తగ్గి, 101 లక్షల చదరపు అడుగులకు చేరనుందని స్థిరాస్తి కన్సల్టెంట్ కొలియర్స్ తెలిపింది. దేశంలోని 7 ప్రధాన నగరాలన్నింటినీ కలిపితే మాత్రం, కార్పొరేట్ సంస్థల నుంచి పెరిగిన గిరాకీ కారణంగా..కార్యాలయాల లీజు 6% పెరగనున్నట్లు వెల్లడించింది. గ్రేడ్-ఏ కార్యాలయాల స్థలాల లీజు 715 లక్షల చదరపు అడుగులకు పెరగనున్నట్లు పేర్కొంది. విదేశీ సంస్థలు తమ కార్యాలయాలను నెలకొల్పేందుకు మన దేశ నగరాలను ఎంచుకుంటున్నాయని వివరించింది.
- హైదరాబాద్, ముంబయిలలో గిరాకీ తగ్గితే.. చెన్నై, బెంగళూరు, పుణె, కోల్‌కతా, దిల్లీ-ఎన్‌సీఆర్‌లలో అధికమైందని వెల్లడించింది.

అక్టోబరు-డిసెంబరులో ఇళ్ల విక్రయాలు

నగరం	2025-26	2024-25	వృద్ధి/ క్షీణత(%)
హైదరాబాద్	11,323	13,902	-19
బెంగళూరు	15,603	15,782	-1
చెన్నై	4,542	4,688	-3
కోల్‌కతా	3,995	4,497	-11
ముంబయి	9,135	13,902	-25
థానే	16,987	22,817	-26
పుణె	15,788	22,817	-31
నవీ-ముంబయి	8,434	7,496	13
దిల్లీ-ఎన్‌సీఆర్	12,212	11,792	4

సూచీలకు కొనసాగిన నష్టాలు

ఇంధనం, ఐటీ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ ▼ 116 **85409**

నిఫ్టీ ▼ 35 **26142**

ఎఫ్ఐఐ అమ్మకాలు..రూ.1721.26 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు..రూ.2381.34 కోట్లు



సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ఇంధనం, ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురవ్వడం, విదేశీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, రూపాయి విలువ తగ్గడమూ మదుపర్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 8 పైసలు తగ్గి 89.71 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.08% పెరిగి 62.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

- బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.70,000 కోట్లు తగ్గి రూ.475 లక్షల కోట్ల (5.29 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

లాభాల్లో మొదలైనా..

బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,524.84) స్వల్ప లాభాల్లో 85,533.11 పాయింట్ల వద్ద ఆరంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుని, ఒక దశలో 85,342.19 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 116.14 పాయింట్ల నష్టంతో 85,408.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 35.05 పాయింట్లు కోల్పోయి 26,142.10 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,123 వద్ద కనిష్ఠాన్ని; 26,236.40 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది.

నేడు మార్కెట్లకు సెలవు

క్రిస్మస్ సందర్భంగా నేడు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లకు సెలవు. కమొడిటీస్, కరెన్సీ మార్కెట్లు కూడా పనిచేయవు.

14 మినహా మిగతావి నష్టాల్లో

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 14 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టీఎంపీవీ 1.05%, సన్‌ఫార్మా 1.01%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82%, ఏషియన్ పెయింట్స్ 0.81% నష్టపోయాయి. ట్రెంట్ 2.36%, మారుతీ సుజుకీ 0.79%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.73%, పవర్ గ్రిడ్ 0.45%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.35% లాభపడ్డాయి.

- క్యాస్ట్రోల్‌లో 65% వాటాను స్టోన్‌పీక్‌కు విక్రయించనున్నట్లు బీపీ పీఎల్‌సీ వెల్లడించడంతో బుధవారం ట్రేడింగ్ ఆరంభంలో క్యాస్ట్రాల్ ఇండియా షేరు 8.9% పెరిగి రూ.202.50 వద్ద ఇంట్రాడే గరిష్ఠానికి చేరింది. చివరకు 1.99% లాభంతో రూ.189.60 వద్ద ముగిసింది.
- డెరివేటివ్స్ విభాగంలో అకౌంటింగ్ అవకతవకలకు సంబంధించి **ఇండస్ఇండ్ బ్యాంక్‌**పై దర్యాప్తును సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) ప్రారంభించింది.
- 2031-32 ఆర్థిక సంవత్సరం నాటికి విద్యుదుత్పత్తి సామర్థ్య లక్ష్యాన్ని 41.87 గిగావాట్లకు పెంచుకోవాలన్నది **అదానీ పవర్** ప్రణాళిక. మూలధన వ్యయంగా రూ.2 లక్షల కోట్లు చేస్తామని తెలిపింది.
- **గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ లిమిటెడ్** తొలి పబ్లిక్ ఆఫర్ చివరి రోజుకు 5.21 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలో 19.04 రెట్లు అధికంగా బిడ్లు దాఖలయ్యాయి.

అనిల్ అంబానీకి ఊరట

3 బ్యాంకుల చర్యలపై హైకోర్టు స్టే



ముంబయి: అనిల్ అంబానీ, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఖాతాలను 'మోసపూరితమైనవి'గా వర్గీకరించి, 3 బ్యాంకుల కన్సార్షియం చేపడుతున్న, చేపట్టబోయే అన్ని చర్యలపై బాంబే హైకోర్టు స్టే ఇచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల ఉల్లంఘన కిందకు ఇది వస్తుందని తెలిపింది. కొన్నేళ్ల తర్వాత బ్యాంకులు మేల్కొన్న 'క్లాసిక్ కేస్' ఇదని కోర్టు పేర్కొంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐఓబీ), ఐడీబీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) చేపడుతున్న ప్రస్తుత చర్యలు, భవిష్యత్తులో చేపట్టబోయే చర్యలపైనా కోర్టు స్టే ఇస్తూ అనిల్ అంబానీ, ఆయన కంపెనీకి మధ్యంతర ఊరట కల్పించింది. తప్పులున్న ఫోరెన్సిక్ ఆడిట్ ఆధారంగా బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయని, రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాలనూ ఉల్లంఘించాయని న్యాయమూర్తి జస్టిస్ మిలింద్ జాధవ్ పేర్కొన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్‌పై ఒక చార్టర్డ్ అకౌంటెంట్(సీఏ) సంతకం కూడా లేనందున, దాని ఆధారంగా కఠిన చర్యలు తీసుకోరాదని పేర్కొంటూ, 2020 అక్టోబరు నాటి బీడీఓ ఎల్ఎల్‌పీ ఆడిట్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి కోర్టు నిరాకరించింది.

కొలరాడో స్కూల్ ఆఫ్ మైన్స్‌తో ఎన్ఎండీసీ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వరంగ గనుల సంస్థ ఎన్ఎండీసీ అమెరికాలోని కొలరాడో స్కూల్ ఆఫ్ మైన్స్‌తో ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ప్రధానంగా మైనింగ్, మినరల్ ప్రాసెసింగ్, మెటలర్జీ, గనుల విభాగంలో ఏఐ/ఎంఎల్ (కృత్రిమమేధ/యాంత్రీకరణ)పై పరిశోధనలు నిర్వహించడం కోసం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎన్ఎండీసీ వెల్లడించింది.

ఇంపీరియన్ కార్స్‌కు తెలుగు రాష్ట్రాల్లో ఆడి ఇండియా డీలర్‌షిప్‌లు

దిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆడి కార్ల రిటెయిల్ విక్రయాలను పాపులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ లిమిటెడ్‌కు స్టెప్-డౌన్ సబ్సిడరీ సంస్థ ఇంపీరియన్ కార్స్ చేపట్టనుంది. ఇందుకోసం ఆడి ఇండియా నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ అయినట్లు పాపులర్ వెహికల్స్ వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లో 5 టచ్ పాయింట్లను ఈ సంస్థ ఏర్పాటు చేస్తుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలోని డీలర్ షిప్‌లకు ఇవి అదనం.

కాలిఫోర్నియాలో 30 మంది భారతీయుల అరెస్టు

న్యూయార్క్: అమెరికాలో అక్రమంగా నివసిస్తూ వాణిజ్య డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుని ట్రక్కులు నడుపుతున్న 30 మంది భారతీయులను సరిహద్దు గస్తీ అధికారులు అరెస్టు చేశారు. కాలిఫోర్నియాలోని ఎల్ సెంట్రో సెక్టార్‌లో మొత్తం 49 మందిని అరెస్టు చేయగా అందులో 30 మందిని భారతీయులుగా గుర్తించారు. ఇమ్మిగ్రేషన్ తనిఖీ పాయింట్లతోపాటు ఇంటర్ ఏజెన్సీ ఆపరేషన్లలో నవంబరు 23 నుంచి డిసెంబరు 12 మధ్య వీరిని అరెస్టు చేసినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) గతవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. మిగిలిన వారిలో ఎల్‌సాల్వడార్, చైనా, ఎరిత్రియా, హైతీ, హోండురస్, మెక్సికో, రష్యా, సోమాలియా, తుర్కియే, ఉక్రెయిన్ దేశాలకు చెందినవారున్నారు. 31 మందికి కాలిఫోర్నియాలోనే డ్రైవింగ్ లైసెన్సులు జారీ అయ్యాయి. మిగిలిన వారు ఫ్లోరిడా, ఇల్లినాయిస్, ఇండియానా, ఒహాయో, మేరీలాండ్, మిన్నెసోటా, న్యూజెర్సీ, న్యూయార్క్, పెన్సిల్వేనియా, వాషింగ్టన్ రాష్ట్రాల్లో డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నారు. ఇటీవల అక్రమ వలసదారుల కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో ఈ ఆపరేషన్ చేపట్టారు.

కుటుంబ అనుబంధాలతోనే ఆనందం

శారీరక దారుఢ్యం, సంపద, పరపతి ద్వారా జీవితంలో మీకు ఆనందం, సంతృప్తి లభించే అవకాశం అతి స్వల్పం. మీ కుటుంబం, స్నేహితులతో మీకు ఉండే ఆత్మీయానుబంధాలతోనే సంతోషం, సంతృప్తి లభిస్తాయి. కాబట్టి వాటిని అశ్రద్ధ చేయకండి.

– సిమ్ లాండ్, ఆంత్రోపాలజిస్టు

'ధురంధర్'లుగా దూసుకుపోండి



ఉద్యోగికి కారు తాళాలు అందజేస్తున్న ఎం.కె.భాటియా

చండీగఢ్‌కు చెందిన 'మిట్స్ నేచురా లిమిటెడ్' ఔషధ తయారీ సంస్థ యజమాని ఎం.కె.భాటియా తన సంస్థలో పనిచేసే ఉద్యోగులకు మళ్లీ ఆశ్చర్యకరమైన కానుకలు ఇచ్చారు. ఈ ఏడాది దీపావళికి 51 మంది సిబ్బందికి కార్లు బహుమతిగా ఇచ్చిన ఆయన.. తాజాగా క్రిస్మస్, నూతన సంవత్సరాది వేళ మరో ఆరుగురికి కొత్త కార్ల తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా భాటియా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పనిలో 'ధురంధర్ (అగ్రగాములు)'గా మారాలని పిలుపునిచ్చారు.

ఈటీవీ భారత్

వావ్! నడిచే కేఫే



ఇంటర్నెట్ డెస్క్: నిల్చున్నచోటే వేడి వేడి కాఫీ తయారు చేసి ఇస్తున్న ఓ యువకుడి వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపిస్తున్న ఈ వీడియోలో.. ఆ యువకుడు ప్రత్యేకంగా రూపొందించిన ఓ బ్యాగును వీపుకు తగిలించుకున్నాడు. కాఫీ పొడి, పాలపొడి, చక్కెర డబ్బా, ఫ్లాస్కులో వేడినీళ్లు, పేపర్ గ్లాసులు తదితర సామగ్రి అందులో అమర్చాడు. అవసరమైన పదార్థాలన్నీ ఒక్కొక్కటిగా వరుసగా తీసి.. పేపర్ గ్లాసులో వేసి కాఫీ తయారు చేయడం, చివరగా దానిపై చాక్లెట్ సాస్‌తో అలంకరణ చేసి ఇవ్వడం వీడియోలో కనిపిస్తోంది. స్టాల్ వంటివి అవసరం లేకుండా.. ఉన్న చోటే త్వరత్వరగా కమ్మని కాఫీ అందించే అతడి నైపుణ్యం బాగుందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

ఆ రెండింటిపై తప్ప.. అన్నింటిపై ఏకాభిప్రాయం

- యుద్ధం ముగింపుపై ఉక్రెయిన్, అమెరికా చర్చల్లో భారీ పురోగతి
- ఇక బంతి పుతిన్ కోర్టులోనే ఉందన్న జెలెన్‌స్కీ



జెలెన్‌స్కీ

కీవ్: రష్యాతో యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా, ఉక్రెయిన్‌ల మధ్య జరుగుతున్న చర్చలు కీలక పురోగతి సాధించాయి. పలు కీలక అంశాల్లో వాటి మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఒక్క ప్రాంతాల నియంత్రణతోపాటు జపోరిజియా అణు విద్యుత్తు ప్లాంటు నిర్వహణపైనే ఏకాభిప్రాయం సాధించాల్సి ఉంది. మిగతా చాలా అంశాలు అంగీకరించాను, ఇక రష్యా అధ్యక్షుడు బంతి పుతిన్ కోర్టులోనే ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. దీంతో నాలుగేళ్లగా కొనసాగుతున్న యుద్ధం ముగిసే అవకాశాలకు మార్గం సుగమమైందని భావిస్తున్నారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఇటీవల సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం మంగళవారం జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడారు. ఏకాభిప్రాయం సాధించిన ఒక్కో అంశాన్నీ వివరించారు.

స్వేచ్ఛా ప్రాంతంగా..

డాన్‌బాస్ అని పిలిచే డొనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాల ఆధిపత్యంపైనే వివాదం ఉంది. ఇది అత్యంత క్లిష్టమైన అంశమని, నేతల స్థాయిలోనే చర్చిస్తామని జెలెన్‌స్కీ తెలిపారు. అయితే ఈ ప్రాంతంపై పూర్తి ఆధిపత్యం కావాలని రష్యా డిమాండు చేస్తోంది. ఇందులో కొంత ప్రాంతం ఇంకా ఉక్రెయిన్ ఆధీనంలోనే ఉంది. ఈ కారణంగా రష్యా డిమాండును ఉక్రెయిన్ తిరస్కరిస్తోంది. దీనికి అమెరికా ఒక పరిష్కారం సూచిస్తోంది. స్వేచ్ఛా ఆర్థిక ప్రాంతంగా దీనిని మార్చుదామని అంటోంది. అయితే దానిని రెఫరెండం ఆధారంగా నిర్ణయించాలని, ఉక్రెయిన్ ప్రజలు వారి భవిష్యత్తును వారే నిర్ణయించుకుంటారని జెలెన్‌స్కీ అంటున్నారు.

■ జపోరిజియాలో అతి పెద్దదైన జపోరిజియా అణు విద్యుత్తు కేంద్రాన్ని రష్యా, ఉక్రెయిన్‌ల కన్సార్షియం ఏర్పాటు చేసి నిర్వహించాలని అమెరికా ప్రతిపాదించింది. ఇద్దరికీ సమాన భాగస్వామ్యం ఉండేలా చూస్తామని పేర్కొంది. కానీ ప్రస్తుతం రష్యా ఆధీనంలో ఉన్న ఈ విద్యుత్తు కేంద్రంపై కన్సార్షియాన్ని ఉక్రెయిన్ వ్యతిరేకిస్తోంది.

■ ఈ రెండు అంశాలపై ఏకాభిప్రాయం రాలేదని జెలెన్‌స్కీ తెలిపారు. ఇవి తప్ప మిగిలిన అన్ని అంశాల్లో దాదాపు ఏకాభిప్రాయం సాధించామని వెల్లడించారు.

అమెరికాను దూరం పెట్టడానికే భారత్‌తో చైనా బంధం

పెంటగాన్ నివేదిక

న్యూయార్క్: వాస్తవాధీన రేఖ వెంట ఉద్రిక్తతలను తగ్గించుకోవడం ద్వారా భారత్‌తో బంధాన్ని స్థిరీకరించుకోవడంతోపాటు అమెరికాకు ఆ దేశం దగ్గర కాకుండా చూడాలన్నదే చైనా ఉద్దేశమని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ నివేదిక వెల్లడించింది. అయితే చైనా చర్యలు, ఉద్దేశాలను భారత్ అనుమానిస్తూనే ఉంటుందని, రెండు దేశాల మధ్య అపనమ్మకం కొనసాగుతుందని, ద్వైపాక్షిక సంబంధాలు పరిమితంగానే ఉంటాయని అభిప్రాయపడింది. మరోవైపు భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌ను రాజీపడని ప్రయోజనాల్లో ఒకటిగా చైనా భావిస్తోందని అమెరికా కాంగ్రెస్‌కు పెంటగాన్ ఇచ్చిన ఈ నివేదిక పేర్కొంది. 2024 అక్టోబరులో భారత్, చైనాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని ఇందులో ప్రస్తావించింది.

■ పాకిస్థాన్‌తో రక్షణ, అంతరిక్ష రంగాల్లో బంధాన్ని చైనా బలోపేతం చేసుకుంటోందని పెంటగాన్ వెల్లడించింది. పాక్‌లో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసే దిశగా ఆలోచిస్తోందని వివరించింది. ఇంకా అంగోలా, బంగ్లాదేశ్, మయన్మార్, క్యూబా, ఈక్వెటోరియల్ గినీ, ఇండోనేసియా, కెన్యా, మొజాంబిక్, నమీబియా, నైజీరియా, పపువా న్యూ గినీ, సీషెల్స్, సాల్మన్ ఐలాండ్స్, శ్రీలంక, తజికిస్థాన్, థాయ్‌లాండ్, టాంజానియా, యూఏఈ, వనవటులలోనూ స్థావరాలను ఏర్పాటు చేయాలనుకుంటోందని తెలిపింది.

ఉన్నావ్ బాధితురాలి తల్లిపై దాష్టీకం

- కదులుతున్న బస్సు నుంచి దూకాల్సిన పరిస్థితి
- నిరసనలు చేపట్టకుండా అడ్డుకున్న బలగాలు
- కోర్టు నిర్ణయం మాకు మరణశాసనమే: బాధితులు



బాధితురాలి తల్లిని బలవంతంగా తరలిస్తున్న పోలీసులు

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార ఘటనలో నిందితుడి శిక్షను దిల్లీ హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేయడంపై బాధితురాలు, ఆమె తల్లి చేపట్టిన నిరసన పలు పరిణామాలకు దారితీసింది. తమ న్యాయవాదిని, మీడియాను కలిసేందుకు వీరు చేసిన ప్రయత్నాలను భద్రతాబలగాలు అడ్డుకున్నాయి. వారిని తరలిస్తున్న బస్సు నుంచి బాధితురాలి తల్లి కిందికి దూకాల్సిన పరిస్థితి తలెత్తింది. నిందితుడికి శిక్ష నిలిపివేత తమకు మరణశాసనమేనని తల్లీకుమార్తె భయాందోళన వ్యక్తంచేశారు. నిందితుడు కుల్దీప్‌సింగ్ సెంగర్‌కు జైలు శిక్షను నిలిపివేయడంపై మహిళా హక్కుల ఉద్యమకర్త యోగితా భయానాతో కలిసి మంగళవారం రాత్రి వీరిద్దరు ఇండియాగేట్ ఎదుట నిరసన చేపట్టారు. న్యాయవాదిని కలిసేందుకు ఇంటి నుంచి బయల్దేరిన తనను సీఆర్పీఎఫ్ బలగాలు అడ్డుకుని, తిరిగి వెనక్కి పంపించేందుకు ప్రయత్నించాయని, బస్సులోనుంచి గట్టిగా అరవడంతో చివరకు లాయర్ వద్దకు తీసుకెళ్లేందుకు బలగాలకు ఆదేశాలు వచ్చాయని బాధితురాలి తల్లి చెప్పారు. తోపులాటలో బాధితురాలు గాయపడినట్లు భయానా తెలిపారు. బస్సు దిగేందుకు బాధితురాలి తల్లిని సీఆర్పీఎఫ్ అనుమతించలేదు. ఆమెను చేతులతో తోస్తూ కదులుతున్న బస్సులోంచి కిందకు దూకాలని ఆదేశించినట్టు కనిపించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దాంతో ఆమె దూకేయగా, బాధితురాలితో బస్సు వెళ్లిపోయింది. తమను బలవంతంగా, కర్కశంగా పంపేస్తారని ఆ తల్లి రోడ్డుపైనే విలపించిన వీడియో వైరల్‌గా మారింది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని వారు కలిసి ఆవేదనను పంచుకున్నారు. సెంగర్‌కు విధించిన శిక్షను హైకోర్టు నిలిపివేయడంపై సుప్రీంకోర్టులో తక్షణం సవాల్ చేయాలని సీబీఐ నిర్ణయించిందని అధికారులు తెలిపారు.

నేడు లఖ్‌నవూలో జాతీయ స్మారకాన్ని ప్రారంభించనున్న ప్రధాని

- శ్యామాప్రసాద్, దీన్‌దయాళ్, వాజ్‌పేయీ విగ్రహాలతో ఏర్పాటు

దిల్లీ: ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో గురువారం జాతీయ స్మారకాన్ని, ప్రాంగణాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దేశానికి సేవలందించిన శ్యామాప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీల 65 అడుగుల ఎత్తైన విగ్రహాలను ఇందులో ఏర్పాటు చేశారు. వాటితోపాటు మ్యూజియాన్ని నిర్మించారు. రూ. 230 కోట్లతో 65 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేశారు. గురువారం దివంగత ప్రధాని వాజ్‌పేయీ 101వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లఖ్‌నవూలో రాష్ట్రీయ ప్రేరణా స్థల్‌ను ప్రారంభించనుండటం గర్వకారణంగా భావిస్తున్నానని ప్రధాని బుధవారం పేర్కొన్నారు.

■ వాజ్‌పేయీ జయంతి గురువారం జరగనున్న నేపథ్యంలో బుధవారం దిల్లీలోని భాజపా కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఆయనకు నివాళులర్పించారు. పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, జేపీ నడ్డాసహా పలువురు భాజపా నేతలు ఇందులో పాల్గొన్నారు.



లఖ్‌నవూలోని రాష్ట్రీయ ప్రేరణా స్థల్‌లో విగ్రహాలు

చేతులు కలిపిన ఠాక్రేలు

- స్థానిక ఎన్నికల్లో కలిసి పోటీ




విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే

ముంబయి: బృహన్‌ముంబయి సహా మహారాష్ట్రలోని 28 నగరపాలక సంస్థలకి జనవరి 15న ఎన్నికలు జరగనున్న తరుణంలో శివసేన (యూబీటీ) అధిపతి ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే చేతులు కలిపారు. ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. మరాఠీలు, మహారాష్ట్ర ప్రయోజనాల కోసం తాము ఒక్కటయ్యామని, బీఎంసీ మేయర్ పీఠం తమదేనని సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఇతర పురపాలక సంఘాల్లోనూ పొత్తుపై చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. భాజపాలో జరుగుతున్నదానిని భరించలేకపోతున్నవారు తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశానికి ఒకే వాహనంలో వచ్చిన ఠాక్రే సోదరులు.. తొలుత శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే స్మారకం వద్ద నివాళులర్పించారు.

గుత్తాధిపత్యానికి స్వేచ్ఛనిచ్చిన ప్రభుత్వం

- చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం
- రాహుల్ గాంధీ విమర్శ



వైశ్య వర్గానికి చెందిన ప్రతినిధులతో రాహుల్

దిల్లీ: కొందరి గుత్తాధిపత్యానికి ప్రభుత్వం స్వేచ్ఛనివ్వడంతో చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతోందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా బ్యూరోక్రసీ సంకెళ్లతో వారిని బంధిస్తోందని, జీఎస్టీవంటి తప్పుడు విధానాలతో అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. సహజంగా వ్యాపార రంగంలో ఉండే వైశ్య వర్గానికి చెందిన ప్రతినిధులతో ఆయన ఇటీవల సమావేశమయ్యారు. ఆయనను కలిసిన వారిలో పాదరక్షలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ తయారీ, కాగితం, స్టేషనరీ, రవాణా, స్టోన్ క్రషింగ్, కెమికల్స్, హార్డ్‌వేర్ రంగాలకు చెందిన వ్యాపారులున్నారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాహుల్‌కు వారు వివరించారు. 'తమ వ్యాపారాలు కుప్పకూలే స్థితిలో ఉన్నాయని వైశ్య వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇది నిజంగా నన్ను కదిలించింది. వారు ఎంతోకాలంగా దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తూ వస్తున్నారు. అలాంటివారు నిరాశలో ఉన్నారు. ఇది ప్రమాద సంకేతాలను మోగిస్తోంది' అని రాహుల్ బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. గుత్తాధిపత్యం అనేది ప్రభుత్వ విధాన నిర్ణయ లోపమే కాదని, ఉత్పత్తి, ఉపాధి, దేశ భవిష్యత్తుపై నేరుగా చేస్తున్న దాడి అని వ్యాఖ్యానించారు. 'భాజపా ఫ్యూడల్ మైండ్‌సెట్‌కు వ్యతిరేకంగా వైశ్య వర్గం పోరాటం చేస్తోంది. ఈ పోరాటంలో నేను వారికి అండగా నిలుస్తా' అని రాహుల్ పేర్కొన్నారు.

తుర్కియేలో విమాన ప్రమాదం..

లిబియా మిలిటరీ చీఫ్ మృతి

- ప్రాణాలు కోల్పోయిన మరో ఏడుగురు




అల్ హద్దాద్

అంకారా: తుర్కియేలో చోటుచేసుకున్న విమాన ప్రమాదంలో లిబియా సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ముహమ్మద్ అలీ అహ్మద్ అల్ హద్దాద్ మరణించారు. ఆయనతోపాటు నలుగురు సైన్యాధికారులు, ముగ్గురు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. సాంకేతిక సమస్యల కారణంగా విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే కూలిపోయిందని లిబియా అధికారులు ధ్రువీకరించారు. తుర్కియే, లిబియాల మధ్య సైనిక సహకారం పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చల్లో పాల్గొన్న అనంతరం స్వదేశానికి ఓ ప్రైవేటు జెట్ విమానంలో పయనమైన అల్ హద్దాద్ ఈ ప్రమాదంలో మృతి చెందడంపై లిబియా దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. లిబియా ప్రధాని అబ్దుల్ హమీద్ ద్బెయిబా దీన్ని ఒక విషాదకర పరిణామంగా అభివర్ణించారు. పశ్చిమ లిబియాకు చెందిన అల్ హద్దాద్ రెండుగా చీలిపోయిన తమ దేశ సైన్యాన్ని ఏకం చేయడానికి విశేషంగా కృషి చేశారు. లిబియా పదాతి దళాల ప్రధానాధికారి జనరల్ అల్ ఫితూరీ ఘ్రైబిల్, సైనిక ఉత్పాదక విభాగం అధినేత బ్రిగేడియర్ జనరల్ మహమూద్ అల్ ఖతావి, సైనిక దళాల ప్రధానాధికారికి సలహాదారుగా ఉన్న మొహమ్మద్ అసావి దియాబ్, సైనిక ఫొటోగ్రాఫర్ మొహమ్మద్ ఒమర్ అహ్మద్ మహజూబ్‌లు కూడా ఈ ప్రమాదంలో మృతిచెందారు. గాల్లోకి ఎగిరిన కొద్ది సేపటికే విమానం రాడార్ నుంచి అదృశ్యమైందని, అనంతరం విమాన శిథిలాలు అంకారాకు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న కెసిక్కవాక్ గ్రామం వద్ద లభించాయని తుర్కియే అధికారులు వెల్లడించారు.

ఇత్తడిపై రష్యన్ రాజ్యాంగం

- ఇందౌర్ వ్యాపారి వినూత్న ప్రయోగం



ఇందౌర్: భారత రష్యాల స్నేహ సంబంధానికి గౌరవ సూచకంగా ఇందౌర్‌కు చెందిన వ్యాపారి ఒకరు రష్యా రాజ్యాంగాన్ని ఇత్తడి పత్రాలపై ముద్రించారు. లోకేశ్ మంగల్ అనే ఈ వ్యాపారి ఇత్తడి పుస్తకాల ముద్రణకర్తగా ప్రసిద్ధి పొందారు. "భారత్- రష్యాల స్నేహబంధానికి గౌరవ సూచకంగా ముద్రించాలని నిర్ణయించాను" అని మంగల్ అన్నారు. మొత్తం అరకేజీ బరువున్న 56 ఇత్తడి పత్రాలపై ఆంగ్లంలోకి అనువదించిన రష్యా రాజ్యాంగాన్ని ముద్రించారు. 137 అధికరణాలను ప్రచురించడానికి ఎనిమిది గంటలు పట్టాయి.

మద్యం తాగి పట్టాలపై ఆటో నిలిపిన డ్రైవరు

వందే భారత్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

తిరువనంతపురం: కేరళలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. పట్టాలపై ఓ ఆటో ఆగి ఉండడాన్ని గమనించిన లోకోపైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో అపాయం తప్పింది. తిరువనంతపురంలోని అకతుమురి హాల్ట్ స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10.10 గంటలకు అకతుమురి హాల్ట్ స్టేషన్ వైపు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుండగా రైల్వే ట్రాక్‌పై ఓ ఆటో ఆగి ఉండడాన్ని లోకో పైలట్ గుర్తించారు. వెంటనే అత్యవసర బ్రేకులు వేసి, రైలును ఆపివేశారు. అయితే రైలు స్వల్పంగా ఢీకొనడంతో ఆటో కొంత మేర దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఆటోలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అనంతరం ఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే సిబ్బంది, స్థానిక పోలీసులు ఆటోను పట్టాలపై నుంచి తొలగించారు. ట్రాక్ భద్రతను నిర్ధరించిన అనంతరం రాత్రి 11.15 గంటలకు వందే భారత్ రైలు అక్కడి నుంచి బయల్దేరింది. సుధి అనే ఆటో డ్రైవర్ మద్యం మత్తులో తన ఆటోను పట్టాలపై నిలిపివేసి, అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నేడు బంగ్లాదేశ్‌కు తారిక్ రెహమాన్ రాక

ఢాకా: దాదాపు 17 ఏళ్లుగా లండన్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) తాత్కాలిక ఛైర్మన్ తారిక్ రెహమాన్ (60) గురువారం బంగ్లాదేశ్‌కు పునరాగమనం చేయనున్నారు. ఈయన బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి, బీఎన్‌పీ అధినాయకురాలు ఖాలిదా జియా కుమారుడు. ఖాలిదా ప్రస్తుతం పలు తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతూ ఢాకాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని రేసులో తారిక్ ముందు వరుసలో ఉన్నారు. ఆయనపై గతంలో కేసులు నమోదయ్యాయి. గత 17 ఏళ్లుగా స్వదేశానికి తిరిగి రాలేదు.

■ తారిక్ రెహమాన్ స్వదేశానికి తిరిగి రావడానికి ఒకరోజు ముందు ఢాకాలో బాంబు పేలుడు చోటుచేసుకోవడం కలకలం సృష్టించింది. స్థానిక మోఘ్‌బజార్ ప్రాంతంలో 1971 విమోచన యుద్ధవీరుల ప్రధాన కార్యాలయం వెలుపల బుధవారం ఈ పేలుడు సంభవించింది. అక్కడి ఓ ఫ్లైఓవర్ పైనుంచి గుర్తుతెలియని దుండగుడు బాంబు విసరడంతో.. టీస్టాల్ వద్ద టీ తాగుతున్న ఓ ప్రైవేటు ఉద్యోగి మరణించాడని పోలీసులు తెలిపారు.

ఎయిర్ ప్యూరిఫైయర్స్‌పై 18% జీఎస్టీయా!

- కేంద్రంపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం



దిల్లీ: దేశ రాజధాని నగరం దిల్లీ సహా చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న వేళ.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18 శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై దిల్లీ హైకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ గాలి శుద్ధి యంత్రాలపై జీఎస్టీ తగ్గించే అంశాన్ని ఎందుకు పరిశీలించడం లేదని కేంద్రాన్ని ప్రశ్నిస్తూ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జీఎస్టీ కౌన్సిలు తక్షణం సమావేశమై గాలిశుద్ధి యంత్రాలపై పన్ను తగ్గించడం లేదా పూర్తిగా రద్దు చేయడంపై ఓ నిర్ణయం తీసుకోవాలని పురమాయించింది. ఈ యంత్రాలను వైద్య పరికరంగా పరిగణించి.. 5 శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన ఈ పిటిషనుపై కేంద్రానికి హైకోర్టు నోటీసు జారీ చేసింది. విచారణలో కేంద్రం తీరుపై డివిజన్ బెంచ్ అసహనం వ్యక్తం చేసింది. "మనం రోజుకు 21 వేల సార్లు శ్వాస తీసుకుంటాం. అలాంటప్పుడు గాలి కాలుష్యం వల్ల ఎంత నష్టం జరుగుతుందో ఓసారి లెక్కించండి" అని వ్యాఖ్యానించింది. పిటిషనుపై స్పందించేందుకు గడువు ఇవ్వాలన్న ప్రభుత్వ అభ్యర్థనపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. "వాయు కాలుష్యం ప్రాణాంతకంగా మారింది. వేల సంఖ్యలో ప్రజలు చనిపోయిన తర్వాత స్పందిస్తారా? ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి అవసరం. అది అందించలేనప్పుడు కనీసం శుద్ధి యంత్రాలనైనా అందుబాటు ధరల్లో ఉంచాలి కదా! ఇలాంటి ఎయిర్ ఎమర్జెన్సీలో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద తాత్కాలిక పన్ను మినహాయింపును తక్షణం ఎందుకు ఇవ్వకూడదు?' అని కేంద్రంపై ప్రశ్నలు కురిపించింది. ప్రజల ప్రాణాల కంటే పన్నులే ముఖ్యమా? అంటూ దీనిపై ఈరోజే స్పందన తెలియజేయాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని చీఫ్ జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావులతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 26కు వాయిదా వేశారు.

రూ.12వేల కోట్లతో దిల్లీ మెట్రో విస్తరణ

- 16 కిలోమీటర్లు.. కొత్తగా మూడు కారిడార్లు

ఈనాడు, దిల్లీ: దేశ రాజధానిలో ప్రధాన ప్రజారవాణా వ్యవస్థగా ఉన్న మెట్రో రైల్ వ్యవస్థని రూ. 12,014.91 కోట్ల వ్యయంతో 16 కిలోమీటర్ల మేర విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఇందుకు ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా మూడు కొత్త కారిడార్లు నిర్మిస్తారు. వాటిలో 1. ఆర్‌కే ఆశ్రమ్ మార్గ్-ఇంద్రప్రస్థ (9.913 కి.మీ.), 2. ఏరోసిటీ-ఎయిర్‌పోర్ట్ టెర్మినల్-1 (2.263 కి.మీ.), 3. తుగ్లకాబాద్-కాళిందికుంజ్ (3.9 కి.మీ.) మార్గాలు ఉంటాయి. ఇందులో ఆర్‌కే ఆశ్రమ్ మార్గ్-ఇంద్రప్రస్థ కారిడార్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పనిచేసే కర్తవ్య భవన్‌తోపాటు, పర్యాటకులు అధికంగా సందర్శించే ఇండియా గేట్ మీదుగా సాగుతుంది. ఇది అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతిరోజూ 60వేల మంది ఉద్యోగులు, 2 లక్షలమంది పర్యాటకులు వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని కేంద్ర సమాచార, ప్రసారశాఖల మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. దిల్లీ మెట్రో 5ఏ దశగా పిలిచే ఈ మూడు కారిడార్లలో 10 భూగర్భ, 3 ఎలివేటెడ్ స్టేషన్లు వస్తాయి.



టోక్యోలోని ఆఫ్రికన్స్ పెంగ్విన్స్ ఉన్న ట్యాంకులో శాంటాక్లాజ్ దుస్తులతో డైవర్

దిల్లీ కాలుష్యంతో నాకు మూడ్రోజుల్లోనే అలర్జీ

నితిన్ గడ్కరీ



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇక్కడున్న మూడ్రోజుల్లోనే తనకు అలర్జీ వచ్చిందన్నారు. దేశ రాజధానిలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఇక్కడ కాలుష్యం వల్ల నాకు మూడ్రోజుల్లోనే ఎలర్జీ వచ్చింది. రవాణా రంగం వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంద"న్నారు. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. "ఇది ఎలాంటి జాతీయవాదం? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం పెరిగిపోతోంది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని మనం తగ్గించలేమా? కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో తగ్గించే ఎలక్ట్రిక్, హైడ్రోజన్ ఆధారిత వాహనాలను ఎందుకు ప్రోత్సహించకూడదు?" అని గడ్కరీ ప్రశ్నించారు. పూర్తిగా ఇథనాల్‌తో నడిచే పర్యావరణ అనుకూలమైన తన ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనం గురించి ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అది కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు, దిగుమతి చేసుకొనే శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని దూరం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

మాస్కో పేలుడులో పోలీసు అధికారుల మృతి

మాస్కో: రష్యాలో జరిగిన బాంబు పేలుడులో బుధవారం ఇద్దరు పోలీస్ అధికారులతో సహా మొత్తం ముగ్గురు మరణించారు. మాస్కో నగరంలోని యెలెట్‌స్కాయా వీధిలో ఈ పేలుడు సంభవించింది. పోలీసు వాహనం వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఒక వ్యక్తిని అధికారులు గుర్తించి అతణ్ని పట్టుకునేందుకు ఉపక్రమించిన సమయంలో పేలుడు సంభవించిందని రష్యన్ విచారణ సంస్థ నొవోస్తి ప్రకటించింది. రెండ్రోజుల క్రితం సీనియర్ రష్యన్ సైన్యాధికారి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ కారు బాంబు పేలుడులో మరణించిన ప్రదేశానికి అతి సమీపంలో తాజా పేలుడు సంభవించింది. పక్కనే నిలబడివున్న మరో వ్యక్తి సైతం పేలుడు తాకిడికి మరణించాడు. మృతులను పోలీస్ లెఫ్టినెంట్ ఇల్యా క్లిమనోవ్(24), మ్యాగ్జిమ్ గోర్బునోవ్(25) లుగా గుర్తించారు. ఈ ఇద్దరూ 2022, 2023 సంవత్సరాల్లో పోలీసు బలగంలో చేరారు. మరణించిన మూడో వ్యక్తిని బాంబు పేలుడుకు కారకునిగా అనుమానిస్తున్నారు. అతను ఉక్రెనియన్ రహస్య విభాగానికి చెందినవాడై ఉండవచ్చని మీడియా వర్గాలు పేర్కొన్నాయి.

(c) eenadu

తితిదే, పర్యాటకశాఖల మధ్య జరిగిన భూమార్పిడి విషయంలో జోక్యం చేసుకోలేం

- స్పష్టం చేసిన హైకోర్టు
- పిల్‌ను కొట్టేసిన సీజే నేతృత్వంలోని ధర్మాసనం



ఈనాడు, అమరావతి: తిరుపతి మండలం, పేరూరు గ్రామ పరిధిలో తితిదేకు చెందిన భూమిని పరస్పర భూమార్పిడి విధానం కింద పర్యాటకశాఖకు కేటాయించి.. దానిని ఒబెరాయ్ గ్రూప్‌నకు చెందిన స్వర హోటల్ నిర్మాణానికి ఇచ్చారంటూ దాఖలైన పిల్‌లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. పిల్‌ను కొట్టేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

✦ తితిదే, పర్యాటకశాఖ మధ్య జరిగిన భూమార్పిడిని రద్దు చేయాలని, ఒబెరాయ్ గ్రూప్‌నకు చెందిన స్వర హోటల్స్‌కు భూమిని కేటాయిస్తూ పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ హైకోర్టులో తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తిరుపతి పిల్ దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ 'తితిదేకు చెందిన ఎంతో విలువైన భూమిని పరస్పర భూమార్పిడి విధానంలో పర్యాటకశాఖకు చెందిన తక్కువ విలువగల భూమికి బదులుగా అప్పగించారు. తితిదే నుంచి పర్యాటకశాఖ తీసుకున్న భూమిలో స్వర హోటల్ నిర్మాణానికి అనుమతివ్వడం చట్ట విరుద్ధం. పర్యాటకశాఖ నుంచి తీసుకున్న భూమిలో భక్తుల ప్రయోజనాల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన తితిదే.. తదనంతరం ఆ ప్రాజెక్ట్‌ను మారో చోటకు మార్చాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భూమార్పిడి వల్ల తితిదేకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. హోటల్ నిర్మాణానికి ప్రస్తుతం భూమిని చదును చేస్తూ వృక్షాలను కొట్టేస్తున్నారు. ప్రక్రియను నిలువరించండి' అని కోరారు.

✦ తితిదే, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 'పర్యాటకశాఖ, తితిదే పరస్పరం మార్పిడి చేసుకున్న భూములు రహదారికి ఇరువైపులా ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ భూముల విలువ వేరుగా ఉంటుంది. అంతే తప్ప రెండు భూముల విలువ ఒక్కటే. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పర్యాటకశాఖ ఆ భూమిని ఒబెరాయ్ గ్రూప్‌నకు కేటాయించింది. ఇరువైపు వాదనలూ విన్న ధర్మాసనం.. పిల్‌ను కొట్టేసింది. పర్యాటకశాఖ నుంచి తీసుకున్న భూమిలో భక్తులకు మౌలిక సదుపాయాల కోసం చేపట్టాల్సిన ప్రాజెక్ట్‌ను తితిదే వేరే చోటకు మార్చిందన్న కారణంతో తితిదే, పర్యాటకశాఖ మధ్య జరిగిన భూ మార్పిడి ఒప్పందాన్ని రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

ఎన్‌కౌంటర్‌పై కౌంటర్ వేయండి

- రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లికి సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టు కీలక నేత మద్వి హిడ్మా, ఆయన భార్య, తదితరుల ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ జరిపించాలంటూ 'పీపుల్స్ యూనిటీ ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం' జాతీయ అధ్యక్షురాలు జయా విధ్యాల దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

ఈ వైష్ణవి అపురూపం



ఊయలలో ఆవు దూడ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: సాధారణంగా పిల్లలు పుట్టిన 11 రోజులకు బారసాల (ఊయల) వేడుక నిర్వహించడం ఆనవాయితీ. కృష్ణా జిల్లా బాపులపాడుకు చెందిన వేగుంట సత్యనారాయణ, మాధవీ రాణి దంపతులు తమ ఇంట్లో పుట్టిన ఆవు దూడకు ఇదే తరహాలో బారసాల నిర్వహించారు. ఎంతో ఇష్టంగా పశుపోషణ చేసే ఈ దంపతులు.. శ్రద్ధగా వాటి బాగోగులు చూసుకుంటారు. ఇటీవలే గిర్ జాతి ఆవు రెండో ఈతలో పెయ్య దూడకు జన్మనిచ్చింది. దీంతో వేడుకగా బుధవారం బారసాల చేసి.. బుల్లి దూడకు వైష్ణవిగా నామకరణం చేశారు.

డ్రోన్లతో గిరిజన ప్రాంతాలకు ఔషధాల సరఫరా

రెడ్‌వింగ్ సంస్థతో వైద్య ఆరోగ్య శాఖ ఒప్పందం



ఒప్పంద పత్రంతో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, రెడ్‌వింగ్ సంస్థ ప్రతినిధి కుందన్

ఈనాడు, అమరావతి: మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా ఔషధాలు, బ్లడ్ యూనిట్లు పంపి.. అక్కడి నుంచి రక్త, మల, మూత్ర నమూనాలు వైద్య పరీక్షల కోసం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు నుంచి జనవరి నెలాఖరుకు ఈ తరహా డ్రోన్ సేవలు అందుబాటులోకి తేనుంది. ఈ మేరకు రెడ్‌వింగ్ సంస్థతో వైద్య ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. మంగళగిరిలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, రెడ్‌వింగ్ సంస్థ ప్రతినిధి కుందన్ మాదిరెడ్డి ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటికే అరుణాచల్‌ప్రదేశ్‌లో సేవలందిస్తున్న ఈ సంస్థ.. రాష్ట్రంలో 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కింద ప్రాథమికంగా ఆరు నెలల పాటు ఉచిత సేవలు అందించడానికి అంగీకరించింది. పాడేరు కేంద్రంగా 60 నుంచి 80 కి.మీ. పరిధిలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు డ్రోన్ల సేవలు ప్రారంభిస్తారు. భవిష్యత్తులో విశాఖ కేజీహెచ్ నుంచి పాడేరుకు మందుల రవాణాకూ డ్రోన్లు వినియోగించాలని భావిస్తున్నారు. కోల్డ్‌చైన్ సదుపాయంతో, రెండు కిలోల బరువు మోసే డ్రోన్లను అందుబాటులోకి తెస్తామని వీరపాండియన్ వెల్లడించారు.



వేట కత్తులతో వైకాపా నేతలు

జగన్ జన్మదిన వేడుకల్లో వేట కత్తులతో వైకాపా నేతలు



ఈనాడు, కడప: మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో వైకాపా నేతలు వేట కత్తులను గాల్లోకి దూసి.. విన్యాసాలు చేశారు. ఆ చిత్రాలు వైరల్ అవుతున్నాయి. అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం గుర్రంకొండలో పార్టీకి చెందిన సర్పంచి జమీర్ అలీఖాన్, నేతలు హరీష్‌రెడ్డి, శివ, ఖదీర్ తదితరుల ఆధ్వర్యంలో ఇటీవల జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కోసేందుకు పొడవాటి వేట కత్తులు తెచ్చారు.

2027 జూన్ నాటికి పోలవరం పూర్తి చేయాలి

- పీపీఏ సీఈవో యోగేష్ పైఠాణ్‌కర్
- తొలిసారిగా ప్రాజెక్టు సందర్శన



గ్యాప్-1 ప్రాంతంలో పనులు పరిశీలిస్తున్న పీపీఏ సీఈవో యోగేష్ పైఠాణ్‌కర్, జలవనరుల శాఖ అధికారులు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 జూన్ నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జలవనరుల శాఖ అధికారులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) యోగేష్ పైఠాణ్‌కర్ ఆదేశించారు. సీఈవోగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన తొలిసారిగా అథారిటీ సభ్యులతో కలిసి బుధవారం ప్రాజెక్టును సందర్శించారు. డయాఫ్రం వాల్ నిర్మాణంతోపాటు గ్యాప్-1, 2ల్లో జరుగుతున్న ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులను పరిశీలించారు. జలవిద్యుత్తు కేంద్రాన్ని సందర్శించారు. ఏజెన్సీ ప్రతినిధులు, జలవనరులశాఖ సిబ్బందికి సీఈవో పలు సూచనలు చేశారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన యంత్రాలు, సామగ్రి, కార్మికులను సమకూర్చుకోవాలన్నారు. దేవరగొంది, మామిడిగొంది గ్రామాల మధ్య కొండల్లో చేపట్టిన జంట సొరంగాల పనుల గురించి ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి ఆయనకు వివరించారు. పైఠాణ్‌కర్ వెంట పీపీఏ కార్యదర్శి ఎం.రఘురాం, సీఈలు ఎం.రమేశ్, సివి సుబ్బయ్య, డైరెక్టర్ కె.శంకర్, ప్రాజెక్టు ఎస్ఈ కె.రామచంద్రరావు, ఈఈలు, మేఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులున్నారు.

పునరావాస కాలనీ సందర్శన

రాజమహేంద్రవరం నుంచి ఉదయం బయలుదేరిన సీఈవో నేరుగా పోలవరం మండలంలోని కోండ్రుకోట పునరావాసకాలనీకి వెళ్లారు. అక్కడి నిర్వాసితులతో సమావేశమయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ఎక్స్‌అఫిషియో జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్ ప్రాజెక్టు నిర్వాసితులు, పరిహారం, పునరావాసం వివరాలను ఫొటో ప్రదర్శన ద్వారా వెల్లడించారు.

న్యాయబద్ధ సంపాదనతో ప్రశాంతత



న్యాయబద్ధమైన సంపాదనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇందుకోసం పాటించాల్సిన సూత్రాలు.. ✦ చట్టబద్ధమైన మార్గాల్లోనే సంపాదించాలి. ✦ గడువు తేదీలోగా అన్ని రకాల పన్నులు చెల్లించేయాలి. ✦ పన్ను అధికారుల నుంచి అభ్యంతరాలేమైనా వస్తే వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించుకోవాలి. ✦ చట్టబద్ధంగా ఏర్పాటైన పెట్టుబడి సంస్థల్లోనే మీ నిధులను మదుపు చేయాలి. – చంద్ర భాటియా, ఇన్వెస్టర్

ప్రాణం తీసిన పెన్సిల్

- గొంతులో గుచ్చుకుని బాలుడి మృతి
- ఖమ్మం జిల్లాలో ఘటన



విహార్

కూసుమంచి, న్యూస్‌టుడే: పెన్సిల్ గొంతులో గుచ్చుకొని ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మేడారపు ఉపేంద్రచారి, మౌనిక దంపతుల కుమారుడు విహార్(8) నాయకన్‌గూడెంలోని ప్రైవేటు పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పెన్సిల్ చేతపట్టుకొని మూత్రశాలకు వెళ్లాడు. తిరిగి తరగతి గదిలోకి వచ్చే క్రమంలో పరిగెడుతూ... అదుపుతప్పి బోర్లా పడ్డాడు. ఆ క్రమంలో చేతిలో ఉన్న పెన్సిల్ గొంతులో గుచ్చుకుంది. తీవ్ర రక్తస్రావం కావడంతో.. ఉపాధ్యాయులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్దకు, అక్కణ్నుంచి కూసుమంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్ల పునరుద్ధరణకు రూ.205 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా తీవ్రంగా దెబ్బతిన్న రాష్ట్ర, జిల్లా రోడ్లను రూ.205.12 కోట్లతో పునరుద్ధరించేందుకు ప్రభుత్వం బుధవారం పరిపాలనపరమైన అనుమతులిచ్చింది. 92 జిల్లా రోడ్లలో 467.49 కి.మీ. మేర పనులకు రూ.117.89 కోట్లు, 34 రాష్ట్ర రోడ్లలో 174.72 కి.మీ. మేర పనులకు రూ.87.23 కోట్లు వెచ్చిస్తారు. ఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ మేరకు ఉత్తర్వు జారీచేశారు.

టైరు పేలి అదుపు తప్పిన బస్సు

- రెండు కార్లను ఢీకొనడంతో 9 మంది మృతి
- తమిళనాడులో దుర్ఘటన



ప్రమాదానికి కారణమైన బస్సు



నుజ్జయిన కారు

చెన్నై, న్యూస్‌టుడే: టైరు పేలి బస్సు అదుపుతప్పి రెండు కార్లను ఢీకొట్టడంతో తొమ్మిది మంది మృతి చెందిన విషాద ఘటన తమిళనాడులో జరిగింది. తిరుచ్చి నుంచి చెన్నై వెళ్తున్న ప్రభుత్వ బస్సు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో కడలూర్ జిల్లా ఎళుత్తూర్ వద్ద జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా ముందు టైరు అకస్మాత్తుగా పేలింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపు రహదారిపైకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న రెండు కార్లను ఢీకొట్టడంతో వాటిలోని తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. రామనత్తం పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు.



10 YEAR WARRANTY | BAJAJ SECURE • AMC • ROAD SIDE ASSISTANCE | 72198 21111 | SHRIRAM Finance | IDFC FIRST Bank ALWAYS YOU FIRST | BAJAJ AUTO CREDIT | L&T Finance | TATA CAPITAL Two Wheeler Loans

*నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి. డిసెంబర్ 22 నుంచి డిసెంబర్ 31, 2025 వరకు పొదుపులు వర్తిస్తాయి. పేర్కొన్న మొత్తం పొదుపులు అంటే క్యాష్ బ్యాక్ నుంచి పొదుపులు, సున్న ప్రాసెసింగ్ ఫీ మరియు 5 ఉచిత సర్వీసుల (3 ప్రమాణిత ఉచిత సర్వీసులు మరియు 2 అదనపు ఉచిత సర్వీసులు) కూడిక. ఉచిత సర్వీసు పొదుపులు ప్రణాళిక చేయబడిన మజూరీ చార్జీల కోసం. మోడల్స్/రాష్ట్రాల వ్యాప్తంగా వర్తించే ఆఫర్స్‌లో మార్పు ఉండవచ్చు. ఋుణసదుపాయం అందించేవారి పైన ఆధారపడి స్వాదరాల ప్రకారం సున్న పిఎఫ్‌లో మార్పు ఉండవచ్చు. ఋుణసదుపాయం అందించేవారి విచక్షణ మేరకు ఋుణసదుపాయం ఉంటుంది. స్టంట్స్‌ని నిపుణులద్వారా, నియంత్రణ మరియు కప్పివుంచబడిన వాతావరణంలో సాధారణ ప్రజానికం లేదా ప్రజా రోడ్లకు దూరంగా వృత్తి నైపుణ్యంగలవారి పర్యవేక్షణలో కొనసాగించడం జరిగింది. ఈ స్టంట్స్‌ని నకలు చేసే ప్రయత్నం చెయ్యకండి మరియు ఎల్లప్పుడు ట్రాఫిక్ మరియు భద్రత నియమాలను పాటించండి. పల్సర్ 125 ఆఫర్ నియోన్ మరియు కార్బన్ ఫైబర్ మోడల్స్‌కి ఉంటుంది.

Authorised Dealers For Bajaj Auto Ltd.: Vijayawada VARUN BAJAJ 9885180282,9966383555 • Gudivada VARUN BAJAJ 9885180311 • Guntur SRI SIDDHI VINAYAKA BAJAJ 9100961204, 9121008788 • KOTHAPETA 9100559456, 9100551152 • Tenali VARAHI BAJAJ 9959234569, 08644226778 • Bhimavaram VARUN BAJAJ 8142511888 • Eluru MOHANA SAI BAJAJ 7799771997 • Ongole TIRUMALA BAJAJ 6309601833 • Chirala TIRUMALA BAJAJ 9292002004 • Nellore MGB BAJAJ GT ROAD 9247000009, 9299999987, Mini Bye-Pass 9299999976, 9246777133.

EENADU Vol: 52, Issue: 135 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

మహిళల రక్షణ ఆమె ఆకాంక్ష. అందుకు అసాంఘిక శక్తులతో, సామాజిక పరిస్థితులతో అలుపెరగని పోరాటం చేస్తున్నారు సునీతా కృష్ణన్. వ్యభిచార వృత్తిలో కూరుకుపోయిన ఆడపిల్లల్ని కాపాడేందుకు హైదరాబాద్‌లో ప్రజ్వల ఫౌండేషన్‌ను స్థాపించి చాలామందిని ఈ మురికికూపం నుంచి బయట పడేశారు. ఇటీవల షార్జా ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్-2025లో ఉత్తమ అంతర్జాతీయ పుస్తకం(నాన్ ఫిక్షన్) పురస్కారాన్నీ అందుకున్నారీమె.

సాయం చేసిన ప్రతిసారీ... దాడి చేశారు!




సునీత

బెంగళూరులో పుట్టినప్పటికీ తండ్రి ఉద్యోగరీత్యా సునీత బాల్యమంతా దేశంలో పలు ప్రాంతాల్లో గడిచింది. చిన్నప్పటి నుంచి సమాజసేవే శ్వాసగా పెరిగారు. ఎనిమిదేళ్ల వయసులోనే మానసిక దివ్యాంగులైన విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ సమాజసేవ వైపు ఆకర్షితురాలయ్యారు. ఆపై మురికివాడల్లో పాఠశాలలు ప్రారంభించారు. పదిహేనేళ్లప్పుడు దళితుల పక్షాన ఉద్యమంలో పాల్గొన్నారని ఆమెపై కొందరు దుండగులు సామూహిక అత్యాచారం చేశారు. ఆ సంఘటనే సునీతను మహిళల రక్షణ కోసం ధైర్యంగా నిలబడేలా చేసింది. మాస్టర్స్ తరవాత సేవా రంగంలో డాక్టరేట్‌ను తీసుకున్నారు. ఫీల్డు వర్క్‌లో భాగంగా వేశ్యల జీవితాలను అధ్యయనం చేసేవారీమె. 1996లో పూర్తి సామాజిక కార్యకర్తగా మారారు. స్త్రీ శరీరాన్ని మార్కెట్ వస్తువుగా పరిగణించే ధోరణిని నిరసిస్తూ బెంగళూరులో జరిగిన మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకించారు. ఆ సమయంలో రెండునెలలు జైలు శిక్ష కూడా అనుభవించారు. 'ఇప్పటికి పదిహేడుసార్లు కత్తులూ చెయిన్లూ, రాళ్లతో దాడులు జరిగాయి. ఒక ఘటనలో దెబ్బ తగిలి వినికిడి శక్తే తగ్గింది. మహిళల రక్షణకోసమే 'ప్రజ్వల ఫౌండేషన్'ను మొదలుపెట్టా. స్త్రీల అక్రమ రవాణా పూర్తిగా అంతరించాలంటే సమాజంలో మార్పు రావాలి. 'నా బంగారు తల్లి' సినిమాతో కొందరినైనా ఆ దిశగా ఆలోచింపచేయగలిగాను. ఆడవాళ్ల మీద జరిగే దాడులు, మోసాలను అరికట్టాలంటే ముందు మగవాళ్లలో మార్పు తీసుకురావాలి' అంటారు సునీత. తను రచించిన 'ఐయామ్ వాట్ ఐయామ్' పుస్తకానికి షార్జా ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ 2025 నవంబరులో 'ఉత్తమ అంతర్జాతీయ పుస్తకం(నాన్ ఫిక్షన్) పురస్కారం అందుకున్నారు. ఆడపిల్లల అక్రమ రవాణా, లైంగిక బాధితులకి పునరావాసం, సోషల్ మీడియా తెస్తోన్న చిక్కులూ... ఇలా ఎన్నో అంశాల గురించి ఈ పుస్తకంలో చర్చించారు.

ధైర్యంగా సాగుతున్నా!

నా విజయం



నేనో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిని. నాకు చిన్నప్పట్నుంచీ ఒక కల... సొంతంగా వ్యాపారం చేయాలని. ఇది స్వతంత్రంగా ఎదగడాన్ని నేర్పిస్తుందని నమ్ముతా. కాబట్టే, ఆ కలని ఈ ఏడాది నిజం చేసుకున్నా. అయితే ఇది ఒక్కరోజులో వచ్చిన మార్పు కాదు. భయం, చేయగలనా అన్న సందేహం. అయినా ధైర్యాన్ని కూడగట్టుకుని ముందడుగు వేశా. ఈ-కామర్స్ వేదికల్లో ఉత్పత్తులను అమ్మడం మొదలుపెట్టా. తొలిరోజుల్లో ఆర్డర్లు తక్కువగా వచ్చేవి. దానికితోడు ధరల నిర్ణయం, డెలివరీ ఆలస్యాలు, వినియోగదారులతో ఇబ్బందులు... ఇలా ఎన్నో సమస్యలు. వేటికీ భయపడలేదు. ప్రతిదాన్నీ పాఠంగా భావించా. పొరపాట్లూ చేశా, వాటి నుంచీ నేర్చుకున్నా. ఇవన్నీ నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచితే, వచ్చిన ప్రతి ఆర్డరు నాలో ఉత్సాహాన్ని నింపేది. కాబట్టే, ధైర్యంగా ముందుకు సాగుతున్నా. అందుకే 2025 నాకు ప్రత్యేకం. నా జీవితాన్ని మార్చిన గొప్ప సంవత్సరం. అయితే ఈ ప్రయాణంలో కుటుంబ ప్రోత్సాహాన్ని మర్చిపోలేను. ఇప్పుడు నా లక్ష్యం స్పష్టంగా ఉంది. చిన్నగా మొదలైన ఈ వ్యాపారాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలి. ఓ బ్రాండ్‌గా తీర్చిదిద్దాలి. నిజమైన ప్రయత్నం, ఆత్మవిశ్వాసం, కుటుంబ మద్దతు ఉంటే ఎవరి కలలూ కలగానే మిగలవు. తప్పక నిజమవుతాయి. ఈ ఏడాది నేను నేర్చుకున్న గొప్ప పాఠమిది.

– **తటవర్తి వెంకట సూర్య అనూష**, బడంగ్‌పేట్, రంగారెడ్డి జిల్లా.

పుట్టబోయే పాపాయి కోసం ఆ అమ్మానాన్నలు ఎంతో ఎదురుచూశారు. తీరా పుట్టాక ఆమెను చూసి తల్లడిల్లారు. కారణం ఆ పాపకి ఒక చేయి పూర్తిగా లేదు. అయితేనేం ఆమెను ఉన్నతంగా తీర్చిదిద్దాలి అనుకున్నారు. తగ్గట్టుగానే ఆ అమ్మాయి ఆటల్లో రాణించింది. తాజాగా జాతీయ బాల పురస్కార్‌కి ఎంపికైంది... ఉప్పర శివాని!

ఈ అవార్డు... అమ్మకే!



మాది కర్నూలు జిల్లాలోని మద్దికెర గ్రామం. నా కుడి చేయి మోచేతి వరకే ఉంటుంది. దీంతో నా భవిష్యత్తు ఏమవుతుందోనని అమ్మానాన్నలు ఈరప్ప, లలిత దిగులు చెందేవారు. ఇద్దరూ కూరగాయలు అమ్ముతూ నన్నూ, ఇద్దరు తమ్ముళ్లనూ పోషించేవారు. అయినా నాకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని శిక్షణ ఇప్పించి మరీ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష రాయించారు. బనవాసి నవోదయలో సీటు రావడం నా జీవితాన్ని మలుపుతిప్పింది. అక్కడి ప్రిన్సిపల్ సాగరిక చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రోత్సహించారు. తొమ్మిదో తరగతిలో రంగారెడ్డి జిల్లాలోని నవోదయకి వచ్చా. అక్కడివాళ్లు నన్ను ఆదిత్య మెహతా ఫౌండేషన్లో చేర్పించి షాట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల్లో శిక్షణ ఇప్పించారు. 2023లో విశాఖలో జరిగిన దివ్యాంగుల పోటీల్లో జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యా. అక్కడే కాదు, ఆపై థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా గేమ్స్‌లోనూ పతకాలు సాధించా. 2024లో 100మీ. పరుగులోనూ బంగారు పతకాన్ని దక్కించుకున్నా. ఈ ఏడాదీ రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో షాట్‌పుట్, జావెలిన్ త్రోల్లో సత్తా చాటి... దుబాయిలో నిర్వహించిన పారా 'యూత్ ఏషియన్ గేమ్స్'లో పాల్గొన్నా. దిల్లీలో జరిగిన గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచా. చదువునీ నిర్లక్ష్యం చేయట్లేదు. ప్రస్తుతం చిత్తూరులో 12వ తరగతి చదువుతున్నా. శిక్షణ కొనసాగిస్తూనే పోటీల్లోనూ పాల్గొంటున్నా. గత మూడేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తుండటంతో ప్రధానమంత్రి బాలపురస్కార్‌కు ఎంపిక చేశారు. ఈ నెల 26న రాష్ట్రపతి చేతుల మీదుగా దీన్ని అందుకోబోతున్నా. నేను ఉన్నత స్థానంలో నిలబడితే చూడాలని అమ్మానాన్నలతోపాటు నా శిక్షకులు, ఉపాధ్యాయులు ఎంతోమంది కోరుకున్నారు. ఇప్పుడు ఆ దిశగానే అడుగులు వేస్తున్నా. చూడటానికి అమ్మే లేదు. అయితేనేం నాకు దక్కబోయే పురస్కారాన్ని అమ్మకే అంకితం చేస్తాను.

– బి.ఎస్.రామకృష్ణ, కర్నూలు

నాయిక 2025

ఏ చిన్న సందేహమొచ్చినా చిన్నా, పెద్దా ఆశ్రయించేది గూగుల్‌నే! అలా రోజుకి ఎన్ని సెర్చ్‌లు ఉంటాయో తెలుసా? 350 కోట్లకు పైమాటే. ఒక్కొక్కరికీ ఒక్కో సందేహం, ఒక్కో ఆసక్తి! ఇలాంటి వాటిల్లోనూ చూపు తమవైపు తిప్పుకొన్నారు కొందరు. కాబట్టే, 'గూగుల్ మోస్ట్ సెర్చ్‌డ్' వ్యక్తుల జాబితాలో చేరారు. అలా దేశం నుంచి అత్యధిక స్థాయిలో వెతికిన అమ్మాయిలెవరో తెలుసా?

'ఈమె' కోసం వెతికారు!

ముందు తనే!



చలాకీ అమ్మాయి... స్టైలిష్ బ్యాటర్... ఉత్తమ ఫీల్డర్లలో ఒకరు... చెప్పుకొంటూ పోవాలే కానీ... **జెమీమా రోడ్రిగ్స్**‌కి సరిపోయే ఉపమానాలెన్నో! అమ్మాయిల జట్టులో సీనియర్ క్రీడాకారిణే! మూడు ఫార్మాట్లలోనూ ఆడుతోంది. అత్యవసరమైతే బాల్‌తోనూ ఆదుకోగలదు. అయితే ఇన్ని చేస్తున్నా జెమీమాకి ఓ మోస్తరు స్థాయి బ్యాటర్‌గానే పేరు. ఫామ్ కోల్పోయి కొన్ని కీలక మ్యాచ్‌లకీ దూరమైంది. తనని తాను తీర్చిదిద్దుకుని తిరిగి జట్టులోకి అడుగుపెట్టినా... సోషల్‌మీడియాలో 'ఎప్పుడూ మైదానంలో తిరుగుతుంటావు. రీల్స్ మాని ఆటమీద దృష్టిపెట్ట'మంటూ ట్రోల్స్. వాటన్నింటికీ ఆటతోనే సమాధానం చెప్పింది జెమీమా. ఈ ఏడాది వరల్డ్‌కప్ సెమీస్‌లో 127 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఆస్ట్రేలియాని ఓడించి, మన జట్టు ఫైనల్స్‌కి దూసుకెళ్లేలా చేసింది. అప్పట్నుంచీ ఆమె పేరు మారుమోగిపోయింది. తాజాగా శ్రీలంక టీ20లోనూ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. తన 'కెరియర్ 2.0'తో జనాల్ని ఆకర్షించింది. కాబట్టే, ఈ ఏడాది గూగుల్‌లో దేశంలో ఎక్కువ మంది వెతికిన మహిళల్లో ముందుంది జెమీమా. టాప్ 10 జాబితాలోనూ నిలిచింది.

టాప్‌లో నిలిచి...



మన అమ్మాయిల క్రికెట్ జట్టులో ఎక్కువ అభిమాన గణం ఎవరికి అంటే తప్పక వినిపించే పేర్లలో **స్మృతి మంధాన** ముందు వరుసలో ఉంటుంది. గతేడాది డబ్ల్యూపీఎల్‌లో బెంగళూరు జట్టుకు కప్పు అందించాక ఆ సంఖ్య మరింత పెరిగింది. ఇక ఈ ఏడాది సాధించిన ఘనతలూ తక్కువేమీ కాదు. మూడు ఫార్మాట్‌ల్లో సెంచరీలు, 4వేల ఓడీఐ రన్‌లు చేసిన తొలి భారతీయ మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. వరల్డ్‌కప్‌లోనూ రాణించింది. మహిళల వన్డే క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ కూడా. వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం... కాబట్టే, ఆమె గురించి ఎక్కువగా వెతికారు. దీనికితోడు యాడ్‌లనూ చేజిక్కించుకుంది. అదీగాక ఈ ఏడాది పెళ్లి పీటలవరకూ వెళ్లింది స్మృతి. ఇవీ ఆమె గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి పెంచాయి.

తొలి సినిమాకే స్టార్




మధ్యతరగతి అమ్మాయి. సినీ కలలు కంది. కానీ కుటుంబానికి సినీ నేపథ్యమే లేదు. అయితేనేం... మోడలింగ్ చేస్తూ కోరుకున్న అవకాశాన్ని దక్కించుకుంది **అనీత్ పడ్డా**. తను హీరోయిన్‌గా చేసిన తొలి సినిమా (సయ్యారా)నే రూ.100కోట్ల క్లబ్‌లో చేరింది. ఏకంగా రూ.500 కోట్లకుపైగా కొల్లగొట్టింది. దీనిలో ఈమె సహజమైన, భావోద్వేగాలతో కూడిన నటనకి అందరూ ఫిదా అయ్యారు. అందుకే ఆమె గురించి తెలుసుకోవడానికి పోటీపడ్డారు. అన్నట్టూ ఐఎండీబీ- పాపులర్ ఇండియన్ స్టార్స్ జాబితాలోనూ చోటు దక్కించుకుంది అనీత్.

తిరిగి రాదనుకున్నారు



సునీతా విలియమ్స్... ఈ భారత సంతతి వ్యోమగామి పరిచయం ప్రత్యేకంగా అవసరం లేదు. రెండుసార్లు అంతరిక్ష యానం చేసిన ఆమె గత ఏడాది మూడోసారి స్పేస్‌లోకి అడుగుపెట్టారు. ఎనిమిది రోజుల ప్రయాణం కాస్తా వ్యోమనౌకలో సాంకేతిక లోపం కారణంగా తొమ్మిది నెలలపాటు కొనసాగింది. దీనికితోడు ఆమె బక్కచిక్కి కనిపించారు. సునీత ఆరోగ్యం క్షీణిస్తోంది, ఆమె తిరిగి రావడం కష్టమన్న ఊహాగానాలూ ఊపందుకున్నాయి. ఆమె క్షేమంగా తిరిగి రావాలంటూ ప్రపంచమంతా వేడుకుంది. ఈ సందేహాలను నివృత్తి చేసుకునే క్రమంలోనే ఆమె గురించి వెతికారట.

విజయాలన్నీ కలిసి...



మల్టీ టాలెంట్... ఈ పదం **కృతి సనన్**‌కి తప్పక నప్పుతుంది. ఓవైపు సినిమాల్లో భిన్న పాత్రలతో మెప్పిస్తూనే వ్యాపారవేత్తగానూ దూసుకెళ్తున్నారీమె. తన బ్యూటీ బ్రాండ్ 'హైఫెన్' ఈ ఏడాది ప్రారంభంలోనే రూ.400 కోట్ల అమ్మకాలకు చేరుకుంది. దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతోన్న బ్యూటీ సంస్థగా గుర్తింపు తెచ్చుకుంది. ఇదేనా... 'సఫైర్' అనే వెల్‌నెస్ సంస్థలో భాగమవ్వడమే కాదు, తన ప్రొడక్షన్ సంస్థ 'బ్లూ బటర్‌ఫ్లై ఫిల్మ్స్'తోనూ వార్తల్లోకి వచ్చారీమె. రెడ్‌కార్పెట్, అవార్డుల ఫంక్షన్లలో ఆమె ధరించిన దుస్తులూ ఫ్యాషన్ ప్రియులను మెప్పించాయి. అలా నెటిజన్లను ఆకర్షించారు కృతి. ఈ ఏడాది ఏకంగా ఐఎండీబీ- ప్రపంచంలోనే అత్యంత అందమైన నటీమణుల జాబితాలోనూ చోటు దక్కించుకున్నారు. దేశం నుంచి ఆ జాబితాలో చోటు సంపాదించిన ఏకైక నటి కృతినే!

?

టీనేజ్ అమ్మాయిలు పాల సంబంధిత పదార్థాలు, గ్లూటెన్ ఉండే ఆహారాలను తీసుకోకూడదు అంటున్నారు ఇది నిజమేనా? ఇప్పుడు మా అమ్మాయికి 18ఏళ్లు. తనకి వీటిని పెట్టకూడదా?

- లావణ్య, రాయవరం

టీనేజ్‌లో పాల ఉత్పత్తులు తినకూడదా?

డియర్ వసుంధర


డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

పాలు, పాల సంబంధిత పదార్థాలు, గ్లూటెన్ ఉండే ఆహారాలు తీసుకోవడం వల్ల మీ అమ్మాయికి ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తున్నాయా? దానికి సంబంధించి వైద్య పరీక్షలు ఏమైనా చేయించారా? ఈ విషయాలపై మీరు స్పష్టత ఇవ్వలేదు. ఒకవేళ అలాంటి సమస్యలుంటే డెయిరీ ఉత్పత్తులు, గ్లూటెన్ ఉండే ఆహారాలకు దూరంగా ఉండాలి. అంతేకానీ, టీనేజర్లు ఈ ఆహారాన్ని తినకూడదన్న నియమం ఏమీ లేదు. ఎందుకంటే ఈ వయసు వారికి కాల్షియం తప్పక అవసరం. సమస్య ఉంటే మాత్రం తనకి గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే... మిల్లెట్స్, ఓట్స్, క్వినోవా, గోధుమ పిండితో చేసిన వంటకాల్ని ఆహారంలో భాగం చేయండి. వీటితోపాటు ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లతోపాటూ బ్రొకలి, బీన్స్, చిక్కుళ్లను హమ్మస్(నువ్వులు, వెల్లుల్లి, నిమ్మరసంతో చేసిన మిశ్రమం)లో మంచి స్నాక్స్‌గానూ తీసుకోవచ్చు. లీన్ ప్రొటీన్... చికెన్, చేపలు పెట్టొచ్చు. వీటితో తన శరీరానికి కావాల్సిన కాల్షియం అందుతుంది. వీటితోపాటు శరీరంలో చక్కెర స్థాయుల్ని పెంచే ప్రాసెస్ చేసిన ఆహారపదార్థాలకు దూరంగా ఉంచితే మంచిది.

బంగారం - వెండి



24న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,40,440	1,27,750	2,23,200
విజయవాడ	1,36,850	1,27,350	2,26,600
ప్రొద్దుటూరు	1,40,500	1,29,260	2,24,000
రాజమహేంద్రవరం	1,38,930	1,27,350	2,44,000
విశాఖపట్నం	1,38,500	1,27,350	2,10,000
తమిళనాడు	-----	1,28,000	2,44,000

మీకు తెలుసా!

చిన్నపిల్లలకు దాదాపు మూడేళ్లు వచ్చే వరకూ మంచిచెడు అనే భావనలకి అర్థం తెలియదు. అందుకే ఈ వయసులో చిన్నారి ఏదైనా తప్పు చేస్తే తల్లిదండ్రులు దండించడం సరికాదు అంటున్నారు నిపుణులు.

ఏ ప్రాంతమైనా తీసుకోండి... మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చే కొన్ని సంప్రదాయాలు, కళలు ఉంటాయి. తరవాతి తరాలు వాటిని కొనసాగిస్తే అవి బతుకుతాయి. లేదంటే కనుమరుగవుతాయి. తన బామ్మ నుంచి నేర్చుకున్న కళ అలా అంతరించి పోవద్దు అనుకున్నారు రీతా! ఆమె ప్రయత్నం విదేశీయులను ఆకర్షించడమే కాదు... వందలమందికి ఉపాధినీ కల్పిస్తోంది.

బామ్మల కళని బతికిస్తున్నారు!



ఈటీవీ భారత్

రీతా ఆదివాసి మహిళ. ఈమెది ఉద్ధమ్ నగర్. తరవాత వారణాసిలో స్థిరపడ్డారు. అప్పట్నుంచీ ఆమె ప్రయత్నం ఒకటే తన హస్తకళను బతికించుకోవడం! ఈమె 'ముంజ్' అనే క్రాఫ్ట్‌ను సాధన చేసేవారు. ఇది తన పూర్వీకుల కళ. రీతా తన అమ్మమ్మ, నానమ్మల నుంచి దీన్ని నేర్చుకున్నారు. ఈ కళ దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుందట. తనూ వదిలేస్తే తరవాతి తరాలకు అందదన్న ఉద్దేశంతో కొనసాగిస్తూ వచ్చారు. ముంజ్ అనే ఒక గడ్డిని అల్లుతూ బుట్టలు, బొమ్మలు, గృహాలంకరణ వస్తువులు చేస్తారు. 'ఇది ఉత్తరాది రాష్ట్రాల్లో నదీ ప్రాంతాల్లో మాత్రమే దొరికే గడ్డి రకం. పర్యావరణ హితం, ఎక్కువ కాలంపాటు మన్నుతాయి. మా తెగల వేడుకలు, పండుగలేవైనా ఈ గడ్డితో చేసిన వస్తువులు ఉండాల్సిందే. వీటిని శుభప్రదంగానూ భావిస్తాం. కాబట్టే, పూజా వస్తువులను ఈ గడ్డితో చేసిన బుట్టల్లో పెట్టుకుని మరీ తీసుకెళతాం. వీటి తయారీకి నదుల వద్దకు వెళ్లి ఈ గడ్డిని సేకరిస్తాం. శుభ్రపరిచి ఒక్కొక్కటిగా విడదీసి ఎండబెడతాం. ఈ క్రమంలో పాడవకుండానూ, కుళ్లిపోకుండానూ చూసుకోవాలి. ఒక్కో వస్తువూ తయారవడానికి 2-3 రోజులు పడుతుంది' అంటారు రీతా.

తొలిరోజుల్లో ఈమె ఒక్కరే. క్రమంగా మరికొందరిని చేర్చుకుని నేర్పించి, ఉపాధి కల్పించడం మొదలుపెట్టారామె. ప్రభుత్వం, ఎన్‌జీఓలు సాయంగా నిలవడంతో వీరి ఉత్పత్తులకు మార్కెటింగ్ ఏర్పడింది. దీంతో వీళ్లూ ఆధునికతను అందిపుచ్చుకున్నారు. గృహాలంకరణ వస్తువులు, పిల్లల ఆటవస్తువులు, ఆభరణాలు, పెన్ హోల్డర్లు... ఇలా ఎన్నింటినో తీసుకొచ్చారు. గత ఏడాది ఈ మహిళలు ప్రధాని మోదీని కలిసినప్పుడు వీరికి అండగా ఉంటామని మాటనిచ్చారట. దీంతో ఎక్కడ ఎగ్జిబిషన్లు జరిగినా వీరికి స్టాల్స్ పెట్టుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఫలితంగా 500 మంది మహిళలు ఉపాధి పొందుతుండటమే కాదు... నెలకు రూ.15-20 వేలు సంపాదించుకోగలుగుతున్నారు. అంతేకాదు, వీరి ఉత్పత్తులకు విదేశాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. జర్మనీలో వీటికి ఎక్కువ గిరాకీ ఉందట. 'ఒకప్పుడు డబ్బులు అవసరమైతే ఇంట్లో మగవాళ్లని అడిగేవాళ్లం. ఇప్పుడు మా కాళ్ల మీద నిలబడుతున్నాం. ఇంటి స్థితిగతులనీ మార్చుకున్నాం' అంటారీ మహిళలు. వారసత్వ కళని ముందుకు తీసుకెళ్లడమే కాదు... వాటితో తమ జీవితాల్నీ మార్చుకుంటున్న రీతానీ ఆమె బృందాన్నీ అభినందించాల్సిందే కదూ!



కొన్ని పూలమొక్కల్ని చూసినప్పుడు వీటినెందుకు పెంచాలి అనిపించడం సహజం. వాసన ఉండవు. అందంగానూ కనిపించవు. ఆ కోవకే చెందుతాయి గంటాకారంలోని డిసెంబర్ పూలు.

డిసెంబరాలు... ప్రకృతి అందాలై!

ఇంటి తోట




మూడు నాలుగు దశాబ్దాల క్రితంనాటి అమ్మాయిలకు ఇవి సుపరిచితమే. కంచెల్లోనూ రోడ్లపక్కనా ఎక్కడంటే అక్కడ పెరిగే డిసెంబరాల్నీ, పసుపు పచ్చని ముళ్లగోరింటల్నీ కోసి మాలలు కట్టి ఇష్టంగా పెట్టుకునేవారు. ఏ వాసనా లేకున్నా ఆ రంగులు ఆకర్షణీయంగా కనిపించటం, పైగా తేలికగా ఉండటంతో ఎంత పెద్ద మాలనైనా జడలో ఇట్టే తురిమేసేవారు. ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలల్లో ఇవి ఎక్కువగా పూస్తాయి. అందుకే డిసెంబర్ పూలుగా ఇవి వాడుకలోకి వచ్చి ఉండొచ్చు. వీటిల్లో నీలం, ఊదా, తెలుపు, గులాబీ, ఎరుపు... ఇలా రంగులూ రకాలూ చాలానే ఉన్నాయి. అలాంటి రకాల్లో ఒకటి ముళ్లగోరింట. దీన్నే వజ్రదంతి అనీ పిలుస్తారు. అయితే ఇంతకీ వీటిని ఎందుకు పెంచాలన్నదేగా సందేహం. సృష్టిలోని ప్రతి మొక్కకీ ఓ ప్రయోజనం ఉంటుందని తెలిసిందేగా. అలాగే డిసెంబరాలకీ ఓ ప్రత్యేకత ఉంది. ఈ కాలంలో చెట్టునిండా విరబూసిన పూలల్లోని తేనె, ఆ పూల రంగులూ పిట్టల్నీ సీతాకోకచిలుకల్నీ ఆకర్షిస్తాయి. అంటే, పరాగ సంపర్కానికి తోడ్పడుతూ జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయి. పైగా దట్టమైన పొదల్లా పెరిగే ఈ మొక్కల కొమ్మల మధ్యలో బుల్లి పిట్టలూ కీటకాలూ గూళ్లు కట్టుకుంటాయి. అలాగే ఈ మొక్కల ఆకుల్నీ వేర్లనీ జ్వరం, శ్వాస సమస్యల నివారణకు సంప్రదాయ చికిత్సల్లో వాడుతుంటారు. అందుకే ఎలాంటి వాసనా లేకున్నా అందమైన ఆకారంలో మురిపించకున్నా ఆ పూల రంగులు ప్రకృతి అందాలై విరబూస్తుంటాయి. మరి మన ఇంటితోటలో వీటికీ చోటిద్దామా?!

రంగవల్లిక



20 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకూ


టి.అరుణ, నెల్లూరు



21 చుక్కలు
1 వచ్చేవరకూ


ఇందు సాయి
సూళ్లూరుపేట



21 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకూ



కల్యాణి
బెంగళూరు

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా: వసుంధర, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.

Email:vasundhara@eenadu.in

అనంత ప్రేమ.. అపార దయ!



కరుణా సముద్రుడైన ఏసుక్రీస్తును హృదయపూర్వకంగా ఆరాధించాలి. దైవం పట్ల విధేయులమై త్యాగనిరతిని చూపాలి. మనల్ని మనం సమర్పించుకోవాలి. ఈ మూడు గుణాలనూ ప్రదర్శించిన మేరీమాత మనందరికీ ఆదర్శం. ఏసుక్రీస్తును ఈ లోకానికి తీసుకొచ్చిన శుభదినమే క్రిస్మస్. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన సంగతులను స్మరించుకుందాం...

కన్య మరియ ఇజ్రాయెల్ దేశం గలిలయలోని నజరేతు నివాసి. జాతి పేరుతో వెలివేసిన వర్గంలో పుట్టి పెరిగిందామె. ఉన్నతవర్గంగా భావించే యూదయ ప్రాంత యూదులు వీరితో సంబంధబాంధవ్యాలు నెరిపేవారు కాదు. దేవుడిపట్ల భయభక్తులున్న ఆమెకి యోసేపు అనే నీతిబద్ధుడైన వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. లోక సంరక్షణార్థం దేవాధిదేవుడు మరియను ప్రధాన పాత్రగా ఎంచుకున్నాడు. ఆమె వద్దకు పరలోకం నుంచి నేరుగా ప్రధాన దూత గాబ్రియేల్ వచ్చాడు. తన రక్షణ సంకల్పం ఆమె ద్వారా నెరవేరేలా దేవుడు నిశ్చయించడం ఎంత భాగ్యం! మరో కోణంలో చూసినట్లయితే ఇంకా వివాహం కాని మరియ గర్భం ధరించడం భయంకరమైన పరిస్థితి. పర్యవసానం ఘోర అవమానం. మరణంతో సమానమైన పరిణామం. కానీ మరియ సందేహించలేదు. దేవుని వాక్యం సఫలమయ్యేందుకు ఎంతటి దుర్భర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధపడింది. లోకులు పలురకాలుగా విమర్శిస్తారు, పరాభవిస్తారు. తనకు నిర్ణయించిన వ్యక్తి వివాహం చేసుకునేందుకు నిరాకరిస్తాడు. ఆఖరికి తల్లిదండ్రులు కూడా తనను చేరదీయరు. ఎందుకంటే యూదు మతాచారాలు అంత కఠినమైనవి. వాటిని కచ్చితంగా అమలుచేయాలనే ఆంక్ష ఉంది. ఒక కన్యక వివాహం కాకుండా గర్భం దాల్చినట్లయితే ఆమెకు మరణశిక్ష అమలయ్యేది. అయినా దైవచిత్తాన్ని నెరవేర్చేందుకు ఎలాంటి పర్యవసానాన్ని అయినా సహించాలనుకుంది. వర్తమానం తీసుకొచ్చిన గాబ్రియేల్‌తో 'నేను ప్రభువు దాసురాలిని! ఆయన చెప్పినట్లే జరుగుతుంది' (లూకా 1:38) అంది. ఈ మాటల్లో ఆమె విధేయత, సమర్పణ, దైవచిత్తం నెరవేరాలనే ఆకాంక్ష గోచరిస్తాయి.

అంతర్యం.. అంతరార్థం..

ఏసుప్రభువు దావీదు వంశంలో జన్మిస్తాడని బైబిల్ పేర్కొంది. అందుకు ప్రభువు మరియను ఎంచుకున్నాడు. అలాగే పుట్టబోయే బిడ్డ తండ్రి లేని అనాథగా ఉండకూడదు. దావీదు సింహాసనానికి వారసుడిగా ఉండాలి. అందుకే దావీదు వంశంలో నీతిబద్ధునిగా పేరొందిన యోసేపును ప్రభువు నిర్ణయించాడు. మరియ తల్లి, యోసేపు తండ్రి కావడం వెనుక అంతర్యం, అంతరార్థం ఇదే.

ఏసు జన్మించినప్పుడు తూర్పు నుండి వచ్చిన జ్ఞానులు ఆకాశాన నక్షత్రాన్ని చూసి.. ఆయనను పూజించేందుకు వచ్చామని చెప్పారు. ఆ నక్షత్రానికి సంకేతంగా, స్ఫూర్తిగా క్రిస్మస్ రోజున క్రైస్తవులు తమ ఇళ్లలో నక్షత్రాన్ని వేళ్లాడదీస్తారు. జ్ఞానుల మాటలు గమనిస్తే.. వారికి ఏసు జన్మను గురించి ఎవరూ చెప్పలేదు. కానీ వారు వచ్చి దైవ కుమారుడు జన్మించాడని, ఆయనను దర్శించి పూజించేందుకు వచ్చామని అన్నారు. తన ప్రజలను వారి పాపాల నుంచి విడిపించేందుకు కన్య మరియ గర్భాన ఏసు జన్మించినట్లుగా దేవదూత ప్రత్యక్షమై తెలియజేశాడు. మనందరినీ రక్షించేందుకు ఏసుక్రీస్తు ఈ లోకంలో ఉదయించిన సుదినమే క్రిస్మస్.

అదీ నిజం..!

యోసేపు మరియను త్యజించదలచినప్పుడు.. పుట్టబోయే శిశువెవరో దూత ద్వారా తెలియజేశాడు పరిశుద్ధాత్ముడు. ఆ మాటలు విశ్వసించిన యోసేపు మరియను ఆదరించి అక్కున చేర్చుకున్నాడు.

ఏసు పుట్టిన సమయంలోనే అప్పటి పరిపాలకుడైన సీజర్ చక్రవర్తి జనాభా లెక్కలు సేకరించమని ఆజ్ఞాపించాడు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తమ స్వస్థలాలకు చేరుకున్నారు. అలా యోసేపు తన భార్య మరియను తీసుకుని బెత్లెహేమ్ వెళ్లాడు. పట్టణమంతా జనంతో కిక్కిరిసి ఉంది. ఒక సత్రంలో యోసేపు స్థలం కోసం ప్రయత్నించగా.. యజమాని స్థలం లేదన్నాడు. సర్వలోకాన్నీ సృష్టించిన దేవునికి (లూకా 2:7) కొద్ది స్థలం కరవైంది. మరియ ప్రసవించింది. యోసేపు బిడ్డను వస్త్రంలో చుట్టి పశువులశాలలో పడుకోబెట్టాడు. ఆయనకు మన హృదయంలో స్థలం ఇవ్వాలి. బాల ఏసు జన్మించినప్పుడు దేవ దూతలు స్తోత్రం చేశారు. వాళ్లు తెలియజేసినట్లుగా పుట్టిన బిడ్డకు (లూకా 2:21) ఏసు అని పేరు పెట్టారు. ఏసు జననం భూలోకంలో అందరికీ శుభం చేకూరుస్తుందని బైబిల్ పేర్కొంది.

ప్రబోధలు.. పరివర్తన..

పాపం అనేది కుష్టువ్యాధి కంటే భయంకరమైంది. ఏసు ప్రభువు తప్ప ఆ వ్యాధి నుంచి మరెవరూ తప్పించలేరు. లోకుల పాపాలను ఏసు ప్రక్షాళన చేసిన ఉదంతాలు కోకొల్లలు. ప్రభువు ఎందరో వ్యాధిగ్రస్తులను స్వస్థపరిచాడు. నీళ్లను ద్రాక్షరసంగా మార్చాడు. ఐదు రొట్టెలు, రెండు చేపలతో వేలాదిమందికి విందు సిద్ధం చేశాడు. తన ప్రబోధాత్మక మాటలతో ఎందరెందరిలోనో మానసిక పరివర్తన తెచ్చి, సజ్జనులుగా మార్చాడు.

ఏసు పుట్టకముందు రాసిన చరిత్ర పాత నిబంధన. కొందరు భావిస్తున్నట్టు.. పాత నిబంధనలో యెహోవా దేవుడు తప్ప ఏసు లేడనేది సరికాదు. అందులోనూ ప్రభువు ఉన్నాడు. దేవుని వాక్యం శ్రద్ధగా చదివితే.. పాత నిబంధన మూలరాయి, పునాది, కేంద్రం.. అన్నీ లోకసంరక్షకుడైన ఏసుక్రీస్తే అని అర్థమవుతుంది. పూలదండలోని దారం పైకి కనిపించకపోయినప్పటికీ.. ఆ కుసుమాలకు ఆధారమై, వాటిని పట్టి ఉంచుతుంది. అదే రీతిగా ఏసుక్రీస్తు అనే దారం చుట్టూ అల్లిన వృత్తాంతాలను దండలా మనకు అందిస్తుంది పాత నిబంధన.

మనందరి మీద అనంత ప్రేమ.. అపార దయలను కురిపించే ఆ దయామయుణ్ణి సదా స్మరించు కుందాం. తోటివారితో ప్రేమగా, స్నేహంగా, వినమ్రంగా ఉందాం. ప్రతి ఒక్కరి హృదయంలో ఏసుప్రభువు స్థిరనివాసం ఏర్పరచుకోవాలని ఆశిద్దాం.

– మర్రి ఎ.బాబ్జి

అమృత సిద్ధిని చేకూర్చిన కూర్మావతారం

డిసెంబరు 31 కూర్మ ద్వాదశి



శ్రీమహావిష్ణువు అవతారాల్లో కూర్మావతారం రెండోది. 'నీ వీపు మీద భూమిని మోస్తున్న ఓ కేశవా! తాబేలు రూపాన్ని ధరించిన ఓ జగదీశా! నీకు జయం' అంటూ జయదేవుడు కూర్మావతారాన్ని స్తుతించాడు. పుష్యమాసంలో శుద్ధ ద్వాదశి కూర్మ ద్వాదశి. ఒక సందర్భంలో ఇంద్రుడిపై ఆగ్రహించిన దూర్వాస మహర్షి- దేవతలు శక్తిహీనులవుతారని శపించాడు. ఆ శాప కారణంగా దేవతలు రాక్షసుల చేతిలో ఓడిపోవడం ప్రారంభమైంది. దాంతో దేవతలంతా విష్ణుమూర్తిని ఆశ్రయించారు. పాలకడలిని చిలికి అమృతాన్ని సాధిస్తే సమస్య తొలగుతుందన్నాడు విష్ణువు. స్వామి సూచన మేరకు ఆ మహత్కార్య సాధనలో భాగంగా దేవతలు దానవులతో సంధి కుదుర్చుకున్నారు. మందర పర్వతం కవ్వంగా, వాసుకి తాడుగా.. పాల సముద్ర మథనం మొదలయ్యింది. కానీ మందరగిరి సముద్రంలో మునిగిపోసాగింది. ఆ తలపెట్టిన కార్యం విఫలమయ్యే పరిస్థితి ఉత్పన్నమై.. దేవతలు మరోసారి విష్ణువును ప్రార్థించారు. శ్రీహరి బ్రహ్మాండ పరిమాణాన్ని తలపిస్తూ మహాకూర్మరూపంలో అవతరించాడు. పాలసముద్రంలో మునిగిపోయిన మందర పర్వతాన్ని తన వీపుమీద నిలిపాడు. మళ్లీ సాగర మథనం కొనసాగి.. చివరిగా అమృతం లభించింది. విష్ణుమూర్తి మోహినీ రూపం దాల్చి ఆ అమృతాన్ని పంచడంతో దేవతలు బలం పుంజుకొని అమరులయ్యారు. రాక్షసుల్ని ఓడించి పాతాళానికి అణిచేశారు. ఇందులోని అంతరార్థాన్ని కైవల్యోపనిషత్తు వివరించింది. మనలో ఉండే మంచి, చెడులే దేవతలు, రాక్షసులు. బుద్ధి అనే మందర పర్వతాన్ని కవ్వంగా, అహంకారం అనే వాసుకిని తాడుగా చేసుకొని మనసనే క్షీరసాగరాన్ని చిలికితే జ్ఞానామృతం వెలువడుతుంది. ఈ విషయాన్నే ఆదిశంకరులు 'వేదాంత సాగరాన్ని మథిస్తే చివరి ఫలితంగా మోక్షమనే అమృతం లభిస్తుంది' అన్నారో సందర్భంలో.

పోతన భాగవతంలో కూర్మావతారం గురించి చాలా చక్కగా వర్ణించారు. కూర్మం తన శరీరాన్ని లోనికి ముడుచుకుని స్థిరంగా ఉంటుంది. మన ఇంద్రియాలను లౌకిక విషయాల నుంచి మరల్చినప్పుడు జీవనయానంలో మందర పర్వతమంత బరువును భరిస్తూ కూడా, స్థిరంగా ఉండగలరన్నదే కూర్మావతారం ఇచ్చే సందేశం. కూర్మం కాలస్వరూపానికి చిహ్నం. కదలాలని అనిపించినప్పుడు మెల్లగా కదులుతుంది. వద్దనుకున్నప్పుడు స్తంభించిపోతుంది. స్థితప్రజ్ఞత్వానికి, దృఢచిత్తానికి కూర్మాన్ని సంకేతంగా చెబుతారు. ఈ లక్షణాలు సాధకుడికి తప్పనిసరిగా ఉండాలి. సర్వోత్కృష్టమైన చైతన్యంతో నారాయణుడు కూర్మావతారం దాల్చి అమృత సిద్ధిని చేకూర్చాడు. కూర్మ అవతారాన్ని పూజిస్తే సకల పాపాలూ హరిస్తాయని అగ్నిపురాణం పేర్కొంది. శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలో శ్రీహరి కూర్మావతారంలో ఉన్న ఆలయం ఉంది. అక్కడ కూర్మశైలంపై కూర్మనాథస్వామి అవతరించాడు. విష్ణుతీర్థుడనే భక్తుడి తపస్సుకు మెచ్చి విష్ణువు కూర్మరూపంలో అక్కడ వెలిసాడని పురాణ వచనం. ఎక్కడాలేని విధంగా శ్రీకూర్మనాథస్వామి ఆలయంలో రెండు ధ్వజస్తంభాలుంటాయి. కర్పూరేశ్వరుడు, హాటకేశ్వర, సుందరేశ్వర, కోటేశ్వర, పాతాళ సిద్ధేశ్వరులతో ఇది పంచలింగారాధ్య క్షేత్రం కూడా.

– త్రినేత్ర

హిందూ సంప్రదాయం ప్రకారం పూజ, పెళ్లి, ఇతర శుభకార్యాల్లో తమలపాకులు తప్పనిసరిగా ఉంటాయి. తాంబూలంలో తమలపాకులదే అగ్రస్థానం. కాబట్టి ఏ పుణ్యకార్యాల్లోనైనా తమలపాకు ఉంటేనే పరిపూర్ణమవుతుందని, వీటివల్ల మనకు తెలీని శక్తి, సుస్థిరత చేకూరతాయని పెద్దలు చెబుతారు.

తమలపాకు.. సకల దేవతా స్వరూపం

నాగవల్లి దళం అనే తమలపాకును దేవతాదళం అని కూడా అంటారు. ఇందులో సకల దేవతలూ కొలువై ఉంటారన్నది పురాణ వచనం. అందుకే వాటిని పరమ పవిత్రంగా భావించి శుభకార్యాల్లో వినియోగించడం ఆనవాయితీ అయ్యింది. తమలపాకు లేకపోతే అది అసంపూర్ణంగా మిగిలిపోతుంది.




తమలపాకు తొడిమ భాగంలో లక్ష్మీదేవి ఉంటుంది. మధ్యభాగంలో పరమేశ్వరుడి అర్ధభాగమైన పార్వతీదేవి కొలువయ్యుంటుంది. కొనభాగంలో విద్యలకు అధిదేవత అయిన సరస్వతీదేవి స్థిరనివాసం ఏర్పరచుకుంది. అంతేకాదు.. తమలపాకులో ఇంద్రుడు, మన్మథుడు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కూడా కొలువై ఉంటారు. తమలపాకును శ్రేయోదాయకంగా, దైవికశక్తికి చిహ్నంగా భావిస్తారు. నోములు, వ్రతాల్లో తాంబూలం ఇవ్వడం, భోజనం తర్వాత తమలపాకును సేవించడం పురాణకాలం నుంచి కొనసాగుతున్న ఆచారం. ఆయుర్వేదంలో దీన్ని ఔషధంగా ఉపయోగిస్తారు.



- పండిన, వాడిపోయిన లేదా చిరిగిన తమలపాకులను శుభకార్యాల్లో ఉపయోగించకూడదు.
- పూజలో తమలపాకును సమర్పించడం దైవిక శక్తుల పట్ల భక్తిని వ్యక్తపరిచే మార్గం.
- ఇవి ఆధ్యాత్మిక చింతనకే కాదు.. ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి కనుకనే తమలపాకులు ఎంతో విశిష్టమైనవి.

ఆడ్వెంట్: దేవుని భవిష్యత్తులోకి ఆహ్వానం


ప్రతి సంవత్సరం ఆడ్వెంట్, క్రిస్మస్ కాలాలు మన ముందుకొచ్చి నిలుస్తాయి. ఇవి పండుగ కాలాలే కాదు, మన జీవితాలను తిరిగి ఒకసారి పరిశీలించుకునే అవకాశాలు. ఆనందాన్ని గుర్తు చేస్తూనే, ప్రభువు కోసం సిద్ధపడమని, ప్రార్థనలో నిలవమని, నిరీక్షణతో జీవించమని గుర్తు చేస్తాయి. దేవుడు నూతన కార్యం చేయబోతున్నాడన్న ఆశను, ఆ దేవునితో కూడిన భవిష్యత్తులోకి మనల్ని పిలుస్తున్నాడన్న సత్యాన్ని ఆడ్వెంట్ కాలం స్పష్టంగా చెబుతుంది. 'ఆడ్వెంటస్' అంటే దేవుడు స్వయంగా జోక్యం చేసుకుని చరిత్రను మలిచే భవిష్యత్తు. ఇది గతంపై ఆధారపడింది కాదు; దేవుని శక్తిమంతమైన కార్యాలపై ఆధారపడింది. దీనినే 'పరూసియ'గా పిలుస్తారు. చాలామంది దీన్ని ఏసు క్రీస్తు రెండో రాకడకే పరిమితం చేస్తారు. కానీ దేవుడు రెండో రాకడకాలం, క్రిస్మస్ లాంటి పండుగ కాలంలోనే కాదు; ప్రతిరోజూ కరుణతో మన జీవితాల్లోకి వస్తాడు. మానవాళి రక్షణ కోసం జన్మించి, ఆయా కార్యాలను నెరవేర్చి, మరణించి తిరిగి లేచిన ఏసు తన పరిచర్య ముగింపులో 'కాలములను, సూచక చిహ్నాలను వివేచించండి' అని ఉపదేశించాడు. మరి ఇవాళ్టి రోజున మనం ఆ సూచనలను గ్రహించగలుగుతున్నామా? మన కాలంలో దేవుడు చేస్తున్న కార్యాలను గుర్తించగలుగుతున్నామా? లేక భవిష్యత్తును కేవలం గతానికి కొనసాగింపుగానే చూస్తూ, దేవుని నూతన కార్యములను విస్మరిస్తున్నామా? ఏసు జననం ఒక చారిత్రక సంఘటన మాత్రమే కాదు. అది మనలను దేవుని భవిష్యత్తులోకి ఆహ్వానించే పిలుపు. ఆ భవిష్యత్తు భయం కలిగించేది కాదు; ఆశను, నూతనత్వాన్ని కలిగించేది. ఈ ఆడ్వెంట్ కాలంలో మనం కూడా సిమ్యోనులా నిరీక్షణతో జీవిస్తూ, దేవుడు మన మధ్యకు వస్తున్నాడని గుర్తించి, ఆయన సహవాసంలోకి అడుగుపెడితే అదే క్రిస్మస్ పండుగకు నిజమైన అర్థం.



– పాస్టర్ జాన్ బిళ్లా, అట్లాంటా తెలుగు చర్చ్, జార్జియా, అమెరికా

డిసెంబరు 25 త్యాగరాజస్వామి ఆరాధన

సుస్వర నాదబ్రహ్మ.. సద్గురు త్యాగరాజస్వామి



ఆపాతమధురం, ఆనందకారకమైంది సంగీతం. అది ఆత్మానుసంధానమై అలరింపజేస్తుంది. అందుకే సంగీతంలో దేవుడు కొలువై ఉంటాడని చెబుతారు. 'నేనుండేది వైకుంఠంలో, యోగి హృదయంలో, అనంత సూర్య మండలంలో కాదు.. భక్తులు పరవశించి గానం చేసే చోటే నా నివాసం' అని శ్రీమహావిష్ణువు, నారదుడితో ప్రస్తావించినట్లు విష్ణుపురాణం పేర్కొంది.

దైవదత్తమైన సంగీతకళను ఆరాధించి, ఉపాసించి తమ జీవితాన్ని చరితార్థం చేసుకున్న ఎందరో వాగ్గేయకారులు, సంగీతకళాకారులు ఈ దివ్యధాత్రిని పునీతం చేశారు. భగవదనుగ్రహానికి సంబంధించిన అంశాల్లో నాదోపాసన విశేషమైందని సామవేదం పేర్కొంది. ఇది ఈశ్వరతుల్యమైంది. ధర్మార్థకామ మోక్షాలను సిద్ధింపచేస్తుంది. కర్ణాటక సంగీతానికి త్యాగరాజస్వామి అఖండ యశస్సును ఆపాదించారు. తేటతెలుగులో మధురమైన కీర్తనల్ని సృజించారు. ఆయన రాసి గానం చేసిన కీర్తనలు ఆధ్యాత్మిక చైతన్య తరంగాలై భాసిల్లుతున్నాయి. ఆయన కృతుల్లో వేదసారం, పురాణాల మార్మికత, ఉపనిషత్తుల సారాంశం, భగవద్గీతా ఉపదేశాలు సమ్మిళితమై ఉంటాయి. భక్తి విశేషాలే కాకుండా నీతి సందేశాలను, జీవన జాగృతికి ఉపకరించే మరెన్నో అంశాలను తన రచనల్లో మేళవించారు. సంగీత యోగం ద్వారా దైవసాన్నిధ్యాన్ని సాధించవచ్చని, సాధికారికంగా నిరూపించారు.

96 కోట్లసార్లు పునశ్చరణ

తమిళనాడు తంజావూరు సమీపంలోని తిరువారూర్‌లో 1767 మే 4 వైశాఖ శుద్ధ షష్ఠిన కాకర్ల త్యాగయ్య జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామానికి చెందిన ఆయన పూర్వీకులు తమిళనాడుకు వలస వెళ్లారు. త్యాగయ్య చదువు నిమిత్తం వారి కుటుంబం తిరువారూర్ నుంచి తిరువయ్యారు వెళ్లి స్థిరపడింది. త్యాగయ్య అక్కడ వేదవేదాంగాల్ని, పురాణేతిహాసాల్ని అభ్యసించారు. తన 13వ ఏటనే 'నమోనమో రాఘవాయ' అనే కీర్తనను స్వరపరిచారు. ఇహలోకపరమైన విషయాలపై ఆసక్తిలేని త్యాగయ్య సదా రామనామ సంకీర్తన చేసేవారు. పంచనందీశ్వరాలయంలో శ్రీరామ తారక మంత్రాన్ని 96 కోట్లసార్లు పునశ్చరణ చేసి రామసాక్షాత్కారాన్ని పొందారని చెబుతారు. రామసంకీర్తనల్ని ఆలపిస్తూ- ఉంఛవృత్తిలో (పొలాల్లో మిగిలిన ధాన్యాన్ని సేకరించి జీవనం సాగించడం) తనకు దక్కినదానినే ప్రసాదంగా, రామానుగ్రహంగా భావించారు. భక్తి జ్ఞాన మిళితమై, గానయోగ్యంగా, అమృతతుల్యంగా ఉండే త్యాగయ్య కీర్తనలు మనల్ని దైవానికి చేరువ చేస్తాయి.

శొంఠి వెంకటరమణయ్య వద్ద త్యాగయ్య సంగీతాభ్యాసం చేశారు. గురువు అనుగ్రహంతో శ్రీరాముడి మీద అనంత భక్తితో త్యాగయ్య 24 వేల కీర్తనల్ని రచించారని అంచనా. కానీ వాటిలో 8 వేల కీర్తనలు మాత్రమే లభ్యమవుతున్నాయి. నవవిధ భక్తి రీతుల్లో దాస్యం, ఆత్మనివేదనలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సహజమైన భక్తి, ఆర్తి, విధేయత, విన్నపాలు, వేడుకోళ్లు, రసరమ్యత, పారమార్థిక చింతన వంటి మధుర భావోద్వేగాలు ఆయన కీర్తనల్లో ప్రస్ఫుటమవుతాయి.

సంగీతం ద్వారా అలౌకిక అనుభూతి సాధ్యమవుతుందని త్యాగయ్య తన కీర్తనల ద్వారా నిరూపించారు. సంగీతకళ అనేది కేవలం సప్తస్వర విన్యాసానికే గాక ఆ కళద్వారా ఇహలోక, పరలోక ప్రయోజనాల్ని సాధించాలని త్యాగరాజ స్వామి ప్రతిపాదించారు. రాముడి మీద తన అపార భక్తిని పలురీతుల్లో, వివిధ కోణాల్లో అమోఘంగా వ్యక్తపరిచారు. 'నీ దయ రాదా కాదనె వారెవరూ కల్యాణ రామా..', 'గ్రహబలమేమి శ్రీరామానుగ్రహబలమే..', 'నిధి చాల సుఖమా.. రాముని సన్నిధిసేవ సుఖమా..' ఇలా శ్రీరామసంకీర్తనా స్రవంతిని సరళసుందరంగా, తన్మయపూరితంగా వెలువరించారు త్యాగరాజస్వామి.

ఒక కీర్తన.. 108 నామాలు

త్యాగరాజ పంచరత్న కృతులు పరమపావనకరమైనవిగా సంగీతజ్ఞులు పరిగణిస్తారు. ఘనరాగ పంచరత్న కీర్తనలుగా వ్యవహరించే ఈ కృతుల్ని త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో సంగీతకళాకారులు పారవశ్యంగా ఆలపిస్తారు. ఈ కీర్తనా స్రవంతి సమ్మోహనమై హృదయాలను ఆకట్టుకుంటుంది, మనల్ని దైవసన్నిధిలోకి తీసుకెళ్తుంది. 'జగదానందకారకా..' అనే తొలి పంచరత్న కీర్తన 108 శ్రీరాముడి నామాలను వెల్లడిస్తుంది. ఇది ఆయన రామభక్తి వైభవాన్ని, పరిపూర్ణంగా ప్రకటిస్తుంది. 'దుడుకు గల నన్నే', 'నగుమోము గనలేని..', 'కనకన రుచిరా..', 'ఎందరో మహానుభావులు.. అందరికీ వందనములు..' వంటి కీర్తనలు భక్తి ప్రపంచంలో మణిమకుటాలై ప్రకాశిస్తున్నాయి.

లౌకికం, పారమార్థికం, ప్రాపంచికం, తాత్వికం, ఉపదేశం, ఉత్సవ సంప్రదాయం, ప్రబోధకం వంటి అంశాలుగా త్యాగయ్య కీర్తనల్ని వర్గీకరిస్తారు. వాగ్గేయకారుడిగా, పరమభక్తాగ్రేసరుడిగా, నాదం ద్వారా యోగాన్ని సాధించిన నాదయోగిగా త్యాగయ్య కీర్తి గడించారు. సంగీతం వేదాంతసారమని నిర్వచించి తన జీవితాన్ని నాదోపాసనకే అంకితంచేసిన మహానుభావుడాయన. పుష్య బహుళ పంచమి నాడు సద్గురు త్యాగరాజస్వామి శివైక్యం చెందారు. ఆయన సృజించిన కీర్తనలు సూర్య చంద్రులు ఉన్నంతవరకూ నిలిచి ఉంటాయి.

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

పుణ్యాల రాశి ముక్కోటి ఏకాదశి

పుష్యమాస శుక్లపక్ష ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ రోజున విష్ణుమూర్తి ముక్కోటి దేవతలతో కలిసి భూలోకానికి విచ్చేసి భక్తులకు దర్శనమిస్తాడు కాబట్టి ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ఈ పుణ్య దినాన విష్ణ్వాలయాల్లో ఉత్తర ద్వారం తెరిచి ఉంచుతారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను ఉపదేశించింది, క్షీరసాగర మథనం జరిగి హాలాహలం, అమృతం ఉద్భవించింది ఈ రోజునే. పూజలు, హోమాలు, ఉపవాస, జాగరణలకు అధిక ఫలం చేకూర్చే రోజిది. పరిబియ్యంలో దాగివున్న మురాసురుణ్ణి సంహరించింది వైకుంఠ ఏకాదశి నాడేనని పురాణాలు పేర్కొన్నాయి. అందువల్ల ఈ ఏకాదశి నాడు బియ్యంతో చేసిన ఏ పదార్థాలనూ తినకూడదంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే ఏడాదిలోని అన్ని ఏకాదశులూ ఉపవాసం పాటించినట్టేనన్నది పురాణ వచనం. ముర అంటే తామసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వైకుంఠ ఏకాదశి నాడు ఉపవసించి, ద్వాదశినాడు అన్నదానం చేసిన వారు పాప విముక్తులవుతారు. ఉప అంటే దగ్గరగా, వాసం అంటే ఉండటం. దైవానికి దగ్గర కావాలనేదే ఉపవాసంలోని అంతరార్థం. పూజ, జపం, ధ్యానం లేదా ఉపాసన మొదలైన సాధనల ద్వారా మనసును శ్రీహరిపై లగ్నం చేస్తే ఉత్తమ ఫలితాలు కలుగుతాయి. ఈ పుణ్యదినాన చెడు పనులు, అబద్ధాలు, దురాలోచనలకు దూరంగా ఉండాలి. బ్రహ్మచర్యం పాటించాలి. అప్పుడే శ్రీహరి అనుగ్రహం కలుగుతుంది. ముక్కోటి ఏకాదశి రోజున నియమనిష్ఠలతో పూజించినవారికి పుణ్యఫలంతో పాటు కార్య సిద్ధి కలుగుతుంది. మోక్షం ప్రాప్తిస్తుంది.

ఎలా చేయాలి...



ఆ రోజున ఉదయం ఐదు గంటలకే లేచి, స్నానమాచరించి తెలుపు రంగు దుస్తులు ధరించాలి. గడపకు పసుపు రాసి కుంకుమ అద్ది, తోరణాలు, ముగ్గులతో తీర్చిదిద్దాలి. పూజా మందిరాన్ని శుభ్రపరచి, విష్ణుమూర్తి విగ్రహం లేదా పటాన్ని కుంకుమ, చందనం, పుష్పాలతో అలంకరించాలి. దేవుని ఎదుట కలశం ఏర్పాటుచేయాలి. జాజి, తామర తదితర కుసుమాలు, తులసి దళాలతో పూజించాలి. పాయసం, కేసరి మొదలైన తీపి పదార్థాలు, ఆకుపచ్చని పండ్లను నైవేద్యంగా సమర్పించి శ్రీహరిని స్తుతించాలి. మధ్యాహ్నం 12 గంటల లోపు పూజ పూర్తవ్వాలి. మట్టి ప్రమిదల్లో ఐదు తామర వత్తులను వెలిగించాలి. కొబ్బరినూనె వాడాలి. ముక్కోటి ఏకాదశి నాడు చేసే విష్ణుపూజ, గీతా పారాయణం, గోవింద నామ స్మరణ, పురాణ శ్రవణం మోక్ష ప్రాప్తి కలిగిస్తాయి. వీటికి అవకాశం లేకుంటే 'ఓం నమో నారాయణాయ' అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.

ముక్కోటి ఏకాదశి ప్రాశస్త్యాన్ని వివరించే కొన్ని పురాణ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. పర్వతమహర్షి సూచన మేరకు వైఖానసుడనే రాజు వైకుంఠ ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం వల్ల అతడి పితృదేవతలకు నరక బాధల నుంచి విముక్తి కలిగి స్వర్గలోకంలో ప్రవేశించారు. మరో కథనాన్ని అనుసరించి భద్రావతి రాజ్యాన్ని పాలించే సుకేతుడు ఎన్ని పుణ్యకార్యాలు చేసినా సంతానం కలగలేదు. చివరికి ఏకాదశి వ్రతంతో పుత్రుడు కలిగాడు. తదాదిగా పిల్లలు లేనివారు ఏకాదశి వ్రతం ఆచరించడం ఆనవాయితీ అయ్యింది. అందుకే ఈ ఏకాదశిని పుత్రదా ఏకాదశి అని కూడా అంటారు. – నూతి శివానందం

(c) eenadu

ఈనాడు సినిమా

చావునే చంపిన వీరనారి మైసా


రష్మిక


తన తొలి నాయికా ప్రాధాన్య చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'తో మరో చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకుంది నటి రష్మిక. ఇప్పుడీ జోష్‌లోనే తన రెండో నాయికా ప్రాధాన్య సినిమాగా 'మైసా'ని పట్టాలెక్కించింది. రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్ర ఫస్ట్‌గ్లింప్స్‌ను బుధవారం విడుదల చేశారు. "నా బిడ్డ సచ్చిందన్నారు. కానీ, మట్టే వణికిపోయింది.. నా బిడ్డ రక్తాన్ని దాచలేక. గాలే ఆగిపోయింది.. నా బిడ్డ ఊపిరి మోయలేక. అగ్గే బూడిదయ్యింది.. మండుతున్న నా బిడ్డని చూడలేక. ఆఖరికి చావే చచ్చిపోయింది.. నా బిడ్డని చంపలేక" అంటూ ఓ తల్లి శక్తిమంతమైన సంభాషణతో రష్మికను యాక్షన్ కోణంలో పరిచయం చేసిన తీరు ఆసక్తి రేకెత్తించింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన వీరనారిగా మునుపెన్నడూ చూడని కొత్త గెటప్‌లో అలరించనుంది. ఇది పూర్తిగా అటవీ నేపథ్యంగా సాగే బలమైన భావోద్వేగాలతో నిండిన హై యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండనుంది. ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంట్లో ఈశ్వరీ రావు, రావు రమేశ్, గురు సోమసుందరం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: శ్రేయాస్ కృష్ణ.

'ట్రైన్'లో శ్రుతి పాట


శ్రుతి హాసన్

'తలైవాన్ తలైవి', 'ఏస్' లాంటి చిత్రాలతో ఇటీవలే తెరపై సందడి చేశారు తమిళ హీరో విజయ్ సేతుపతి. ప్రయోగాత్మక పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించే ఆయన ఖాతాలో 'ట్రైన్' అనే సినిమా ఉన్న సంగతి తెలిసిందే. మిస్కిన్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రుతి హాసన్ కథానాయికగా నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి మొదటి సింగిల్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. 'కన్నకుళికారా..' అంటూ సాగుతున్న ఈ పాటను శ్రుతిహాసన్ స్వయంగా ఆలపించడం విశేషం. మిస్కిన్ కంపోజ్ చేసిన ఈ పాట భావోద్వేగభరితంగా సాగుతూ ఆకట్టుకుంటోంది. నరేన్, సంపత్ రామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

కథా చర్చలు షురూ


అల్లు అర్జున్

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ - తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కలయికలో సినిమా ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. ఈ ప్రాజెక్ట్‌పై నిర్ణయం త్వరలోనే వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలే అమెరికా నుంచి తిరిగొచ్చిన అల్లు అర్జున్‌ను దర్శకుడు లోకేశ్ కనగరాజ్ హైదరాబాద్‌లో కలిసి కథని వినిపించారు. ఇంకొన్ని చర్చల తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలున్నాయి. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఆ సినిమా పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఆ వెంటనే కొత్త చిత్రాన్ని మొదలు పెట్టాలనేది అల్లు అర్జున్ ప్రణాళిక. కథా చర్చలు విజయవంతమైతే లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా వచ్చే ఏడాది పట్టాలెక్కే అవకాశాలున్నాయి.

అల్లు అర్జున్‌తోనే ఆ సినిమా?

అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ పురాణాల ఆధారంగా సిద్ధం చేసిన కథలోనూ అల్లు అర్జున్ నటించే అవకాశాలున్నట్టు సమాచారం. మొదట ఈ కలయికలోనే సినిమా ఖరారైంది. అయితే ఆ తర్వాత అనూహ్యంగా ఎన్టీఆర్ పేరు తెరపైకొచ్చింది. కానీ ఇప్పుడు మళ్లీ ఆ కథ అల్లు అర్జున్‌తోనే చేయనున్నట్టు సమాచారం. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. కార్తికేయుడి కథతో ఈ చిత్రం రూపొందనున్నట్టు తెలుస్తోంది.

పవునుతాయి వస్తోంది పరుగెత్తండి


రాధిక

పవునుతాయి కలెక్షన్ల కోసం వస్తోంది త్వరగా పరుగెత్తండిరోయ్... అంటూ ఓ ఊరంతా టెన్షన్ పడుతూ పరుగులు తీస్తుంది. ఇంతకీ ఎవరీమె? కలెక్షన్లు ఎందుకు వసూలు చేస్తుంది? అనేది తెలుసుకోవాలంటే 'తాయి కిళవి' సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. రాధికా శరత్ కుమార్ ప్రధాన పాత్రలో శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరో శివ కార్తికేయన్ సొంత నిర్మాణ సంస్థలో రూపొందుతోంది. తాజాగా ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో పవునుతాయి అనే రుణాలిచ్చే వృద్ధురాలిగా సరికొత్త అవతారంలో కనిపిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు రాధికా శరత్‌కుమార్. ఈ సినిమా ఫిబ్రవరి 20న రానుంది.

"బైరాన్‌పల్లి వాసులతో కలిసి ఓ ఫుట్‌బాల్ ఆటగాడు చేసే పోరాటమే 'ఛాంపియన్' సినిమా. మంచి కథ.. సంకల్పం ఉన్నప్పుడు అన్నీ దానంతట అవే కుదురుతాయని అంటారు. ఈ చిత్ర విషయంలో అదే జరిగింది" అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఆయన దర్శకత్వంలో రోషన్, అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మించాయి. ఇది నేడు థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు ప్రదీప్ అద్వైతం.

ఛాంపియన్ చూశాక రోషన్‌ని గుండెల్లో పెట్టేసుకుంటారు!


ప్రదీప్ అద్వైతం

● "బైరాన్‌పల్లి పోరాటాన్ని.. మైఖేల్ సి విలియమ్స్ అనే ఫుట్‌బాల్ ఆటగాడి కథను ముడిపెట్టి రాసుకున్న ఫిక్షనల్ కథ ఇది. నేను తొలుత ఈ రెండింటిని రెండు వేర్వేరు కథల్లా అనుకున్నా. కాకపోతే కేవలం బైరాన్‌పల్లి పోరాటాన్నే చూపిస్తే ఏదో డాక్యుమెంటరీలా అయిపోతుందేమో అనిపించింది. అందుకే ఇప్పుడున్న ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా సినిమా చేయాలన్న ఉద్దేశంతో సికింద్రాబాద్‌లోని లాలాగూడలో పుట్టి పెరిగిన మైఖేల్ పాత్రను బైరాన్‌పల్లిలోకి మార్చి ఫిక్షనల్‌గా ఓ మంచి కమర్షియల్ కథను సిద్ధం చేశా. ఈ సినిమా అంతా తన కోణం నుంచే సాగుతుంటుంది. ఇది ప్రధానంగా తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంలో ఉంటుంది. ఇక దీంట్లోని ప్రేమకథ, బ్రిటిష్ తిరుగుబాటు అంశం హీరో కోణం నుంచి వస్తాయి. ఈ మూడింటిని ఎలా ముడిపెట్టాం అన్నది ఆసక్తికరంగా ఉంటుంది".

● "మనం పుట్టిన నేలపై మనకి తెలియని కథలు చాలా ఉంటాయి. అలా చరిత్రలో ఉన్న ఓ ఊరి కథను ఆసక్తికరంగా ప్రేక్షకులకు తెలియజెప్పాలన్న ఉద్దేశంతో ఈ సినిమా చేశా. తెలంగాణ పోరాట ఇతివృత్తం ఉంది కాబట్టి ఇది ఆద్యంతం సీరియస్ కోణంలో సాగే చిత్రమేమీ కాదు. ఆ బైరాన్‌పల్లి వాసులతో కాసేపు గడిపి.. వాళ్లతో కలిసి నడిచి.. ఆఖరికి వాళ్లతో పాటుగా పోరాటం చేసి, ఏడ్చి బయటకు వచ్చినట్లుగా ఉంటుంది. సినిమా చూసి బయటకు వచ్చాక ఇందులోని పాత్రలన్నింటినీ ప్రేక్షకులు తమతో పాటు ఇళ్లకు తీసుకెళ్లిపోతారు".

● "రోషన్‌కి ఈ కథని 2021 చివర్లో వినిపించా. వెంటనే సినిమాని పట్టాలెక్కించాలనుకున్నాం. కానీ, అప్పటికే వైజయంతీ మూవీస్‌లో 'కల్కి 2898ఏడీ' లాంటి భారీ సినిమా మొదలవడంతో అందరూ ఆ హడావుడిలో పడిపోయారు. అందుకే మేమూ ఆ చిత్రం పూర్తయ్యాకే దీన్ని ప్రారంభిద్దామని అనుకున్నాం. ఈ విరామంలో మరేదైనా కథ ఉంటే సినిమా చేసుకుని రమ్మని రోషన్‌కి కూడా సలహా ఇచ్చాం. తను మాత్రం ఈ చిత్రం చేశాకే మరేదైనా సినిమా చేస్తానని మూడేళ్లు పట్టుదలగా నిరీక్షించాడు. ఇప్పుడిప్పుడే కెరీర్‌లో ఎదుగుతున్న తన లాంటి ఓ హీరో.. ఇలా ఒక సినిమా కోసం మూడేళ్లు కేటాయించడం గొప్ప విషయం. ఇందులో రోషన్ చాలా అద్భుతంగా నటించాడు. సినిమా చూశాక ప్రతిఒక్కరూ తనని గుండెల్లో పెట్టేసుకుంటారు. ఈ చిత్రం తనకోసమైనా తప్పకుండా విజయం సాధించాలని కోరుకుంటున్నా. అనస్వర రాజన్‌కి ఇది తొలి తెలుగు చిత్రమైనప్పటికీ చాలా కష్టపడి స్వయంగా తెలుగులో డబ్బింగ్ చెప్పుకుంది".

క్షమాపణలు చెప్పడానికి నేనేమీ సిగ్గుపడను!


శివాజీ

'దండోరా' వేడుక నుంచి బయటకు రాగానే తాను పొరపాటుగా మాట్లాడినట్టు గ్రహించానని, అందుకు తోటి నటులతోపాటు, ఆడబిడ్డలకు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నానన్నారు నటుడు శివాజీ. తప్పుగా మాట్లాడానని అనిపించిన వెంటనే ఇంటికొచ్చి మొదట తన భార్యకు క్షమాపణలు చెప్పానన్నారు. బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసిన శివాజీ తన వ్యాఖ్యలపై మరోసారి వివరణ ఇచ్చారు. "ఒక సినిమా వేడుక తర్వాత ఇటీవల కథానాయిక నిధి అగర్వాల్‌కు ఎదురైన అనుభవం నన్ను వెంటాడింది. సమంత కూడా అలాంటి ఇబ్బందినే ఎదుర్కొన్నారు. సమాజంలో ఏం జరిగినా సినిమాల వల్లే చెడిపోతున్నారనే మాటలు తరచూ వింటుంటాం. సినిమా నుంచే నా కుటుంబం బతుకుతోంది. అలాంటి నా సినిమాని ఎవరూ వేలెత్తి చూపించకూడదనే ఉద్దేశంతో కథానాయికల వస్త్రధారణ గురించి మాట్లాడాను. అంతే తప్ప, ఫలానా దుస్తులే వేసుకోవాలని చెప్పడానికి నేనెవరిని? నేను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నా. ఆ వ్యాఖ్యల సందర్భంలో నేను వినియోగించిన పదజాలం మాత్రం తప్పు. మూడు దశాబ్దాల సినీ జీవితంలో కానీ.. రాజకీయాల్లో కానీ ఎప్పుడూ తప్పు మాట్లాడని నేను ఇలా ఎలా మాట్లాడానా అనే అంతర్మథనంలో ఉన్నా. 36 గంటలైంది నిద్రలేక. మనం మనుషులం, పొరపాట్లు జరుగుతాయి. అలా అని నా వ్యాఖ్యల్ని సమర్థించుకోవడం లేదు. మహిళా కమిషన్ ఈ నెల 27న హాజరు కావాలని కోరింది. నేను వెళ్లి క్షమాపణలు చెబుతా. అందుకు నేనేమీ సిగ్గుపడను. అయితే కొంత మంది ఆవేశంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), మహిళా కమిషన్‌కూ, రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేయడం బాధ అనిపించింది. 'శివాజీతో మాట్లాడి, క్షమాపణలు చెప్పిద్దాం' అని ఎవ్వరూ ప్రయత్నించలేదు. సుప్రియ ఒక్కరే ఫోన్ చేశారు. ఆమెకు క్షమాపణ చెప్పా" అన్నారు.

★ నటుడు శివాజీ విలేకర్ల సమావేశం అనంతరం నటి నిధి అగర్వాల్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. ఆమె ఇటీవల లులూ మాల్‌లో జరిగిన వేడుకలో దిగిన ఫొటోను స్టోరీగా పెట్టి "బాధితురాలిపై తప్పు నెట్టడాన్ని అతి తెలివి అంటారు" అని క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఇది తనని ఉద్దేశిస్తూ శివాజీ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే నిధి ఈ పోస్ట్ పెట్టినట్లు నెట్టింట చర్చలు మొదలయ్యాయి. ఇక మరోవైపు తన పట్ల శివాజీ చేసిన వ్యాఖ్యలకు అనసూయ సామాజిక మాధ్యమాల వేదికగా బదులిచ్చారు. శివాజీ బాధితుడిలా నటిస్తూ సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఈ కాలంలోనూ ఆడవాళ్ల దుస్తుల గురించి మాట్లాడటం చేతగాని తనమని పేర్కొన్నారు. అభద్రతా భావంతో బతికే వాళ్లు మాత్రమే ఎదుటి వాళ్లపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తారని.. తామేం చిన్నపిల్లలం కాదని, తమ హక్కులు తమకు తెలుసని, తమ ఇష్టానికి బతకనీయాలని, తనకు ఎవరి అండ అవసరం లేదని, తనని తనని తాను ఎలా రక్షించుకోవాలో తెలుసని అనసూయ అన్నారు.

వడ్డీ కాంతమ్మ వచ్చేసింది


అక్షర గౌడ

సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రం 'హైలెస్సో'. శివ చెర్రీ, రవి కిరణ్ నిర్మిస్తున్నారు. నటాషా సింగ్, నక్ష శరణ్ కథానాయికలు. దీంట్లో ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ కీలక పాత్రలో అలరించనుంది. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో తను వడ్డీ కాంతమ్మగా చలువ కళ్లద్దాలు పెట్టుకుని.. చేతిలో డబ్బులు, నడుము దగ్గర పుస్తెల తాళ్లతో కనిపించిన తీరు ఆసక్తిరేకెత్తించింది. ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ చిత్రమిది. శివాజీ ఇందులో ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఛాయాగ్రహణం: సుజాత సిద్ధార్థ.

'రేజర్'.. రక్తపాతం


రవిబాబు

ఇటీవలే ఈటీవీ విన్ వేదికగా 'ఏనుగు తొండం ఘటికాచలం' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించారు దర్శకుడు రవిబాబు. ఇప్పుడు కొత్తగా 'రేజర్' అనే మరో సినిమాని ప్రకటించారు. దీన్ని సురేశ్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను బుధవారం విడుదల చేశారు. 18ఏళ్లు దాటిన వాళ్లే చూడాలన్న హెచ్చరికతో మొదలైన ఈ గ్లింప్స్ ఆద్యంతం హింస, రక్తపాతంగా సాగింది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవికి థియేటర్లలోకి రానుంది.

ఆ వందో అమ్మాయి ఎవరు?


జి.వి.ఆంజనేయులు, శ్రీధర్, బెల్లంకొండ సురేశ్, శైలి, అమర్‌దీప్, సుధాకర్, ఎం.ఎం.నాయుడు

ఒక యువకుడు పెళ్లి కోసం పడిన పాట్లు ఎలాంటివో తెలియాలంటే మా 'సుమతీ శతకం' చూడాల్సిందే అంటున్నారు అమర్‌దీప్ చౌదరి. ఆయన కథానాయకుడిగా... ఎం.ఎం.నాయుడు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శైలి చౌదరి కథానాయిక. సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాత. వచ్చే ఏడాది ఫిబ్రవరి 6న ఈ చిత్రం రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "పెళ్లి చేసుకోవాలని 99 మంది అమ్మాయిల్ని చూసిన తర్వాత కథానాయకుడికి తారసపడిన వందో అమ్మాయి ఎవరు? ఆమెతో పెళ్లి కోసం ఎలాంటి ప్రయత్నాలు చేశాడన్నది తెరపైనే చూడాలి" అన్నారు. కొమ్మాలపాటి శ్రీధర్, బెల్లంకొండ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నువ్విలానే ప్రేమించు


కయాదు, విష్వక్ సేన్

"ఉన్నమాట పైకి చెప్పనంటూ.. లోపల లేమో నన్ను ఒప్పుకుంటూ.. నువ్వలానే ప్రేమించవే" అంటూ తన ప్రియురాలి కోసం ప్రేమ పాటలు పాడుతున్నారు విష్వక్ సేన్. ఆయన హీరోగా నటిస్తున్న 'ఫంకీ' సినిమా కోసమే ఇదంతా. కయాదు లోహార్ కథానాయిక. కేవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మొదటి గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'ధీరే ధీరే..' అంటూ సాగుతున్న పాటకు విష్వక్, కయాదుల జోడీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. భీమ్స్ సిసిరోలియో సంగీతమందించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ కామెడీ డ్రామా వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న రానుంది.

విభిన్నమైన రివేంజ్ డ్రామా

పార్థ గోపాల్ హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'డైమండ్ డెకాయిట్'. సూర్య జి.యాదవ్ తెరకెక్కించారు. మేఘన కథానాయిక. ఈ సినిమా ఫిబ్రవరిలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో టీజర్‌ను విడుదల చేశారు. అనంతరం హీరో, నిర్మాత పార్థ గోపాల్ మాట్లాడుతూ.. "ఇదొక విభిన్నమైన ఫ్యామిలీ ఎమోషనల్ రివేంజ్ డ్రామా. ఆద్యంతం ఆసక్తిరేకెత్తించేలా ఉంటుంది. ఎన్నో సవాళ్లు ఎదుర్కొని దీన్ని తెరకెక్కించాం. అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా" అన్నారు. "కడప జిల్లాలోని అరవై లొకేషన్లలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు దర్శకుడు సూర్య. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రోహిత్, మేఘన తదితరులు పాల్గొన్నారు.

కొన్నాళ్లు వెంటాడే 'ఈషా'


వంశీ నందిపాటి, శ్రీవిష్ణు, కేఎల్ దామోదర్‌ప్రసాద్, బన్నీ వాస్, అఖిల్‌రాజ్, హెబ్బా పటేల్

"హారర్ సినిమా చూసిన అనుభవం నాకు చాలా రోజుల పాటు గుర్తుండిపోతుంది. 'ఈషా' కూడా అలా అందరినీ కొన్నాళ్లపాటు వెంటాడే సినిమాగా నిలుస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు ప్రముఖ కథానాయకుడు శ్రీవిష్ణు. ఆయన ముఖ్య అతిథిగా ఇటీవల హైదరాబాద్‌లో 'ఈషా' విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. అఖిల్‌రాజ్, త్రిగుణ్ కథానాయకులుగా చిత్రమిది. హెబ్బా పటేల్ కథానాయిక. సిరి హనుమంతు ముఖ్యభూమిక పోషించారు. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. హేమ వెంకటేశ్వరరావు నిర్మాత. కేఎల్ దామోదర్‌ప్రసాద్ సమర్పకులు. గురువారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకలో కథానాయకుడు శ్రీవిష్ణు బిగ్‌టికెట్‌ని ఆవిష్కరించారు. ప్రేక్షకుడిని భయపెట్టడంతోపాటు అర్థవంతమైన ఓ సందేశాన్ని పంచే చిత్రమిదని, ఒక రోజు ముందు నుంచే ప్రత్యేక ప్రదర్శనలతో సినిమాని విడుదల చేస్తున్నామన్నారు వంశీ నందిపాటి. పతాక సన్నివేశాలు అందరికీ షాక్‌నిస్తాయన్నారు బన్నీ వాస్. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

నాకే నమ్మశక్యంగా లేదు


అర్చన

విభిన్నమైన కథ.. పాత్రల్లో నటించే అవకాశం కెరీర్ ఆరంభంలోనే రావడం అరుదైన విషయమని... ఓ కథానాయికగా 'శంబాల' ప్రయాణం ఎంతో తృప్తినిచ్చిందని చెప్పారు అర్చన అయ్యర్. అచ్చమైన తెలుగమ్మాయైన ఈమె 'కృష్ణమ్మ' సినిమాతో మెరిసింది. ఇటీవల ఆది సాయికుమార్‌తో 'శంబాల' చిత్రంలో నటించింది. యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈరోజు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు అర్చన అయ్యర్.

● "నేను కథ పూర్తిగా వినకుండానే ఒప్పుకున్న సినిమా ఇది. ఆ స్థాయిలో నాకు నచ్చిన కథ ఇది. సినిమా మొదలైన ఐదు నిమిషాల్లోనే ప్రేక్షకులు శంబాల ప్రపంచంలో లీనమైపోతారు. థియేటర్లలో చూస్తూ ఓ గొప్ప అనుభూతిని పొందే కథ ఇది. ఇప్పటికే పలుచోట్ల ప్రత్యేక ప్రదర్శనలు జరిగాయి. చాలామంది సినీ ప్రముఖులు సినిమాని చూశారు. పలువురు దర్శకులు ఫోన్ చేసి నాకు అభినందనలు తెలిపారు. నటులకి జీవితంలో ఒక్కసారే ఇలాంటి పాత్రల్లో నటించే అవకాశం వస్తుందేమో అనిపిస్తోంది. కెరీర్‌ని ఇప్పుడిప్పుడే మొదలుపెట్టిన నేను ఇలాంటి ఓ గొప్ప పాత్రని పోషించానంటే ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. నేను దేవి అనే యువతిగా కనిపిస్తా".



దరఖాస్తు చేశారా?

☛ రంగరాయ మెడికల్ కాలేజీ కాకినాడలో ఉద్యోగాలు
చివరి తేదీ: 2025, డిసెంబరు 27

☛ ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌లో 149 టెక్నీషియన్ ఉద్యోగాలు
చివరి తేదీ: 29-12-2025

ప్రాక్టీస్ బిట్స్ — ఇండియన్ జాగ్రఫీ

1. ప్రపంచ చక్కెర ఉత్పత్తిలో భారత్ వాటా?
   1) 5%   2) 19%   3) 25%   4) 50%
2. కింది వాటిలో తెల్ల బంగారం అని దేనిని పిలుస్తారు?
   1) వెండి   2) వజ్రాలు   3) అల్యూమినియం   4) పత్తి
3. జనపనారకు ఉన్న మరో పేరు?
   1) సాఫ్ట్ ఫైబర్   2) గోల్డెన్ ఫైబర్   3) బ్రౌన్ ఫైబర్   4) గోల్డెన్ కాటన్
4. పొగాకును మనదేశానికి పరిచయం చేసినవారు?
   1) బ్రిటిష్   2) ఫ్రెంచ్   3) డచ్   4) పోర్చుగీసు
5. కింది వాటిలో రబీకాలం పంట?
   1) శనగలు   2) కందులు   3) రెండూ   4) ఏదీకాదు
6. రబ్బరు పంటలో ముందంజలో ఉన్న రాష్ట్రం?
   1) కర్ణాటక   2) తమిళనాడు   3) కేరళ   4) సిక్కిం
7. కింది వాటిలో బీవరేజస్ క్రాప్ కానిది ఏది?
   1) టీ   2) కాఫీ   3) కోకో   4) చెరకు
8. కిందివాటిలో సుగంధద్రవ్యానికి చెందని పంట?
   1) మిరియాలు   2) యాలకులు   3) లవంగాలు   4) కోకో

సమాధానాలు: 1-2; 2-4; 3-2; 4-4; 5-1; 6-3; 7-4; 8-4.

తీగల దారులు.. వెలుగుల బాటలు!

విద్యుత్తు అందరి జీవితాల్లో విడదీయలేని భాగంగా మారిపోయింది. చీకట్లను తొలగించే బల్బుల నుంచి ఆధునిక స్మార్ట్ ఫోన్ల వరకు అన్నీ విద్యుత్తుపైనే ఆధారపడి పని చేస్తాయి. అయితే ఆ విద్యుత్తు ఒక చోట నుంచి మరో చోటికి ప్రయాణించాలంటే నిర్దిష్ట మార్గం అవసరం. దానినే విద్యుత్తు వలయం అంటారు. ఈ వలయాల్లో విద్యుత్తు ప్రవాహాన్ని నియంత్రించడానికి, కొలవడానికి, ఉపయోగించుకోడానికి వివిధ రకాల విద్యుత్తు పరికరాలు కావాలి. వాటిలో స్విచ్‌లు, బ్యాటరీలు, బల్బులు, రెసిస్టర్లు ఉంటాయి. భౌతికశాస్త్ర అధ్యయనంలో భాగంగా పోటీ పరీక్షార్థులు విద్యుత్తు వలయాల నిర్మాణాన్ని, పనితీరును తెలుసుకోవాలి. చిన్న స్విచ్‌లు కూడా అత్యంత పెద్దవైన యంత్రాలను ఏ విధంగా నియంత్రిస్తాయో అర్థం చేసుకోవాలి. విద్యుత్తు వలయాలు, వాటిలోని పరికరాల సమన్వయంపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ స్టడీస్ — భౌతిక శాస్త్రం


విద్యుత్తు వలయాలు, పరికరాలు


విద్యుత్తు ప్రవహించడానికి ఉపయోగపడే పూర్తి నిర్మాణాలను విద్యుత్తు వలయాలు అంటారు. ఇందులో కేవలం విద్యుత్తు ప్రసరించే తీగలు మాత్రమే కాకుండా అనేక రకాల పరికరాలు ఉంటాయి. ఇళ్లు, కార్యాలయాలు, పరిశ్రమలు లాంటి అనేక రకాల పరిసరాల్లో, పరికరాల్లో విద్యుత్తు ప్రసరించాలి అంటే వలయాలు తప్పనిసరి. ఈ విద్యుత్తు వలయాలు సాధారణంగా ఇళ్లలోనే కనిపిస్తాయి.

విద్యుత్తు వలయం: కొన్ని విద్యుత్తు సాధనాల (పరికరాల)ను విద్యుత్తు ప్రసార తీగల సహాయంతో విద్యుత్తు జనకానికి కలిపితే ఏర్పడే అమరికను 'సాధారణ విద్యుత్తు వలయం' అంటారు.
★ ఏదైనా ఒక విద్యుత్తు ఘటానికి విద్యుత్తు సాధనాలు కలిపితే విద్యుత్తు వలయం ఏర్పడుతుంది. ★ స్విచ్‌లు, హోల్డర్లు, బల్బులు మొదలైన పరికరాలను తీగలతో కలిపితే వలయాలు ఏర్పడతాయి. ★ విద్యుత్తు వలయంలో రెండు రకాల సాధారణ వలయాలు ఉంటాయి.

1) మూసిన విద్యుత్తు వలయాలు
2) తెరచిన విద్యుత్తు వలయాలు

1) మూసిన విద్యుత్తు వలయాలు: విద్యుత్తు జనకానికి (బ్యాటరీ/విద్యుత్తు ఘటం) విద్యుత్తు పరికరాలను తీగల్లో మూసి ఉన్న స్థితిలో ఉంచే వలయాలను మూసిన వలయం అంటారు.
★ మూసిన స్థితిలో వలయం ద్వారా విద్యుత్తు ప్రసారం జరుగుతుంది.
★ వలయాలను సూచించే క్రమంలో విద్యుత్తు పరికరాల సంకేతాలను ఉపయోగిస్తూ వలయాన్ని గీస్తే వాటిని వలయ పటాలుగా పిలుస్తారు.
★ విద్యుత్తు వలయంలో స్విచ్ మూసి ఉన్నపుడు మాత్రమే విద్యుత్తు ప్రసారం జరిగి బల్బు వెలుగుతుంది. ★ వలయంలో విద్యుత్తు సంకేతాలను అమర్చే క్రమంలో స్విచ్‌ను ఏ స్థానంలోనైనా అమర్చవచ్చు.





2) తెరచిన వలయం: విద్యుత్తు వలయంలో స్విచ్‌ను తెరచిన స్థితిలో ఉంచితే వలయం అసంపూర్ణం అవుతుంది. దీనినే తెరచిన వలయం అంటారు. ★ ఈ వలయంలో ఏ భాగం నుంచి కూడా విద్యుత్తు ప్రసారం జరగదు. ★ ఒకవేళ స్విచ్ మూసి ఉన్నప్పటికీ వలయంలోని తీగలో ఎక్కడైనా తెరచి ఉంటే విద్యుత్తు ప్రసారం జరగదు. దానిని కూడా తెరచిన విద్యుత్తు వలయమే అంటారు. ★ విద్యుత్తు వలయంలో విద్యుత్తు వనరులు, వాహకాలు, పరికరాలు, స్విచ్ ప్రధానంగా ఉంటాయి. ★ స్విచ్ వలయాన్ని మూయడానికి, తెరవడానికి సాయపడే ముఖ్యమైన పరికరం. ★ విద్యుత్తు ఘటం ద్వారా విద్యుత్తు శక్తి ప్రసారం జరిగి విద్యుత్తు బల్బులు వెలుగుతాయి/పరికరాలు పనిచేస్తాయి.





కొన్ని విద్యుత్తు పరికరాలు

1) ఫ్యూజ్‌వైర్: ఇది వలయానికి రక్షణ పరికరం. వలయంలో అధిక విద్యుత్తు ప్రసారం జరిగినప్పుడు ఇది కాపాడుతుంది. ★ దీనిని సీసం (లెడ్), తగరం (టిన్)ల మిశ్రమంతో తయారుచేస్తారు. దీనిలో 37% లెడ్, 63% టిన్‌ల మిశ్రమం ఉంటుంది. రాగి, సిల్వర్ మిశ్రమంతోనూ తయారుచేస్తారు. అధిక నిరోధం, అధిక ద్రవీభవన స్థానం ఈ పదార్థాల లక్షణాలు.

2) ఎంసీబీ: ఫ్యూజ్‌కు బదులుగా వాడే రక్షణ పరికరం. ఎంసీబీ అంటే మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్. ★ వలయంలో విద్యుత్తు ప్రవాహం సురక్షిత హద్దు దాటిన తర్వాత స్విచ్‌లు తమంతట తామే ఆగిపోతాయి. వాటిని తిరిగి ఆన్‌చేస్తే వలయం పూర్తి అవుతుంది.

3) కెపాసిటర్: విద్యుచ్ఛక్తిని విద్యుత్తు ఛార్జ్ (ఆవేశం) రూపంలో నిల్వచేయగలిగే పరికరం. ★ దీనిలోని రెండు వాహక పలకలను ఒక ఇన్సులేటింగ్ (విద్యుత్తు బంధక) పదార్థం (సిలికాన్, మైకా) వేరు చేసి ఉంచుతుంది. ★ ఇది ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌లో శక్తిని నిల్వచేయడానికి, ఓల్టేజీని స్థిరీకరించడానికి ఉపయోగపడుతుంది.

4) గాల్వనా మీటర్: ★ ఇది అతిస్వల్ప విద్యుత్తు ఉనికిని తెలియజేసే పరికరం. ★ విద్యుత్తును కచ్చితంగా కొలిచే సున్నితమైన గాల్వనా మీటర్లను జలాంతర్గాముల్లో వాడతారు. శరీరంలో గుండె, మెదడు లాంటి వాటిలో విద్యుత్తు ఉనికి తీరును తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు.

విద్యుత్తు బల్బు



★ ఇది విద్యుచ్ఛక్తిని కాంతి శక్తి/ ఉష్ణశక్తిగా మారుస్తుంది. ★ దీనిని థామస్ ఆల్వా ఎడిసన్ 1879లో కనుక్కున్నారు. ★ విద్యుత్తు బల్బులు విద్యుత్తు వల్ల ఏర్పడిన ఉష్ణఫలితం ఆధారంగా పనిచేస్తాయి. ★ దీనిలో వెలిగే భాగాన్ని ఫిలమెంట్ అంటారు. ప్లాటినం తీగను మొదటిసారిగా ఫిలమెంట్‌గా ఎడిసన్ వాడారు. ★ నిరోధం పెంచడానికి బల్బులో ఉండే ఫిలమెంట్‌ను చాలా సన్నగా తయారుచేస్తారు. ఎంత నిరోధం పెరిగితే అంత విద్యుత్తు ఉష్ణంగా మారి ఫిలమెంట్ బాగా వేడెక్కి, మండుతూ, కాంతిని ఇస్తుంది. ★ ఫిలమెంట్లు మండి వేడెక్కడం ద్వారా కాంతినిచ్చే బల్బులను ఇన్‌కాండిసెంట్ ల్యాంప్ (ప్రకాశించే) అంటారు. దీనిలో గాలిని నింపరు. ఎందుకంటే అది ఫిలమెంట్‌తో ఆక్సీకరణ చర్య జరుపుతుంది. దీనిలో జడ వాయువులను నింపుతారు (ఉదా: హీలియం, నియాన్, ఆర్గాన్). ప్రస్తుతం వాడుతున్న ఫిలమెంట్ టంగ్‌స్టన్. ★ టంగ్‌స్టన్ పదార్థ లక్షణం - అధిక నిరోధం, అధిక ద్రవీభవన స్థానం.
★ దీనిలో విద్యుత్తు ప్రసరించే తీగలను రాగితో తయారుచేస్తారు. వీటిని లీడ్స్ అని పిలుస్తారు.
★ ప్రస్తుతం విద్యుత్తు బల్బులు అనేక రకాలుగా ఉన్నాయి. అవి ఇన్‌కాండిసెంట్ ల్యాంప్, ఫ్లోరోసెంట్ ల్యాంప్, హాలోజన్ ల్యాంప్‌లు.



రచయిత: ఎస్.వై.నాయుడు

జూనియర్ ఇంటర్ తెలుగు — రుద్రపశుపతి కథ

ఫైనల్ పరీక్షలు 2026 — ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

1. రుద్రపశుపతి ముగ్ధభక్తిని వివరించండి. **6 మార్కులు**

జ: రుద్రపశుపతి కల్మషం లేని ముగ్ధభక్తి, స్వచ్ఛమైన వాత్సల్యం, ప్రేమానురాగాలను పరమాత్మకు పంచిన నిర్మలుడు. పారవశ్యంతో కూడిన భక్తి భావం, వెన్న లాంటి హృదయం ఉన్నవాడు. శివుడంటే ఎనలేని భక్తి విశ్వాసం ఉన్నవాడు. శివుడిని చూసినంతనే ఆప్తుడిలా సేవించి, లాలించి ప్రాణాలనైనా ఇవ్వడానికి వెనకాడని భక్తుడు.

1. గరళంబు మ్రింగె శ్రీకఱ కంఠు(డునిన? **3 మార్కులు**

జ: పరిచయం: పాల్కురికి సోమన రచించిన 'బసవ పురాణం' ద్విపద కావ్యం, తృతీయాశ్వాసం నుంచి గ్రహించిన 'రుద్రపశుపతి కథ' లోనిది.
సందర్భం: దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగర మథనం చేయగా ముందుగా హాలాహలం పుట్టింది. లోక రక్షణ కోసం శివుడు మింగినవి వివరిస్తూ బసవన్న చెన్న బసవన్నకు చెప్పిన సందర్భం. భావం: శివుడు విషాన్ని మింగాడు.

2. అణుమాత్ర నా కంఠమందు(జిక్కినది.

జ: పరిచయం: ఈ వాక్యం సోమన రచించిన 'బసవ పురాణం' అనే ద్విపద కావ్యం తృతీయ శ్వాసం నుంచి గ్రహించిన 'రుద్ర పశుపతి కథ' అనే పాఠంలోనిది. సందర్భం: విషం మింగిన శివుడితో రుద్రపశుపతి వేయుము అణుమాత్రమందైనా -'విషాన్ని ఉమ్మివేయడం నీకు లెక్కకాదు' అని పలికిన సందర్భం.
భావం: అణుమాత్రమంత విషం కంఠంలో ఉంది.

1. విషం తాగిన శివుడిని కాపాడమని రుద్రపశుపతి ఎవరెవరిని కోరాడు? **3 మార్కులు**

జ: విషం తాగిన శివుడిని కాపాడమని పార్వతిని, ప్రమథ గణాలను, పరమాప్తులను, శతరుద్రులను, వీరభద్రుడిని మున్నగువారికి రుద్రపశుపతి కోరాడు.


2. శివుడు రుద్రపశుపతికి ఇచ్చిన వరమేమిటి?

జ: శివుడు రుద్రపశుపతిని తన తొడపై కుర్చోబెట్టుకుని విషం జారకుండా చూడమని వరమిచ్చాడు.

సంధులు — **3 మార్కులు**

1. విశ్వేశుడు — **జ:** విశ్వ + ఈశుడు (గుణ సంధి)
2. ప్రత్యక్షం — **జ:** ప్రతి + అక్షం (యణాదేశ సంధి)
3. కడుపుసొచ్చినను — **జ:** కడుపు + చొచ్చినను (గసడదవాదేశ సంధి)
4. పరమాప్తులు — **జ:** పరమ + ఆప్తులు (సవర్ణదీర్ఘ సంధి)

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: మండ్ల మహేశ్వర నాయుడు

పెద్ద పద్దులు.. పన్నుల భారాలు!

కరెంట్ అఫైర్స్ — రౌండప్ - 2025 — ఫిబ్రవరి


గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా యాభై లక్షల కోట్ల రూపాయల పద్దును తీసుకొచ్చింది. ఇదే బాటలో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ పరిమాణం కూడా మొదటిసారి మూడు లక్షల కోట్ల రూపాయలు దాటింది. దేశ రాజధాని దిల్లీ అసెంబ్లీలో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత భాజపా అధికారంలోకి వచ్చింది. జాతుల హింసతో కల్లోలంగా మారిన మణిపుర్‌లో ముఖ్యమంత్రి రాజీనామా చేశారు. ఆ వెంటనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించారు. తెలంగాణ ప్రభుత్వం కులాలవారీగా చేపట్టిన జనాభా లెక్కలు వెల్లడించడంతో పాటు ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపింది. ఉక్కు దిగుమతులపై ఇరవై అయిదు శాతం సుంకాలతో ట్రంప్ ప్రపంచ దేశాలపై టారిఫ్ యుద్ధానికి తెరలేపారు. దక్షిణాఫ్రికాలో అతిపెద్ద హిందూ ఆలయాన్ని నిర్మించారు. కంప్యూటింగ్ తీరుతెన్నులను మార్చేస్తుందని భావిస్తున్న గాడ్ చిప్‌ను మైక్రోసాఫ్ట్ ఆవిష్కరించింది. ఈ విధమైన ప్రధాన సంఘటనలు, పరిణామాలను పోటీ పరీక్షార్థులు మరోసారి గుర్తుచేసుకోవాలి.

ముఖ్యాంశాలు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి రూ.50.65 లక్షల కోట్ల అంచనాలతో లోక్‌సభలో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంచనాలు రూ.50 లక్షల కోట్లు దాటడం ఇదే తొలిసారి.

- తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను ఫిబ్రవరి 2న విడుదల చేసింది. రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతంగా లెక్క తేలింది. ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45%, ఓసీలు 15.79% ఉన్నారు.
- భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ మాజీ వ్యోమగామి పెగ్గీ విట్సన్ రికార్డును అధిగమించి అత్యధిక సమయం అంతరిక్షంలో నడిచిన రికార్డు సృష్టించారు. మొత్తం 9 అంతరిక్ష నడకల్లో 62 గంటల 6 నిమిషాల సమయాన్ని నమోదు చేశారు.
- తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నాలుగు సిఫార్సులు చేసింది. వాటిలో మూడింటిని ప్రభుత్వం ఆమోదించింది.
- భారత మాజీ ప్రధాన ఎన్నికల కమీషనర్ (సీఈసీ) నవీన్ చావ్లా (79) దిల్లీలో మరణించారు.
- దేశంలో మొదటి తెల్లపులుల పెంపకం కేంద్రాన్ని మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో ఏర్పాటు చేయడానికి సెంట్రల్ జూ అథారిటీ ఆమోదం తెలిపింది.
- సంప్రదాయ నిర్మాణ సామగ్రికి ప్రత్యామ్నాయంగా వెదురు ఆధారిత మిశ్రమ బంకర్లను అభివృద్ధి చేయడానికి భారత సైన్యం ఐఐటీ గువాహటితో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.
- బెల్జియం నూతన ప్రధానమంత్రిగా న్యూ ఫ్లెమిష్ అలయన్స్ నాయకుడు బార్ట్ డి వెవర్ ఎన్నికయ్యారు.



67వ గ్రామీ అవార్డుల్లో భారతీయ అమెరికన్ చంద్రిక టాండన్ రూపొందించిన 'త్రివేణి' ఆల్బమ్.. బెస్ట్ న్యూఏజ్ ఆల్బమ్ విభాగంలో పురస్కారాన్ని గెలుచుకుంది. ఈమె వౌటర్ కెల్లెర్మాన్, ఎరు మట్సుమోటోలతో కలిసి ఈ ఆల్బమ్ రూపొందించారు.

- మానవ హక్కులు, శ్రమ, పర్యావరణం, అవినీతి నిరోధకతపై ఐక్యరాజ్య సమితి సూత్రాలకు అనుగుణంగా స్థిరమైన వ్యాపార పద్ధతులకు కట్టుబడి దేశంలోనే తొలిసారిగా జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) ఐక్యరాజ్య సమితి గ్లోబల్ కాంపాక్ట్ (యూఎన్‌జీసీ)లో చేరింది.
- దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణార్ధగోళంలోనే అతిపెద్ద హిందూ దేవాలయాన్ని ప్రారంభించారు. బొచాసన్వాసి అక్షర పురుషోత్తం స్వామి నారాయణ సంస్థ (బీఏపీఎస్) బహుళ సాంస్కృతిక కేంద్రంలో భాగంగా ఈ హిందూ ఆలయాన్ని నిర్మించింది.
- భారత సైన్యం కోల్‌కతాలోని తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయమైన ఫోర్ట్ విలియం పేరును 'విజయ్ దుర్గ్'గా మార్చింది.



2025 అండర్ - 19 టీ20 మహిళల వరల్డ్ కప్‌ను భారత మహిళల జట్టు నెగ్గింది. ఫిబ్రవరి 2న దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో భారత్ 9 వికెట్ల తేడాతో నెగ్గింది. ఫైనల్ మలేసియాలోని కౌలాలంపూర్‌లో జరిగింది.

- ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నుంచి వైదొలుగుతున్నట్టు అర్జెంటీనా ప్రకటించింది. దేశాధ్యక్షుడు జేవియర్ మిలే ఈ ప్రకటన చేశారు.
- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం 'జీతో బాజీ ఖేల్ కే' అనే థీమ్ సాంగ్‌ను విడుదల చేసింది. దీన్ని ప్రఖ్యాత పాకిస్థానీ గాయకుడు అతిఫ్ అస్లాం పాడాడు.
- ప్రపంచంలోనే తొలిసారిగా ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకుల నేతృత్వంలో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) ద్వారా కంగారూ పిండాలను విజయవంతంగా సృష్టించారు.
- పనామా అధికారికంగా చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) నుంచి వైదొలగింది. అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో ఈ ప్రకటన చేశారు.
- బిమ్‌స్టెక్ యువజన సదస్సును ఫిబ్రవరి 7 నుంచి 11 వరకు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించారు. బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్‌లు ఈ సదస్సుకు హాజరయ్యాయి.
- ఫిబ్రవరి 8న దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు 48 చోట్ల భాజపా అభ్యర్థులు గెలుపొందారు.
- ఫిబ్రవరి 10న బెంగళూరులో 15వ ఏరో ఇండియా - వైమానిక ప్రదర్శనను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు.
- ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25% సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కెనడా, మెక్సికో సహా ప్రపంచ దేశాలన్నింటికీ ఇది వర్తిస్తుందన్నారు. ఫిబ్రవరి 9వ తేదీని 'గల్ఫ్ ఆఫ్ అమెరికా డే'గా ట్రంప్ ప్రకటించారు.
- కృత్రిమ మేధస్సుపై కార్యాచరణ శిఖరాగ్ర సమావేశాన్ని ప్యారిస్‌లో నిర్వహించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు.
- మెయిటీ, కుకి వర్గాల మధ్య జాతి హింస కారణంగా మణిపుర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు.
- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ (ఎన్‌సీఎస్‌కే) కాలాన్ని 2025, మార్చి 31 నుంచి మార్చి 31, 2028 వరకు మూడేళ్లు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- భారత్ - ఈజిప్ట్ సైనిక దళాల సంయుక్త విన్యాసాల మూడో ఎడిషన్ 'సైక్లోన్ - 3' రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఫిబ్రవరి 10 నుంచి 23 వరకు జరిగింది.



చంద్రయాన్ - 3 మిషన్‌లో భాగంగా విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశం 'శివశక్తి', భూమిపై జీవం ఆవిర్భవించిన నాటికన్నా పురాతనమైందని ఇస్రో శాస్త్రవేత్తలు గుర్తించారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి దగ్గరగా ఉన్న శివశక్తి ప్రాంత తొలి భౌగోళిక పటాన్ని భారత ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ బృందం రూపొందించింది. దీన్ని విశ్లేషించిన శాస్త్రవేత్తలు ఆ ప్రాంతం దాదాపు 370 కోట్ల ఏళ్ల పూర్వం ఏర్పడిందని అంచనా వేశారు.

- భాషా సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడానికి లోక్‌సభ అనువాద సేవలకు బోడో, డోగ్రి, మైథిలి, మణిపురి, సంస్కృతం, ఉర్దూ భాషలను జోడిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇప్పటివరకు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అనువాదం అందుబాటులో ఉంది.
- అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నిషేధించిన తొలి మహిళ క్రికెటర్‌గా బంగ్లాదేశ్‌కు చెందిన షోహెలీ అక్తర్ నిలిచింది. ఈమె 2023 మహిళల టీ 20 ప్రపంచ కప్ సందర్భంగా మ్యాచ్‌లను ఫిక్సింగ్ చేయడానికి ప్రయత్నించి దోషిగా తేలడంతో ఐసీసీ అన్నిరకాల క్రికెట్ ఫార్మాట్‌ల నుంచి ఐదేళ్లు నిషేధం విధించింది.



అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఫిబ్రవరి 14న వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలు విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది.

- ఫిబ్రవరి 13న మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది.
- చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెర్టిబ్రేట్ పాలియోంటాలజీ అండ్ పాలియోఆంత్రోపాలజీ (ఐవీపీపీ)కు చెందిన ప్రొఫెసర్ వాంగ్‌మిన్ నేతృత్వంలోని పరిశోధనా బృందం చైనాలోని ఫుజియాన్ ప్రావిన్స్‌లో రెండు జురాసిక్ - యుగ పక్షి శిలాజాలను కనుక్కుంది. ఇవి 149 మిలియన్ సంవత్సరాల పురాతనమైనవని అంచనా.
- గ్రీస్ నూతన అధ్యక్షుడిగా కాన్‌స్టాంటైన్ టస్సోలాస్ ఎన్నికయ్యారు. గ్రీస్ తొలి మహిళ అధ్యక్షురాలు కాటెరినా సకెల్లారో పౌలో స్థానంలో ఈయన ఎన్నికయ్యారు.
- జాతీయ గిరిజన ఉత్సవం ఆది మహోత్సవ్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిబ్రవరి 16న న్యూదిల్లీలో ప్రారంభించారు. ఫిబ్రవరి 24 వరకు మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.



ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్‌కు బీబీసీ ఇండియన్ స్పోర్ట్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డు లభించింది.

- ఫిబ్రవరి 17న భారత తదుపరి ప్రధాన ఎన్నికల కమీషనర్ (సీఈసీ)గా జ్ఞానేష్ కుమార్ నియమితులయ్యారు. ఈయన 26వ సీఈసీ.
- అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక ప్రకారం భాజపా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.4,340.47 కోట్ల ఆదాయంతో దేశంలో అత్యంత ధనిక రాజకీయ పార్టీగా అవతరించింది. రూ.1,225.11 కోట్ల ఆదాయంతో కాంగ్రెస్ పార్టీ రెండో స్థానంలో ఉంది.
- మయోరానా-1 పేరుతో ఓ విప్లవాత్మకమైన క్వాంటమ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మైక్రోసాఫ్ట్ ఆవిష్కరించింది. అరచేతిలో ఇమిడిపోయే ఈ సాధనాన్ని 'గాడ్ చిప్'గా పేర్కొంటున్నారు. ఇది కంప్యూటింగ్ తీరుతెన్నులను సమూలంగా మార్చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.
- రీఛార్జబుల్ బ్యాటరీల తయారీలో కీలకమైన లిథియం అన్వేషణతో పాటు గనుల రంగంలో పరస్పరం సహకరించుకునే విషయంలో భారత్ - అర్జెంటీనాలు ఓ ఒప్పందం కుదుర్చుకున్నాయి.



టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతిష్ఠాత్మక గౌరవ నైట్‌హుడ్ అవార్డు ప్రదానం చేసింది. యూకే - భారత్ వాణిజ్య సంబంధాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషించినందుకు ఈ పురస్కారం లభించింది.

- దిల్లీ 9వ ముఖ్యమంత్రిగా ఫిబ్రవరి 20న రేఖాగుప్తా రామ్‌లీలా మైదానంలో ప్రమాణ స్వీకారం చేశారు.
- ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను 2025 - 26కు రూ.3,22,359 కోట్లతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఫిబ్రవరి 28న శాసన సభలో ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్లను దాటడం ఇదే తొలిసారి.
- అంటు, స్వయం ప్రతిరక్షక రోగంగా గుర్తించిన మెదడు వాపు వ్యాధిని అంతర్జాతీయ ముప్పుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.



రచయిత: సీహెచ్.కృష్ణప్రసాద్

మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఉద్యోగ పనితీరు, కెరీర్ వృద్ధి, అనుకూలతలను పెంచుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను అలవరచుకోవడం, మెరుగుపరుచుకోవడం లాంటివి చేస్తుండాలి. వ్యక్తిగత విజయంతోపాటు ఆర్థిక పురోగతిలోనూ ఇది కీలకమైన ప్రక్రియ. ఒక దేశంలో ఎంతమంది నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉంటే ఆ దేశం అంత త్వరగా అభివృద్ధి చెందుతుంది. నైపుణ్యాలు, మేధస్సు, ప్రతిభ ఉన్న జనాభానే దేశ ప్రగతికి ఆధారం. అయితే ప్రస్తుతం భారత్ సహా అనేక దేశాల్లో నిపుణుల కొరత ఉంది. దీంతో ఆశించినంతగా అభివృద్ధి జరగడం లేదు. మన దేశంలో నైపుణ్యాభివృద్ధి సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



నవీన నైపుణ్యాలే.. ఆర్థికాభివృద్ధికి సోపానాలు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

భారత ఆర్థిక సమస్యలు - నైపుణ్యాభివృద్ధి

ప్రస్తుతం జనాభాపరంగా భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా ఉంది. ఐక్యరాజ్యసమితికి చెందిన స్టేట్ ఆఫ్ ది వరల్డ్ పాపులేషన్ నివేదిక - 2025 ప్రకారం, మన దేశ జనాభా 146.39 కోట్లుగా అంచనా. మొత్తం ప్రపంచ జనాభా 823.2 కోట్లుగా ఉంది.

- మన ప్రజల్లో 60% కంటే ఎక్కువ మంది పనిచేసే వయసులో ఉన్నారు. మరే దేశంలోనూ ఇంత మొత్తంలో యువతరం అందుబాటులో లేదు. భారత్‌లో నైపుణ్యం కలిగినవారిని అభివృద్ధి చేయడం ద్వారా కేవలం స్వదేశానికే కాక, ప్రపంచంలోని మిగతా ప్రాంతాలకూ సమర్థులైన మానవ వనరులను అందించవచ్చు.
- జాతీయ ఉన్నత విద్యాకమిషన్ తన నివేదికలో దేశంలో సగటు జనాభా వయసు 2020 నాటికి 29 సంవత్సరాలుగా అంచనా వేసింది. ఇది అమెరికాలో 40 ఏళ్లు, యూరప్‌లో 46, జపాన్‌లో 47 సంవత్సరాలుగా ఉంది.

నైపుణ్యాభివృద్ధి సమస్యలు/ సవాళ్లు (Skill Development Problems)

మన దేశంలో నిపుణుల కొరతకు ప్రధాన సమస్యగా పేదరికం, ప్రాంతీయ అసమానతలు, మేధో వలస, నైపుణ్య వ్యత్యాసం, అవగాహన లేమి లాంటివి ఉన్నాయి.

- ఈ కారణంగా అధిక సంఖ్యలో మానవవనరులు ఉన్నప్పటికీ, వారిలో సరైన సామర్థ్యాలు లేక ఉద్యోగ, ఉపాధి లభ్యతలో వెనుకబడి ఉన్నారు. పరిశ్రమలకు కావాల్సిన 'స్కిల్డ్ మ్యాన్‌పవర్' తగినంతగా అందుబాటులో లేదనేది వాస్తవం.
- పెరుగుతున్న యువ జనాభా (40 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారు)కు ఉపాధి అవకాశాలు కల్పించడానికి, సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడానికి, ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధే కీలకం.
- మన దేశంలో మొత్తం శ్రామిక శక్తిలో 93% అసంఘటిత రంగంలో (Un-organised Sector) ఉన్నారు. విస్తారమైన జనాభా అవసరాలను తీర్చి; మెరుగైన నైపుణ్యాలను అందించడం ద్వారా ఉపాధిని కల్పించడం, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడం అనేవి పెద్ద సవాళ్లుగా ఉన్నాయి.
- భారత్‌కు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, వైద్యులు లాంటి వారు ఉద్యోగ, ఇతర అవకాశాల కోసం బయటి దేశాలకు వలస వెళ్లడమూ నిపుణుల కొరతకు ప్రధాన కారణంగా ఉంది.

నైపుణ్యాభివృద్ధి - ప్రభుత్వ చర్యలు

దేశంలోని వివిధ రంగాల్లో యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టి, అమలు చేస్తున్నాయి. వాటిలో ముఖ్యమైనవాటిని పరిశీలిస్తే..

స్కిల్ ఇండియా మిషన్

ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం. దేశ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో ది మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యుర్‌షిప్ (ఎంఎస్‌డీఈ) ఆధ్వర్యంలో 2015 జులై 15న స్కిల్ ఇండియా మిషన్ (Skill India Mission - SIM)ను ప్రారంభించారు.

- ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై), జన్ శిక్షణ్ సంస్థాన్ (జేఎస్ఎస్), నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్‌పీఏఎస్), క్రాఫ్ట్స్‌మాన్ శిక్షణ పథకం (సీటీఎస్) లాంటివి ఎస్ఐఎంలో భాగం.
- ఈ పథకాల కింద నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా నైపుణ్యం (స్కిల్), రీ-స్కిల్, అప్-స్కిల్ శిక్షణను దేశవ్యాప్తంగా అన్ని వర్గాలకు అందిస్తారు.
- ఈ పథకాన్ని పూర్తిగా దేశంలోని జనాభాకు సమర్థవంతమైన నైపుణ్యాలు అందించి, వారికి ఉపాధిని కల్పించేందుకు రూపొందించారు. దీనిద్వారా డిజిటల్ అక్షరాస్యత, సాఫ్ట్‌స్కిల్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, అప్రెంటిస్ డ్రైవ్ లాంటివి కల్పిస్తారు.

సాధించిన విజయాలు: స్కిల్ ఇండియా మిషన్ ప్రారంభించినప్పటి నుంచి నైపుణ్యాభివృద్ధి రంగంలో గణనీయమైన విజయాలు నమోదయ్యాయి. ఈ మిషన్ కింద 2015-16లో ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా 2025 అక్టోబరు 31 నాటికి 1.64 కోట్ల మంది అభ్యర్థులకు శిక్షణతో కూడిన సర్టిఫికెట్ ఇచ్చారు.

- నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ (ఎన్‌ఏపీఎస్) కింద 2016-17 నుంచి 2025 అక్టోబరు 31 వరకు 49.12 లక్షల మంది అప్రెంటిస్ శిక్షణ పొందారు.
- ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఐటీఐల) సంఖ్య 2014లో 9,776 ఉండగా 2025 నాటికి అది 14,682కి చేరింది.

పీఎం సేతు

దేశంలో వృత్తి శిక్షణ, నాణ్యత, ఔచిత్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం 2025, అక్టోబరు 4న రూ.60 వేల కోట్లతో పీఎం సేతు (ప్రధాన మంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐస్) పథకాన్ని ప్రారంభించింది. దీని కింద దేశవ్యాప్తంగా వెయ్యి ఐటీఐలను ఆధునికీకరిస్తారు. దీంతోపాటు 400 నవోదయ, 200 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1,200 వృత్తి విద్య నైపుణ్య ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తారు.

- 2030 అక్టోబరు వరకు అయిదేళ్ల కాలవ్యవధితో దీన్ని అమలు చేస్తున్నారు.

పీఎం కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై)

దీన్ని 2015 జులై 15న ప్రారంభించారు. ఇది నాలుగు దశల్లో అమలైంది. అవి:

1. పీఎంకేవీవై 1.0 (2015-16)
2. పీఎంకేవీవై 2.0 (2016-20)
3. పీఎంకేవీవై 3.0 (2020-22)
4. పీఎంకేవీవై 4.0 (2022-23 నుంచి కొనసాగుతోంది)

- పీఎంకేవీవై 4.0 కింద అభ్యర్థులు తమకు నచ్చిన కెరీర్‌ను ఎంచుకునేలా సాధికారత కల్పించే శిక్షణ ఇస్తారు. ఆన్ జాబ్ ట్రైనింగ్ కింద పరిశ్రమలకు తగిన నైపుణ్య కోర్సులను అందిస్తారు.
- పీఎంకేవీవై ప్రారంభించినప్పటి నుంచి 2025 అక్టోబరు 31 వరకు మొత్తం 1,76,11,055 మంది దీని కింద నమోదు చేసుకున్నారు. 1,64,33,033 మంది శిక్షణ పొందారు.
- పీఎంకేవీవై 4.0లో మహిళలు, వికలాంగులు సహా ప్రత్యేక సమూహాలకు శిక్షణ కోసం వసతి, రవాణాకు ఆర్థిక సహాయం అందిస్తారు.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day 871

Magnify

Telugu meaning: పెంచు, పెద్దది చేయు

English meaning: The word magnify (మ్యాగ్నిఫై) is a verb that means to make something appear larger, more important, or more serious than it actually is.

Synonyms: Amplify, Exaggerate; ***Antonyms:*** Diminish, Lessen

Usage: 1. The microscope helps magnify tiny organisms that are invisible to the naked eye.


2. The media sometimes magnifies minor issues, creating unnecessary panic among people.

Current Affairs



The Indian Navy received Anjadip, the third of eight Anti-Submarine Warfare Shallow Water Crafts (ASW SWC) on 22 December 2025, marking another milestone in the country's indigenous naval shipbuilding programme.

- The vessel, designed and built in India by Garden Reach Shipbuilders and Engineers (GRSE), Kolkata, was delivered at Chennai.



Eminent Hindi writer and Jnanpith Award winner Vinod Kumar Shukla passed away on 23 December 2025 at the age of 89. He was born on January 1, 1937, in Rajnandgaon, in present-day Chhattisgarh.

- In 2023, he was awarded the Jnanpith Award, India's highest literary honour.

India Optel Limited (IOL) has signed a collaboration agreement with Safran Electronics & Defense for the transfer of production of two high-precision, combat-proven defence systems for local manufacturing. Under the collaboration, IOL will manufacture the SIGMA 30N Digital Ring Laser Gyro Inertial Navigation System, used in artillery guns, air defence systems, missiles and radars, and the CM3-MR Direct Firing Sight, designed for artillery guns and anti-drone systems.

According to the 'EY 2025 Work Reimagined Survey, India is among the world's highest adopters of artificial intelligence. 62 percent of employees regularly use generative AI (GenAI) at work, while 90 percent of employers and 86 percent of employees believe AI has a positive impact on productivity.

- The report shows that 75 percent of employees and 72 percent of employers believe GenAI enhances decision-making.

For more Current Affairs: **Scan QR code**

సుపరిపాలన దినోత్సవం

డిసెంబరు 25
చరిత్రలో ఈనాడు

దేశంలో లేదా రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నా, ప్రజలు సుఖ-శాంతులతో జీవించాలన్నా సమర్థవంతమైన పాలన అవసరం. దీని ద్వారానే పౌరులు మెరుగైన సేవలు పొందగలుగుతారు. ప్రజా వ్యవహారాల నిర్వహణలో నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడం, పర్యవేక్షించడం లాంటివి పాలన సూచిస్తుంది. స్థిరమైన అభివృద్ధి, సామాజిక న్యాయం, పౌరుల సాధికారతకు ఇది అవసరం. ప్రభుత్వ జవాబుదారీతనం, సమర్థవంతమైన పరిపాలన గురించి ప్రజలకు తెలియజేసే లక్ష్యంతో ఏటా డిసెంబరు 25న మన దేశంలో సుపరిపాలన దినోత్సవాన్ని (Good Governance Day) నిర్వహిస్తారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి సందర్భంగా దీన్ని జరుపుకుంటారు. ప్రభుత్వ బాధ్యతలు, విధుల, అభివృద్ధి ఆధారిత పాలన గురించి పౌరులను చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

పాలన అంటే?

దేశ సమగ్రతను కాపాడుతూ; పౌరులందరి భద్రతను, రాజ్యాంగ నియమాలను పరిరక్షిస్తూ, విద్య - ఆరోగ్యం - ఉపాధి - ఆహారభద్రత మొదలైన సేవలను అందించే నిర్ణయీకరణ ప్రక్రియనే గవర్నెన్స్‌గా పేర్కొంటారు. నిర్ణయీకరణ ప్రక్రియ అమలు చేస్తున్న ప్రతి వ్యవస్థలోను గవర్నెన్స్ ఉంటుంది.

- ప్రపంచంలోని అనేక దేశాలు తమ పాలనలో ఆధునికీకరణ, నూతన ప్రభుత్వ నిర్వహణ అనే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాయి. దీంతో 'పాలన' స్థానంలో 'సుపరిపాలన' అనే భావన అమల్లోకి వచ్చింది.

చారిత్రక నేపథ్యం

అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్న కాలంలో సమ్మిళిత వృద్ధి, ప్రభావవంతమైన పరిపాలనపై ఎక్కువగా దృష్టిసారించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014, డిసెంబరు




23న ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ప్రకటించింది. అలాగే ఆయన జన్మదినమైన డిసెంబరు 25న ఏటా 'సుపరిపాలన దినోత్సవం'గా నిర్వహిస్తామని ప్రకటించింది. 2014 నుంచి ప్రతి సంవత్సరం దీన్ని జరుపుతున్నారు.

భారత్‌లో సుపరిపాలన, వాజ్‌పేయీ జీవిత విశేషాలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

EENADU
epratibha

జనరల్ స్టడీస్ - పర్యావరణ సమస్యలు

వ్యర్థ నిర్వహణ - తాజా అంశాలు



ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ జనాభా పెరిగిపోతుంటే మరోవైపు భూమిపై పలురకాల వ్యర్థపదార్థాలు పేరుకుపోతున్నాయి. అత్యంత వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ కారణంగా కాలుష్యం అధికమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో వ్యర్థ నిర్వహణ కోసం అనేక కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తున్నప్పటికీ విడుదలవుతున్న వ్యర్థాలతో పోలిస్తే వాటి నిర్వహణ అంతంతే. వ్యర్థాల నిర్వహణ కోసం భారత్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, రూపొందించిన చట్టాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన అవసరం.

మురుగు నీటి నిర్వహణ

- మన దేశంలో రోజూ సుమారు 33 వేల మిలియన్ లీటర్ల మురుగు నీరు విడుదలవుతోంది. ఈ మురుగు నీటిలో కొంత శాతమే శుద్ధి చేస్తున్నారు. దీనికి కారణం, భారతదేశ పట్టణాలు, నగరాల మురుగునీటి నిర్వహణ సామర్థ్యం 18.6% మాత్రమే.
- భారతదేశం మురుగునీటి నిర్వహణను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తోంది.

ఈ-వేస్ట్ వ్యర్థాల నిర్వహణకు కార్యాచరణ, వేస్ట్ టు వెల్త్, భారతదేశంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ, కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ మొదలైన అంశాలతోపాటు పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in UCIL

Uranium Corporation of India Limited (UCIL) in Jharkhand is inviting applications for the filling of the Mining Mate, Winding Engine Driver, Boiler Operator cum Compressor Attendant posts on a regular basis. The total no. of posts is 107. The application fee is Rs.500. Eligible candidates can apply online before 31 December 2025.

Probationary Officer posts in Nainital Bank

Nainital Bank Limited, a private sector scheduled commercial bank, is inviting online applications for Customer Service Associate, Probationary Officer (PO), and Specialist Officer posts in Grade/Scale-1 and 2. The total number of posts is 185. The application fee is Rs.1000. The last date for online applications is 1 January 2026.

Apprentice Posts

Neyveli Lignite Corporation Limited (NLC India Limited), Tamil Nadu state, is inviting applications from eligible candidates with a Graduate Diploma (Technician) for one-year Apprenticeship Trainee posts. The total number of posts is 575. Eligible candidates can apply online before 2 January 2026.

Did You Apply..?

Today (December 25) is the last date for the following Jobs/ Apprentice posts

- 400 Assistant Manager posts in RITES Limited. ***Eligibility:*** Degree.
- 84 Graduate Apprentice posts at Bel. ***Eligibility:*** BE/BTech.
- 156 Operator posts in HAL. ***Eligibility:*** ITI.

For more information and other notifications - scan QR code

Bank Exams

Reasoning

Simplification BODMAS Rule

Directions (Qs. 1 - 11): *What will come in place of question mark (?) in the given questions?*

1. The value of the expression $[7 + 30 \div 6 - (6 + 6) + 7] = ?$

A) 6 B) 7 C) 5 D) 4 E) 9

2. $7.5 \times 17.2 \div 8.6 + (59.5)$ of $\frac{1}{17} - \frac{7}{2}$ of $5 = [\ ]$

A) 1 B) 3 C) 4 D) 2 E) 0

3. The value of $[15 \div 3 \times 7 - 8 \text{ of } 2 + 6] = ?$

A) 13 B) 25 C) −29 D) 39.5 E) 16.8

4. $4\frac{4}{5} \div \frac{3}{5}$ of $5 + \frac{4}{5} \times \frac{3}{10} - \frac{1}{5} = ?$

A) $1\frac{4}{5}$ B) 5 C) $1\frac{16}{25}$ D) 6 E) 25

5. $3 - (-6)\{-2 - 9 - 3\} \div 7\{1 + (-2)(-1)\} = ?$

A) −1 B) 15 C) 7 D) 1 E) −6

6. $15.5 - [3 - \{7 - (5 - (14.5 - 13.5))\}] = ?$

A) 12.5 B) 14.5 C) 13.5 D) 11.5 E) 15.5

7. $626 \times 2912 + 8138 = ?$

A) 364 B) 224 C) 285 D) 310 E) 413

8. $21 - 4.9 \div 7 + 3.9 \times 0.4 + 0.9 = ?$

A) 18.23 B) 24.12 C) 26.32 D) 21.43 E) 22.76

9. The value of $\frac{3}{4} \times 2\frac{2}{3} \div \frac{5}{9}$ of $1\frac{1}{5} + \frac{2}{23} \times 3\frac{5}{6} \div \frac{2}{7}$ of $2\frac{1}{3} = ?$

A) $1\frac{5}{6}$ B) $1\frac{2}{3}$ C) $3\frac{1}{2}$ D) $2\frac{4}{7}$ E) $3\frac{1}{7}$

10. What is the value of

$$\left[\frac{1}{8} + \left\{\frac{1}{6} \times \left(\frac{36}{45} \div \frac{24}{25}\right) - \left(\frac{12}{21} + \frac{14}{15} \div \frac{24}{45}\right)\right\} + \frac{27}{36}\right] = ?$$

A) $\frac{1}{36}$ B) $\frac{1}{72}$ C) $\frac{1}{108}$ D) $\frac{1}{27}$ E) $\frac{1}{42}$

11. $0.26 \times 50 + 13^2 = ?$

A) 182 B) 181 C) 180 D) 189 E) 188

Directions (Qs. 12 - 19): *What will come in place of question mark (?) in the given questions?*

12. 55% of $(120 + 280) - ? = 145\%$ of 300

A) −259 B) −223 C) −252 D) −200 E) −215

13. $\frac{5425 + 575 + 100}{61} = 100 \times ?$

A) 61 B) 2 C) 1 D) 5 E) 10

14. $\frac{240}{15} + 15 + ? = \frac{42}{7} \times 8.5$

A) 14 B) 20 C) 11 D) 15 E) 10

15. $23\frac{1}{5} + 12\frac{2}{5} + ? = 53\frac{1}{15}$

A) $\frac{213}{15}$ B) $\frac{4}{13}$ C) $\frac{617}{15}$ D) $\frac{37}{15}$ E) $\frac{262}{15}$

16. 47% of ? + 53% of ? = 235

A) 200 B) 235 C) 285 D) 135 E) 250

17. $(0.9)^2 \times 10 + 2.9 = ? + 132 \div 12$

A) 4 B) 3 C) 2 D) 1 E) 0

18. $2^5 \times 250 \div 5^3 \times 25 \div 32 = ?$

A) 30 B) 50 C) 16 D) 10 E) 20

19. $1471 + 567 - 627 = ? + 123$

A) 1950 B) 1880 C) 1288 D) 1700 E) 1800

Directions (Qs. 20 - 24): *What will come in the place of question mark (?) in following questions.*

20. 25% of $256 + \frac{4\sqrt{256}}{4} \times 8 = ? + 10$

A) 64 B) 62 C) 60 D) 56 E) 82

21. 36% of $250 + \frac{26}{2} \times ? = 207$

A) 8 B) 5 C) 6 D) 9 E) 7

22. $240 \times 2.5 + 65 \times \frac{2}{13} = ?^2 - \sqrt{225}$

A) 22 B) 24 C) 23 D) 27 E) 25

23. $4080 \div (? + 17) = 10^2 + 2$

A) 33 B) 42 C) 51 D) 15 E) 16

24. $31.5 \div 3.5 \times 12 - 8 = ?^2$

A) 25 B) 10 C) 75 D) 100 E) 50

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

(c) eenadu

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్‌లు

బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) ముంబయి.. వివిధ జోనుల్లోని అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అప్రెంటిస్: 400 ఖాళీలు

అర్హత: డిగ్రీ **వయసు:** 01.12.2025 నాటికి 20 - 28 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టైపెండ్: నెలకు రూ.13,000.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.800, ఎస్సీ, ఎస్టీలకు రూ.600, దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10.01.2026

ఎంపిక: రాత పరీక్షతో

వెబ్‌సైట్: https://bankofindia.bank.in/career/recruitment-notice

హెచ్‌ఎస్‌ఎల్‌లో మేనేజర్లు

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, విశాఖపట్నం.. ఒప్పంద, ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జనరల్ మేనేజర్(టెక్నికల్, హెచ్‌ఆర్): 02
- డిప్యూటీ జనరల్ మేనేజర్: 01
- మేనేజర్(హెచ్‌ఆర్): 03
- డిప్యూటీ మేనేజర్(సేఫ్టీ, ఫైనాన్స్): 02
- సీనియర్ చీఫ్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ (టెక్నికల్): 02

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000-2,60,000. డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.80,000-2,20,000. మేనేజర్‌కు రూ.60,000-1,80,000. డిప్యూటీ మేనేజర్‌కు రూ.50,000-.1,60,000. సూపరింటెండెంట్‌కు రూ.2,15,000.

వయసు: జనరల్ మేనేజర్‌కు 52 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్, మేనేజర్‌కు 45 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, సూపరింటెండెంట్‌కు 56 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూలతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13-01-2026.

వెబ్‌సైట్: https://indiansalt.com/career.php

సంస్థతో మమేకం కొలువుకు జయం

అకడమిక్ ప్రతిభ, అత్యున్నత సాంకేతిక నైపుణ్యాలు ఉన్నంత మాత్రాన కార్పొరేట్ కొలువులు ఖాయం కావు. ఆ సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూల్లో విజయవంతమైతేనే ఉద్యోగ నియామక పత్రం చేతికందుతుంది. యాజమాన్యాలు ఎలాంటి నిర్దేశిత ఫలితాలు ఆశిస్తున్నాయో గ్రహించినవారే ఉద్యోగ వేటలో విజయవంతమవుతున్నారు. అందువల్ల సంస్థలు ఎలాంటి నైపుణ్యాలు ఆశిస్తాయో అవగాహన పెంచుకోవడం ఎంతో ముఖ్యం.

ప్రాంగణ నియామకాల్లో కొద్ది మందే విజయవంతమవుతున్నారు. పలు విద్యా సంస్థల్లో ఇంటర్వ్యూ నైపుణ్యాలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నప్పటికీ ఈ అంశాలు కార్పొరేట్ కంపెనీల అంచనాలను అందుకోలేకపోతున్నాయి. కళాశాలలో చెప్పని వాటిపైనా విద్యార్థి అవగాహన పెంచుకుంటేనే ఇంటర్వ్యూలో విజయం సొంతమవుతుంది.



పరిశోధన

డేటా అనలిటిక్స్ అదనపు విద్యార్హతగా ఉన్న నరేష్ ఒక బహుళ జాతి కార్పొరేట్ సంస్థ నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. అతడి సాంకేతిక నైపుణ్యాలతో సంతృప్తి చెందిన ఇంటర్వ్యూ ప్యానెల్ ఉద్యోగానికి ఎంపిక చేసుకునే ముందు 'మా సంస్థలో ఎందుకు చేరాలనుకుంటున్నారని' అడిగింది. పర్యావరణ అనుకూల సాంకేతిక నైపుణ్యాలపై ఆ సంస్థ పనిచేస్తుందని చెప్పాడు. డేటా అనలిటిక్స్‌లో అదనపు సాంకేతిక నైపుణ్యాలు సంస్థకు ఎలాంటి విలువ చేకూర్చగలడో గణాంకాలతో ప్యానల్‌కు స్పష్టంగా అతడు వివరించాడు. ఈ ప్రక్రియలో భాగమైతే సంస్థకూ, తనకూ పరస్పర ప్రయోజనం, అభివృద్ధి ఉంటుందని ప్యానల్‌ను మెప్పించి ఉద్యోగం సాధించాడు.

✦ ఉద్యోగార్థులు రెజ్యూమెలో పొందుపరిచిన అంశాలపైనే ప్యానల్ దృష్టి ఉంటుందనే భావనతో ఇంటర్వ్యూకు సన్నద్ధమవుతారు. బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగం ఆశించేవారికి ఆ సంస్థ మిషన్, విజన్, అందించే వస్తు సేవలు, ఆ సంస్థకున్న మార్కెటింగ్ లాంటి అదనపు అంశాలపై అవగాహన ఉండాలి. దీంతో ఎంపిక కావడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

✦ 'మా సంస్థలో ఉద్యోగంలో చేరడానికి ఆకర్షించిన అంశాలేమిటని' అడిగే ప్రశ్నకు ఒక సాధారణ అభ్యర్థి మీ సంస్థ మంచిది, వేతనాలు బాగుంటాయి, ప్రోగ్రెసివ్ కెరియర్ కోసం మీ సంస్థలో ఉద్యోగంలో చేరాలనుకుంటున్నానని అంటాడు. అదే వృత్తి పరమైన పరిణతి కలిగినవారైతే సంస్థ సాధించిన విజయాలు, ప్రస్తుత మార్కెట్ స్థితిగతులు, అక్కడి పని సంస్కృతి ఆకర్షించాయని, తన సేవలు సంస్థకు ఎలా ఉపయోగపడగలవో అనుసంధానించి, వాస్తవ సమాచారంతో మాట్లాడతారు. ఇలాంటి వారిని భవిష్యత్తు నాయకుడిగా కార్పొరేట్ సంస్థలు భావిస్తాయి. కళాశాలల్లో విద్యార్థులకు ఇలాంటి అంశాలపై శిక్షణ ఉండదు. అందరికంటే భిన్నంగా ఉండాలంటే పలు అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

అనుసంధానం

ఒక పేరున్న బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చదివి అకడమిక్‌గా మంచి ప్రతిభ ఉన్న శ్రీనివాస్ ఒక తయారీరంగ సంస్థ నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. ఉద్యోగుల వలసలు (అట్రిషన్) గురించి ప్రాజెక్ట్ చేసినట్లు రెజ్యూమెలో పేర్కొన్నాడు. ఆ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం, అది పూర్తయిన తర్వాత పరిశీలించిన అంశాలు, ఉద్యోగుల వలసలు అరికట్టడానికి ఇచ్చిన సలహాలు, సూచనలు, చర్చిస్తూ ఆ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు ఇంటర్వ్యూలో అడిగారు. వాటిని అర్థం చేసుకోలేని శ్రీనివాస్ ఆ ప్రశ్నల గురించి మాట్లాడకుండా.. ప్రాజెక్టు బాగా జరిగిందని, ఆ సబ్జెక్టులో మంచి మార్కులూ వచ్చాయని, ఇదిగో చూడండంటూ పొంతనలేని సమాధానాలిచ్చాడు. దీంతో అతను ప్రాజెక్టుకు కనెక్ట్ కాలేదని ఇంటర్వ్యూ ప్యానెల్ గ్రహించింది. ఈ ఉద్యోగానికి సరిపోడని, వృత్తి పట్ల నిబద్ధత లేదని భావించి అతడి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది.

✦ ఏదైనా ప్రాజెక్టు తీసుకోవడానికి దారి తీసిన కారణాలు, ఎదుర్కొన్న సవాళ్లు, నేర్చుకున్న పాఠాలు వీటిని చెప్పాలి. అలాగే ఆ ప్రాజెక్టును ఇంటర్వ్యూకు హాజరైన సంస్థ వ్యాపార పరిస్థితులకు కనెక్ట్ చేసి, మాట్లాడగలిగే సామర్థ్యం ఉండాలి. ఇలాంటి వారికి కార్పొరేట్ సంస్థలు ఎంపికలో ప్రాధాన్యమిస్తాయి.

అతి విశ్వాసం

అకడమిక్‌గా మంచి పనితీరుతో, కాలేజీలో ప్రతి కార్యక్రమంలోనూ భాగమై, వేగంగా చొచ్చుకుపోయే స్వభావం ఉన్న మహేష్ ఒక బహుళజాతి సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూకు హాజరయ్యాడు. ప్యానల్ సభ్యుడు ప్రశ్న ముగించక ముందే 'ఇది చాలా సులభం సర్, నేను ఈ పనిని సెకండ్ ఇయర్ లోనే చేసేశాను' అంటూ సమాధానమిచ్చాడు. ప్రశ్నను పూర్తిగా అర్థం చేసుకోకుండా, ఇంటర్వ్యూ ప్యానెల్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, తనకు తెలిసిన అన్ని నైపుణ్యాలనూ ప్రదర్శించే ప్రయత్నం చేశాడు. అతి విశ్వాసం, అసహన ప్రవర్తన, ఆధిపత్య స్వభావం నచ్చని ఇంటర్వ్యూ ప్యానెల్ మహేష్ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది.

✦ ఉద్యోగార్థుల్లోని సాంకేతిక నైపుణ్యాలతో పాటు మనోవైఖరి, ఇతర ప్రవర్తనలనూ కార్పొరేట్ సంస్థలు పరిగణనలోకి తీసుకుంటాయని గ్రహించాలి.



దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

రైల్ ఇండియాలో

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్), గురుగ్రామ్.. రెగ్యులర్ ప్రాతిపదికన మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- గ్రూప్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్):01
- డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్, మెరైన్, స్ట్రక్చరల్ ఎక్స్‌పర్ట్): 01
- డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్): 02

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (సివిల్ ఇంజినీరింగ్), ఎంబీఏ/ పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ పీజీడీఎం/ పీజీడీహెచ్‌ఆర్‌ఎంతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 41 ఏళ్ల నంచి 53 ఏళ్లు ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.70,000 నుంచి రూ.2,80,000.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.600, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.300.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.01.2026

ఎంపిక: ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://www.rites.com/Career

ఐఏఆర్‌ఐలో ల్యాబ్ అసిస్టెంట్లు

ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐకార్), న్యూదిల్లీ ఒప్పంద ప్రాతిపదికన ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయనుంది.

- ల్యాబ్ అసిస్టెంట్

అర్హత: ఇంటర్మీడియట్ (సైన్స్ సబ్జెక్ట్) ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.42,000.

వయసు: 35 సంవత్సరాలు మించకూడదు **ఇంటర్వ్యూ తేదీ:** 06.01.2026.

వేదిక: డివిజన్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, ఐఏఆర్‌ఐ, పుసా క్యాంపస్, న్యూదిల్లీ. **వెబ్‌సైట్:** https://www.iari.res.in/bms/announcements/jobs.php

పోర్ట్ అథారిటీలో

పోర్ట్ అథారిటీ, ముంబయి.. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ఇంటర్న్‌ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- జూనియర్ ఇంటర్న్(ఎలక్ట్రికల్): 05

అర్హత: ఎలక్ట్రికల్ డిప్లొమాతో పాటు అనుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లకు మించకూడదు.

వేతనం: నెలకు రూ.40,000.

ఎంపిక: షార్ట్ లిస్టింగ్, విద్యార్హతలు, టెస్ట్/ఇంటర్వ్యూలతో.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 12.01.2026.

వెబ్‌సైట్: https://mumbaiport.gov.in

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

చదువు

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ - 501 512 edc@eenadu.in

బీకామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. యాక్చూరియల్ సైన్స్ కోర్సు పూర్తిచేస్తే ఎలాంటి అవకాశాలు ఉంటాయి? – ప్రకాష్

యాక్చూరియల్ సైన్స్‌తో ఎలాంటి అవకాశాలు?

బ్యాచిలర్ ఆఫ్ కామర్స్(బీకామ్) ప్రథమ సంవత్సరం చదువుతున్నప్పుడే భవిష్యత్తు కెరియర్ గురించి ఆలోచించడం అభినందనీయం. మంచి కెరియర్ నిర్మించుకోవడానికి యాక్చూరియల్ సైన్స్ ప్రతిష్ఠాత్మకమైన రంగంగా నిలుస్తుంది. బీకామ్ పూర్తిచేసిన విద్యార్థులు సాధారణంగా ఎంకామ్ లేదా ఎంబీఏ గురించి ఆలోచిస్తారు. అలాకాకుండా, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్స్‌పై ఆసక్తి ఉన్నవారికి యాక్చూరియల్ సైన్స్ కొత్త దిశను చూపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్స్యూరెన్స్, ఫైనాన్స్ రంగాల్లో ఉన్న డిమాండ్ ఈ కోర్సు ప్రాముఖ్యాన్ని మరింత పెంచుతోంది.

- మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ఫైనాన్స్, ఎకనామిక్స్ లాంటివి ఉపయోగించి భవిష్యత్తులో రాబోయే ఫైనాన్షియల్ రిస్కులను అంచనా వేసే శాస్త్రంగా యాక్చూరియల్ సైన్స్‌ను చెప్పుకోవచ్చు. ఉదాహరణకు, ఒక ఇన్స్యూరెన్స్ కంపెనీ ఎంత ప్రీమియం వసూలు చేయాలి, ఎంత మొత్తాన్ని రిజర్వ్‌గా ఉంచాలి, భవిష్యత్తులో క్లెయిమ్స్ ఎంతవరకు రావచ్చు అనే అంశాలను యాక్చువరీలు శాస్త్రీయంగా లెక్కిస్తారు. ఈ కారణంగా వీరిని ఫైనాన్షియల్ రిస్క్ ఆర్కిటెక్ట్స్‌గానూ పిలుస్తారు.



- బీకామ్ విద్యార్థులకు యాక్చూరియల్ సైన్స్ చాలా అనుకూలమైన కోర్సు. ఇందులోని అకౌంటింగ్, బిజినెస్ మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ లాంటి సబ్జెక్టులు యాక్చూరియల్ సైన్స్‌కు పునాది వంటివి. బీకామ్ పూర్తయ్యేలోపే యాక్చూరియల్ పరీక్షలకు సిద్ధమవడం ప్రారంభిస్తే సమయాన్ని సద్వినియోగం చేసుకున్నట్లే. ఇందుకోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చూరీస్ ఆఫ్ ఇండియా (ఐఏఐ) నుంచి సర్టిఫికేషన్ పొందాలి. బీకామ్ చదువుతూనే ఈ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉండడం ఈ కోర్సు ప్రత్యేకత.

- యాక్చూరియల్ సైన్స్ సర్టిఫికేషన్ పూర్తిచేసి, కొంత వృత్తిపరమైన అనుభవం గడించిన తర్వాత కెరియర్ అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. లైఫ్, హెల్త్, జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీలు, బ్యాంకులు, పెన్షన్ ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు, రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా అనలిటిక్స్ రంగాల్లో యాక్చువరీలకు మంచి డిమాండ్ ఉంది. ఎల్ఐసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, టాటా ఏఐఏ లాంటి సంస్థలు యాక్చూరియల్ నిపుణులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయి. వేతనాల పరంగా కూడా యాక్చూరియల్ సైన్స్ చాలా ఆకర్షణీయమైన రంగం. అనుభవం పెరిగే కొద్దీ పెద్ద మొత్తంలో జీతం అందుతుంది.

- యాక్చూరియల్ సైన్స్ పరీక్షలు కొంత కఠినంగా ఉంటాయి. ఎక్కువ సమయం కేటాయించాలి. ఓర్పు, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం లేకుండా ఈ రంగంలో ముందుకు వెళ్లడం కష్టం. అయినప్పటికీ మ్యాథ్స్‌పై ఆసక్తి, లాజికల్ ఆలోచనా శక్తి ఉన్న వారు ఈ సవాళ్లను అధిగమించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నేర్చుకున్నవి.. ఇలా పదిలం!

పదో తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు దాదాపు అన్ని అకడమిక్ పరీక్షలకూ సమయం దగ్గర పడుతోంది. ఎంత చదివినప్పటికీ గుర్తుండటం లేదని ఎక్కువ మంది మథనపడతారు. ఇప్పటికైతే గుర్తుంది కానీ పరీక్షలో ఇదే ప్రశ్న అడిగితే రాయగలనా అనే సందేహమూ వేధిస్తుంది. ఎన్నిసార్లు చదివినా మర్చిపోవడం అనేది ఎక్కువ మంది విషయంలో సాధారణంగా జరిగే వ్యవహారమే. నేర్చుకున్నవి పదిలంగా గుర్తుండాలంటే..

చదివింది మర్చిపోతే ఎంతో నిరాశ చెందుతాం. ఎలా గుర్తుంచుకోవాలో తెలుసుకుంటే మర్చిపోవడం ఉండదు. కొన్ని సులభమైన పద్ధతులు పాటించడం ద్వారా పరీక్షల్లోనే కాదు ఆ తర్వాతా గుర్తుండిపోతాయి.

కొత్తవి వద్దు

పరీక్ష తేదీలు సమీపిస్తున్నప్పుడు కొత్తవి నేర్చుకోవడానికి ప్రయత్నించవద్దు. వీటి కారణంగా ఒత్తిడికి లోనై అప్పటి వరకూ చదివినవీ మర్చిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల కొత్తవి ప్రయత్నించే బదులు నేర్చుకున్నవే మరోసారి చదివితే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

రాయండి

ఏదైనా ప్రశ్నకు సమాధానం నేర్చుకుంటే వెంటనే దాన్ని ఒకసారి రాసేయండి. ఆ తర్వాత పుస్తకంలోని జవాబుతో పోల్చండి. ఏవైనా తప్పులుంటే సరిచేయండి. ఆసక్తితో ఇలాచేస్తే పరీక్షలో విజయవంతం కాగలరు. దీంతో ఎన్నో ఇతర ప్రయోజనాలూ ఉన్నాయి. తక్కువ వ్యవధిలోనే సమాధానం పూర్తవుతుంది. దస్తూరీ మెరుగవుతుంది. అందుకే పది సార్లు చదివే బదులు ఒకసారి రాస్తే మేలని అంటారు.

పునశ్చరణ

ముందుగా ఇప్పటి వరకూ నేర్చుకున్న పాఠాలపై దృష్టి సారించాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. ముఖ్యమైన పాయింట్లను రాసుకుని రోజుకు మూడు సార్లైనా చదవాలి. గంటల తరబడి పుస్తకంలో లీనమైపోకుండా ప్రతి అర గంటకూ ఐదేసి నిమిషాలైనా విరామం తీసుకోవాలి.



వివరించండి

ఏదైనా విషయం బాగా గుర్తుండాలంటే ఇతరులకు అర్థమయ్యేలా చెప్పడం మంచి పద్ధతే. మీ స్నేహితులు ఎవరైనా కోరితే విసుగు చెందకుండా మీరు నేర్చుకున్నది వివరించండి. దీంతో మీరు ఆ అంశాన్ని ఎప్పటికీ మర్చిపోరు.

కంటినిండా నిద్ర

నిద్ర పోకుండా చదివితే ఎక్కువ పాఠాలు కవర్ చేయవచ్చని అనుకుంటారు. దీంతో మేలు కంటే కీడే ఎక్కువ. సరిపడా నిద్ర లేకపోతే దేనిపైనా దృష్టి పెట్టలేరు. పరీక్షకు ముందు రోజు ఎక్కువ సమయం మేల్కొని చదివితే పరీక్ష హాల్లో ఇబ్బంది పడతారు. బాగా వచ్చినవీ సరిగా రాయలేరు. దీని బదులు రాత్రి నిద్రపోయే ముందు పునశ్చరణ చేసుకుంటే మంచిది. అలాగే ప్రతి రోజూ కనీసం 7-8 గంటల నిద్ర అవసరం. దీంతో మీ జ్ఞాపక శక్తీ మెరుగవుతుంది. చదివింది బాగా గుర్తుండటానికి ముఖ్యమైన టెక్నిక్‌ల్లో ప్రశాంతంగా నిద్ర పోవడమూ ఒకటని మరవకండి.

చిత్రాలు, చార్ట్స్

చదువుకునేటప్పుడు కేవలం పుస్తకాల్లో అక్షరాలకే పరిమితం కాకుండా చిత్రాలు, చార్ట్స్, ఫ్లాష్ కార్డ్స్ ఉపయోగించాలి. ముఖ్యాంశాల కింద రంగు పెన్నులతో గీయడం లాంటివి చేయాలి. చిత్రాలు, రంగులను మెదడు ఎక్కువ కాలం గుర్తుంచుకునే అవకాశం ఉంది.

కొన్నిసార్లు నేరుగా విషయాలు నేర్చుకోవడం కంటే కథలు, చిన్న చిన్న ఉదాహరణలతో చదివితే మెదడు చురుకుగా పనిచేస్తుంది. అలాగే చూడటం, చెప్పడం, బోధించడం, సరదాగా నేర్చుకోవడం లాంటివీ జ్ఞాపకశక్తిని పెంచుతాయి.

ప్రశాంతత

సానుకూల దృక్పథంతో ఉండాలి. వచ్చినవీ ఒత్తిడి కారణంగా రాయలేరు. 'నాకు గుర్తుండదు' అనే భయాన్ని తీసేసి 'నేను చదవగలను, గుర్తుంచుకోగలను, రాయగలను' అనే నమ్మకాన్ని పెంచుకోవాలి. జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి మానసిక ప్రశాంతత ఎంతో ముఖ్యం. ఇందుకోసం దీర్ఘ శ్వాస, యోగా లాంటివి ప్రయత్నించవచ్చు.

పోషకాహారం

ఆరోగ్యకరమైన ఆహారం జ్ఞాపకశక్తికీ మేలు చేస్తుంది. నీరు ఎక్కువగా తాగడం, పండ్లు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్ మెదడుకు శక్తినిస్తాయి. చురుకుగా పనిచేయడానికి సహాయపడతాయి. అందువల్ల వేళకు మంచి ఆహారం తీసుకోవడమూ ముఖ్యమే అని గ్రహించాలి.

నిత్యజీవితంలోనూ..

జ్ఞాపకశక్తి కేవలం పరీక్షలకే పరిమితం కాదు. రోజువారీ జీవితంలోనూ ఎంతో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు పేర్లు గుర్తుంచుకోవడం, దారులు గుర్తించడం, వస్తువులు ఎక్కడ పెట్టామో గుర్తుండటం ఇవన్నీ జ్ఞాపకశక్తి వల్లే సాధ్యమవుతాయి. అలాగే రోజువారీ జీవితంలోనూ వ్యక్తులను అర్థం చేసుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడంలో కూడా జ్ఞాపకశక్తి ఎంతో ఉపయోగపడుతుంది.

కాలిఫోర్నియా యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనం ప్రకారం కొత్తగా నేర్చుకున్న విషయంలో సగటున 50 శాతాన్ని గంటలోనే మర్చిపోతాం. సరైన శిక్షణ, మెలకువలతో ఈ ఇబ్బందిని అధిగమించవచ్చు. నిరంతర సాధనతో మెరుగైన ఫలితాలు పొందవచ్చు. ఆసక్తితో చదవడాన్ని, నేర్చుకోవడాన్ని అలవాటు చేసుకోవడం ప్రధానం. ఆసక్తి ఉంటే జ్ఞాపకశక్తికి ఇబ్బంది ఉండదు.

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

క్యాడ్ డిజైన్
సంస్థ: హర్షజ్ స్టూడియో
నైపుణ్యాలు: ఆటోక్యాడ్, ఆటోడెస్క్ ఫ్యూషన్ 360, బ్లెండర్ 3డీ, కాటియా, రైనో
స్టైపెండ్: రూ.13,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 31
☛ https://shorturl.at/nA7Oz

క్లయింట్ అక్విజిషన్
సంస్థ: సత్యజన్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, కీ అకౌంట్ మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఎక్సెల్, సేల్స్
స్టైపెండ్: రూ.8,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 11
☛ https://tinyurl.com/5en5p6yr

విజయవాడలో

జావా డెవలప్‌మెంట్
సంస్థ: యాప్ జెనిసిస్ సాఫ్ట్ సొల్యూషన్స్ ప్రై.లి. నైపుణ్యాలు: హైబర్‌నేట్ ఓఆర్ఎం (జావా), జే2ఈఈ, జావా, జేఎస్‌పీ, మైఎస్‌క్యూఎల్, స్ప్రింగ్ ఎంవీసీ
స్టైపెండ్: రూ.11,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 14
☛ https://shorturl.at/tAKok

విశాఖపట్నంలో

ఎగ్జిక్యూటివ్ అకౌంట్ మేనేజర్
సంస్థ: ఏబకోవ్ బిజినెస్ అడ్వైజరీ ప్రై.లి.
నైపుణ్యాలు: అకౌంటింగ్, క్లయింట్ రిలేషన్‌షిప్, కస్టమర్ అక్విజిషన్, డేటా అనాలిసిస్, ఫైనాన్స్, కీ అకౌంటెంట్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్, మార్కెట్ అనలిటిక్స్, మార్కెటింగ్ క్యాంపైన్స్, పైతాన్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-9,000
దరఖాస్తు గడువు: జనవరి 8
☛ https://tinyurl.com/5drnzcad

(c) eenadu

భారత్‌తో సంబంధాలు మెరుగుపరుచుకుంటాం

- అందుకోసం యూనస్ కృషి చేస్తున్నారు
- బంగ్లాదేశ్ ఆర్థిక సలహాదారు సలేహుద్దీన్ వెల్లడి

ఢాకా: భారత్‌తో ఉద్రిక్తతలను తగ్గించేందుకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ చర్యలు తీసుకుంటున్నారని ఆ దేశ ఆర్థిక సలహాదారు సలేహుద్దీన్ అహ్మద్ తెలిపారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను.. రాజకీయ వ్యాఖ్యల నుంచి వేరు చేసి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'భారత్‌తో దౌత్య సంబంధాలను మెరుగుపరుచుకుంటాం. ఇందుకోసం యూనస్ కృషి చేస్తున్నారు. సంబంధిత వ్యక్తులతో చర్చలు జరుపుతున్నారు. అయితే భారతీయ వర్గాలతో మాత్రం ఇప్పటివరకు నేరుగా ఆయన మాట్లాడలేదు. బంగ్లాదేశ్ వాణిజ్య విధానం రాజకీయ అంశాల ఆధారంగా ఉండదు. వియత్నాం లేదా ఇతర దేశాల నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకోవడం కంటే భారత్ నుంచి తక్కువ ఖర్చుతో కొనుగోలు చేయడం ఆర్థికంగా సరైన నిర్ణయం. దిల్లీతో సత్సంబంధాలను మేం కోరుకుంటున్నాం. అందుకే భారత్ నుంచి 50 వేల టన్నుల బియ్యం కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను ఆమోదించాం'' అని పేర్కొన్నారు. భారత్‌తో తమ సంబంధాలను దెబ్బతీసేందుకు బాహ్యశక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

దీపూచంద్ర కుటుంబానికి అండగా ఉంటామని హామీ

బంగ్లాదేశ్‌లో హత్యకు గురైన హిందూ యువకుడు దీపూచంద్ర దాస్ కుటుంబానికి అండగా నిలుస్తామని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వంలో విద్యారంగ సలహాదారుగా ఉన్న సి.ఆర్.అబ్రార్.. మొహమ్మద్ యూనస్‌తో భేటీ అనంతరం మంగళవారం దీపూచంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన తల్లిదండ్రులు, భార్యాబిడ్డల సంక్షేమ బాధ్యతలను సర్కారు చూసుకుంటుందని హామీ ఇచ్చారు. దీపూచంద్ర హత్య క్రూరమైన నేరమని, అది ఎంతమాత్రమూ క్షమార్హం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హాదీ హత్య వెనుక యూనస్ సర్కారులోని కీలక వ్యక్తులు?

బంగ్లాదేశ్ విద్యార్థి ఉద్యమ నేత ఉస్మాన్ హాదీ హత్య వెనుక యూనస్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల హస్తం ఉందని ఆయన సోదరుడు ఒమర్ హాదీ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరిలో జరగాల్సిన ఎన్నికలను అస్థిరపర్చేందుకే ఈ హత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. హత్యల కారణంగా ఎన్నికల వాతావరణం దెబ్బతినకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఒమర్ కోరారు. వేగంగా దర్యాప్తు జరిపి హాదీ హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఉస్మాన్ హాదీకి న్యాయం జరగకపోతే, ఏదో ఒకరోజు యూనస్ కూడా బంగ్లాదేశ్‌ను వీడి పారిపోవాల్సి వస్తుందని ఒమర్ హాదీ హెచ్చరించినట్లు స్థానిక మీడియా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి.

అవామీ లీగ్‌పై నిషేధం పట్ల అమెరికా చట్టసభ్యుల ఆందోళన

బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం అమల్లో ఉండటంపై అమెరికాకు చెందిన పలువురు చట్టసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీకి కూడా అవకాశం కల్పించాలని యూనస్ సర్కారుకు ఓ లేఖలో తాజాగా సూచించారు. పారదర్శక రీతిలో, స్వేచ్ఛగా ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు బంగ్లాదేశ్ ప్రజలకు ఉండాలని అభిప్రాయపడ్డారు.



బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా బెంగాల్‌లో నిరసనలు

కోల్‌కతా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులకు వ్యతిరేకంగా భారత్‌లో ఆగ్రహ జ్వాలలు కొనసాగుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో బంగ్లాదేశ్‌తో సరిహద్దుల వెంబడి పలు ప్రాంతాల్లో హిందూ అనుకూల సంస్థలు, భాజపా బుధవారం నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. ప్రధానంగా బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపూచంద్ర దాస్ హత్యను ఖండిస్తూ నిరసనకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. హావ్‌డా జిల్లాలో భాజపా మద్దతుదారులను పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ చెలరేగింది. ఉత్తర 24 పరగణాలు జిల్లాలోని పెట్రాపోల్, ఘోజదంగా, మాల్దాలోని మనోహర్‌పుర్, కూచ్‌బిహార్ జిల్లాలోని చంగ్రబంధా తదితర సరిహద్దు ప్రాంతాల్లోనూ నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. దీపూచంద్ర హత్యను ఖండిస్తూ తాము చేపట్టిన నిరసనలను పోలీసుల ద్వారా బలప్రయోగం జరిపి సీఎం మమతా బెనర్జీ అడ్డుకుంటున్నారని భాజపా శ్రేణులు ఆరోపించాయి.




'ఆత్మనిర్భర్ భారత్'కు ఊతమివ్వడం అత్యవసరం

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

దిల్లీ: దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం, స్థానిక సరఫరా గొలుసులను బలోపేతం చేయడం ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్'కు ఊతమివ్వడం అత్యవసరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇండియన్ డిఫెన్స్ ఎకౌంట్స్ సర్వీసు(ఐడీఏఎస్) అధికారుల బృందం బుధవారం రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వంటి ఆధునిక నైపుణ్యాలు నేర్చుకోవాలని వారికి సూచించారు. "అధికారులు నైతికత, పారదర్శకత, బాధ్యతతో నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజా సేవలో విశ్వాసమే ప్రధాన ఆధారం, దాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా వేగవంతమైన, కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలి. రక్షణ విభాగం నిరంతరం ఆధునికీకరణ, ఆవిష్కరణలు చేయాలి. వారి నిర్ణయాలు దేశాభివృద్ధి, జాతీయ భద్రతపై ప్రభావం చూపుతాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

'పార్లమెంటులో ఎంపీలు స్మార్ట్ పరికరాలు వాడొద్దు'

దిల్లీ: పార్లమెంటు భవన సముదాయంలో స్మార్ట్ కళ్లద్దాలు, వాచీలు, పెన్నులు తదితర డిజిటల్ పరికరాలను వాడరాదంటూ లోక్‌సభ సచివాలయం బుధవారం ఎంపీలకు సూచించింది. ఈ పరికరాల వాడకం వల్ల సభ్యుల గోప్యతకు, పార్లమెంటరీ సభా మర్యాదలకు భంగం కలగవచ్చని సచివాలయం హెచ్చరించింది.



మరో రెండు నెలల్లో 'భారత్ ట్యాక్సీ': అమిత్‌షా

చండీగఢ్: ఓలా, ఉబర్ లాంటి ప్రైవేటు ట్యాక్సీ అగ్రిగేటర్ సంస్థల తరహాలో త్వరలోనే 'భారత్ ట్యాక్సీ' సర్వీసును ప్రారంభించనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. ఆ సంస్థల్లో డ్రైవర్లకు కాకుండా యాజమాన్యాలకు లాభాలు వెళ్తున్నాయని, అందుకు భిన్నంగా లాభాలను మొత్తం డ్రైవర్లకే పంచే విధంగా 'భారత్ ట్యాక్సీ'ని తీసుకురానున్నట్లు వివరించారు. వినియోగదారులకు సౌకర్యంతో పాటు డ్రైవర్లకు అదనపు ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా భారత్ ట్యాక్సీని మరో రెండు నెలల్లో ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించే ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు పెద్ద ఎత్తున ఉపాధి దక్కుతుందని అమిత్ షా చెప్పారు. హరియాణాలోని పంచకులలో బుధవారం జరిగిన 'కృషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్ (కేఆర్‌ఐబీహెచ్‌సీఓ) కార్యక్రమంలో అమిత్‌షా ఈ మేరకు మాట్లాడారు. సహకార రంగం ద్వారా రైతులను సంపన్నులను చేయడానికి మోదీ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి కోసం రూ.80వేల కోట్లుగా ఉన్న బడ్జెట్‌ను రూ1.87లక్షల కోట్లకు పెంచామన్నారు. దీని ద్వారా దశలవారీగా రైతుల ఆదాయాన్ని పెంచడానికి పునాది వేసినట్లు చెప్పారు.

ఆక్స్‌ఫర్డ్ యూనియన్ చర్చ.. వైరల్‌గా భారత విద్యార్థి ప్రసంగం

ఇంటర్నెట్ డెస్క్: ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఆక్స్‌ఫర్డ్ యూనియన్ చర్చ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముంబయికి చెందిన విద్యార్థి విరాన్ష్ భానుశాలి పాకిస్థాన్‌కు అనుకూలంగా జరిగిన చర్చలో పాల్గొని మాట్లాడారు. భారత్‌పైకి ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌ను ఎండగట్టాడు. భారత్ ఎప్పుడూ ఇతర దేశాలను అడ్డం పెట్టుకొని ప్రపంచం దృష్టిని ఆకర్షించాలని చూడదన్నారు. ముంబయి ఉగ్రదాడి జరిగినప్పుడు భారత ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుందన్నారు. అయినప్పటికీ భారత ప్రభుత్వం హింసను ఎంచుకోకుండా శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని చూసిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే అంతర్జాతీయ స్థాయిలో చర్చలు చేపట్టినా ఎటువంటి ఉపయోగం లేదని.. మళ్లీ ఉగ్రవాదులు పఠాన్‌కోట్, ఉరి, పుల్వామా, పహల్గాంలలో దాడులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉగ్రవాదులను పోషించే అటువంటి దేశంపై జాలి చూపించాల్సిన అవసరం లేదని విమర్శలు చేశారు.

సత్పరిపాలనా వారోత్సవంలో 17 లక్షల ఫిర్యాదుల పరిష్కారం

దిల్లీ: దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నెల 19 నుంచి వారం రోజులపాటు నిర్వహించిన సత్పరిపాలనా వారోత్సవంలో 17 లక్షల ప్రజా ఫిర్యాదులను పరిష్కరించినట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ బుధవారం ప్రకటించింది. ఈ వారోత్సవాన్ని జిల్లా, తహశీలు స్థాయిల్లో నిర్వహించారు. సేవల అందజేత (సర్వీస్ డెలివరీ)ను మెరుగుపరచాలనే దరఖాస్తులను పరిష్కరించారు. ఆన్‌లైనులో కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార - నిఘా వ్యవస్థ (సీపీగ్రామ్స్) ద్వారా, రాష్ట్రాల పోర్టళ్ల ద్వారా అందిన ఫిర్యాదులనూ పరిష్కరించారు. ఈ ఏడాది 32,000 శిబిరాలు, కార్యశాలల్లో 1.5 కోట్ల దరఖాస్తులను పరిశీలించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి సందర్భంగా గురువారం సత్పరిపాలనా రీతులపై జాతీయ కార్యశాలను నిర్వహిస్తామని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 1,000 మంది అధికారులు పాల్గొంటారు.

అయిదుగురు ఐరోపావాసులపై అగ్రరాజ్యం ఆంక్షలు

వాషింగ్టన్/బ్రసెల్స్: అమెరికా దృక్కోణాలనూ, అభిప్రాయాలనూ సెన్సార్ చేయాలంటూ ఆ దేశానికి చెందిన టెక్ సంస్థలపై ఒత్తిడి తెచ్చారంటూ అయిదుగురు ఐరోపావాసులపై అగ్రరాజ్య విదేశాంగ శాఖ మంగళవారం ప్రయాణ ఆంక్షలు విధించింది. వారిలో ఐరోపా సమాఖ్య (ఈయూ) మాజీ కమిషనర్, ఫ్రాన్స్ మాజీ ఆర్థిక మంత్రి థియెరీ బ్రెటాన్ కూడా ఉన్నారు. మిగిలినవారు స్వచ్ఛంద సంస్థల ఉద్యమకారులు. వీరిలో ఇద్దరు జర్మనీకి, మరో ఇద్దరు బ్రిటన్‌కు చెందినవారు. ఈ నలుగురు ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచార వ్యాప్తికి వ్యతిరేకంగా ఉద్యమం నడుపుతున్నారు. కాగా అమెరికా చర్యపై ఈయూ మండిపడింది. అమెరికా తీసుకునే అసమంజస చర్యలకు అవసరమైతే ప్రతిచర్య తీసుకుంటామని బుధవారం హెచ్చరించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ కూడా అమెరికా చర్యను గట్టిగా ఖండించారు. ఆన్‌లైన్ కంటెంట్ నిబంధనల విషయంలో అమెరికా, ఈయూల మధ్య వివాదం నడుస్తోంది. తమ డిజిటల్ నిబంధనలను ఈయూలోని 27 సభ్య దేశాలూ, ఐరోపా పార్లమెంటు కలసి రూపొందించాయనీ, వాటిలో ఎవరి జోక్యాన్నీ సహించేది లేదని ఈయూతోపాటు మెక్రాన్ స్పష్టం చేశారు. అన్నట్టు ఈయూ డిజిటల్ సర్వీసుల చట్టం (డీఎస్ఏ) రూపకర్త బ్రెటానే అని అమెరికా గుర్రుగా ఉంది. డీఎస్ఏ ఆన్‌లైన్‌లో విద్వేషపూరిత ప్రసంగాలను అడ్డుకోవడానికి ఉద్దేశించినదని ఈయూ చెబుతుంటే, దాన్ని సెన్సార్‌షిప్‌గా అమెరికా పరిగణిస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతలపై అమెరికా, ఐరోపాల మధ్య ముఖాముఖి ఘర్షణ వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తాజా పరిణామం సూచిస్తోంది.

కెనడాలో భారతీయ మహిళ హత్య

టొరంటో: కెనడాలోని టొరంటోలో హిమాన్షీ ఖురానా(30) అనే భారతీయురాలు హత్యకు గురైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 19న హిమాన్షీ అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో గాలింపు చర్యలు చేపట్టారు. మరుసటి రోజు స్ట్రాచన్ అవెన్యూ-వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్ ప్రాంతంలోని ఓ ఇంటిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా పోలీసులు దీన్ని హత్య కేసుగా నమోదు చేశారు. ఆమెపై లైంగిక దాడి కూడా జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి అనుమానితుడిగా ఉన్న 32 ఏళ్ల అబ్దుల్ గఫూరీ అనే యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరిద్దరికీ ముందునుంచే పరిచయమున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. హిమాన్షీ హత్యపై కెనడాలోని భారత రాయబార కార్యాలయం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది.

చిరుత దాడిలో ఒకరి మృతి.. 9 మందికి గాయాలు

శిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఓ చిరుత బీభత్సం సృష్టించింది. చండ్యాల్, బధ్యాల్, మాల్వానా గ్రామాల్లోని ప్రజలపై బుధవారం ఉదయం అది ఒక్కసారిగా దాడి చేసింది. ఈ ఘటనలో బల్బీర్ సింగ్(40) అనే వ్యక్తి మృతి చెందగా, మరో 9 మంది గాయపడ్డారు. బల్బీర్ సింగ్ సొంతూరు మండి కాగా, మాల్వానాలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఆయన చిరుత దాడిలో ప్రాణాలు కోల్పోయారు. భయాందోళన చెందిన స్థానికులు చివరకు కర్రలు, పదునైన ఆయుధాలతో చుట్టుముట్టి దాడి చేయడంతో చిరుత చనిపోయింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం క్షతగాత్రులు, మృతుడి కుటుంబసభ్యులకు తక్షణ ఆర్థిక సాయం అందించారు.

తక్కువ తాగినా క్యాన్సర్ ముప్పు ఎక్కువే



దిల్లీ: మద్యం మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి పెద్ద ప్రమాదం లేదని చాలామంది అనుకుంటారు. ఆ భావన తప్పని జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తల అధ్యయనం నిర్ధారించింది. రోజుకు 9 గ్రాముల (దాదాపు 12 మిల్లీలీటర్ల) మద్యం తీసుకున్నా నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం 50 శాతం ఎక్కువనీ, నాటుసారా తాగితే ఆ ప్రమాదం 87 శాతానికి పెరుగుతుందని హెచ్చరించింది. 2010 - 2021 మధ్యకాలంలో 1,803 మంది నోటి క్యాన్సర్ (బకల్ మ్యుకోసా) పీడితులనూ, 1,903 మంది ఆరోగ్యవంతులనూ శాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. పరిశీలించిన నోటి క్యాన్సర్ బాధితుల్లో 62 శాతం మద్యం తాగడంతోపాటు గుట్కా నమిలిన కేసులే. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మద్యం బ్రాండ్లను తీసుకున్నా నోటి క్యాన్సర్ ముప్పు ఎక్కువే. నాటుసారాలో మెథనాల్, ఎసిటాల్ డిహైడ్ వంటి విషపదార్థాలు ఉండటంతో ప్రమాదం ఇంకా ఎక్కువ. శాస్త్రజ్ఞులు పరిశీలించిన వ్యక్తుల్లో అత్యధికులు 35-54 ఏళ్లవారే. వారిలో 25-45 ఏళ్లవారిలో నోటి క్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపించాయి. దేశంలో ప్రతి 10 క్యాన్సర్ కేసుల్లో ఒకటి నోటి క్యాన్సర్ కేసు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రానికి మమ్మల్ని తరలించండి

- సోనియా, రాహుల్‌లకు ఉన్నావ్ బాధితురాలి వినతి

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార బాధితురాలు, ఆమె తల్లి బుధవారం 10-జన్‌పథ్‌లో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని, లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీని కలిశారు. ఏదైనా కాంగ్రెస్‌పాలిత రాష్ట్రానికి తమను తరలించాలని, సుప్రీంకోర్టులో వాదించేందుకు మంచి న్యాయవాదిని సమకూర్చాలని కోరారు. కేసులో నిందితుడి శిక్ష నిలిపివేత, తదనంతర పరిణామాల నేపథ్యంలో వారు కాంగ్రెస్ అగ్రనేతల సాయాన్ని కోరారు. ఆదుకుంటామని సోనియా, రాహుల్ హామీ ఇచ్చారు. మృత ఆర్థిక వ్యవస్థగానే కాకుండా మృత సమాజంగా భారత్ మిగులుతోందని రాహుల్ ఆరోపించారు. నిందితులకు బెయిల్ రావడం, బాధితులను నేరస్థులుగా చూడటం ఏ రకమైన న్యాయమని నిలదీశారు.

జైల్లోనైనా ప్రాణాలతో ఉంటామేమో

తాజా పరిణామాలు తమ భయాలను మరింత పెంచాయని బాధితురాలు మీడియాతో పేర్కొన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితుడికి బెయిల్ వస్తే.. మహిళలు సురక్షితంగా ఎలా ఉంటారని ప్రశ్నించారు. సెంగర్‌కు బెయిల్ లభించడం తమకు మరణం కంటే తక్కువేం కాదన్నారు. డబ్బు లేనివారికి ఎప్పుడూ ఓటమేననే విషయాన్ని ఈ పరిణామం నిరూపిస్తోందని విలపించారు. సెంగార్‌కు శిక్ష నిలిపివేతపై సుప్రీంకోర్టుకు వెళ్తామని బాధితురాలి తల్లి చెప్పారు. "మాకు న్యాయం జరగలేదు. సీఆర్‌పీఎఫ్ భద్రతా సిబ్బంది మమ్మల్ని చంపాలని అనుకుంటున్నారు. సెంగార్ బెయిలును రద్దుచేయాలి. లేకుంటే మేం ప్రాణాలు తీసుకుంటాం. లేదా వాళ్లు మమ్మల్ని చంపేస్తారు. కావాలంటే నన్ను జైల్లో పెట్టండి. నిందితుడికి మిగిలిన శిక్షను నేననుభవిస్తాను. అక్కడైనా మేం ప్రాణాలతో ఉంటామేమో" అని చెప్పారు.

ఇంకా ఉద్రిక్తంగానే పశ్చిమ కర్బీ ఆంగ్‌లాంగ్

- సైన్యాన్ని మోహరించిన సర్కారు

దీఫూ: అస్సాంలోని పశ్చిమ కర్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. అక్కడి ఖెరోనీ ప్రాంతంలో మంగళవారం చెలరేగిన అల్లర్లలో సురేశ్ దేయ్ అనే దివ్యాంగుడు హత్యకు గురవడంపై బుధవారం ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. హిందీ మాట్లాడే వ్యక్తులు, బెంగాలీలు పెద్దఎత్తున గుమిగూడి.. అతడి హత్యపై నిరసన ప్రదర్శన చేపట్టారు. లంక-ఖెరోనీ రోడ్డుపై రాకపోకలను స్తంభింపజేశారు. సురేశ్ దేయ్‌ని హత్య చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వివేక్‌రాజ్ సింగ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి నిరసనకారులను శాంతింపజేశారు. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమ కర్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలో సైన్యాన్ని ప్రభుత్వం మోహరించింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అక్కడ సైన్యం బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు అస్సాం డీజీపీ హర్మీత్ సింగ్ తెలిపారు. పశ్చిమ కర్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలో మంగళవారం తీవ్రస్థాయిలో అల్లర్లు చెలరేగాయి. వీటిలో 60 మందికిపైగా పోలీసు సిబ్బంది సహా చాలామంది గాయపడ్డారు. జిల్లాలో బిహారీలు, బెంగాలీలు, నేపాలీలు ఎక్కువగా నివసించే ఖెరోనీ ప్రాంతంలో 25 ఏళ్ల దివ్యాంగుడు సురేశ్ దేయ్‌ని తన ఇంటిలోనే కొందరు ఆందోళనకారులు సజీవ దహనం చేశారు.

వారిని ఇప్పుడు ఖాళీ చేయించలేం: హిమంత

పశ్చిమ కర్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలో విలేజ్ గ్రేజింగ్ రిజర్వ్ (వీజీఆర్), ప్రొఫెషనల్ గ్రేజింగ్ రిజర్వ్ (పీజీఆర్) భూముల నుంచి హిందీ మాట్లాడే వ్యక్తులను ఖాళీ చేయించాలంటూ కర్బీలు చేస్తున్న డిమాండ్‌పై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్పందించారు. ఈ వ్యవహారంలో గువాహటి హైకోర్టు ఇప్పటికే స్టే విధించినందున.. వారిని ప్రస్తుతానికి ఖాళీ చేయించడం సాధ్యం కాదని బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆయన పేర్కొన్నారు.

పదేళ్లలో చంద్రుడిపై రష్యా అణువిద్యుత్తు కేంద్రం!

ఇంటర్నెట్ డెస్క్: చంద్రుడిపై అన్వేషణలో రష్యా మరో ముందడుగు వేసేందుకు సిద్ధమవుతోంది. వచ్చే పదేళ్లలో జాబిల్లిపై అణు విద్యుత్తు కేంద్రం నిర్మించేందుకు ప్రణాళికలు వేస్తోంది. తన చంద్రమండల కార్యక్రమానికి, రష్యా-చైనా ఉమ్మడి పరిశోధన కేంద్రానికి విద్యుత్తు సరఫరా చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించింది. చంద్రుడిపై 2036 నాటికి విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రణాళిక రచించినట్లు రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష పరిశోధన సంస్థ రాస్‌కాస్మోస్ వెల్లడించింది. ఇందుకోసం ఏరోస్పేస్ కంపెనీ లావోచ్‌కిన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది.

మలేరియా కేసుల్లో భారీ తగ్గుదల

ఈనాడు, దిల్లీ: దేశంలో 2015-24 మధ్య దశాబ్దకాలంలో మలేరియా కేసుల్లో 80 - 85 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్ర వైద్యఆరోగ్య శాఖ బుధవారం విడుదల చేసిన 'ఇండియాస్ ప్రోగ్రెస్ టువర్డ్స్ మలేరియా ఎలిమినేషన్' నివేదిక వెల్లడించింది. 2015లో 10.17 లక్షలమేర నమోదైన మలేరియా కేసులు 2024 నాటికి 2.27 లక్షలకు తగ్గడమే ఇందుకు నిదర్శనమని తెలిపింది. అలాగే మలేరియా సంబంధ మరణాలు కూడా ఇదే తీరులో 384 నుంచి 83కు తగ్గాయి. గతంలో ఎన్నడూలేని విధంగా 2023లో వార్షిక రక్తపరీక్షల రేటు 25 శాతానికి చేరినట్లు తెలిపింది. దీన్నిబట్టి ప్రభుత్వం పెట్టిన నిఘా, పరీక్షల స్థాయిని అర్థం చేసుకోవచ్చని వివరించింది. ప్రస్తుతం 92% జిల్లాల్లో ఏటా మలేరియా బారినపడే వారి సంఖ్య (యాన్యువల్ పారాసైట్ ఇన్సిడెన్స్) ప్రతి వెయ్యిమందిలో ఒకరిలోపే ఉంది. మలేరియాను పూర్తిగా రూపుమాపే దశకు భారత్ చేరుకున్నట్లు ఈ గణాంకాలు చెబుతున్నాయని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం భారతదేశం అన్నివిధాలా సమాయత్తమై ఉన్నందున రాబోయే సంవత్సరాల్లో మలేరియాను రూపుమాపే కార్యక్రమం వేగం పుంజుకుంటుందని తెలిపింది. 2030 నాటికి మలేరియా కేసు అన్నది లేకుండా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఇందుకు రాజకీయ నిబద్ధత, బహుళ వ్యవస్థల మధ్య సమన్వయంతోపాటు డేటా ఆధారంగా నియంత్రణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. జిల్లాల వారీగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు అమలుచేయాలని, రోగ నిర్ధారణ పరీక్షల వ్యవస్థలను విస్తృతం చేయాలని నివేదిక సూచనలు చేసింది.



అత్యవసర పరిస్థితిలో తనంత తానుగా దిగిన విమానం

డెన్వర్: అత్యవసర పరిస్థితిలో ఓ విమానం తనంత తానుగా (ఆటోమేటిక్‌గా) సురక్షితంగా రన్‌వేపై దిగింది. డెన్వర్‌లోని రాకీ మౌంటెన్ మెట్రోపాలిటన్ విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రెండు ఇంజిన్లున్న బీచ్‌క్రాఫ్ట్ సూపర్ కింగ్ ఎయిర్ 200 అనే ఈ విమానం దిగగానే అందులోని ఇద్దరు వ్యక్తులు క్షేమంగా బయటకు వచ్చారు. ఈ విమానానికి గర్మిన్స్ ఆటోలాండ్ వ్యవస్థను అమర్చారు. దాదాపు 1,700 విమానాలకు ఈ వ్యవస్థలను అమర్చామని, తొలిసారిగా బీచ్‌క్రాఫ్ట్ విమానానికి అత్యవసర పరిస్థితి ఎదురైందని, ఆటోలాండ్ వ్యవస్థను వినియోగించుకుని అది సురక్షితంగా దిగిందని గర్మిన్ కంపెనీ వెల్లడించింది. లైవ్‌ఏటీసీడాట్‌నెట్ ద్వారా ఆటోమేటెడ్ వాయిస్‌ను ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆడియోలో వినిపించిన తర్వాత.. సమీపంలోని ఇతర పైలట్లను అప్రమత్తం చేశాక నిమిషంలోపే రన్‌వేపై విమానం ఆటోలాండ్ అయింది.

మరో 30వేల పేజీల ఎప్‌స్టీన్ పత్రాల విడుదల

ఈటీవీ భారత్: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించి మరో 30 వేల పేజీల డాక్యుమెంట్లను అమెరికా న్యాయ శాఖ విడుదల చేసింది. అయితే ఈ ఫైళ్లలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఉన్న కొన్ని ఆరోపణలు పూర్తిగా అసత్యమని న్యాయశాఖ స్పష్టంచేసింది. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేసింది. "ట్రంప్‌పై ఉన్న అత్యాచార ఆరోపణలు నిరాధారమైనవి. వాటికి ఎలాంటి విశ్వసనీయత లేదు. ఎప్‌స్టీన్ బాధితుల గోప్యతను కాపాడే నిబంధనలతోనే ఈ పత్రాలను విడుదల చేస్తున్నాం" అని న్యాయశాఖ పోస్ట్‌లో రాసుకొచ్చింది. తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో లైంగిక నేరస్థుడు లారీ నాసర్‌కు ఎప్‌స్టీన్ పంపినట్లు చెప్తున్న ఒక లేఖ కూడా ఉంది. ఈ లేఖలో ట్రంప్ పేరును ప్రస్తావించకుండా 'అవర్ ప్రెసిడెంట్ (మన అధ్యక్షుడు) అనే పదాలు ఉన్నాయి. అయితే ఈ లేఖ పూర్తిగా నకిలీ అని ఎఫ్‌బీఐ తేల్చింది. లేఖలోని రాత ఎప్‌స్టీన్ హస్తాక్షరాలతో సరిపోలేదని, ఆయన మృతి చెందిన మూడు రోజుల తర్వాతే లేఖకు పోస్టుముద్ర ఉందని పేర్కొంది. మరోవైపు 2020లో ఫెడరల్ ప్రాసిక్యూటర్ల నుంచి వచ్చిన ఓ రహస్య ఈ-మెయిల్ గురించి కూడా తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో ఉంది. ఇందులో ఎప్‌స్టీన్‌కు సంబంధించి ప్రైవేట్ జెట్‌లో 1993-96 మధ్యలో ట్రంప్ ఎనిమిది సార్లు ప్రయాణించినట్లు వెల్లడైంది.

కాన్సులర్ సేవలకు లాస్ ఏంజెలెస్‌లో నూతన కేంద్రం

న్యూయార్క్: అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు పాస్‌పోర్టు, వీసా సేవలను సౌకర్యవంతంగా, వేగంగా అందించడానికి వీలుగా లాస్ ఏంజెలెస్‌లో ఇండియన్ కాన్సులర్ అప్లికేషన్ సెంటర్(ఐసీఏసీ)ను ప్రారంభించారు. వీఎఫ్‌ఎస్ గ్లోబల్ నిర్వహిస్తున్న ఈ కేంద్రం ఈ నెల 15 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. పాస్‌పోర్టు, వీసా, ఓవర్‌సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా(ఓసీఐ), గ్లోబల్ ఎంట్రీ ప్రోగ్రామ్(జీఈపీ) వంటి పలు సేవలను ఈ కేంద్రం అందిస్తుంది. దీంతో అమెరికాలో మొత్తం ఐసీఏసీ కేంద్రాల సంఖ్య 17కి చేరింది.

ముప్పిరిగొంటున్న రొమ్ము క్యాన్సర్ ముప్పు

- మాంసాహారం, నిద్రలేమి, ఊబకాయం కారణాలంటున్న అధ్యయనం

దిల్లీ: రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరగడానికి మాంసాహారం, నిద్ర లేమి, ఊబకాయం కారణమని ఐసీఎంఆర్ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఈ క్యాన్సర్ కేసులు ఏటా 5.6 శాతం పెరిగి సంవత్సరానికి 50వేల కొత్త కేసులు నమోదయ్యే స్థాయికి చేరాయని వెల్లడైంది. పిల్లల్ని కనే సమయం, హార్మోన్ల ప్రభావం, కుటుంబ చరిత్ర.. వంటివీ రొమ్ము క్యాన్సర్ ముప్పునకు కారణమవుతున్నాయని తేలింది. ఐసీఎంఆర్‌కు చెందిన బెంగళూరులోని జాతీయ వ్యాధుల సమాచార, పరిశోధన సంస్థ ఈ అధ్యయనం చేసింది.

✦ 2022లో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 23 లక్షల మందికి కొత్తగా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ అయింది. 6,70,000 మంది మరణించారు.



✦ భారత్‌లోనూ రొమ్ము క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. 2022లో 2,21,757 మందికి ఈ వ్యాధి నిర్ధారణ అయింది. ఇది మహిళలకు వస్తున్న క్యాన్సర్లలో 22.8శాతానికి సమానం.

✦ 50 ఏళ్లలోపు మెనోపాజ్ వచ్చే మహిళలతో పోలిస్తే 50 ఏళ్లు దాటిన వారికి రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు రెట్టింపు ఉంటుంది.

మహిళల్లో హార్మోన్ల ప్రభావం, వివాహం జరిగిన వయసు, గర్భధారణ వయసు, అబార్షన్ చరిత్ర, ఏ వయసులో తొలి, చివరి బిడ్డ పుట్టారు, చనుబాలు ఇవ్వడం, గర్భ నిరోధక మాత్రల వాడకం, ఎందరు పిల్లలున్నారు వంటి అంశాలను విశ్లేషించారు.

✦ పెళ్లి జరిగిన వయసు పెరిగేకొద్దీ క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని అధ్యయనంలో తేలింది.

✦ రెండుసార్లు గర్భస్రావం చేయించుకున్న మహిళల్లో వ్యాధి ముప్పు 1.68 రెట్లు అధికమని తేలింది.

✦ 30 ఏళ్ల తర్వాత తొలి కాన్పు జరిగిన మహిళల్లోనూ ఈ వ్యాధి ముప్పు ఎక్కువేనని వెల్లడైంది.


✦ ఎంత కాలం బిడ్డకు చనుబాలు పట్టారన్న విషయానికీ రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరగడానికీ సంబంధం లేదని తేలింది.

✦ ఓరల్ గర్భ నిరోధక సాధనాలవల్లా క్యాన్సర్ ముప్పు పెరుగుతుందనడానికి ఆధారాలు కనిపించలేదని వెల్లడైంది.

కడుపులో మంచి బ్యాక్టీరియా తగ్గితే ఐబీడీ ముప్పు

- నిర్ధారించిన అధ్యయనం

దిల్లీ: సంక్లిష్టమైన కార్బోహైడ్రేట్లను జీర్ణం చేయడానికి సాయపడే మంచి బ్యాక్టీరియా కడుపులో తగ్గిపోయిన వారికి ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ (ఐబీడీ) (కడుపులో మంట, వాపు) వ్యాధి సంక్రమిస్తున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. ఈ వ్యాధి సంక్రమించిన వారిలో ఆక్సిజన్ అధికంగా ఉండే వాతావరణంలో పెంపొందే బ్యాక్టీరియా నోటి నుంచి కడుపులోకి వెళ్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఆక్సిజన్ లేని వాతావరణంలో పెరిగే బ్యాక్టీరియా కడుపులో అధికంగా ఉన్నప్పుడు జీర్ణ వ్యవస్థ సమర్థంగా పని చేస్తుందని పరిశోధకులు నిర్ధారించారు. ఆక్సిజన్‌ను ఇష్టపడే బ్యాక్టీరియా అధికంగా ఉన్న వారిలో పేగుల్లో మంట, వాపు కలిగించే ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్ సంభవిస్తున్నట్లు వారు గ్రహించారు. 'ఈ అధ్యయనం ఐబీడీ వ్యాధి ప్రారంభ దశలో ఏం జరుగుతుందన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది' అని బర్మింగ్‌హాం విశ్వ విద్యాలయానికి చెందిన డాక్టర్ పీటర్ రిమ్మర్ వెల్లడించారు. 'పేగుల్లో ఆక్సిజన్ స్థాయి పెరగడం, ఆక్సిజన్ ఇష్టపడే బ్యాక్టీరియా నోటి నుంచి కడుపులోకి వెళ్లడం మంట, వాపు వంటి పరిణామాలకు దారి తీస్తోందని మా అధ్యయనం తేటతెల్లం చేస్తోంది. ఈ పరిణామాలు వ్యాధి నిర్ధారణ, చికిత్సలను కొత్త పుంతలు తొక్కించే అవకాశం ఉంది' అని రిమ్మర్ తెలిపారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో భాగంగా 11 దేశాల్లో వ్యాధి తొలి దశలో ఉన్న 1700 మంది పిల్లలు, పెద్దలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించారు.



వీరిలో 400 మంది అల్సరేటివ్ కొలైటిస్‌తో, 675 మంది క్రోన్స్ వ్యాధితో బాధపడుతున్నారు. పేగుల్లో ఆక్సిజన్ అధికమైతే పొట్టలోని సూక్ష్మజీవుల అసమతుల్యత పెరిగిపోయినట్లు పరిశోధకులు పేర్కొన్నారు. దాని ఫలితంగా వ్యాధి కడుపులో ప్రబలుతోందని పరిశోధకులు అంటున్నారు. కడుపులో ఆక్సిజన్ ఇష్టపడే బ్యాక్టీరియా పెరిగి, ఆక్సిజన్‌ను ద్వేషించే బ్యాక్టీరియా తగ్గినప్పుడు ఐబీడీ వ్యాధి సంభవిస్తుందని గతంలో జరిగిన అధ్యయనాలు తేల్చినా.. తాజా అధ్యయనం ఈ విషయాన్ని మరింత స్పష్టంగా నిర్ధారించిందని రిమ్మర్ తెలిపారు.

(c) eenadu

హైదరాబాద్‌లో 8న జాతీయ సైన్స్ సదస్సు

● 'ఈనాడు'తో కలిసి అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ సంస్థ నిర్వహణ

ఈనాడు, హైదరాబాద్: అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎస్‌టీసీ) అనే సంస్థ 'ఈనాడు'తో కలిసి జనవరి 8న హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించనుంది. 'శాస్త్ర విజ్ఞానాన్ని ప్రయోగశాల నుంచి సమాజంలోకి తీసుకెళ్లడంలో సమాచార పాత్ర-వికసిత్ భారత్ 2047 నిర్మాణం' ఇతివృత్తంగా బి.ఎం.బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఈ సదస్సు జరగనుంది. శాస్త్రీయ జ్ఞానం సమాజంపై ప్రభావం చూపేలా, జాతీయ అభివృద్ధికి దోహదపడేలా సైన్స్ ఉపాధ్యాయులు, పరిశోధకులు, కమ్యూనికేటర్లు, విద్యార్థులు, విద్యారంగ ప్రముఖుల పాత్రను బలోపేతం చేయడం... సదస్సు నిర్వహణ ప్రధాన లక్ష్యం. ఇందులో శాస్త్ర, సాంకేతికతలో ఇటీవలి పురోగతిపై నిపుణుల చర్చలుంటాయి. ముఖ్యంగా రక్షణ, అంతరిక్షం, ఆరోగ్య, పోషకాహార రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. పబ్లిక్ సైన్స్ కమ్యూనికేషన్‌కు సంబంధించి 'డిస్కవరీ టు డైలాగ్: రీఇమాజినింగ్ సైన్స్ కమ్యూనికేషన్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్' అంశంపై చర్చాగోష్ఠి ఉంటుంది. జాతీయ సదస్సు ద్వారా సైన్స్ ఉపాధ్యాయులను పరిశోధకులు, కమ్యూనికేటర్లతో సమ్మిళితం చేసి ల్యాబొరేటరీల నుంచి సమాజంలోకి సైన్స్‌ను తీసుకురావాలనేది తమ లక్ష్యమని ఏఎస్‌టీసీ కార్యదర్శి సి.ఎల్.నరసింహారావు తెలిపారు. సదస్సులో పాల్గొనేందుకు ఇద్దరేసి సైన్స్ ఉపాధ్యాయులను నామినేట్ చేయాలని విద్యాసంస్థల అధిపతులు, ప్రిన్సిపాళ్లను ఆయన కోరారు. డిసెంబరు 31లోగా తమ నామినేషన్లను astc.academy@gmail.com మెయిల్‌కు పంపాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆప్కాబ్ ఎండీగా వి.రామకృష్ణ



రామకృష్ణకు అభినందనలు తెలుపుతున్న వీరాంజనేయులు, త్రినాథ్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఆప్కాబ్ ఎండీగా వి.రామకృష్ణ నియమితులయ్యారు. బుధవారం సమావేశమైన పాలకవర్గం ఆప్కాబ్ కొత్త ఎండీ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించి రామకృష్ణ ఎంపికైనట్లు ప్రకటించింది. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో నాబార్డు సీజీఎంగా పనిచేసిన ఆయన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎండీ త్రినాథ్‌రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు.

'యూరియా వాడకాన్ని తగ్గించాలి'

ఈనాడు, అమరావతి: అవసరానికి కన్నా.. అధికంగా యూరియా వినియోగించే రైతుల ఆలోచనా ధోరణిలో మార్పు తేవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. యూరియా నిల్వల వివరాల్ని జిల్లాస్థాయిలో బులెటిన్ రూపంలో అందించాలని ఆదేశించారు. యూరియా లభ్యత, కందులు, మినుముల కొనుగోళ్లపై జిల్లా సంయుక్త కలెక్టర్లు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. పక్కదారి పడుతున్న యూరియాను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నియంత్రించాలన్నారు. యూరియా అమ్మకాల్లో ఉన్న వ్యత్యాసాన్ని క్రమబద్ధీకరించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీకి సూచించారు.

గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు 210 యూనిట్ల ఏర్పాటు

ఈనాడు, అమరావతి: స్వచ్ఛ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రంలోని 202 గ్రామాల్లో రూ.33.60 కోట్లతో 210 ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు సంబంధించి పరిపాలన అనుమతులిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సమస్యకు పరిష్కారంగా యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఇటీవల ఆదేశించింది.

పట్టాభిరామ్‌ను సత్కరించిన తెలుగుదేశం సింగపూర్ ఫోరం సభ్యులు

ఈనాడు, అమరావతి: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌ను తెలుగుదేశం ఫోరం-సింగపూర్ సభ్యులు సత్కరించారు. ఆయనకు శాలువ కప్పి జ్ఞాపిక అందజేశారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్- 2025'లో ఏపీ అయిదు అవార్డులు దక్కించుకోవడంలో పట్టాభిరామ్ విశేషకృషి చేశారని ఫోరం సభ్యులు కొనియాడారు.

ఏపీ ఫైబర్‌నెట్‌లో ఇద్దరు అధికారుల నియామకం

ఈనాడు, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్‌లో చీఫ్ టెక్నికల్ ఆఫీసర్‌గా రాజా కిశోర్, జనరల్ మేనేజర్ (బిజినెస్ ఆపరేషన్స్)గా హరికృష్ణను నియమించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైలెవల్ కమిటీ సూచనల మేరకు ఇద్దరినీ కాంట్రాక్టు విధానంలో విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

భూ వివాదాల్లో పోలీసుల జోక్యాన్ని నివారించండి

హోం మంత్రికి సీపీఎం వినతి

ఈనాడు, అమరావతి: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామంలోని భూ వివాదాల్లో పోలీసుల జోక్యాన్ని నివారించాలని, గిరిజనుల పంటలను రక్షించాలని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనితకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి విజ్ఞప్తి చేశారు. కోర్టు విచారణలో ఉన్న భూముల విషయంలో గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. భూస్వాముల తరఫున పంటలను నాశనం చేసి, గిరిజన రైతులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై విచారించి, తగిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియాపై పోరాడి, హత్యకు గురైన పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. అనకాపల్లి జిల్లాలో బల్క్ డ్రగ్స్ కాలుష్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో పాల్గొంటున్న సీపీఎం నాయకుడు అప్పలరాజును అక్రమంగా అరెస్టు చేశారని.. ఆయన్ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఖర్చు రూ.21 వేల కోట్లు.. 9,900 ఎకరాలకే నీళ్లు!

- సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేయని ఫలితం
- వైకాపా పాలనలో సాగునీటి రంగం విధ్వంసం
- ప్రాజెక్టులు పూర్తయినా డిస్ట్రిబ్యూటరీలు చేపట్టని వైనం
- అవసరమైన నిధులు ఇవ్వకుంటే చేసిన ఖర్చు వృథా

ఎంతో ఖర్చు చేసినా ఆయకట్టుకు ప్రయోజనం దక్కని ప్రాజెక్టుల వివరాలు
(ఆయకట్టు ఎకరాల్లో... వ్యయం రూ.కోట్లలో)

ప్రాజెక్టు	కొత్త ఆయకట్టు అంచనా	స్థిరీకరణ	ఇంతవరకు చేసిన వ్యయం (రూ.కోట్లలో)	ఇంతవరకు ఆయకట్టుకు ప్రయోజనం (కొత్త ఆయకట్టు +స్థిరీకరణ)
1. చింతలపూడి ఎత్తిపోతల	2,00,000	2,80,879	4,180.96	---
2. గాలేరు నగరి సుజల స్రవంతి	2,57,550	3,950	7,459.30	1,500
3. గండికోట సీబీఆర్ ఎత్తిపోతల	12,000	---	1,522.49	---
4. వెలిగొండ ప్రాజెక్టు	4,32,500	14,800	6,207.00	8,400
5. సోమశిల స్వర్ణముఖి లింకు	12,000	78,464	281.87	---
6. సోమశిల హైలెవల్ కాలువ	89,653	---	634.28	---
7. వంశధార నాగావళి అనుసంధానం	5,000	18,527	107.63	---
8. నాగావళి, చంపావతి అనుసంధానం	--	2,950	3.27	---
9. మహేంద్రతనయ ప్రాజెక్టు	24,600	---	345.77	---
10. తారకరామతీర్థ సాగరం	16,538	8,172	328.33	---
11. కొరిశపాడు ఎత్తిపోతల	18,471	---	113.60	---
12. పాలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు	9,500	---	16.88	---
మొత్తం	10,77,812	4,07,742	21,201.38	9,900

ఈనాడు-అమరావతి: ఆ 12 ప్రాజెక్టులపై ఇప్పటివరకు రూ.21,201.38 కోట్లు ఖర్చు చేయగా 9,900 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే ప్రయోజనం దక్కింది. అదీ కేవలం రెండు ప్రాజెక్టుల్లో మాత్రమే. మిగిలిన ప్రాజెక్టుల్లో ఒక ఎకరానికీ నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తే 10,77,812 ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రావాలి. 4,07,742 ఎకరాలు స్థిరీకరణకు ఆ ప్రాజెక్టులు ఉపయోగపడాలి. సకాలంలో పూర్తి నిధులు వెచ్చించి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడం వల్ల రూ. వేల కోట్లు ఖర్చు చేసినా ఫలితం దక్కని పరిస్థితి ఏర్పడింది. జగన్ ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టుల రంగం పూర్తిగా కుదేలైంది. అనేక ప్రధాన ప్రాజెక్టులు మూలనపడ్డాయి. డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు నిర్మించకపోవడంతో ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. గాలేరు నగరి సుజల స్రవంతి పథకం రెండు దశల్లో ఇంతవరకు రూ.7,459 కోట్లు ఖర్చు చేసినా కేవలం 1,500 ఎకరాలకు నీరందిస్తున్నట్లు అధికారిక గణాంకాలే పేర్కొంటున్నాయి. ఈ లెక్కలు సాక్షాత్తూ శాసనసభకు సమర్పించినవే.

✦ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు సమస్యగా మారాయి. జగన్ హయాంలో ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్లలేదు. మళ్లీ ఇప్పుడు అడుగులు ముందుకు పడుతున్నాయి.

✦ వెలిగొండ ప్రాజెక్టును జగన్ హయాంలో జాతికి అంకితం చేసేశారు. నిజానికి మరో రూ.2,000 కోట్లకుపైగా ఖర్చు చేస్తే తప్ప తొలిదశ ఆయకట్టుకూ నీళ్లు ఇవ్వలేని దుస్థితి.

✦ వంశధార నాగావళి అనుసంధానం, నాగావళి చంపావతి అనుసంధానం వంటివి కూడా 2019-24 మధ్య పూర్తిగా పడకేశాయి.

✦ మహేంద్రతనయ, తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టులకు కూడా సరైన నిధుల కేటాయింపు దక్కలేదు.

✦ పైగా జగన్ సర్కార్‌లో అనేక ప్రాజెక్టుల ప్యాకేజీలను ముందుగా ముగించేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రాజెక్టులు రాబోయే 5 ఏళ్లలో అవసరం లేదంటూ కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిజానికి ఆ ప్రాజెక్టుల్లో అనేకం తక్షణం నిర్మాణం పూర్తి చేసుకోవాల్సినవే.

✦ హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి 2025 జనవరి వరకు రూ.12,191 కోట్లు ఖర్చు చేశారు. 52,654 ఎకరాల కొత్త ఆయకట్టుకు మాత్రమే నీళ్లు ఇచ్చారు. తాజాగా మరో రూ.3,500 కోట్లు ఖర్చు చేసి ప్రవాహ సామర్థ్యం పెంచారు. ఈ లెక్కలు పై పట్టికలోకి తీసుకోలేదు. ప్రవాహ సామర్థ్యం పెంచి చెరువులకు నీళ్లు ఇవ్వడం వల్ల మరో 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేస్తే తప్ప పూర్తి ఆయకట్టు సాగులోకి రాదు.



క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో విద్యుత్తు దీపాలతో సుందరంగా ముస్తాబైన లోక్ భవన్

శాంతి, సామరస్యం కోసం ప్రార్థిద్దాం

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

ఈనాడు, అమరావతి: 'క్రిస్మస్ అంటే ఏసుక్రీస్తును సంతోషంగా స్మరించుకునే సమయం. ఇది ప్రజలందరిలో క్షమాగుణం, ఐక్యత, ప్రేమ, దయ, కరుణ, దాతృత్వాన్ని వ్యాప్తి చేస్తుంది' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ గవర్నర్ బుధవారం సందేశమిచ్చారు. 'ఏసుక్రీస్తు జీవితం ధర్మం, విశ్వాసంతో కూడిన జీవితాన్ని గడపడానికి మనందరికీ ప్రేరణనిస్తుంది. ఈ శుభ సందర్భంగా మనమంతా క్రైస్తవ సోదరులతో కలిసి ప్రపంచంలో శాంతి, సామరస్యం కోసం ప్రార్థన చేద్దాం' అని తెలిపారు.

క్రీస్తు జన్మదినం.. అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: శాంతిదూత ఏసుక్రీస్తు జన్మదినం.. అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. క్రిస్మస్ సందర్భంగా ఎక్స్ వేదికగా క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు చూపిన ప్రేమ, క్షమ, సహనం, సేవ వంటి విలువలు ఈనాటి సమాజానికి మరింత అవసరం. "రాష్ట్రంలోని 8,418 మంది పాస్టర్లకు గౌరవ వేతనాల నిమిత్తం రూ.51 కోట్లు విడుదల చేశాం. క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇది నిదర్శనం'' అని వెల్లడించారు.

● 'క్రైస్తవ ధర్మాన్ని విశ్వసించే వారందరికీ హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● మరో ప్రకటనలో మంత్రి లోకేశ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

● కరుణ, ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా ఏసుక్రీస్తు మానవాళికి అందించిన మహోన్నత సందేశాలని, తద్వారా ఆయన సత్యపథం వైపు నడిపించేలా మార్గదర్శకం చేశారని మాజీ సీఎం జగన్ పేర్కొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ మీదుగా ఫ్రైట్ కారిడార్!

- ఇటార్సీ-విజయవాడ మార్గంపై రైల్వే బోర్డుకు డీపీఆర్
- సరకు రవాణాలో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య కీలకం కానున్న లింక్



ఈనాడు, హైదరాబాద్: దేశంలో సరకు రవాణా ప్రాజెక్టుల్లో ముఖ్యమైందిగా భావిస్తున్న ఇటార్సీ-విజయవాడ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (నార్త్-సౌత్ డీఎఫ్‌సీ) ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. దాదాపు 922 కి.మీ. పొడవుతో తెలంగాణ మీదుగా ప్రతిపాదించిన ఈ కారిడార్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రైల్వే బోర్డుకు డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీఎఫ్‌సీసీఐఎల్) సమర్పించింది. ప్రస్తుతం ఈ డీపీఆర్ బోర్డు పరిశీలనలో ఉంది. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

తగ్గనున్న రవాణా ఖర్చులు

మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరకు ప్రత్యేక సరకు రవాణా కారిడార్‌ను డీఎఫ్‌సీసీఐఎల్ ప్రతిపాదించింది. ఈ మార్గం కార్యరూపం దాలిస్తే సరకు రవాణాలో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల్ని అనుసంధానించే కీలక లింక్ అవుతుంది. ప్రస్తుతం ఉన్న ట్రాక్‌లో అటు ప్రయాణికుల రైళ్లు, ఇటు గూడ్సు రైళ్లు ప్రయాణిస్తున్నాయి. దీంతో అదనపు రైళ్లను ప్రవేశపెట్టడానికి, వేగంగా నడపడానికి సాంకేతికపరమైన సమస్యలు వస్తున్నాయి. కొత్త ప్రాజెక్టుతో గూడ్సు రైళ్లకు ప్రత్యేక ట్రాక్ వస్తుంది. ప్రయాణ సమయంతోపాటు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశాలుంటాయి. ప్రయాణికుల రైళ్ల వేగం సైతం పెరుగుతుంది.

కీలకం కానున్న తెలంగాణ

ఇటార్సీ-విజయవాడ రైల్వే కారిడార్ తెలంగాణ మీదుగా వెళుతుండటంతో సరకు రవాణాలో రాష్ట్రం కీలకంగా మారనుంది. పారిశ్రామిక క్లస్టర్లు, గిడ్డంగులకు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి ఇది దోహదం చేసే అవకాశముంది. రహదారులపై భారీ ట్రక్కుల ఒత్తిడి తగ్గుతుంది. రైల్వే ఆధారిత గ్రీన్ లాజిస్టిక్స్‌కు మార్గం సుగమమవుతుంది. ఇటార్సీ-విజయవాడ రైలుమార్గం సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, కాజీపేట, ఖమ్మం మీదుగా ఉంది. రాష్ట్రంలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌కు సంబంధించిన ఎలైన్‌మెంట్ వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. సరకు రవాణా మార్గం కావడంతో పారిశ్రామిక ప్రాంతాలకు సమీపం నుంచి ఉండే అవకాశం ఉంది.

డిజిటల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్..?

ప్రత్యేక కారిడార్‌ను భారీ మొత్తంలో సరకుల్ని రవాణా చేసేందుకు వీలుగా ఎక్కువ వ్యాగన్లతో కూడిన గూడ్సు రైళ్లను తట్టుకునేలా ట్రాక్‌లు, విద్యుత్ సామర్థ్యం, ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. రైళ్ల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే డిజిటల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టుకు రైల్వే బోర్డు ఆమోదం లభించిన తర్వాత కేంద్ర క్యాబినెట్ అనుమతి లభించాల్సి ఉంది. ఆ తర్వాత బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, భూసేకరణ, పర్యావరణ అనుమతుల వంటి ప్రక్రియలుంటాయి.

ఖరగ్‌పుర్-విజయవాడ కారిడార్ నిడుబ్రోలు వరకు...

ఇప్పటికే ప్రకటించిన ఖరగ్‌పుర్-విజయవాడ 'ఈస్ట్ కోస్ట్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్'ను నిడుబ్రోలు వరకు పొడిగిస్తూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విజయవాడ నుంచి నిడుబ్రోలు స్టేషన్ మధ్య దూరం దాదాపు 63 కి.మీ. కాగా...ఈ కారిడార్ మొత్తం పొడవు 1,149 కి.మీ. ఉండనుంది.

చంద్రబాబును కలిసిన ఈక్వెస్ట్రియన్ క్రీడాకారుడు శశాంక్



శశాంక్‌ను అభినందిస్తున్న సీఎం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును భీమవరానికి చెందిన ఈక్వెస్ట్రియన్ (గుర్రపు స్వారీ) క్రీడాకారుడు శశాంక్ కనుమూరి బుధవారం కలిశారు. థాయ్ పోలో క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఈవెంటింగ్ ఏషియన్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో భారత్ తరఫున శశాంక్ బృందం పాల్గొని రజత పతకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆయన్ను చంద్రబాబు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గుర్రపు స్వారీ చేస్తూ హర్డిల్స్ దాటే ఈక్వెస్ట్రియన్ ఈవెంటింగ్ క్రీడల్లో తనకు పదేళ్ల అనుభవం ఉందని శశాంక్ తెలిపారు.

ఆలయాల్లో జశోదాబెన్ ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న జశోదాబెన్ తదితరులు

కేశవగిరి, న్యూస్‌టుడే: హైదరాబాద్ చాంద్రాయణగుట్టలోని చారిత్రక ఆలయాలను ప్రధాని మోదీ సతీమణి జశోదాబెన్ బుధవారం దర్శించుకున్నారు. తొలుత శ్రీదేవి దేవాలయంలో, అనంతరం గుట్టపై ఉన్న చారిత్రక స్వయంభువు లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం, మహాశివాలయం, న్యూ ఇందిరానగర్‌లోని శ్వేత గంగ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెను శ్రీదేవి దేవాలయ అర్చకులు ప్రమోద్‌కుమార్ కర్వాంకర్ కుటుంబ సభ్యులు సన్మానించారు.

అంగడి సరకులా చిన్నారుల విక్రయాలు

● హైదరాబాద్‌లో మరోసారి బయటపడ్డ పిల్లల అక్రమ రవాణా

ఈనాడు-హైదరాబాద్, గచ్చిబౌలి, న్యూస్‌టుడే: కన్నతల్లి ఒడిలో కేరింతలు కొట్టాల్సిన చిన్నారులు అంగట్లో సరకులా మారుతున్నారు. నెలలు నిండని వయసులోనే అక్రమ రవాణా ముఠా చేతులకు చిక్కి రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నారు. వివిధ రాష్ట్రాల్లోని చిన్నారుల్ని తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న ముఠా శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులకు చిక్కింది. అహ్మదాబాద్, సిద్దిపేటల నుంచి ఇద్దరు చిన్నారుల్ని తీసుకొచ్చి మియాపూర్‌లో విక్రయిస్తున్న 11 మందిని పోలీసులు పట్టుకున్నారు. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్ కుమార్, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సంజయ్‌తో కలిసి మాదాపూర్ డీసీపీ రితిరాజ్ గచ్చిబౌలిలోని కార్యాలయంలో బుధవారం ఈ కేసు వివరాలు వెల్లడించారు.

మూడుసార్లు జైలుకెళ్లినా..

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వెంకిపల్లి గంగాధర్‌రెడ్డి (39) సికింద్రాబాద్‌లో ఉంటాడు. చిన్నారుల విక్రయాలకు సంబంధించి ఇతడిపై 5 కేసులున్నాయి. ఫెర్టిలిటీ కేంద్రాల్లో పనిచేస్తూ.. ఐవీఎఫ్, సరోగసీ కోసం వచ్చే దంపతులతో మాట కలిపేవాడు. డబ్బులిస్తే.. నెలల వయసున్న పిల్లల్ని విక్రయిస్తానని చెప్పేవాడు. వివిధ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాలకు వెళ్లి నిరుపేద తల్లిదండ్రులకు డబ్బు ఆశ చూపి పిల్లల్ని తీసుకొచ్చేవాడు. తొలిసారిగా 2014లో చిన్నారులను విక్రయిస్తూ పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. తర్వాత మరోసారి 2018లో ఇదే వ్యాపారం కొనసాగిస్తూ.. ఆర్‌జీఐఏ, బాలాపూర్ పోలీసులకు చిక్కాడు. అప్పటికే అతడు 12 మంది పిల్లలను విక్రయించాడు. 2020లో మూడోసారి అల్వాల్ పోలీసులకు దొరికాడు. ఇలా మూడు సార్లు జైలుకెళ్లొచ్చినా అతడు మారలేదు. ఈ ఏడాది ఆగస్టులో సృష్టి ఫెర్టిలిటీ కేసులో అరెస్టయిన మూసాపేటకు చెందిన మహిళ కుమ్మరి హర్షరాయ్ (31) ఇటీవలే జైలు నుంచి బయటికొచ్చింది. ఆమెతో కలిసి గంగాధర్‌రెడ్డి మళ్లీ చీకటి దందా మొదలుపెట్టాడు.

పాత స్నేహితుడితో జట్టు కట్టి..

నగరంలోని దమ్మాయిగూడలో నివసించే వేముల బాబురెడ్డి (49)ది ఏపీలోని కడప జిల్లా. పాత మిత్రుడైన ఇతడిని కలుపుకొని.. గంగాధర్ దందా కొనసాగిస్తున్నాడు. వీరిద్దరూ గతంలో ఆసుపత్రులు, ఫెర్టిలిటీ కేంద్రాలకు బ్రోకర్లుగా పనిచేసేవారు. నిరుపేదల పిల్లల్ని కిడ్నాప్ చేసి అమ్మేవారు. 2020లో అల్వాల్ పోలీసులకు దొరికారు. బాబురెడ్డి మీద దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లోనూ ఒక కేసు నమోదైంది. తాజాగా మరోసారి చేతులు కలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన దారం లక్ష్మి (28), బిహార్‌లోని శివాన్ జిల్లాకు చెందిన జీడిమెట్లలో నివసించే రామ్ హరిరాయ్ (37), జగద్గిరిగుట్టకు చెందిన సంగీతదేవి (33), నారపల్లిలో నివసించే ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన గూడెపు సుజాత (40), సికింద్రాబాద్ వాసి.. సిద్దిపేట జిల్లాకు చెందిన సూరబోయిన అనూరాధ (55), బేగంపేట వాసి ఈసారపు జ్యోతి (35), చింతల్‌కు చెందిన వి.మాధవి (28), ముషీరాబాద్‌లో ఉండే పోతుల శోభ (44) తదితరుల్ని సహాయకులుగా పెట్టుకున్నారు. లక్ష్మి, సంగీత, హర్షరాయ్, హరిరాయ్‌ల ద్వారా గంగాధర్.. అహ్మదాబాద్‌కు చెందిన దంపతుల నుంచి నెలల వయసున్న చిన్నారిని కొన్నాడు. మరోవైపు సుజాత, అనూరాధ, జ్యోతి, మాధవి, శోభల ద్వారా సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతుల నుంచి బాబురెడ్డి ఒక చిన్నారిని కొని తీసుకొచ్చాడు. ఈ ఇద్దరు పిల్లల్ని హైదరాబాద్‌లో సంతానం లేని తల్లిదండ్రులకు విక్రయించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ సంజయ్, మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌ల బృందం మంగళవారం మియాపూర్‌లో 11 మంది నిందితుల్ని అదుపులోకి తీసుకుంది. చిన్నారుల్ని అమీర్‌పేట శిశువిహార్‌లో అప్పగించారు.

ఫెర్టిలిటీ కేంద్రాలకు ఏజెంట్లుగా..

9 ఫెర్టిలిటీ కేంద్రాలకు బ్రోకర్లుగా వ్యవహరించే గంగాధర్‌రెడ్డి, బాబురెడ్డి.. అద్దె గర్భం (సరోగసీ) కోసం చెత్త ఏరుకునే మహిళలకు డబ్బు ఆశ చూపి ఒప్పించేవారని తెలుస్తోంది. ఒక్కో సరోగసీ కోసం రూ.30 లక్షల వరకు తీసుకుని.. పంచుకునేవారు. ఫెర్టిలిటీ కేంద్రాలకు అండాలు విక్రయించేందుకు కూడా నిరుపేద మహిళల్ని ఒప్పించేవారు.

గోవిందరాజస్వామి ఆలయ గోపురంపై ఉన్న పురాతన విగ్రహాల్ని ఏం చేశారు?

● వైకాపా నేతల్ని నిలదీసిన తెదేపా అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

ఈనాడు, అమరావతి: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ గోపురంపై ఉన్న 30 పురాతన విగ్రహాలు వైకాపా హయాంలో మాయమయ్యాయని, వాటిని ఏం చేశారని ఆ పార్టీ నేతల్ని తెదేపా అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ నిలదీశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "గతంలో తీసిన అనేక ఫొటోల్లో వరాహస్వామి, నరసింహస్వామి, దేవేంద్రుడు సహా వివిధ విగ్రహాలు ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. పునర్నిర్మాణం అనంతరం వాటిని తొలగించారా? లేకపోతే ధ్వంసమయ్యాయా? అన్న విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదు. గోవిందరాజస్వామి గోపురం బంగారు తాపడానికి తితిదే ట్రెజరీ నుంచి భారీగా తీసుకున్న బంగారాన్ని పూర్తిగా వినియోగించలేదు. వాస్తవానికి ఎంత బంగారాన్ని తాపడానికి వినియోగించారు.. మిగిలిన బంగారం పరిస్థితి ఏంటి అన్న భక్తులు, హిందూ సంఘాల ప్రశ్నలకు సమాధానం లేదు. వైకాపా హయాంలో తితిదే పాలక మండలిలో కీలక బాధ్యతల్లో ఉన్నవారూ ఇందులో భాగస్వాములయ్యారు" అని ఆరోపించారు.

పాఠాలు చెప్పాల్సినవారు.. ప్రాణాలు తీశారు

- ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య
- నిందితులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: పిల్లలకు నీతిసూత్రాలు చెప్పాల్సిన ఆ ఉపాధ్యాయులు హంతకులయ్యారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఆమె భర్తనే హత్య చేసి జైలుపాలయ్యారు. తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట సీఐ నాగరాజు బుధవారం ఈ కేసు వివరాలు తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్ కాలనీలో నవంబరు 25న అనుమానాస్పద స్థితిలో లక్ష్మణ్‌నాయక్ (38) మృతిచెందారు. ఆయన సోదరుడు శ్రీరామ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లక్ష్మణ్‌నాయక్ భార్య పద్మ (30) 2024 డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికై.. ఉప్పునుంతల మండలం బట్టుకాడిపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తోంది. అదే మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాత్లావత్ గోపి (36)తో ఆమెకు ఏడాది కాలంగా వివాహేతర సంబంధం ఉంది. లక్ష్మణ్‌నాయక్ గతంలో రంగారెడ్డి జిల్లాలోని గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. భార్యకు పోస్టింగ్ రావడంతో అచ్చంపేటకు వచ్చేసి.. ఖాళీగానే ఉండేవారు. తమ సంబంధానికి లక్ష్మణ్‌నాయక్ అడ్డుగా ఉన్నాడని భావించి పద్మ, గోపి అతడిని అంతమొందించాలనుకున్నారు. నవంబరు 24 రాత్రి.. నిద్రిస్తున్న లక్ష్మణ్‌నాయక్ ముక్కు, నోటిపై వస్త్రంతో మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. మర్నాడు ఉదయం ఏమీ తెలియనట్లుగా పద్మ పాఠశాలకు వెళ్లి.. ఇంటి యజమానికి ఫోన్ చేసింది. తన భర్తకు ఫోన్ చేసినా స్పందించడంలేదని ఆందోళన నటించింది. మధ్యాహ్నం హడావుడిగా ఇంటికొచ్చి.. లోపల భర్త చనిపోయి ఉన్నాడని అందరినీ నమ్మించింది. దర్యాప్తులో పోలీసులు వాస్తవాలను రాబట్టారు. హత్య చేసిన అనంతరం పద్మ.. సమీప బంధువు నర్సింహకు ఫోన్ చేసి విషయం చెప్పినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. పద్మ, గోపిలను బుధవారం అరెస్టు చేసి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్పందన ఎదుట హాజరుపర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించారు.

మిస్టర్ బంగారం..



చేతులు, మెడ నిండా బంగారు ఆభరణాలతో ఉన్న ఈయన పేరు రజిమోన్ మీథల్. కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన ఆయన వ్యవసాయ యంత్ర పరికరాలు తయారుచేసే ఓ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్నారు. కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్టేడియంలో జరుగుతున్న కిసాన్ గ్రామీణ మేళాలో తన కంపెనీ యంత్ర పరికరాలు ప్రదర్శించడానికి వచ్చారు. ఆయన ధరించిన ఆభరణాల కారణంగా అంతా ఆయనను ఆసక్తిగా తిలకించారు. "2010లో గాయకుడు యోయో హనీసింగ్ షోను చూసినప్పటి నుంచి అతడిలా బంగారు ఆభరణాలు ధరించాలనే కోరిక కలిగింది. ఇప్పటికి 2.5 కిలోల బంగారం కొనుగోలు చేసి ఆభరణాలుగా ధరిస్తున్నా. 5 కిలోల బంగారం ధరించాలన్నదే నా లక్ష్యం'' అని తన ఆసక్తిని వెల్లడించారు.

– ఈనాడు, కరీంనగర్

(c) eenadu